

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15
సంచిక: 332

మంగళవారం 15-8-2023

పాఠకులు, ఏజెంట్లు, ప్రకటనకర్తలు, శ్రేయోభిలాషులకు
సాక్షి
స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | DELHI | VIJAYAWADA | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



సామరస్య స్ఫూర్తిని పాటిద్దాం

భారతీయులంతా సమాన అవకాశాలు, సమాన హక్కులు, సమాన విధులు ఉన్న సమాన పౌరులేనని రాష్ట్రపతి ముర్ము అన్నారు.

వివరాలు 6లో ▸



సెప్టెంబర్‌లో ఆదిత్య-ఎల్1

సూర్యుడిపై అధ్యయనం కోసం ఇస్రో సెప్టెంబర్ మొదటి వారంలో ఆదిత్య-ఎల్1 ఉపగ్రహాన్ని ప్రయోగించబోతోంది.

వివరాలు 6లో ▸



కుజునిపై జీవముండేదా?

కుజ గ్రహం మీద పరిశోధనల కోసం నాసా పంపిన క్యూరియాసిటీ రోవర్ తాజాగా కీలక విశేషాలను సేకరించింది.

వివరాలు 6లో ▸



'ఆండ్రాయిడ్'లో చాలా లోపాలు

ఆండ్రాయిడ్ ఆపరేటింగ్ సిస్టమ్‌లో లోపాలు న్నాయని కేంద్ర ప్రభుత్వ సంస్థ ఇండియన్ కంప్యూటర్ ఎమర్జెన్సీ టీమ్ హెచ్చరించింది.

వివరాలు 6లో ▸

'ఏఐ'తో ఎదిగేలా!

మన లక్ష్యం ప్రపంచ స్థాయి విద్యా బోధన: సీఎం జగన్

- విద్యారంగంలో విస్తృతంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగం
- ఏఐపై పరిశోధన కోసం వర్సిటీల్లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లు
- అంతర్జాతీయ ప్రమాణాలతో ఒక కోర్సుగా ప్రవేశపెట్టేలా ప్రణాళిక
- ప్రభుత్వ స్కూళ్లు, ఇంటర్‌లో ఐబీ, ఐజీసీఎస్ఈ సిలబస్‌పై అధ్యయనం
- ఉపాధ్యాయుల సామర్థ్యాలను మరింత పెంచేలా చర్యలు



సాక్షి, అమరావతి: విద్యారంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుంటూ మన బోధనా ప్రమాణాలు అంతర్జాతీయ స్థాయిని అందుకునేలా కార్యాచరణ రూపొందించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. విద్యా వ్యవస్థ అవసరాలు, విద్యార్థుల ప్రయోజనాలను నెరవేర్చడం లక్ష్యంగా అధ్యయనం కొనసాగాలని దిశా నిర్దేశం చేశారు. ఉపాధ్యాయుల సామర్థ్యాలు, సమర్థతను మరింత పెంచడం, బోధన ప్రమాణాలను పెంపొందించడంపై ఆలోచన చేయాలన్నారు. 'ఉన్నత విద్యలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వినియోగంపై కార్యాచరణ రూపొందించాలి. ఏఐలో మరిన్ని అంశాలను

మిగతా 2వ పేజీలో ▶

నేడు విజయవాడలో స్వాతంత్ర్య వేడుకలు

ముస్తాబైన ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియం

జాతీయ జెండాను ఎగురవేయనున్న సీఎం జగన్

అనంతరం ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్న ముఖ్యమంత్రి

2లో

8 పాఠశాలలకు 'ఉత్తమ' అవార్డులు

పదోతరగతిలో నూరుశాతం ఫలితాలు సాధించిన వాటికి గుర్తింపు

నేడు విజయవాడలో అవార్డులు ప్రదానం చేయనున్న సీఎం జగన్

2లో

ఫ్యాక్ట్ చెక్

గడప చెంతనే రేషన్

- ఎండీయూ వ్యవస్థపై ఈనాడు దుష్ప్రచారం
- ఈ-పోస్ యంత్రానికి జీపీఎస్ ట్రాకింగ్‌తో నిత్యం పర్యవేక్షణ
- గతంతో పోలిస్తే భారీగా పెరిగిన రేషన్ వినియోగదారుల శాతం
- టీడీపీ హయాంలో భారీ క్యూ లైన్లు, ముక్కిన బియ్యమే దిక్కు

2లో

ఆరుబయట ఉంటే తడవదా!?

- వర్షాకాలంలో బొగ్గు తడిగా ఉండటం సహజం
- దేశవ్యాప్తంగా ఏటా ఈ సీజన్‌లో బొగ్గు కొరత.. ఇప్పుడూ అదే పరిస్థితితో తగ్గిన ఉత్పత్తి
- అయినా రాష్ట్రంలో ఎక్కడా విద్యుత్ కోతల్లేవు.. వాస్తవాలు చెప్పినా మారని 'ఈనాడు' తీరు

10లో

రాష్ట్రంలో మిల్లెట్ మెరుపులు

చిరుధాన్యాలు, జొన్నలు దిగుబడిలో ఏపీనే టాప్

రాష్ట్రంలో చిరుధాన్యాలు హెక్టార్‌కు 2,363 కిలోలు దిగుబడి

- జొన్నలు హెక్టార్‌కు 3,166 కిలోలు
- చిరుధాన్యాలపై ప్రజల్లో ఆసక్తి కనిపిస్తోంది
- నాబార్డు అధ్యయన నివేదిక వెల్లడి
- చిరుధాన్యాల సాగు, వినియోగాన్ని ప్రోత్సహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- ప్రత్యేకంగా మిల్లెట్ మిషన్ ఏర్పాటు
- మరే రాష్ట్రంలోనూ లేని విధంగా మద్దతు ధర
- పౌరసరఫరాల సంస్థ ద్వారా కొనుగోలు
- ప్రత్యేకంగా ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు
- నగరాలు, పట్టణాల్లో ప్రత్యేక స్టాల్స్‌లో విక్రయం.. బాలింతలు, పిల్లలకు పోషకాహారంగా రాగి పిండి పంపిణీ

5లో



మారణహోమానికే టీడీపీ నేతల దాడి

- ముందస్తు ప్రణాళికతోనే అంగళ్లు నుంచి పుంగనూరు వరకు విధ్వంసం
- ఓ మార్గంలో అనుమతి తీసుకుని చంద్రబాబు మరో మార్గంలో వచ్చారు
- చంద్రబాబు స్వయంగా వేసేయండిరా అంటూ కార్యకర్తలను రెచ్చగొట్టారు
- అడ్డుకున్న పోలీసులపైనా దాడి చేశారు.. 47 మంది పోలీసులు గాయపడ్డారు
- ఈ ఘటనతో సంబంధం ఉన్న వారందరినీ అరెస్టు చేస్తాం.. ఇలాంటి ఘటనలను, బాధ్యులను కోర్టులు ఉపేక్షించకూడదు
- హైకోర్టుకు నివేదించిన అదనపు ఏజీ సుధాకర్‌రెడ్డి.. విచారణ బుధవారానికి వాయిదా
- అప్పటి వరకు పిటిషనర్లపై చర్యలు తీసుకోవద్దని ఏఏజీకి న్యాయమూర్తి మౌఖిక ఆదేశాలు

10లో

రెండు రాష్ట్రాల్లో భీకర వర్షం

హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాలను భీకర వర్షాలు ముంచెత్తుతున్నాయి. కొండచరియలు విరిగి పడుతుండడంతో పలుచోట్ల ఇళ్లు కూలిపోయాయి. వర్షాలు, కొండచరియల ధాటికి హిమాచల్‌లో దాదాపు 51 మంది మరణించారని అధికారులు ప్రకటించారు.



6లో

29 మంది ఏపీ అధికారులకు

పోలీస్ పతకాలు

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రకటించిన కేంద్రం

ఏడీజీపీ బాగ్చికి రాష్ట్రపతి విశిష్ట సేవా పోలీస్ పతకం

2లో

క్లుప్తంగా...

స్కూల్ చైర్మన్ల ఆధ్వర్యంలోనే జెండా వందనం

పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు జారీ

సాక్షి, అమరావతి: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం అన్ని పాఠశాలల్లోను పేరెంట్స్ కమిటీ చైర్మన్ల ఆధ్వర్యంలోనే జాతీయ జెండా ఎగురవేయించాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సోమవారం ఆదేశాలు జారీ చేశారు. కమిటీలు లేని పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు జెండా వందనం చేయాలని తెలిపారు. జిల్లా స్థాయిలో డీఈవోలు, రీజనల్ స్థాయిలో ఆర్జేడీలు ఆయా కార్యాలయాల్లో జాతీయ జెండా ఎగురవేయాలని పేర్కొన్నారు.

రూ.40 కోట్లతో గంగవరం పోర్టులో సదుపాయాలు

ఇంటిగ్రేటెడ్ వే బ్రిడ్జిలు, 2 గేట్ కాంప్లెక్స్‌ల నిర్మాణం



పోర్టులో ఇంటిగ్రేటెడ్ వెయింగ్ బ్రిడ్జ్

పెదగంట్యాడ(గాజువాక): మెరుగైన ఉత్పాదకతను సాధించేందుకు గంగవరం పోర్టులో మరిన్ని మౌలిక సదుపాయాలు కల్పించే పనులను అదానీ సంస్థ పూర్తి చేసింది. దేశంలోనే అత్యంత లోతైన, ఆధునిక పోర్టుగా పేరొందిన గంగవరం పోర్టు సామర్థ్యాన్ని పెంపొందించడంతోపాటు వ్యాపార కార్యకలాపాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు రూ.40 కోట్లతో పలు ప్రాజెక్టులు చేపట్టింది. 35 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో ఉన్న 6 వేల చదరపు మీటర్ల వేర్ హౌస్ పోర్టు కవర్ స్టోరేజీ ప్రాంతాన్ని 1.4 లక్షల చదరపు మీటర్లకు విస్తరించింది. ఉపరితల రవాణాను మరింత సమర్థవంతంగా నిర్వహించేలా మూడు కిలో మీటర్ల మేర పోర్టు అంతర్గత రహదారులను అనుసంధానించినట్లు అదానీ గంగవరం పోర్టు అధికారులు వెల్లడించారు. దీంతోపాటు ఇంటిగ్రేటెడ్ వెయింగ్ బ్రిడ్జ్‌లు, టార్పాలిన్ కవరింగ్ స్టేషన్లతో రెండు గేట్ కాంప్లెక్స్‌లు, ఇంధన నిర్వహణ స్టేషన్లు, కార్ అండ్ ట్రక్ టైర్ వాషింగ్ యూనిట్, ఇంటిగ్రేటెడ్ వాటర్ క్యాప్చర్, రీసైక్లింగ్ యూనిట్‌లను కూడా ప్రారంభించినట్లు అధికారులు వివరించారు.

23న అసిస్టెంట్ కన్జర్వేటర్ పోస్టులకు పరీక్ష

సాక్షి, అమరావతి: ఏపీ ఫారెస్ట్ సర్వీసులోని అసిస్టెంట్ కన్జర్వేటర్ పోస్టులకు ఈ నెల 23వ తేదీన విజయవాడలోని ఏపీపీఎస్సీ కార్యాలయంలో రాత పరీక్ష నిర్వహించనున్నారు. ఈ మేరకు ఏపీపీఎస్సీ కార్యదర్శి సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఏప్రిల్ నెలలో మెడికల్, వాకింగ్ టెస్ట్‌లో ఉత్తీర్ణత సాధించిన వారి వివరాలను ఏపీపీఎస్సీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామని, వారు ఈ నెల 23వ తేదీ ఉదయం 9.30 గంటలకు జరిగే కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ)కు హాజరుకావాలని తెలిపారు. పూర్తి వివరాల కోసం https://psc.ap.gov.in వెబ్‌సైట్‌లో చూడాలని సూచించారు.

వైద్య విద్య పీజీ అడ్మిషన్లకు తుది మెరిట్ జాబితా

సాక్షి, అమరావతి: వైద్య విద్య, డెంటల్ పీజీ కోర్సుల్లో 2023–24 విద్యా సంవత్సరానికి కాంపిటెంట్ అథారిటీ కోటా సీట్లలో ప్రవేశాల ప్రక్రియలో భాగంగా తుది మెరిట్ జాబితాను డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం సోమవారం విడుదల చేసింది. సర్వీస్, నాన్–సర్వీస్ విభాగాలకు సంబంధించిన మెరిట్ జాబితాలను వేర్వేరుగా యూనివర్సిటీ అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు.

కృష్ణా జలాలపై నవంబర్ 29న విచారణ

విచారణ జాబితాలో చేర్చాలని సుప్రీం కోర్టు ఆదేశాలు



సాక్షి, న్యూఢిల్లీ : కృష్ణా నదీ జలాల కేటాయింపులపై నవంబర్ 29 సుప్రీం కోర్టు విచారణ జరపనుంది. నదీ పరీవాహక ప్రాంతాలైన ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర మధ్య కృష్ణా ట్రిబ్యునల్ నీటి పంపకాలు జరుపుతూ 2010లో తుది అవార్డు జారీ చేసింది. దీనిని వ్యతిరేకిస్తూ కర్ణాటక సుప్రీం కోర్టులో అభ్యంతరం వ్యక్తం చేస్తూ అప్లికేషన్ దాఖలు చేసింది. ఈ విషయాన్ని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ దీపాంకర్ దత్తాలతో కూడిన ధర్మాసనం ముందు కర్ణాటక తరపు సీనియర్ న్యాయవాది శ్యామ్ దివాన్ సోమవారం ప్రస్తావించారు. రూ.వేల కోట్లతో కర్ణాటక ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టులు పూర్తిగా వచ్చాయని శ్యామ్ దివాన్ తెలిపారు. ట్రిబ్యునల్ అవార్డు ప్రకారం రాష్ట్రానికి కేటాయించిన జలాల మేరకు విడుదల చేయాలన్నారు. ప్రజాప్రయోజనాల దృష్ట్యా విచారణ వేగవంతం చేయాలని, సముద్రంలోకి వృథాగా నీరు వెళ్లకుండా చూడాలని కోరారు. తొలుత నవంబర్ 21న విచారిస్తామన్న ధర్మాసనం తుది విచారణ నిమిత్తం నవంబర్ 29న విచారణ జాబితాలో చేర్చాలని రిజిస్ట్రార్‌ని ఆదేశించింది.

గడప చెంతనే రేషన్

సాక్షి, అమరావతి: గతంలో రేషన్ సరుకులు తెచ్చుకోవాలంటే పెద్ద ప్రహసనం. చౌక ధరల దుకాణాల దగ్గర క్యూ లైన్లతోపాటు సర్వర్లు ఎప్పుడు మొరాయిస్తాయో తెలియని పరిస్థితి. రోజంతా పనులు మానుకోవాల్సి రావడంతో రేషన్‌దారులు నానా అగచాట్లు పడేవారు. ఒక్కోసారి రేషన్ తీసుకోకుండానే ఉసూరుమంటూ వెనుతిరిగేవారు. ఇవన్నీ అందరికీ తెలిసిన వాస్తవాలే అయినా రామోజీ మాత్రం కళ్లకు గంతలు కట్టుకున్నారు!! ఇప్పుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఇంటింటికీ రేషన్ సరుకులను డోర్ డెలివరీ చేస్తుంటే అబ్బే.. పాత రోజులే బాగున్నాయంటున్నారు!! దేశంలో ఎక్కడా లేని విధంగా 9,260 మొబైల్ వాహనాలతో ప్రతి నెలా రేషన్ సరుకులను సరఫరా చేస్తూ బడుగు, బలహీన వర్గాల యువత ఉపాధి పొందుతుంటే 'గడప చేరని రేషన్' అంటూ ఈనాడు దుష్ప్రచారానికి దిగింది.



ఫ్యాక్ట్ చెక్

నాడు తినేవారేరి?

చంద్రబాబు హయాంలో రేషన్ బియ్యాన్ని తింటే ఒట్టే! ముక్కిన బియ్యం, పురుగులు పట్టినవి, రాళ్లు, నూకలతోపాటు రంగు మారిన బియ్యాన్ని రేషన్‌దారులకు అంటగట్టడంతో వాటిని శుభ్రం చేసుకోలేక అవస్థలు పడేవారు. మరి ఇప్పుడిస్తున్నది నాణ్యమైన సార్టెక్స్ బియ్యం. కరోనా సమయంలో ప్రభుత్వం అందించిన నాణ్యమైన రేషన్ బియ్యం లక్షల మంది ఆకలిని తీర్చింది. కార్డుదారుల సమక్షంలో ఇంటి దగ్గరే సంచులు తెరిచి కచ్చితమైన తూకంతో ఇస్తుండటంతో కొలతలపై ఫిర్యాదులు లేవు. ఈ–పోస్ యంత్రాలకు జీపీఎస్ ట్రాకింగ్ అమర్చడంతో అక్రమ రవాణాకు తావు లేదు. దీంతో ఇప్పుడు రేషన్ తీసుకునే వారు 90 శాతానికి పైగా ఉన్నారు. ఈ లెక్కలు వెల్లడించే సాహసం రామోజీ చేయగలరా?

అర్హులందరికీ రేషన్

చంద్రబాబు హయాంలో తమకు నచ్చని వారి రేషన్ కార్డులను నిర్దాక్షిణ్యంగా తొలగించారు. ఆయన దిగిపోయే నాటికి 1.39 కోట్ల కార్డులు మిగిలాయి. సీఎం జగన్ ఇంటింటికీ వలంటీర్లను పంపి పార్టీలకు అతీతంగా అర్హులందరికీ లబ్ధి చేకూర్చడంతో రేషన్ కార్డుల సంఖ్య 1.47 కోట్లకు పెరిగింది. నెలకు 2.31 లక్షల టన్నుల బియ్యాన్ని సరఫరా చేస్తున్నారు. ఎండీయూ వాహనాలు క్రమం తప్పకుండా నిర్దేశించిన ప్రాంతాలకు వెళ్లేలా సెంట్రల్ కమాండ్ కంట్రోల్ ప్రత్యేకంగా పర్యవేక్షిస్తోంది. అధికారులు నిత్యం తనిఖీలు చేయడంతో పాటు 1967 టోల్ ఫ్రీ నంబర్‌ను ఎండీయూలపై ముద్రించి లబ్ధిదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్నారు. గత ఆర్నెల్లలో 128 ఫిర్యాదులు రాగా వెంటనే పరిష్కరించారు. గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో విజిలెన్సు కమిటీలను ఏర్పాటు చేసి నిత్యం రేషన్ డోర్ డెలివరీ విధానాన్ని పర్యవేక్షిస్తున్నారు. ఇందులో ఆయా గ్రామాల్లోని నాయకులతో పాటు వివిధ రంగాల సభ్యులుంటారు. ఇంటింటికీ రేషన్ చేరకుంటే ప్రజలే ప్రశ్నించే వ్యవస్థను రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చింది. ఇంత పారదర్శకంగా రేషన్ అందుతోంది కాబట్టే ఐవీఆర్ సర్వేలో డోర్ డెలివరీ విధానంపై సంతృప్తి వ్యక్తమైంది.

ఆపరేటర్ ఆగినా.. పంపిణీ ఆగట్లేదు

ఎక్కడైనా ఎండీయూ ఆపరేటర్ సెలవులో ఉన్నా, అనివార్య కారణాలతో రాకపోయినా వీఆర్‌వో ద్వారా లబ్ధిదారుల ఇంటి వద్దే సరుకులు పంపిణీ చేసేలా ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తోంది. అంతేగానీ ఏ చౌక ధరల దుకాణదారుడికీ రేషన్ ఇచ్చే అథారిటీ లేదు. అలాంటప్పుడు ఈనాడు చెబుతున్నట్లుగా లబ్ధిదారులు రేషన్ దుకాణాల్లోకి వెళ్లి సరుకులు ఎలా తెచ్చుకుంటారు? ఎండీయూ వాహన ఆపరేటర్ల ఖాళీలను ఎప్పటికప్పుడు భర్తీ చేయడంతో పాటు లబ్ధిదారులకు ఇబ్బంది లేకుండా తాత్కాలిక ప్రాతిపదికపైన నియమించి నిత్యావసరాలను సరఫరా చేస్తున్నారు. ఎండీయూ వాహనం ఎప్పుడు ఏ వీధికి రానుందో ముందుగానే వలంటీర్ల ద్వారా సమాచారాన్ని చేరవేస్తున్నారు. కార్డుదారుడి కుటుంబ సభ్యుల్లో ఎవరు అందుబాటులో ఉన్నా వేలిముద్ర ద్వారా రేషన్ తీసుకునే సౌకర్యాన్ని కల్పించారు. గత ఆర్నెల్లలో 126 ఎండీయూ ఆపరేటర్లను శాశ్వత ప్రాతిపదికన నియమించగా మరో 284 చోట్ల తాత్కాలిక విధానంలో తీసుకుని సరుకులు సరఫరా చేస్తున్నారు. గిరిజన ప్రాంతాలు, కొండ కోనల్లో ఎండీయూ వాహనాలు వెళ్లడం కష్టంతో కూడుకున్నది కావడంతో అదనపు ఖర్చు చేసి ఇతర వాహనాల్లో లబ్ధిదారుల ఇళ్లకు రేషన్ చేరవేస్తున్నారు. తాత్కాలికంగా ఆగిన ఓ ఎండీయూ వాహనాన్ని చూపిస్తూ అసలు ఎక్కడా ఇంటింటికీ రేషన్ అందడం లేదని రామోజీ బుకాయించడం నిజంగా విడ్డూరమే!

ఎండీయూ ఆపరేటర్లకు అదనపు ఆదాయం



ప్రతి నెలా 17లోగా రేషన్ పంపిణీ పూర్తవుతుంది. అనంతరం అవసరాన్ని బట్టి పాఠశాల విద్యాశాఖ పుస్తకాలను సరఫరా చేయడం, మధ్యాహ్న భోజన పథకానికి అవసరమైన నిత్యావసరాలను నేరుగా పాఠశాలలు, అంగన్‌వాడీ సెంటర్లకు చేరవేయడం లాంటి వాటి ద్వారా ఎండీయూ వాహనదారులకు అదనపు ఆదాయం లభించేలా చర్యలు తీసుకుంటున్నాం. ఏటా వైఎస్సార్ వాహన మిత్ర పథకం ద్వారా ఇన్సూరెన్స్ భారాన్ని తగ్గిస్తున్నాం. ఎండీయూ ఆపరేటర్లకు సమానంగా రేషన్ కార్డులను కేటాయించి ప్రతి నెలా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నాం. సమస్యలుంటే పరిష్కరిస్తున్నాం. వైఎస్సార్‌లో 35, అన్నమయ్యలో 39, నెల్లూరు జిల్లాలో 32 ఎండీయూ ఆపరేటర్ల ఖాళీలను భర్తీ చేశాం. ఎండీయూలో రేషన్ సరఫరా ఎక్కడా నిలిచిపోలేదు. – **హెచ్.అరుణ్‌కుమార్**, కమిషనర్, పౌరసరఫరాల శాఖ

వలంటీర్ వ్యవస్థ బాగుంది

- మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ ప్రశంసలు
- తక్షణం నివేదిక ఇవ్వాలని సీఎంవోకు ఆదేశం



సాక్షి, న్యూఢిల్లీ : ఆంధ్రప్రదేశ్‌లో ప్రజలకు ఇంటి వద్దే ప్రభుత్వ పథకాలు, సేవలను అందించే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్ల వ్యవస్థ చాలా బాగుందని మధ్యప్రదేశ్ సీఎం శివరాజ్‌సింగ్ చౌహాన్ ప్రశంసించారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి 50 కుటుంబాలకు ఒక వలంటీరును నియమించడం, 2.62 లక్షల మందికి గ్రామస్థాయిలో సేవ చేసే అవకాశం కల్పించడం అభినందనీయమన్నారు. దీనిపై తక్షణం అధ్యయనం నిర్వహించి నివేదిక సమర్పించాలని తన కార్యాలయ సిబ్బందిని ఆదేశించారు. సీఎం శివరాజ్‌సింగ్ ఆదేశాల మేరకు ఆయన ఓఎస్డీ లోకేష్ నవరత్నాలు, వలంటీర్లు, సచివాలయాల వ్యవస్థ గురించి 'సాక్షి' ప్రతినిధి నుంచి వివరాలను సేకరించారు. మరి కొద్ది నెలల్లో మధ్యప్రదేశ్ శాసనసభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో శనివారం రాత్రి భోపాల్‌లోని తన అధికారిక నివాసంలో మీడియాతో సీఎం శివరాజ్‌సింగ్ ముచ్చటించారు. ఈ సందర్భంగా 'సాక్షి' ప్రతినిధితో ప్రత్యేకంగా మాట్లాడారు. ఏపీలో అమలవుతున్న పలు పథకాల గురించి ఆరా తీశారు. ఆ వివరాలివీ..

- ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సచివాలయాల వ్యవస్థను తీసుకొచ్చి గ్రామ / వార్డు సచివాలయాల ద్వారా ప్రజలకు 500కిపైగా సేవలందించడం, ప్రతి 50 కుటుంబాలకు ఒక వలంటీరు చొప్పున నియమించడం వినూత్నం, అభినందనీయం. యువతకు స్థానికంగా తోటివారికి సేవలందించే అవకాశం లభిస్తుంది.
- ఎలాంటి పడిగాపులు లేకుండా ఇంటివద్దే రేషన్ సరుకులు అందించడం కూడా బాగుంది.
- ప్రజాస్వామ్యంలో అందరినీ స్వాగతిస్తాం. బీఆర్ఎస్ పార్టీ మరింత జోరుగా మా రాష్ట్రానికి రావచ్చు. అయినా తెలంగాణలో జరుగుతున్న అవినీతి గురించి దేశం మొత్తానికి తెలుసు.

8 పాఠశాలలకు 'ఉత్తమ' అవార్డులు

- పదోతరగతిలో నూరుశాతం ఫలితాలు సాధించిన వాటికి గుర్తింపు
- నేడు విజయవాడలో అవార్డులు ప్రదానం చేయనున్న సీఎం జగన్

సాక్షి, అమరావతి: స్వాతంత్ర్యదిన వేడుకల సందర్భంగా ప్రభుత్వంలోని వివిధ యాజమాన్యాల పరిధిలోని ఎనిమిది పాఠశాలలను రాష్ట్రస్థాయి ఉత్తమ స్కూల్ అవార్డులకు ఎంపిక చేశారు. గత విద్యాసంవత్సరం పదో తరగతిలో నూరుశాతం ఫలితాలు సాధించిన ఈ పాఠశాలలకు మంగళవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డులను ప్రదానం చేయనున్నారు. ఎస్సెస్సీ ఫలితాల్లో నూరుశాతం విద్యార్థుల ఉత్తీర్ణతతో పాటు విద్యార్థుల సరాసరి అత్యధిక మార్కులు సాధించిన బడులను అవార్డుకు ఎంపిక చేశారు. ఇందులో సీతంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జియ్యమ్మవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (పార్వతీపురం మన్యం జిల్లా), ఏపీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాల (భీమునిపట్నం), భద్రగిరిలోని ఏపీ గిరిజన బాలికల సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాల–యూఆర్జేసీ (పార్వతీపురం మన్యం జిల్లా), మంచాల ఏపీ మోడల్ స్కూల్ (అనకాపల్లి జిల్లా), పెదపవని ఏపీ సాంఘిక సంక్షేమ బాలికల రెసిడెన్షియల్ స్కూల్ (శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా), డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం మెమోరియల్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ (కర్నూలు), వీరఘట్టం కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయ (పార్వతీపురం మన్యం జిల్లా) ఉన్నాయి. అవార్డులు ప్రకటించిన ఎనిమిది పాఠశాలల్లో నాలుగు పార్వతీపురం మన్యం జిల్లాలోనే ఉండడం విశేషం. ఎంపికైన పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపల్స్ మంగళవారం విజయవాడలో జరిగే స్వాతంత్ర్యదిన వేడుకల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నుంచి అవార్డులను అందుకోనున్నారు. ఏటా స్వాతంత్ర్యదిన వేడుకల సందర్భంగా గడిచిన విద్యాసంవత్సరం పదోతరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ప్రభుత్వ నిర్వహణలోని పాఠశాలలకు 2005 నుంచి అవార్డులు అందజేస్తున్నారు. ఇందులో నూరుశాతం ఉత్తీర్ణత, గరిష్ట సగటు మార్కులను పరిగణనలోకి తీసుకుంటున్నారు.

'ఏఐ'తో ఎదిగేలా!

▶ మొదటి పేజీ తరువాయి

నేర్చుకునేందుకు వీలుగా అంతర్జాతీయ విద్యారంగంలో ప్రసిద్ధ సంస్థలను భాగస్వాములుగా చేయాలి. ఐబీ, ఐజీసీఎస్ఈ సిలబస్‌తో వివిధ కోర్సులను తొలుత పైలట్ పద్ధతిలో ప్రవేశపెట్టి విస్తృత అధ్యయనం తరువాత పూర్తిస్థాయిలో అందుబాటులోకి తేవాలి' అని సూచించారు. సీఎం జగన్ సోమవారం క్యాంపు కార్యాలయంలో విద్యాశాఖపై ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థలో ఏఐ టెక్నాలజీ వినియోగం, పాఠశాలలు, ఇంటర్ విద్యలో ఇంటర్నేషనల్ బాకలారియేట్ (ఐబీ), ఐజీసీఎస్ఈ (కేంబ్రిడ్జి) సిలబస్ అమలుపై పలు సూచనలు చేశారు. ఆ వివరాలివీ..

జాబ్ ఓరియెంటెడ్ విద్యా విధానం

అందుబాటులో ఉన్న ఏఐని బోధన, సబ్జెక్టు పరిజ్ఞానాన్ని పెంచుకునేందుకు వినియోగించుకోవాలి. ఈ టెక్నాలజీని నేర్చుకోవడం ఒక్కటే కాకుండా ఏఐలో క్రియేటర్లుగా మారడం ఎలా అన్నది ప్రధాన అంశంగా విద్యార్థులను తీర్చిదిద్దాలి. కొత్త తరహా సబ్జెక్టులను నేర్చుకునేందుకూ ఏఐని వినియోగించుకోవాలి. అధ్యాపకుల కొరత, కంటెంట్ల కొరతను నివారించేందుకు ఏఐ ఉపయోగపడుతుంది. దీనిపై ప్రధానంగా అధికారులు దృష్టి పెట్టాలి. విద్యార్థులు తాము నేర్చుకున్న థియరీ నిజ జీవితంలో ఏ మేరకు ప్రాక్టికల్‌గా ఉపయోగపడుతుందో వివరిస్తూ ప్రశ్నాపత్రాలు రూపొందించాలి. విద్యార్థులతో పాటు తల్లిదండ్రులకూ విద్యావిధానంలో వస్తున్న మార్పులపై అవగాహన కల్పించాలి. ఉన్నత విద్యలో ఏ కోర్సు నేర్చుకున్నా అది విద్యార్థికి మంచి ఉద్యోగం, ఉపాధి కల్పించేలా ఉండాలి. అందుకు అనుగుణంగా కోర్సులు రూపొందించాలి.

మన సర్టిఫికెట్లకు అత్యుత్తమ విలువ ఉండేలా..

ప్రపంచస్థాయి బోధనే లక్ష్యంగా మన విద్యా రంగం అడుగులు వేయాలి. ప్రభుత్వ పాఠశాలలు, ఇంటర్ విద్యలో ఐబీ, ఐజీసీఎస్ఈ సిలబస్ అమలు దిశగా ప్రణాళిక రూపొందించాలి. ముందుగా తొలుత విస్తృతంగా అధ్యయనం, కసరత్తు జరగాలి. విద్యార్థుల ప్రయోజనాలను నెరవేర్చేలా, మన విద్యావ్యవస్థ అవసరాలను తీర్చేలా ఇది ఉండాలి. పాఠశాల విద్యలో కూడా ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో మెరుగైన విద్యా విధానాలు అందుబాటులోకి రావాలి. దీనిపైనా అధ్యయనం తప్పనిసరి. మన విద్యార్థులు పదో తరగతి సర్టిఫికెట్ తీసుకున్నా, ఇంటర్ సర్టిఫికెట్ తీసుకున్నా వాటికి ప్రపంచంలో ఎక్కడైనా సరే అత్యుత్తమ విలువ ఉండాలన్నదే మన లక్ష్యం. శాస్త్ర సాంకేతిక, ఆర్థిక, వ్యాపార, ఇతర రంగాల్లో వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులను సిద్ధం చేయాలి.



విద్యాశాఖపై ఉన్నత స్థాయి సమీక్షలో మాట్లాడుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

నాయకులు మార్పును స్వాగతించాలి..

గత సర్కారు హయాంలో ప్రభుత్వ స్కూళ్లను, విద్యార్థులను గాలికొదిలేశారు. మనం వచ్చాక అనేక మార్పులు తీసుకొచ్చి ప్రపంచవ్యాప్తంగా ఉత్తమ అవకాశాలను అందిపుచ్చుకునేలా విద్యార్థులను ప్రోత్సహిస్తున్నాం. ఈ విధానాన్ని సమర్థంగా అమలు చేసి విజయవంతమైన విద్యార్థులుగా తీర్చిదిద్దడం మన బాధ్యత. ఉన్నత ఆలోచనలతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు అందించేలా చర్యలు చేపట్టాలి. నాయకులుగా ఉన్న వ్యక్తులు మార్పులను స్వాగతిస్తూ పేద విద్యార్థులకు మంచి జీవితాన్ని అందించాలి. సులభంగా నేర్చుకునే విధానాలతోపాటు విద్యార్థుల్లో ఆసక్తి, సృజనాత్మకత పెంచేందుకు నిరంతరం కృషి చేయాలి.

వర్సిటీల్లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లు

ఉన్నత విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు కోర్సు చివరిలో 'ఏఐ' ప్రాథమిక అంశాలను బోధించేలా కార్యాచరణ రూపొందించినట్లు సమావేశంలో అధికారులు వివరించారు. ఏఐపై పరిశోధన కోసం యూనివర్సిటీల్లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. బోధన, పరిశోధన, అసెస్‌మెంట్‌లో ఏఐ టూల్స్ వినియోగంతో పాటు అంతర్జాతీయ ప్రమాణాలతో ఏఐని ఒక కోర్సుగా ప్రమోట్ చేస్తామన్నారు. ఏఐ ప్రాథమిక అంశాలపై అవగాహన పెంపొందించేలా సమగ్ర ఫౌండేషన్ కోర్సును బైలింగ్యువల్, డిజిటల్ కంటెంట్ రూపంలో అందుబాటులోకి తెస్తున్నట్లు వెల్లడించారు. ప్రపంచస్థాయి సంస్థలతో మమేకమై ఏఆర్, వీఆర్ కంటెంట్, డిజిటల్ మౌలిక సదుపాయాల అభివృద్ధి, పరిశోధనలో బోధనా పద్ధతులు, క్లాస్‌రూం మేనేజ్‌మెంట్, వ్యక్తిగతంగా నేర్చుకునే విధానాల కోసం ఏఐని వినియోగించుకునే దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. ఏఐ, అప్లికేషన్ల వినియోగంలో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్స్‌ను అభివృద్ధి చేస్తున్నట్టు తెలిపారు. కంప్యూటర్ విజన్ జోన్, ఇమేజ్ ప్రాసెసింగ్ జోన్, మెటావర్స్ లెర్నింగ్ జోన్లను యూనివర్సిటీల్లో ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఉన్నత విద్యలో మాసివ్ ఓపెన్ ఆన్‌లైన్ కోర్సుల్లో (మూక్) విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నామని, ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా విభాగంలో మొత్తం 1,17,012 మంది మూక్ కోర్సులు అభ్యసించినట్లు తెలిపారు. విద్యార్థులు 1.5 లక్షల కోర్సులను నేర్చుకోవడం ద్వారా 5.09 లక్షల క్రెడిట్స్ సాధించినట్లు వెల్లడించారు.

29 మంది ఏపీ అధికారులకు

పోలీస్ పతకాలు

- స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రకటించిన కేంద్రం
- ఏడీజీపీ శంఖబ్రత బాగ్చికి రాష్ట్రపతి విశిష్ట సేవా పోలీస్ పతకం





శంఖబ్రత బాగ్చీ

సాక్షి, న్యూఢిల్లీ: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని కేంద్ర హోం శాఖ దేశంలో మొత్తం 954 మంది అధికారులకు సోమవారం పోలీస్ పతకాలను ప్రకటించింది. వీరిలో ఒకరిని రాష్ట్రపతి పోలీస్ శౌర్య పతకం, 229 మందిని పోలీస్ శౌర్య పతకాలు, 82 మందిని రాష్ట్రపతి విశిష్ట సేవా పోలీస్ పతకాలు, 642 మందిని ప్రతిభా పోలీస్ పతకాలకు ఎంపిక చేసింది. ఆంధ్రప్రదేశ్‌కు 1 రాష్ట్రపతి విశిష్ట సేవా పోలీస్ పతకం, 10 ప్రతిభా పోలీస్ పతకాలు, 18 పోలీస్ శౌర్య పతకాలు లభించాయి. విధి నిర్వహణలో విశిష్ట సేవలు అందించినందుకు గాను రాష్ట్రానికి చెందిన అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (ఏడీజీపీ) శంఖబ్రత బాగ్చి రాష్ట్రపతి విశిష్ట సేవా పోలీస్ పతకానికి ఎంపికయ్యారు.

రాష్ట్రం నుంచి ప్రతిభా పోలీస్ పతకాలకు ఎంపికైనవారు..

1. దాడిరెడ్డి మురళీధర్‌రెడ్డి, సీఐ, కర్నూల్ టౌన్
2. సింగులూరి వెంకటేశ్వరరావు, డీఎస్పీ, ఏలూరు
3. కొండపు ఆనందరెడ్డి, డీసీపీ, విశాఖపట్నం సిటీ
4. సుంకర మునిస్వామి, ఆర్ఐ, మంగళగిరి
5. బెండి కాశీపతి, అసిస్టెంట్ రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్, విశాఖపట్నం
6. జమ్మలమడుగు నిసార్ అహ్మద్ బాషా, ఏఎస్ఐ
7. బెహెర నాగభూషణరావు, ఏఎస్ఐ
8. కన్నూజు వాసు, ఇన్‌స్పెక్టర్, గుంటూరు
9. మంద సత్యనారాయణ, ఏఎస్ఐ
10. తోట బ్రహ్మయ్య, డీఎస్పీ

రాష్ట్రం నుంచి పోలీస్ శౌర్య పతకాలకు ఎంపికైనవారు..

1. కనపాకల హేమసుందరరావు (ఏఏసీ)
2. మార్పు సుదర్శనరావు (ఎస్‌సీ)
3. జక్కు దేముడు (జేసీ)
4. పొన్నాడ లవకుమార్ (ఏఏసీ)
5. చిక్కంగౌరి వెంకట రామచంద్రరావు (ఎస్‌సీ)
6. ముర సత్యనారాయణరావు (జేసీ)
7. మట్టపర్తి సుబ్రహ్మణ్యం (జేసీ)
8. శంఖబతుల వీరవెంకట సత్యనారాయణ (జేసీ)
9. ప్రగడ పోశయ్య (జేసీ)
10. ఏడిగగండ్లూరు అశోక్ కుమార్ (అడిషనల్ ఎస్పీ)
11. పైల పార్వతీశం (ఎస్‌సీ)
12. గొర్లి రమణబాబు (జేసీ)
13. షేక్ సర్దార్ ఘనీ (ఇన్‌స్పెక్టర్)
14. గుల్లిపల్లి నాగేంద్ర (జేసీ)
15. కోమట్ల రామచంద్రారెడ్డి (జేసీ)
16. దాసరి సురేష్ బాబు (జేసీ)
17. ఏపూరి మధుసూదన్‌రావు (జేసీ)
18. పాళ్యం మహేశ్వరరెడ్డి (ఏఏసీ)



త్రివర్ణ విద్యుత్ కాంతులతో దేదీప్యమానంగా వెలిగిపోతున్న వెలగపూడిలోని ఏపీ సచివాలయం



తాడేపల్లిలోని ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయం

నేడు విజయవాడలో స్వాతంత్ర్య వేడుకలు

- ముస్తాబైన ఇందిరాగాంధీ స్టేడియం
- జాతీయ జెండాను ఎగురవేయనున్న సీఎం జగన్.. అనంతరం ప్రజలను ఉద్దేశించి ప్రసంగం
- సాయంత్రం రాజ్‌భవన్‌లో గవర్నర్ తేనీటి విందు
- హాజరుకానున్న ముఖ్యమంత్రి జగన్



స్వాతంత్ర్య వేడుకలకు సిద్ధమైన వైఎస్సార్ జగనన్న కాలనీ శకటం



ముస్తాబవుతున్న విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం

సాక్షి, అమరావతి: స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. మంగళవారం నిర్వహించనున్న ఈ వేడుకల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొని జాతీయ జెండాను ఎగురవేయనున్నారు. అనంతరం సాయుధ దళాల నుంచి ఆయన గౌరవ వందనం స్వీకరిస్తారు. ఆ తర్వాత రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. ఈ సందర్భంగా శకటాలతో వివిధ శాఖలు ప్రదర్శన నిర్వహించనున్నాయి. ఉదయం 9 గంటలకు వేడుకలు ప్రారంభం కానున్న దృష్ట్యా ఆహ్వానితులు, పాస్‌లు ఉన్నవారు మంగళవారం ఉదయం 8 గంటలకల్లా సభా ప్రాంగణంలో కేటాయించిన సీట్లలో కూర్చోవాలని అధికారులు కోరారు. అనంతరం సాయంత్రం ఐదున్నర గంటలకు రాజ్‌భవన్‌లో గవర్నర్ విందు(ఎట్ హోమ్) ఏర్పాటు చేశారు. సీఎం జగన్, ఇతర ప్రముఖులు హాజరుకానున్నారు.

వేడుకలకు ఏర్పాట్లు..

రాష్ట్ర హైకోర్టు, శాసన మండలి, శాసనసభ, సచివాలయ ప్రాంగణాల్లో స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. త్రివర్ణ పతాక రంగుల విద్యుత్ దీపాలతో ఆ భవనాలను ముస్తాబు చేశారు.

కాగా, మంగళవారం ఉదయం 7.45 గంటలకు శాసన మండలి వద్ద మండలి చైర్మన్ మోషేన్ రాజు, ఉదయం 8.15 గంటలకు శాసనసభ వద్ద స్పీకర్ తమ్మినేని సీతారాం, ఉదయం 7.30 గంటలకు రాష్ట్ర సచివాలయం మొదటి భవనం వద్ద ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి జాతీయ జెండాను ఎగురవేస్తారు. అలాగే నేలపాడులోని హైకోర్టు వద్ద ఉదయం 10 గంటలకు జరిగే స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమంలో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ పాల్గొని.. మువ్వన్నెల జాతీయ జెండాను ఎగురవేస్తారు.

'నోటీ'శ్వరులు

బ్యాంకులకు వెనక్కి వస్తున్న రూ.2 వేల నోట్లు బడా బాబులవే

- చిన్న బ్యాంకుల్లో 90% పైగా వ్యాపారుల నుంచే
- అత్యధికంగా ఎస్‌బీఐలో రూ.14,000 కోట్లు విలువైన నోట్ల డిపాజిట్
- 88 శాతం నోట్లు వెనక్కి



సాక్షి, అమరావతి: క్లీన్ నోట్ పాలసీలో భాగంగా కేంద్రప్రభుత్వం రూ.2 వేల నోటును మే 19న చెలామణిలోంచి ఉపసంహరించింది. సెప్టెంబరు 30 లోగా ఆ నోట్లను బ్యాంకుల్లో మార్చుకోవాలని ఆర్‌బీఐ సూచించింది. దీంతో రూ.2 వేల నోట్లు ఉన్న వారందరూ వాటిని బ్యాంకుల్లో డిపాజిట్ చేసి, చిన్న నోట్లు తీసుకుంటున్నారు. ఇలా నోట్లను మార్చుకుంటున్న వారిలో అత్యధికులు బడా బాబులే. సామాన్యుల నుంచి వస్తున్న నోట్లు చాలా తక్కువని బ్యాంకింగ్ వర్గాలు చెబుతున్నాయి. ప్రైవేటు బ్యాంకులు, మరికొన్ని చిన్న బ్యాంకుల్లో డిపాజిట్ అవుతున్న నోట్లలో 90 శాతానికి పైగా వ్యాపారుల నుంచే వస్తున్నాయని వెల్లడించాయి. సిటీ యూనియన్ బ్యాంక్‌లో రూ.380 కోట్ల విలువైన రూ.2 వేల నోట్లు డిపాజిట్ అయితే.. అందులో 90 శాతం పైన వ్యాపారవేత్తలవేనని ఆ బ్యాంకు అధికారులు తెలిపారు. అదే పెద్ద బ్యాంకుల్లో వస్తున్న డిపాజిట్లలో 50 శాతం పైన ధనవంతులవే. ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్‌లో రూ.3,589 కోట్ల విలువైన నోట్లు వెనక్కి రాగా అందులో 40 శాతం పైన, యూకో బ్యాంకులో రూ.3,471 కోట్లు డిపాజిట్ అయితే అందులో 58 శాతం వ్యాపారవర్గాల నుంచే వచ్చినట్లు పేర్కొన్నారు. 2016లో రూ.500, రూ.1,000 నోట్లను రద్దు చేసినప్పుడు నగదు కొరత రాకుండా రూ.2 వేల నోటును కేంద్రం ప్రవేశపెట్టింది. కొన్ని సంవత్సరాలుగా రూ.2 వేల నోటు చెలామణి తగ్గడంతో వీటిని వెనక్కి తీసుకుంటున్నారు. సెప్టెంబర్ 30 వరకు ఈ నోట్లను బ్యాంకుల్లో డిపాజిట్ చేసుకోవడానికి ఆర్‌బీఐ అనుమతించింది. బ్యాంకులకు చేరిన నోట్లను తిరిగి వెనక్కి ఇవ్వవొద్దని బ్యాంకులను ఆదేశించింది. దేశంలో మొత్తం రూ.3.62 లక్షల కోట్ల విలువైన రూ. 2 వేల నోట్లు చెలామణిలో ఉండేవి. వాటి ఉపసంహరణ అనంతరం జూలై 31 నాటికి 88 శాతం నోట్లు అంటే రూ.3.14 లక్షల కోట్లు వెనక్కి వచ్చినట్లు ఆర్‌బీఐ ప్రకటించింది. అత్యధికంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ)కు రూ.14,000 కోట్లు విలువైన నోట్లు వచ్చాయి. పెద్ద మొత్తంలో నోట్లు వెనక్కి రావడంతో బ్యాంకుల వద్ద డిపాజిట్ల విలువ భారీగా పెరిగిపోతోంది. దీంతో బ్యాంకుల వద్ద నగదు లభ్యతను తగ్గించడానికి ఇంక్రిమెంటల్ క్యాష్ రిజర్వ్ రేషియో (ఐసీఆర్ఆర్)ను 10 శాతం కేటాయించాలని ఆర్‌బీఐ ఆదేశించింది. బ్యాంకుల వద్ద ఒక్కసారిగా డిపాజిట్లు పెరిగిన సమయంలో తాత్కాలికంగా ఐసీఆర్ఆర్‌ను ఆర్‌బీఐ వినియోగిస్తుంది.

జూలై 31నాటికి కొన్ని ప్రధాన బ్యాంకులకు వెనక్కి వచ్చిన రూ.2 వేల నోట్ల విలువ

బ్యాంకు పేరు	వెనక్కి వచ్చిన రూ.2 వేల నోట్ల విలువ (రూ. కోట్లల్లో..)
ఎస్‌బీఐ	14,000
బ్యాంక్ ఆఫ్ బరోడా	10,000
ఇండియన్ బ్యాంక్	7,000
ఇండియన్ ఓవర్సీస్	3,589
యూకో బ్యాంక్	3,471
కోటక్ మహీంద్రా	6,300
సౌత్ ఇండియా బ్యాంక్	888
సిటీ యూనియన్ బ్యాంక్	380

ఉండవల్లి శ్రీదేవిది సిగ్గుమాలిన రాజకీయం

రిలే దీక్షలో మండిపడ్డ బహుజన నేతలు

తాడికొండ: రాజ్యాంగ విలువలకు తిలోదకాలిచ్చి.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో అమ్ముడు పోయిన ఉండవల్లి శ్రీదేవి సిగ్గుమాలిన రాజకీయం చేస్తుందని, నిజంగా ఆమెకు ఏమాత్రం ఆత్మాభిమానం ఉన్నా వెంటనే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి తిరిగి గెలవాలని బహుజన పరిరక్షణ సమితి నాయకులు డిమాండ్ చేశారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 1,051వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో సోమవారం పలువురు మాట్లాడారు. అంబేడ్కర్ రాజ్యాంగాన్ని అడ్డు పెట్టుకుని ఎస్సీ రిజర్వేషన్ కేటగిరీలో వైఎస్సార్‌సీపీ టికెట్‌పై గెలిచిన శ్రీదేవి.. బాబు ఇచ్చిన ప్యాకేజీ తీసుకుని టీడీపీతో జతకట్టడం సిగ్గుచేటన్నారు. టీడీపీ ముసుగులో జరుగుతున్న అమరావతి ఫేక్ ఉద్యమంలో పెయిడ్ ఆర్టిస్టులు ఉన్నారని ఒకప్పుడు శ్రీదేవి విమర్శించిన మాటా వాస్తవం కాదా అని ప్రశ్నించారు. మరిప్పుడు ఆమెకు ఎంత పెయిడ్ చేస్తున్నారో చెప్పాలన్నారు. పావలా పవన్‌కళ్యాణ్‌కు పిచ్చిపట్టిందని.. ఆ పిచ్చిని త్వరలోనే వదిలిస్తామని హెచ్చరించారు. పవన్‌కళ్యాణ్, లోకేశ్ ముందు వార్డు కౌన్సిలర్‌లుగా గెలిచి ప్రజాక్షేత్రంలోకి రావాలని సవాల్ విసిరారు. బీజేపీ, వామపక్ష నాయకులు బాబుకు వంత పాడుతున్నారని, వీరందరినీ తరిమికొట్టి తగిన శాస్తి చెబుతామన్నారు. ఇందుపల్లి సుభాషిణి, మాదిగాని గురునాథం, పెరికే వరప్రసాద్, పులి దాసు, బేతపూడి సాంబయ్య, కారుమూరి పుష్పరాజ్, ఈపూరి ఆదాం, అహరోన్ పాల్ వాన, నూతక్కి జోషి పాల్గొన్నారు.

శ్రీశైల శిఖరం వద్ద మళ్లీ ఎలుగుబంటి

శ్రీశైలం/చంద్రగిరి(తిరుపతి రూరల్): శ్రీశైల మహాక్షేత్రానికి ఎనిమిది కిలో మీటర్ల దూరంలోని శిఖరేశ్వరం వద్ద ఆదివారం రాత్రి మళ్లీ ఎలుగుబంటి సంచరించడం కలకలం సృష్టించింది. ఈ ఏడాది మార్చి 26న శిఖరం వద్ద ఎలుగుబంటి కనిపించడంతో దేవస్థానం అధికారులు అటవీశాఖ ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. కాగా, తిరుమల శ్రీవారి మెట్టు మార్గంలో 2,000 మెట్టుకు సమీపంలో భల్లూకం సోమవారం హల్‌చల్ చేసింది. భక్తులు భయంతో బిగ్గరగా అరుస్తూ పరుగులు తీశారు. ఆ కేకలకు అది అడవిలోకి వెళ్లిపోయింది.



'చల్లా' నేరాలు ఎన్నో..

- రోడ్లపైకి రావడం.. అధికారులను బెదిరించడం..
- కర్ణాటక నుంచి మద్యం అక్రమ రవాణా..
- ఇవికాక అనేక కేసుల్లో ప్రధాన నిందితుడు
- పుంగనూరు ఘటనతో పరార్

చిత్తూరు అర్బన్ (చిత్తూరు జిల్లా): ఇటీవల చంద్రబాబు నాయుడు పుంగనూరు పర్యటనలో టీడీపీ నేతలు, కార్యకర్తలు సృష్టించిన విధ్వంసకాండలో ప్రధాన నిందితుడిగా ఉన్న టీడీపీ నేత చల్లా బాబు గత చరిత్ర అంతా నేరాలమయమే. ఇప్పటికే పోలీసులు అతనిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. అయితే, చల్లా తొలి నుంచి వివాదాలకు వెళ్లడం, నిబంధనలను ఉల్లంఘించడం, నిషేధాజ్ఞలు లెక్క చేయకపోవడం, అధికారులను బూతులు తిడుతూ వాళ్ల విధులను అడ్డుకోవడం లాంటి కేసులు చాలానే ఉన్నాయి. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని అతని నేరాల చిట్టాలో ముఖ్యమైనవి..

- పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జ్ చల్లా బాబు అలియాస్ చల్లా రామచంద్రారెడ్డి 2021 జనవరి 28న రొంపిచెర్లలో విధుల్లో ఉన్న పోలీసులను అడ్డగించి, ప్రజల్ని భయాందోళనలకు గురిచేసి బూతులు తిట్టగా నలుగురిపై నమోదైన కేసులో అతను కూడా నిందితుడు.
- ఇదే ఏడాది కర్ణాటక నుంచి నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం తీసుకొస్తూ ఎక్సైజ్ పోలీసులకు చల్లా బాబు పట్టుబడ్డారు.


చంద్రబాబుతో చల్లా బాబు (ఫైల్)

- కరోనా సమయంలో పెద్ద గుంపుతో చల్లా బాబు ప్రజలను భయభ్రాంతులకు గురిచేసినందుకు, ప్రకృతి వైపరీత్యాల ఉల్లంఘన చట్టం కింద రొంపిచెర్ల పోలీసులు 2021 సెప్టెంబరు 17న 22 మందిపై నమోదు చేసిన క్రిమినల్ కేసులో చల్లా బాబు ప్రధాన నిందితుడు.
- గత ఏడాది చౌడేపల్లెలోనూ ఇదే తరహా ఘటనకు పాల్పడటంతో కేసు నమోదైంది. కల్లూరులో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ ర్యాలీలు నిర్వహించి ప్రజలను భయభ్రాంతులకు గురిచేసినందుకు గతేడాది ఏప్రిల్ 5న నమోదు చేసిన కేసులో చల్లా ప్రధాన నిందితుడు.
- ఇక లోకేష్ పాదయాత్ర వంద రోజులు పూర్తి పేరుతో ప్రజల్ని ఇబ్బందులకు గురిచేస్తూ, వాహనాలను రోడ్లపై అడ్డుగా పెట్టి హంగామా సృష్టించినందుకు ప్రధాన నిందితుడిగా ఉన్నాడు.
- తాజాగా.. పుంగనూరులో పోలీసులను చంపాలని చేసిన పన్నాగం, ఇందులో పోలీసుల తలలు పగలడం, కానిస్టేబుల్ కంటి చూపుపోవడం, మహిళా ఎస్‌ఐను చంపాలని చూడటం లాంటి ఘటనలపై నమోదైన ఏడు కేసుల్లోనూ చల్లా బాబు ప్రధాన నిందితుడు. పరారీలో ఉన్న అతనిని పట్టుకునేందుకు చిత్తూరు ఎస్పీ రిషాంత్ రెడ్డి ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు.

చెన్నై ఎక్స్‌ప్రెస్‌లో భారీ దోపిడీ

- ప్రయాణికులను బెదిరించి 111 గ్రా. బంగారం అపహరణ
- చైన్ లాగి దిగిపోయిన దొంగలు
- చాగల్లు–తెట్టు మధ్య ఘటన
- చార్మినార్ ఎక్స్‌ప్రెస్‌లోనూ దోపిడీకి యత్నం

ఉలవపాడు: అర్ధరాత్రి వేళ.. అందరూ నిద్రలో ఉన్నారు.. అంతలో ఒక్కసారిగా రైల్లో కలకలం.. బోగీలోకి ఎక్కిన దొంగలు ప్రయాణికులను బెదిరించి వారి వద్ద నుంచి బంగారు ఆభరణాలు తీసుకుని చైన్ లాగి దర్జాగా రైలు దిగి వెళ్లిపోయారు. చాగల్లు–తెట్టు మధ్య హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్‌లో ఆదివారం అర్ధరాత్రి ఈ ఘటన జరిగింది. హైదరాబాద్ నుంచి చెన్నైకు వెళ్తున్న హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్ రాత్రి గం.1.50 సమయంలో నెల్లూరు జిల్లా ఉలవపాడు మండలం రాజుపాలెం (చాగల్లు–తెట్టు) వద్ద దొంగలు చైన్ లాగడంతో రైలు నిలిచింది. దొంగలు ప్రయాణికులను బెదిరించి వారి నుంచి నగలు అపహరించి రైలు దిగారు. అనంతరం హైదరాబాద్ నుంచి తాంబరం వెళుతున్న చార్మినార్ ఎక్స్‌ప్రెస్ 2.30గం.ల. సమయంలో సిగ్నల్ వద్ద నిలిచిపోయింది. అక్కడే ఉన్న దొంగలు అక్కడే ఉండి ప్రయాణికులను బెదిరించి దోపిడీ చేసేందుకు యత్నించారు. కానీ రైల్వే పోలీసులు టార్చ్ లైట్లు వేసి వారిని చూడాలని ప్రయత్నించడంతో రైలుపై రాళ్లు రువ్వారు. దీంతో ఆటోలో దొంగలు పారిపోయారు. ఈ రెండు ఘటనలు 40 నిమిషాల వ్యవధిలో జరిగాయి.

నలుగురు దొంగలు!

హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్‌లో మొత్తం మూడు బోగీలలో కలిపి 111 గ్రాముల బంగారం దోపిడీ జరిగినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. హైదరాబాద్ నుంచి చెన్నైకు వెళ్తున్న మహేంద్రచౌదరి నుంచి 36 గ్రా. చైన్, నరేంద్రరెడ్డి, దీప్తిల దగ్గర్నుంచి 40 గ్రా. బంగారం, సరళ, తమిళనాడుకు చెందినవారు వారి వద్ద నుంచి 20 గ్రా. బంగారం, ఉమాజానకి నుంచి 15 గ్రా. చైన్.. మొత్తం 111 గ్రాముల బంగారు ఆభరణాలను దొంగలు బెదిరించి తీసుకెళ్లినట్టు తెలిసింది. సూళ్లూరుపేట స్టేషన్‌లో బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా, ఈ దోపిడీ మొత్తం నలుగురు దొంగలున్నట్టు పోలీసులు చెప్పారు. దొంగలను పట్టుకునేందుకు ఆరు బృందాలను ఏర్పాటు చేసినట్లు నెల్లూరు జీఆర్పీ డీఎస్పీ మల్లికార్జునరావు తెలిపారు. ఆరుగురు ఎస్‌ఐలు, ఆరుగురు హెడ్‌కానిస్టేబుళ్లు, 12 మంది కానిస్టేబుళ్లతో ఈ బృందాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఎస్2 నుంచి ఎస్8 వరకు బోగీల్లో ప్రయాణికులను దొంగలు బెదిరించినట్లు తెలిపారు. అయితే ఆ బోగీల్లో పోలీస్ సిబ్బంది లేకపోవడం వల్లే భారీ దోపిడీ జరిగిందని ఆరోపణలున్నాయి.

టీడీపీ నాయకులపై కిడ్నాప్ కేసు

నామినేషన్ విత్‌డ్రా చేసుకోవాలంటూ బెదిరించిన నేతలు

సింగరాయకొండ: టీడీపీ నాయకులు కిడ్నాప్ చేసి పంచాయతీ సర్పంచ్ పదవికి సమర్పించిన నామినేషన్ పత్రాలను ఉపసంహరించుకోవాలని బెదిరించారని ఆరోపిస్తూ ప్రకాశం జిల్లా సింగరాయకొండ పోలీస్ స్టేషన్‌లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారుడు కుర్రు ప్రసన్నకుమార్ సోమవారం రాత్రి గం.9.30 సమయంలో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కిడ్నాప్ వ్యవహారంలో ఐదుగురు ప్రధాన పాత్ర పోషించారని ఆరోపించారు. ప్రసన్నకుమార్ ఇచ్చిన ఫిర్యాదులో తెలిపిన వివరాల ప్రకారం.. తాను ఈ నెల 10వ తేదీన పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసినట్టు తెలిపారు. సోమవారం దేవి సీఫుడ్స్ కంపెనీలో ఉద్యోగ నిర్వహణలో ఉండగా.. తన కోసం ఎవరో వచ్చారని కబురు చేయడంతో బయటకు వెళ్లానని పేర్కొన్నారు. అక్కడ కె.నరసింహారావు అనే వ్యక్తి వచ్చి.. కలికవాయ గ్రామానికి చెందిన మందలపు గాంధీ చౌదరి తీసుకుని రమ్మన్నాడని చెప్పి తనను బలవంతంగా రౌడీల సహకారంతో పాకల గేటు వద్దకు తీసుకుని వెళ్లారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. అక్కడ నరసింహారావు, చీమకుర్తి కృష్ణ, అతని డ్రైవర్లు బలవంతంగా కారులోకి ఎక్కించుకుని నామినేషన్ ఉపసంహరించుకోవాలని, టీడీపీ అభ్యర్థి సైకం చంద్రశేఖర్‌ను గెలిపించాలని, డబ్బు కూడా ఇస్తామని చెప్పారన్నారు. తమ షరతులకు ఒప్పుకోవాలని, లేకపోతే ఎన్నిక పూర్తయ్యే వరకు కిడ్నాప్ చేస్తామని బెదిరించారన్నారు. తరువాత అక్కడ నుంచి పాకల పంచాయతీ కార్యాలయానికి బలవంతంగా కారులో తీసుకు వచ్చారన్నారు. తాను వచ్చిన విషయం గమనించిన వైఎస్సార్‌సీపీ నాయకులు కారు వద్దకు రాగా.. తనను కిడ్నాప్ చేసిన వ్యక్తులు కారునుంచి దిగి పరారయ్యారని ఫిర్యాదులో పేర్కొన్నారు. వారి నుంచి తనకు ప్రాణహాని ఉందని.. ఎన్నిక అయ్యే వరకు భద్రత కల్పించాలని కోరారు. కాగా.. ఈ వ్యవహారంపై కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ దాచేపల్లి రంగనాథ్ చెప్పారు.

శ్రీవారి సేవలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి

తిరుమల: తిరుమల శ్రీవారిని సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భుయాన్ సోమవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. తొలుత ఆలయం వద్ద ఆయనకు టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈవో ఏవీ ధర్మారెడ్డి స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం జస్టిస్ ఉజ్జల్ భుయాన్ హుండీలో కానుకలు సమర్పించారు. వీరికి రంగనాయకుల మండపంలో వేద పండితులు ఆశీర్వచనం చేశారు. చైర్మన్ కరుణాకరరెడ్డి శాలువతో సత్కరించి తీర్థప్రసాదాలు, స్వామివారి చిత్రపటం అందించారు.


జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌కు శ్రీవారి చిత్రపటం అందజేస్తున్న భూమన

'ఎర్ర' స్మగ్లర్లపై పీడీ యాక్ట్

తిరుపతి మంగళం : మూడుసార్లు ఎర్రచందనం కేసులో పట్టుబడిన స్మగ్లర్లపై పీడీ యాక్ట్ నమోదు చేస్తామని టాస్క్‌ఫోర్స్ డీఎస్పీ చెంచుబాబు హెచ్చరించారు. తిరుపతిలోని టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కర్నూలు రేంజ్ డీఐజీ సెంథిల్‌కుమార్ ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు శేషాచల అడవుల్లో విస్తృతంగా కూంబింగ్ నిర్వహిస్తున్నారన్నారు. దాంతో మూడు ప్రాంతాల్లో సుమారు రూ. 2కోట్లు విలువ చేసే 51 ఏ గ్రేడ్ ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని, 48 మంది ఎర్రస్మగ్లర్లను అరెస్ట్ చేశామని చెప్పారు. తిరుపతి జిల్లా లక్ష్మీపురం గ్రామ సమీపంలో పెరుమాళ్లపల్లి ఫారెస్ట్ బీటు పరిధిలో ఓ వ్యక్తిని అరెస్టు చేసి 9 ఎర్రచందనం దుంగలు, ఓ కారు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. రెండో కేసులో అన్నమయ్య జిల్లా సానిపాయ రేంజి పరిధిలోని సుండుపల్లి అటవీ ప్రాంతంలో కొంతమందిని అరెస్ట్ చేసి 21ఎర్రచందనం దుంగలతో పాటు, 5మోటారు సైకిళ్లు, ఓ కారును స్వాధీనం చేసుకున్నామన్నారు. మూడో కేసులో అన్నమయ్య జిల్లా బాలపల్లి రేంజిలోని సిద్దలేరు బేస్ క్యాంప్ వద్ద అరిమాను బండ సమీపంలో 21ఎర్రచందనం దుంగలు, ఒక మోటారు సైకిల్, ఆటో స్వాధీనం చేసుకుని, 28మంది స్మగ్లర్లను అరెస్టు చేశామని చెప్పారు. 48 మంది నిందితులు తమిళనాడుకు చెందిన వారని తెలిపారు. మొత్తం 51 దుంగలు 1,588 కిలోలున్నాయని, వీటి విలువ సుమారు రూ.2కోట్లు ఉంటుందని డీఎస్పీ వివరించారు.



ఏ మూల్యానికైనా స్వేచ్ఛ అనేది ఖరీదైనది కాదు.
అది జీవితానికి శ్వాస. జీవించడం కోసం మనిషి
ఏం చెల్లించడు?

– మహాత్మా గాంధీ

సాక్షి

మంగళవారం, 15 ఆగస్టు 2023

తటస్థతకు తిలోదకాలు

పోసేవాడు ఒకందుకు పోస్తే... తాగేవాడు మరొకందుకు తాగాడని మోటు సామెత. ఎన్నికల కమిషనర్లు, ప్రత్యేకించి ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) నియామకంపై కేంద్ర ప్రభుత్వం ఆగస్ట్ 10న రాజ్యసభలో ప్రవేశపెట్టిన బిల్లు వ్యవహారం అచ్చం ఆ సామెతనే గుర్తు చేస్తోంది. ఎన్నికల కమిషనర్ల నియామకంపై పాలనావ్యవస్థ ఉడుంపట్టును సడలించేలా గత మార్చిలో సుప్రీమ్ కోర్ట్ రాజ్యాంగ ధర్మాసనం ఒక ఉద్దేశంలో తీర్పు చెబితే, అయిదునెలల్లో కేంద్రం ఏకంగా ఆ తీర్పు స్ఫూర్తికే విరుద్ధమైన బిల్లుతో ముందుకొచ్చింది. ఎంపిక ప్రక్రియ నుంచి భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ)ని తప్పించింది. తటస్థంగా ఉండాల్సిన ఎంపిక కమిటీని అధికారపక్షం తన అదుపాజ్ఞల్లో ఉంచుకొనేలా తెగబడింది. పార్టీ, ప్రభుత్వాలకతీతంగా నడవాల్సిన ఎన్నికల సంఘ స్వతంత్రతను దెబ్బతీస్తోంది.

భారత ప్రధాని, ప్రతిపక్ష నాయకుడు (ఎల్ఓపీ), కేంద్ర క్యాబినెట్ మంత్రితో కూడిన ముగ్గురు సభ్యుల ప్యానెల్ ఇకపై సీఈసీని నియమిస్తుందని ప్రభుత్వం బిల్లులో ప్రతిపాదించింది. ఇప్పటి దాకా కేంద్ర మంత్రిమండలి సలహా మేరకు సీఈసీని రాష్ట్రపతి నియమిస్తున్నారు. తాజాగా ప్రతిపక్ష నేతను కూడా చేర్చి, విస్తృత ప్రాతినిధ్యంతో ప్యానెల్ ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన మామూలుగానైతే స్వాగతించాలి. కానీ, ఇక్కడే తిరకాసుంది. సీఈసీ సహా ఎన్నికల కమిషనర్ల ఎంపికపై ప్రభుత్వం ప్రత్యేక చట్టం చేసే వరకు, సదరు ఎంపిక కమిటీలో సీజేఐకి కూడా చోటిచ్చి, ఈ ప్రక్రియను మరింత ప్రజాస్వామ్యయుతం చేయాలని మార్చి 2న అయిదుగురు సభ్యుల సుప్రీం రాజ్యాంగ ధర్మాసనం ఏకగ్రీవంగా తీర్పునిచ్చింది. సహజంగానే ఇది మింగుడుపడని సర్కార్ ఆగమేఘాలపై బిల్లు తెచ్చేసింది. ఆ బిల్లులో సీజేఐకి బదులుగా కేంద్ర మంత్రికి చోటిచ్చింది. మంత్రులంటే ప్రధాని గీచిన గీత దాటలేరు. వెరసి, ఎంపిక కమిటీలో పేరుకు ప్రతిపక్ష నేత ఉన్నా మొత్తం ముగ్గురిలో ఇద్దరు సభ్యులు పాలక పక్షీయులే గనక మెజారిటీ ఎటు మొగ్గుతుందో వేరుగా చెప్పనక్కర లేదు.

పార్లమెంట్ చేసిన చట్టాలకు అనుగుణంగా ఎన్నికల కమిషనర్ నియామకం జరగాలని భారత రాజ్యాంగ పరిషత్ చర్చలు పేర్కొన్న మాట నిజమే. దాన్ని ఆసరాగా చేసుకొనే సుప్రీమ్ సైతం ప్రభుత్వం చట్టం చేసే వరకు ప్రధాని, ప్రతిపక్ష నేత, సీజేఐతో కూడిన ఎంపిక సంఘమంటూ అయిదు నెలల క్రితం తాత్కాలిక ప్రతిపాదన తన తీర్పులో చెప్పింది. తీరా ఇప్పుడు ప్రభుత్వం చట్టం చేస్తోంది కానీ పరోక్షంగా అధికార పక్షం చేతిలోకే అంతా తెచ్చి, రాజ్యాంగబద్ధ సంస్థ స్వతంత్రతను పణంగా పెట్టింది. ఇదీ అసలు సమస్య. అలాగే, ఎంపిక సంఘం తనదైన సొంత ప్రక్రియను ఎంచుకోవచ్చట. ఆ సంఘం ముందు ఉంచాల్సిన తొలి జాబితాను క్యాబినెట్ సెక్రటరీ సారథ్యంలోని సెర్చ్ కమిటీ సిద్ధం చేస్తుందట. వెరసి, ప్రతిపక్ష నేత వట్టి ఉత్సవ విగ్రహమవుతారు. ఆయన అభిప్రాయం అరణ్యఘోషగా మిగులుతుంది. కొద్దినెలల్లో మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, తెలంగాణల్లోనూ, సరిగ్గా మరో 9 నెలల్లో లోక్‌సభకూ ఎన్నికలు జరగాల్సి ఉండగా కేంద్రం ఈ బిల్లు ద్వారా ఎన్నికల సంఘంపై పూర్తిగా పట్టు బిగించాలన్నది పాలకుల తాపత్రయమనిపిస్తోంది.

ప్రభుత్వ ప్రమేయం లేకుండా నడవాల్సిన వ్యవస్థకు పెద్ద తలకాయలెవరో అధికారంలో ఉన్నవారే నిర్ణయించడం ఎన్నికల ప్రజాస్వామ్యపు ప్రాథమిక లక్ష్యానికే విఘాతం. ఆ మాటకొస్తే దేశంలో ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించే ఎన్నికల సంఘం, కమిషనర్ల నియామకం పారదర్శకంగా లేదని కొన్నేళ్ళుగా వింటున్నదే. వారిపై ప్రభుత్వం పరోక్షంగా స్వారీ చేస్తున్నదన్న ఆరోపణలూ ఉన్నాయి. 2021 నవంబర్‌లో న్యాయశాఖ ఆదేశాల మేరకు సీఈసీ, ఎన్నికల కమిషనర్లు ఉమ్మడి ఓటర్ల జాబితాపై చర్చించడానికి ప్రధానమంత్రి కార్యాలయంతో సమావేశానికి వెళ్ళడం దుమారం రేపింది. ఇది ఎన్నికల సంఘం అధికారం, స్వతంత్రతను తగ్గించడమేనని రాజ్యాంగ నిపుణులు ఆందోళన వ్యక్తం చేశారు. పాలకవ్యవస్థ జోక్యం నుంచి ఎన్నికల సంఘాన్ని కాపాడాలన్న సదుద్దేశంతో సుప్రీమ్ తీర్పునిస్తే అంతా సంతోషించారు. తీరా కొత్త బిల్లుతో ఎన్నికల సంఘం ఇక అధికారికంగానే పాలకుల గూటి చిలకగా మారిపోనుంది. ఎన్నికలు కురుక్షేత్ర సమరంగా మారిన వర్తమాన పరిస్థితుల్లో ఎన్నికల సంఘం నిష్పక్షపాతంగా ఉందని సంబంధిత పక్షాలన్నిటికీ నమ్మకం కలగడం ముఖ్యం. పాలకులేమో చట్టం తెచ్చి మరీ ఆ నమ్మకానికి చరమగీతం పలుకుతున్నారు.

ఎన్నికల సంస్కరణలపై ఏర్పాటైన దినేశ్ గోస్వామి కమిటీ 1990లోనే ఎన్నికల సంఘపు స్వతంత్రతను కాపాడే మార్గాలతో కొన్ని సిఫార్సులు చేసింది. న్యాయ సంఘం 2015 నాటి తన 255వ నివేదికలో ఆ కమిటీ ప్రతిపాదనకు మార్పులు చేస్తూ, ఎంపిక కమిటీలో ప్రధానికి చోటుకల్పించింది. సీజేఐకీ అందులో స్థానం ఉంటే అధికార, ప్రతిపక్షాలు వేటికీ మొగ్గు లేకుండా తటస్థత నెలకొనేది. కొత్త బిల్లుతో ఆ తటస్థత నిర్వీర్యమైంది. ఇది గ్రహించి ప్రజాస్వామ్యంలో ఎన్నికల ప్రక్రియకు కావలిసంస్థ స్వతంత్రతను కాపాడుకోవాలి. రాజ్యాంగ రూపకల్పన వేళ అంబేడ్కర్ సైతం పాలనా వ్యవస్థ జోక్యానికి దూరంగా ఎన్నికల సంఘం ఉండాలన్నారు. సీఈసీ ఎంపిక ప్రక్రియ నుంచి సీజేఐని తప్పించకుండా ఉంటేనే అది సాధ్యం. కాదూ కూడదనుకుంటే, ప్రత్యామ్నాయంగా ఎంపిక కమిటీ నిర్ణయాలన్నీ ఏకగ్రీవంగా ఉండాలనే షరతు పెట్టాలి. తద్వారా ప్రతిపక్ష నేత మాటకు విలువ ఉంటుంది. ఎన్నికల సంఘం సమగ్రతను కాపాడినట్టూ అవుతుంది. మార్గం ఏదైనా, ఎన్నికల సంఘం నియామకాల ప్రక్రియను అపహాస్యం చేస్తున్న ఈ కొత్త బిల్లుపై తక్షణ సమీక్ష అవసరం. ప్రభుత్వం పునరాలోచించి, ఆ పని చేస్తేనే స్వతంత్ర భారతావనికి శోభ! ప్రజాస్వామ్యానికి రక్ష!!

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, అధిక శ్రావణ మాసం, తిథి: బ.చతుర్దశి ఉ.11.54 వరకు, తదుపరి అమావాస్య, నక్షత్రం: పుష్యమి ప.2.21 వరకు, తదుపరి ఆశ్లేష, వర్జ్యం: తె.4.31 నుండి 6.15 వరకు (తెల్లవారితే బుధవారం), దుర్ముహూర్తం: ఉ.8.16 నుండి 9.06 వరకు, తదుపరి రా.10.55 నుండి 11.40 వరకు, అమృతఘడియలు: ఉ.7.21 నుండి 9.05 వరకు.

సూర్యోదయం : 5.46
సూర్యాస్తమయం: 6.23
రాహుకాలం : ప.3.00 నుండి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుండి 10.30 వరకు

హింసా సంస్కృతి ఏ సందేశానికి?

అభిప్రాయం



ప్రొ॥ కంచ ఐలయ్య షెపర్డ్

డబుల్ ఇంజన్ ప్రభుత్వాలు మన దేశంలో కొత్తవి కావు. 1967 వరకు అన్ని రాష్ట్రాల్లోనూ డబుల్ ఇంజన్ కాంగ్రెస్ ప్రభుత్వాలు ఉన్నాయి. గట్టి ప్రత్యర్థులను, ముఖ్యంగా యువతీ యువకులను చంపడం, వారిని ప్రమాదకరమైన నక్సలైట్లుగా ముద్ర వేయడం ఆ రోజుల్లో ఆనవాయితీగా ఉండేది. అదృష్టవశాత్తూ దేశం ఆ పీడకల రోజులను అధిగమించింది. అయితే ఆనాటి క్రూరమైన ఎమర్జెన్సీ పరిస్థితుల్లో కూడా మణిపుర్ ఘటనలో లాగా మహిళలను నగ్నంగా ఊరేగించడం ఎప్పుడూ చూడలేదు. బహుశా అప్పటి రాజకీయ నిర్మాణంలో మూడో ఇంజన్ ఉండకపోవచ్చు. కానీ ఇప్పుడు ప్రజలను మతపరమైన మార్గాల్లో విభజించడానికి మార్గాలను రూపొందించే అత్యంత క్లిష్టమైన ఒక మూడో ఇంజన్ శక్తిమంతంగా పనిచేస్తోంది.

ప్రముఖ తెలుగు దినపత్రిక 'సాక్షి' సంపాదకులు వర్ధెల్లి మురళి 'నా దేశం నగ్న దేహమా?' శీర్షికతో 2023 జూలై 23న ఘాటైన వ్యాసం రాశారు. బీజేపీ ప్రభుత్వాలు అధికారంలో ఉన్న రాష్ట్రాలు డబుల్ ఇంజన్‌తో, అంటే రెండో ఇంజన్ అయిన కేంద్ర మద్దతుతో నడుస్తున్నాయని ప్రధాని మోదీ నిరంతరం మాట్లాడుతున్నారని మురళి అన్నారు. వాస్తవానికి మణిపుర్‌లో మూడు ఇంజన్లు పనిచేస్తున్నాయని ఆయన చెప్పారు. కుకీ క్రైస్తవ మహిళలను నగ్నంగా ఊరేగించి, వారిలో ఒకరిపై సామూహిక అత్యాచారానికి పాల్పడిన దారుణమైన ఘటన గురించి రాస్తూ, ఏ రాష్ట్రంలో బీజేపీ అధికారంలో ఉన్నా 'ట్రిపుల్ ఇంజన్' పవర్‌తో ప్రభుత్వాలు నడుస్తున్నాయని అన్నారు. ఆ మూడో ఇంజన్ – ఆరెస్సెస్.

మూడవ ఇంజన్ క్రమపద్ధతిలో ప్రతి రాష్ట్రంలోనూ ప్రజలను మెజారిటీలు, మైనారిటీలుగా విభజిస్తుంది. ఇది ప్రజలను మత పరమైన మార్గాల్లో విభజించడానికి మార్గాలను రూపొందించే అత్యంత క్లిష్టమైన ఇంజన్. 1999లో బీజేపీ, ఆరెస్సెస్ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి వారు ఎన్నికల ప్రయోజనాల కోసం యంత్రాంగాన్ని ఉపయోగించడం ప్రారంభించారు. మరీ ముఖ్యంగా 2014 ఎన్నికల నుండి దేశవ్యాప్తంగా మైనారిటీ వ్యతిరేక ప్రచారం పెద్ద ఎత్తున జరిగింది. ప్రధానంగా ముస్లింలను, క్రైస్తవులను లక్ష్యంగా చేసుకున్నారు. వ్యవస్థీకృతమైన హిందుత్వ శక్తులు వారిపై దాడి చేసేందుకు అన్ని రకాల వ్యూహాలను ప్రయోగిస్తూనే ఉన్నాయి. ఈశాన్య రాష్ట్రాల్లో క్రైస్తవులు లేదా క్రైస్తవేతరులు అనే ప్రాతిపదికన సమూహాలను విభజించడం చాలా కాలంగా జరుగుతోందని పుకార్లు ఉన్నాయి. 2014 ఎన్నికల తర్వాత ఆరెస్సెస్–బీజేపీ స్థానిక రాష్ట్ర యంత్రాంగంపై నియంత్రణను సాధించింది.

అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం, మణిపుర్‌లో దాదాపు 53 శాతం జనాభా మైతేయిలు కాగా, మిగిలిన వారిలో కుకీలు, నాగాలు ఉన్నారు. కుకీలు, నాగాలలో దాదాపు 95 శాతం మంది క్రైస్తవులు; మైతేయిలలో 2–3 శాతం మంది క్రైస్తవులు. మైతేయిలలో కూడా క్రైస్తవ ప్రభావం పెరుగుతోందని హిందుత్వ శక్తులు భావించినట్లు కనిపిస్తోంది. కాబట్టి వారు మతపరమైన పరివర్తనకు అడ్డుకట్ట వేయాలని కోరుకున్నారు. మైతేయిలను బలమైన హిందూ శక్తిగా అవతరింపజేయడం ద్వారా వారు తమ ప్రయత్నాన్ని ప్రారంభించినట్లు తెలుస్తోంది. అదే సమయంలో రాష్ట్రంలోని కుకీలు, నాగాలు విశ్వాసపాత్రులైన క్రైస్తవులుగా ఉండిపోయారు, లేదా 'ఘర్ వాపసీ' అయ్యారు. ఇంకొక ప్రధాన ఆలోచన ఏమిటంటే, హిందూ



మైతేయిలను ఎస్టీలుగా గుర్తించడం వలన వారికి భూమి హక్కులు, ప్రభుత్వ ఉద్యోగాలు లభిస్తాయి. ఇది ఈశాన్య ప్రాంతాలను క్రైస్తవీకరణ నుంచి మార్చే హిందుత్వ ప్యాకేజీ. ఇది దీర్ఘకాలిక ప్రాజెక్ట్. వ్యవస్థీకృత హిందూ మైతేయిలకు ఆ పనిని చేయడానికి అనుమతించే కార్యాన్ని మణిపూర్ ముఖ్యమంత్రి బీరెన్ సింగ్‌కు అప్పగించినట్లు కనిపిస్తోంది.

రాజకీయ చర్చల నుండి అత్యంత శక్తిమంతమైన మూడో ఇంజన్‌ను మినహాయించి, ప్రధానమంత్రిగా ఉన్న కాలంలో ఏం జరుగుతున్నదో దానికి బాధ్యత వహించాల్సింది మోదీయేనని ప్రతిపక్షాలు మాట్లాడటం తప్పు. వాజ్‌పేయి కంటే ఎక్కువ అధికారంతో మోదీ రెండో ఇంజన్‌ను నడుపుతున్నారనేది వాస్తవం. కానీ మూడో ఇంజన్ అయిన ఆరెస్సెస్ ప్రమేయం లేకుండా... మణిపుర్‌లో లాగా హిందుత్వ యంత్రాంగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపయోగించుకోలేవు. ముఖ్యమంత్రులకు ఏం చేయాలో, ఏం చేయకూడదో చెప్పేది థర్డ్ ఇంజన్.

స్త్రీలను నగ్నంగా నడిచేలా చేసిన పురుషుల ప్రవర్తన కనికరం లేకుండా ఉండటానికి ఎంతో శిక్షణ అవసరం. వారిలో ఒకరిపై దారుణంగా అత్యాచారం చేశారు. ఆ దృశ్యానికి సంబంధించిన వీడియోలు ప్రపంచాన్ని కంపింపజేయడంతో ప్రధాని ఈ ఘటనను ఖండించారు. అయితే ఆ క్రూరత్వానికి వ్యతిరేకంగా ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భాగవత్ ఒక్క మాట కూడా మాట్లాడలేదు. మణిపుర్‌లో సాధారణ పరిస్థితులు నెలకొల్పాలని ఈ సంస్థ గతంలో ఒక సాధారణ ప్రకటన మాత్రం విడుదల చేసింది. అయితే ఈ దారుణ ఘటనకు సంబంధించిన వీడియో నేపథ్యంలో ఆయన ఓ ప్రకటన చేశారు. ''చాలాసార్లు ప్రతికూల చర్చలే వినిపిస్తున్నాయి. అయితే మనం దేశమంతా తిరిగి చూసినప్పుడు, జరుగుతున్న మంచి విషయాల గురించి 40 రెట్లు ఎక్కువ చర్చలు సాగుతున్నాయని మనకు తెలుస్తుంది''.

ఆ ఘటనలోని మహిళా వ్యతిరేక స్వభావాన్ని ఖండించకుండా '40 రెట్లు ఎక్కువ మంచి విషయాలు' అంటూ సర్‌సంఘ్ చాలక్ మాట్లాడుతున్నారు. మణిపుర్‌లో మూడు ఇంజన్లు సమన్వయంతో పనిచేశాయి కాబట్టి, ఆ చర్యలో పాల్గొన్న హిందుత్వ శక్తులు ఆ మహిళలను ఘర్ వాపసీ చేయాలనుకుంటున్నాయా? బాధితులకు ఉరిశిక్ష పడేలా తమ ప్రభుత్వం చూస్తుందని మణిపుర్ ముఖ్యమంత్రి ప్రకటించారు. అయితే బిల్కిస్ బానో అత్యాచారం కేసులో 11 మంది దోషుల వలె వారిని తరువాత విడుదల చేయవచ్చు!

నియంతృత్వం ఆసన్నమైందనే భయం కారణంగానే చాలా మంది ఇందిరాగాంధీ విధించిన అత్యవసర పరిస్థితిని ఎదిరించారు. ఆ సమయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కేంద్ర ప్రభుత్వ మద్దతు కలిగిన డబుల్ ఇంజన్ సర్కారు. ముఖ్యమంత్రిగా జలగం వెంగళరావు పూర్తిగా ఆయిల్ నింపిన ఆ ఇంజన్‌కు రాష్ట్ర స్థాయి నిర్వాహకులు. గట్టి ప్రత్యర్థులను, ముఖ్యంగా యువతీ యువకులను చంపడం, వారిని ప్రమాదకరమైన నక్సలైట్లుగా ముద్ర వేయడం ఆ రోజుల్లో ఆనవాయితీగా ఉండేది. ఏ పోలీసు కూడా అలాంటి వారికి రక్షణ కల్పించలేదు. ఆనాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని ప్రతి అధికారీ పతకం సాధించేందుకు, మరింత మందిని చంపేందుకు పోటీ పడ్డారు. డబుల్ ఇంజన్ ప్రభుత్వాలు మనకు కొత్తవి కావు. 1967 వరకు అన్ని రాష్ట్రాల్లో డబుల్ ఇంజన్ కాంగ్రెస్ ప్రభుత్వాలు ఉన్నాయి.

అయితే ఆనాటి క్రూరమైన ఎమర్జెన్సీ పరిస్థితుల్లో కూడా మహిళలను ఊరేగించడం ఎప్పుడూ చూడలేదు. ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వ ఇంజన్‌కు ఒక మహిళ నాయకత్వం వహిస్తున్నందున, ఆనాడు అలాంటి ఆపరేషన్‌ను అనుమతించలేదు. అదృష్టవశాత్తూ దేశం ఆ పీడకల రోజులను అధిగమించింది. బహుశా ఆ రాజకీయ నిర్మాణంలో ఆ కాలంలో థర్డ్ ఇంజన్ ఉండకపోవచ్చు.

కానీ ఇప్పుడు మణిపుర్‌లో కానీ దేశంలో కానీ బహిరంగంగా ప్రకటించినటువంటి ఎమర్జెన్సీ లేదు. అయినా ఇక్కడ ప్రజలను కేవలం వ్యక్తిగత ఎన్‌కౌంటర్లలో చంపడం లేదు. వారి సొంత ఇళ్లల్లో, బయట సజీవ దహనం చేస్తున్నారు. మణిపూర్ ఘటన ఉద్దేశపూర్వకంగా ప్రేరేపించిన హింసాత్మక సంస్కృతి తాలూకు చివరి చర్య. ఈ హింసను, ఈ అనాగరక సంస్కృతిని ప్రపంచం ఎలా అర్థం చేసుకోవాలి?

వ్యాసకర్త ప్రముఖ రచయిత, సామాజిక కార్యకర్త

మనం ఏ మాత్రం లౌకికవాదులం?

సందర్భం



కె. ఎన్. మల్లీశ్వరి

హమ్మయ్య... ఇన్నాళ్ళకి ఈ జాతీయ పండుగ రోజున దేశభక్తిని నిరూపించుకునే ఘనమైన అవకాశం మనకి దొరికింది. పొద్దున్నే రకరకాల పనుల మీద ఫోన్లు రింగ్ చేసినవారందరికీ ఒక గొంతు దిశా నిర్దేశం చేసింది. సెల్ఫీ ప్రియులయిన భారత ప్రజలంతా మువ్వన్నెల జెండా చేతబూని ఒక సెల్ఫీ దిగి అప్ లోడ్ చేయాలని. 'ఇదేమిటిది! మాకు ఈ సెల్ఫీ ఇష్టం లేదు, మా దేశభక్తి ఇదిగాదు, మేమెందుకు సెల్ఫీ దిగాలని?' గానీ అడిగావో అర్బన్ నక్సలైట్‌వో, ఆందోళన జీవివో అవుతావు తప్ప మరొకటి కాదు.

మరి సెల్ఫీ దేశభక్తి గురించి ఆలోచిస్తుంటే ఒక లెక్క కుదురుతుంది. ఒక్కో సెల్ఫీ ఒక్కో వోటు. అన్ని వోట్లని ఒక దగ్గర చేర్చి చూసుకునే అరుదైన అవకాశం పాలక పార్టీ దక్కించుకుంది. అయితే మనం ప్రశ్నించాల్సిన విషయం ఒకటుంది. జాతీయ జెండాని పట్టుకునే విధానం దగ్గర నుంచి దానిని ఎలా గౌరవించాలీ అనేవరకూ నియమావళి ఉంటుంది. పాలకపార్టీ తాము అత్యంత పవిత్రంగా చూస్తామని చెప్పుకునే 'జాతీయ జెండా'ను జనరంజక జిమ్మిక్కుల కోసం ఫ్యాషన్‌గా మార్చడంలో ఎవరికీ ఎలాంటి అభ్యంతరం లేకపోవడం విరోధాభాస.

దీపాలు వెలిగించడం, గిన్నెలు, తపేళాలు, దబరాలు మోగించడం మాదిరిగా 'సెల్ఫీ విత్ తిరంగా' కూడా త్రిముఖ వ్యూహం. సమస్యలను దారి మళ్లించడం, రోగ కారణాలకి దూరంగా ప్రజలకి తక్షణ ఉపశమన భ్రాంతిని కలుగజెయ్యడం, ఇన్ని కోట్ల మంది తమ వెనుక ఉన్నారని బలప్రదర్శన చేయడం. వీటివల్ల ప్రజలకి దీర్ఘకాలంలో కలిగే కీడు – ఇటువంటివి చేయడం ద్వారా మన సామాజిక బాధ్యతని చాలా గొప్పగా నిర్వహించామన్న తృప్తి కలగడం, పౌరులుగా ఏవి మన అసలు బాధ్యతలో పార్టీ ప్రభుత్వాలు నిర్ణయించడం, రాజకీయంగా చురుకైన మేధస్సుని చూపే అవకాశం లేకపోవడం, మన చుట్టూ జరుగుతున్న నిజమైన, ఘోరమైన అన్యాయాలకి మొహం తిప్పడం! ప్రజాస్వామ్యంలో ప్రజలు బంట్లుగా మారడమే ప్రభుత్వాలకి కావాలి. కత్తులతో నరుకుతున్నా, నగ్నంగా మార్చి ఊరేగిస్తున్నా, ప్రమాదాలలో చనిపోతున్నా నిబ్బరంగా వీడియోలు, సెల్ఫీలు తీసుకునే మన సమాజానికి 'సెల్ఫీ విత్ తిరంగా'నే కవితా న్యాయం.

నిజానికి కొన్ని తేదీలు మైలురాళ్ళ వంటివి. ఆయా చారిత్రక సందర్భాల మీద కొందరికి ఏకీభావం ఉండొచ్చు, మరికొందరికి విభేదంతో కూడిన ఆమోదం ఉండొచ్చు. కలవరాలు, సంతోషాలు, దుఃఖాలు ఉండొచ్చు. కానీ గుర్తించక తప్పని తేదీ ఆగస్ట్ పదిహేను. ఇక్కడ నిలబడి విప్లవాలు సరే, రాజ్యాంగబద్ధ హక్కులకి మన దేశంలో ఎంత విలువ ఉంది, అన్నది ఇపుడు ఆలోచించాలి. అనేక అంశాలతో పాటు అందరినీ కలవ



రపెడుతున్న విషయం భారతదేశపు లౌకిక తత్వానికి ముంచుకు వచ్చిన పెను ముప్పు.

లౌకిక వాద స్ఫూర్తిని భగ్నం చేసే అంశాలను గుర్తించడం కోసం ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక, 'మనం ఏ మాత్రం లౌకిక వాదులం?' పేరుతో ఒక ఆచరణ తీసుకుంది. ప్రజలుగా ప్రజలతో చర్చ చేయడానికి కార్యక్రమం రూపొందించుకుంటోంది. విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఉద్యోగాలు చేస్తున్న యువత, ఇంటిని నిర్వహించేవారు, ఉద్యోగినులు, డాక్టర్లు, వాకర్లు, కార్మికులు, వ్యాపారస్తులు... ఇంకా ఇంకా అనేకులు. భిన్న రంగాల వారితో మాట కలుపుతుంది. అభిప్రాయాలు తెలుసుకుంటుంది, ఆలోచనలు పంచుకుంటుంది. సాహిత్యం మాకు వారధి, పనిముట్టు, ఆయుధం, అవసరం.

పరమ క్రూరమైన పద్ధతులతో మతతత్వం రాజకీయాలతో అంటగాగుతోంది. మనుషుల మధ్య మత ప్రాతిపదికన విభజన రేఖలు గీయబడుతున్నాయి. మతమూ, రాజకీయమూ చెట్టాపట్టాలెక్కిన చోట వ్యక్తులుగా మనమంతా అల్పులం కావొచ్చు. పౌరులుగా తగిన శక్తిమంతులం, బుద్ధిజీవులం. మనకి వచ్చిపడిన ముప్పుని మనమే కలిసికట్టుగా ఎదుర్కోవాలి. వ్యక్తులుగా మనలో మనమే గుర్తించలేనంత సూక్ష్మ స్థాయిలో ఉండే పరమత అసహనాలను వెతికి పట్టుకుందామన్న ప్రతిన పూనాలి. భిన్నమతాలకి చెందిన ఏ అంశం మనకి ఎదురైనా ప్రేమా, సహనాలే మన ఆలోచనలకి పునాది కావాలి. క్రికెట్‌లో గెలవాల్సింది హిందువులో, ముస్లిములో కాదని క్రీడా నైపుణ్యమని గ్రహింపునకు రావాలి. సముద్రంలో నీటి బిందువంత ఈ చిన్న ప్రయత్నానికి, సముద్రమంతటి లోతైన, గాఢమైన, భావస్ఫోరకమైన ప్రజాబాహుళ్యపు ఏకాగ్రతను కోరుతున్నాం.

వ్యాసకర్త జాతీయ కార్యదర్శి, ప్రరవే

ఆవిష్కరణా? ఎగురవేయడమా?

స్వతంత్ర దినోత్సవం, గణతంత్ర దినోత్సవాల నాడు మనం జెండా వందన కార్యక్రమంలో పాల్గొంటూ వస్తున్నాం. అయితే ఈ రెండు జాతీయ పర్వదినాల్లో విభిన్న పద్ధతుల్లో జెండాను గాలిలో రెపరెపలాడేలా చేస్తారు. అంటే ఆగస్ట్ 15న అనుసరించే పద్ధతిలో... జనవరి 26 రిపబ్లిక్ దినోత్సవం నాడు జెండాను ఎగురవేయరు. ఈ తేడా తెలుసుకోవలసిన అవసరం సామాన్య పౌరుని దగ్గరి నుంచి ప్రభుత్వ ఉద్యోగులూ, టీచర్లు, మరీ ముఖ్యంగా విద్యార్థులకు ఎంతో ఉంది. అలా తెలియచేయవలసిన బాధ్యత ఉపాధ్యాయులకూ, మీడియాకూ ఉంది.



ముందుగా స్వాతంత్ర్య దినోత్సవం నాడు ఏం చేయాలో చూద్దాం. ఆరోజు ప్రధానమంత్రి ఎర్రకోటపైనా, రాష్ట్రాల ముఖ్యమంత్రులు తమ తమ రాజధానుల్లోనూ జాతీయ జెండా (త్రివర్ణ పతాకం)ను ఎగురవేస్తారు. అలాగే ప్రభుత్వ కార్యాలయాల్లోనూ, అన్ని పాఠశాలలూ, కళాశాలల్లోనూ, కూడలి స్థలాల్లో పౌరులూ జెండాను ఎగురవేస్తారు. దేశానికి బానిస సంకెళ్ల నుంచి విముక్తి కలిగి స్వాతంత్ర్యం వచ్చింది అనడానికి ప్రతీకగా జెండాను కింది నుంచి జెండా స్తంభం పైకి లాగి ఎగురవేస్తారు.

స్వతంత్ర భారత దేశం తనకంటూ ఒక రాజ్యాంగాన్ని రాసుకొని అమలులోకి తెచ్చుకుని 'రిపబ్లిక్' (సర్వసత్తాక గణతంత్ర రాజ్యం)గా అవతరించిన జనవరి 26వ తేదీన జెండాను ఎగురవేయడానికి బదులు ఆవిష్కరిస్తారు. అంటే... జెండా స్తంభం పైభాగాన త్రివర్ణ పతాకాన్ని మడతపెట్టి తాడుతో జారుముడి వేసి ఆవిష్కారానికి సిద్ధం చేస్తారు. జెండాను ఆవిష్కరించే వారు జెండా తాడును లాగితే ముడి విడివడి, జెండా గాలిలో రెపరెపలాడుతుంది. దీనినే 'జెండా ఆవిష్కారం' అంటారు. దేశ రాజధాని ఢిల్లీలోని రాజ్‌పథ్‌లో రాష్ట్రపతీ, వివిధ రాష్ట్రాల రాజధానులలో ఆ రాష్ట్రాల గవర్నర్లూ త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరిస్తారు. ఇదే పద్ధతిలో మిగతావారూ ఆవిష్కరించాలి.

మన త్రివర్ణ పతాకానికి సంబంధించిన ఈ అవగాహన లేకుండా రెండు జాతీయ పర్వదినాల్లో ఒకే విధమైన పద్ధతి అనుసరించినా, లేదా అనుసరించవలసిన పద్ధతికి భిన్నంగా వ్యవహరించినా అది నేరమవుతుంది. ఇటీవలి కాలంలో స్వాతంత్ర్య దినోత్సవాన్నీ, గణతంత్ర (రిపబ్లిక్) దినోత్సవాన్నీ జాతీయ పర్వదినాలుగా, జాతీయ పండుగలుగా జరుపుకోకుండా సెలవు దినాలుగా గడిపేయడం కనిపిస్తోంది. ఇది ఎంతైనా గర్హనీయం.

– డా॥ ఎస్. విజయ భాస్కర్, ఉపాధ్యాయుడు। 92908 26989

సాధించిన దానికి సంతృప్తి చెందుతూనే...

సందర్భం



ఎమ్.ఆర్.కె. కృష్ణారావు

'ఎందరో మహానుభావులు, అందరికీ వందనాలు'. అలుపెరగని మన స్వాతంత్ర్య సమరయోధుల త్యాగఫలంగా 1947 ఆగస్టు 15న విదేశీ పాలనా శృంఖలాల నుండి ముక్తినొందిన మాతృదేశానికి ప్రణమిస్తూ మనం సాధించిన ప్రగతిని సమీక్షించుకుందాం, సంబరాలు జరుపుకొందాం.

ప్రగతిపథంలో ఏడున్నర దశాబ్దాల భారత్ ప్రయాణం భారతీయుల దృఢసంకల్పానికి ప్రతీకగా నిలుస్తుంది. దూరదృష్టి గల నాయకుల మార్గనిర్దేశంలో ప్రజాస్వామ్య స్ఫూర్తితో వివిధ రంగాలలో అద్భుతమైన మైలురాళ్లను సాధించాం. ఎప్పటికప్పుడు సామాజిక, సాంకేతిక, ఆర్థిక సంస్కరణలతో పురోగమన దిశలోనే పయనించాం.

సమానత్వం, సామాజిక న్యాయం, ప్రాథమిక హక్కులు రాజ్యాంగ సూత్రాలుగా పొందుపరచుకున్నాం. మొదటి ఎన్నికలలోనే సార్వత్రిక ఓటునిచ్చిన అతితక్కువ దేశాలలో ఒకటిగా మన స్థానం ప్రశంసనీయం. అది సామాన్య మానవుని సాధికారతకు చిహ్నమై నిలిచింది.

అమానుషమైన అంటరానితనాన్ని దాదాపుగా నిర్మూలించడం స్వతంత్ర భారతదేశం సాధించిన అతిపెద్ద విజయం. బాల్యవివాహాలను దాదాపుగా రూపుమాపాం. అక్షరాస్యతను పెంపొందించాం, వితంతు వివాహాలను ప్రోత్సహించాం. మహిళా సాధికారత స్వతంత్ర భారతం సాధించిన ప్రగతికి సూచిక అయ్యింది. సాంకేతిక రంగంలో కల్పనా చావ్లా, క్రీడా రంగంలో సానియా మీర్జా, కళా రంగంలో అమృతా షేర్గిల్, యామినీ కృష్ణమూర్తి, రాజకీయ రంగంలో ఇందిరా గాంధీ, ప్రతిభా పాటిల్, ద్రౌపది ముర్ము వంటి ఎందరో మహిళామణులు భారతీయ మహిళా శక్తికి ప్రతిరూపంగా నిలిచారు.

'జాతీయ ఆరోగ్య మిషన్' తల్లీబిడ్డల ఆరోగ్యాన్ని మెరుగుపరచడం, టీకాలను ప్రోత్సహించడం, గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సంరక్షణ, మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం లక్ష్యంగా పెట్టుకున్నది. పోలియో వంటి వ్యాధులను నిర్మూలించడంలో భారతదేశం చేస్తున్న కృషి ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలనందుకున్నది. రెండు దశాబ్దాల క్రితం తెలుగునాట ఆవిర్భవించిన 'ఆరోగ్యశ్రీ' పథకం నేడు 'ఆయుష్మాన్ భారత్' పథకానికి ఆదర్శమై నిలిచింది. అది మనందరం గర్వించ దగిన విషయం.

ఎన్నో ప్రపంచ విశ్వవిద్యాలయాలలో పనిచేసిన అనుభవంతో చెబుతున్నమాట: మన విద్యారంగం స్వతంత్ర భారతానికి మకుటాయమానం. మనవారు లేకుంటే సంపన్న దేశాల విశ్వవిద్యాలయాలూ, వ్యాపార సంస్థలూ స్తంభించిపోతాయంటే వాస్తవ దూరం కాదు. అమెరికాలో మనవారు కనిపించని గొప్ప విశ్వవిద్యాలయాలూ లేవు, పెద్ద వ్యాపార సంస్థలూ లేవు. ఐఐటీలు, ఎన్ఐటీలు, సిల్వర్ జూబిలీ ఇనిస్టిట్యూట్‌లు, కేంద్రీయ విశ్వవిద్యాలయాలు మన దూర దృష్టికి తార్కాణాలు. ఇంతగా అభివర్ధిస్తున్న మన విద్యారంగానికి చీకటికోణాలు లేకపోలేదు. మూడు సంవత్సరాల ముద్దు బాలలను మోయలేని సంచులతో ఇంటి నుండి తరమడం అత్యంత శోచనీయం. అవసరం లేని విషయాలను బలవంతంగా కంఠస్థం చేయించడం అమానుషమంటే అతిశయోక్తి కాదు.

స్వాతంత్ర్యం వచ్చేనాటికి భారతదేశ ఆర్థిక పరి



స్థితి దుర్భరంగా ఉండేది. స్వతంత్ర భారతం పారిశ్రామికీకరణకూ, వ్యవసాయ సంస్కరణలకూ శ్రీకారం చుట్టి స్వయం సమృద్ధిని లక్ష్యంగా చేసుకుని ఆర్థిక ప్రగతికి నాంది పలికింది. ఆధునిక దేవాలయాలుగా పిలువదగ్గ భాక్రా నంగల్ వంటి ప్రాజెక్టులు, భిలాయ్ ఉక్కు కర్మాగారం వంటి వాటితో ప్రగతిమార్గంలో అడుగులు వేసింది. 1960వ దశకంలో ప్రారంభమైన 'హరిత విప్లవం' ఆహార కొరత ఎదుర్కొన్న దశను దాటించి దేశాన్ని మిగులు ఉత్పత్తి దేశంగా మార్చింది.

సాంకేతిక ఆవిష్కరణలలో భారతదేశం పురోగతి అంతర్జాతీయ మన్ననలను పొందినది. 1969లో స్థాపించిన భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) అంతరిక్ష పరిశోధనలో అద్భుత విజయాలకు మార్గం సుగమం చేసింది. నాటి 'ఆర్యభట్ట' నుండి నేటి 'చంద్రయాన్' వరకు అంతరిక్షంలో మన విజయ పరంపర కొనసాగుతున్నది.

1990 దశకంలో ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణలు, మొదటినుంచీ విద్యారంగానికిచ్చిన ప్రాముఖ్యత, సహజ సిద్ధంగా గణితశాస్త్రంలో మనవారికున్న ప్రతిభ సాఫ్ట్‌వేర్ రంగంలో భారతదేశానికి తిరుగులేని స్థానం తెచ్చాయి. ఈ నేపథ్యంలో ఒకప్పుడు చెన్నై, హైదరాబాద్ నగరాలకన్నా చిన్నదైన బెంగళూరు వాటికన్నా పెద్దదై భారతదేశ సిలికాన్ వ్యాలీగా తయారయ్యింది. సైబరాబాద్ ఆవిర్భావంతో హైదరాబాద్ సైతం విదేశీ పెట్టుబడులను ఆకర్షిస్తున్నది. 'ఏ దేశమేగినా ఎందు కాలిడినా పొగడరా నీ తల్లి భూమి భారతిని' అన్నారు రాయప్రోలు. ఐతే, సాఫ్ట్‌వేర్ రంగంలో మనవారి నేర్పు, ప్రముఖ విశ్వవిద్యాలయాలలో, పెద్దపెద్ద వ్యాపార సంస్థలలో మన వారి నాయకత్వం విదేశీయులే మన భూమి భారతిని పొగిడేటట్లు చేసినవి.

ఇక నేడు మన దేశం ఎదుర్కొంటున్న సవాళ్ల గురించి ఆలోచిస్తే, ఆర్థిక అసమానత, వాతావరణ కాలుష్యం, వ్యవస్థీకృత రంగంలో మహిళల భాగస్వామ్యం తగినంత లేకపోవడం, ఎన్నికలలో డబ్బు ప్రభావం ముఖ్యమైనవి. వీటిని త్వరలోనే దేశం అధిగమిస్తుందని ఆశిద్దాం. సమసమాజ నిర్మాణమే ధ్యేయంగా, సకల జనుల సౌభాగ్యమే లక్ష్యంగా ముందుకు సాగుదాం.

వ్యాసకర్త ప్రొఫెసర్; గాయత్రీ విద్యా పరిషద్, వైజాగ్ । 93924 81282

క్లుప్తంగా...

ఏపీఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర మహాసభలకు సీఎం జగన్‌కు ఆహ్వానం



సీఎం జగన్‌ను ఆహ్వానిస్తున్న ఎన్జీవో నేతలు

సాక్షి, అమరావతి: ఏపీఎన్జీవో అసోసియేషన్ (ఆంధ్రప్రదేశ్ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం) 21వ రాష్ట్ర మహాసభలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అసోసియేషన్ ప్రతినిధులు ఆహ్వానించారు. ఈ మేరకు సోమవారం సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఏపీఎన్జీవో అసోసియేషన్ అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి కేవీ శివారెడ్డి, ప్రభుత్వ సలహాదారు(ఉద్యోగుల సంక్షేమం) ఎన్.చంద్రశేఖర్‌రెడ్డి కలిసి మహాసభలకు హాజరు కావాలని కోరారు. విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఈ నెల 21, 22 తేదీల్లో రాష్ట్ర మహాసభలు జరుగుతాయని వివరించారు.

200వ రోజుకు చేరిన 'గడప గడపకు'

మార్కాపురంలో ఎమ్మెల్యే కేపీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ



బైక్ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి

మార్కాపురం టౌన్: ఎమ్మెల్యేలు ప్రజలతో మమేకమై వారి సమస్యలు ఇంటింటికీ వెళ్లి తెలుసుకుని పరిష్కరించేందుకు చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ప్రకాశం జిల్లా మార్కాపురం నియోజకవర్గంలో సోమవారం 200వ రోజుకు చేరింది. ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ జరిగింది. సుమారు 1000 మందికి పైగా పార్టీ నాయకులు, కార్యకర్తలు బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పలువురు ఐఏఎస్‌ల బదిలీ

సాక్షి, అమరావతి: పలువురు ఐఏఎస్‌లను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్ రెడ్డి సోమవారం ఉత్తర్వులిచ్చారు. యువజన సర్వీసులు, పర్యాటక, సాంస్కృతిక శాఖ ముఖ్యకార్యదర్శి జి.వాణీమోహన్‌ను పురావస్తు, మ్యూజియం కమిషనర్‌గా బదిలీ చేశారు. యువజన సర్వీసులు, పర్యాటక, సాంస్కృతిక శాఖ ముఖ్యకార్యదర్శిగా పూర్తి అదనపు బాధ్యతలను రహదారులు-భవనాల శాఖ కార్యదర్శి పీఎస్ ప్రద్యుమ్నకు అప్పగించారు. రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ వైస్ చైర్మన్ అండ్ ఎండీ కే.హర్షవర్ధన్‌ను రాష్ట్ర షెడ్యూల్ కులాల కమిషన్ కార్యదర్శిగా బదిలీ చేశారు. గ్రామ, వార్డు సచివాలయాల అదనపు డైరెక్టర్ హెచ్.ఎం.ధ్యానచంద్రకు రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ వైస్ చైర్మన్ అండ్ ఎండీగా పూర్తి అదనపు బాధ్యతలను అప్పగించారు.

దేవాలయాల్లో ఖాళీ ఉద్యోగాల భర్తీకి చర్యలు

సాక్షి, అమరావతి: దేవదాయ శాఖ పరిధిలోని వివిధ ఆలయాల్లో గతంలో ఆ శాఖ కమిషనర్ ద్వారా అనుమతి పొందిన క్యాడర్ స్ట్రెంత్‌కు అనుగుణంగా ఖాళీగా ఉన్న వివిధ ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ నెల 8న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అధ్యక్షతన దేవదాయ శాఖ ఉన్నతాధికారుల సమావేశంలో ఈ అంశంపై చర్చ జరిగిన సంగతి తెలిసిందే. ఈ భేటీలో తీసుకున్న నిర్ణయాలకు సంబంధించి మినిట్స్ వివరాలు సంబంధిత శాఖ ఉన్నతాధికారులందరికీ చేరాయి. ఈ నేపథ్యంలో ఆలయాల వారీగా ఖాళీల వివరాలను గుర్తించే ప్రక్రియను దేవదాయ శాఖ ఇప్పటికే మొదలు పెట్టింది. ఆలయాల వారీగా ఖాళీల వివరాలను ఆర్జేసీలు దేవదాయ శాఖ కమిషనర్ కార్యాలయానికి పంపిన అనంతరం తుది ఆమోదానికి ప్రభుత్వానికి పంపనున్నారు. ఆలయాల వారీగా భర్తీ చేసే ఖాళీలకు ముందుగా పత్రికా ప్రకటనల ద్వారా నోటిఫికేషన్ జారీ చేస్తారు. నిబంధనల ప్రకారం భర్తీకి చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించినట్టు అధికారులు తెలిపారు.

సింహాద్రిలో విద్యుదుత్పత్తి పునరుద్ధరణ

పరవాడ(పెందుర్తి): అనకాపల్లి జిల్లా పరవాడ సమీపంలోని సింహాద్రి ఎన్టీపీసీ మూడవ యూనిట్‌లో వార్షిక మరమ్మతుల అనంతరం సోమవారం లైటాఫ్ చేశారు. యూనిట్‌లో వార్షిక మరమ్మతుల నిమిత్తం గత నెల ఒకటో తేదీన విద్యుదుత్పత్తిని నిలిపివేసిన విషయం తెలిసిందే. సుమారు 44రోజుల పాటు యూనిట్‌లో వార్షిక మరమ్మతులు చేపట్టిన అనంతరం విద్యుదుత్పత్తిని పునరుద్ధరించడానికి సన్నాహాలు ప్రారంభించారు. ఈ క్రమంలో యూనిట్‌లో రెండు రోజులపాటు కొన్ని సాంకేతికపరమైన టెస్టులు నిర్వహించిన అనంతరం పూర్తిస్థాయిలో విద్యుదుత్పత్తి సరఫరా జరుగుతుందని ఎన్టీపీసీ అధికారులు తెలిపారు. ఇంతవరకు 1, 2, 4 యూనిట్‌లు పనిచేస్తుండగా, మూడో యూనిట్ కూడా సిద్ధం కావడంతో నాలుగు యూనిట్‌లు పనిచేస్తున్నట్లయింది.

రాష్ట్రంలో మిల్లెట్ మెరుపులు

చిరుధాన్యాలు, జొన్నలు దిగుబడిలో ఏపీనే టాప్

- రాష్ట్రంలో చిరుధాన్యాలు హెక్టార్‌కు 2,363 కిలోలు దిగుబడి
- జొన్నలు హెక్టార్‌కు 3,166 కిలోలు
- చిరుధాన్యాలపై ప్రజల్లో ఆసక్తి కనిపిస్తోంది
- నాబార్డు అధ్యయన నివేదిక వెల్లడి
- చిరుధాన్యాల సాగు, వినియోగాన్ని ప్రోత్సహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- ప్రత్యేకంగా మిల్లెట్ మిషన్ ఏర్పాటు
- మరే రాష్ట్రంలోనూ లేని విధంగా మద్దతు ధర
- పౌరసరఫరాల సంస్థ ద్వారా కొనుగోలు
- ప్రత్యేకంగా ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు
- నగరాలు, పట్టణాల్లో ప్రత్యేక స్టాల్స్‌లో విక్రయం
- బాలింతలు, పిల్లలకు పోషకాహారంగా రాగి పిండి పంపిణీ



చిరుధాన్యాలకు కనీస మద్దతు ధర ఇలా..

జొన్నలకు క్వింటాల్‌కు రూ.2,990	రాగులకు క్వింటాల్‌కు రూ.3,578
సజ్జలుకు క్వింటాల్‌కు రూ.2,350	కొర్రలకు క్వింటాల్‌కు రూ.2,500



రాష్ట్రంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో చిరుధాన్యాల సాగు, ఉత్పత్తి ప్రణాళిక

పంట	విస్తీర్ణం (హెక్టార్లలో)	ఉత్పత్తి (లక్షల మెట్రిక్ టన్నుల్లో)
జొన్నలు	80,247	2.81
రాగులు	47,930	0.58
సజ్జలు	22,786	0.59
కొర్రలు	5,328	0.06
సామలు	5,645	0.04
వరిగలు	2,000	0.01
ఇతర చిరుధాన్యాలు	2,800	0.02
మొత్తం	1,66,736	4.11

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో చిరుధాన్యాల సాగును ప్రోత్సహించి, సిరి ధాన్యాలుగా, రైతులకు లాభసాటి పంటలుగా చేయాలని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు సత్ఫలితాలనిస్తున్నాయి. ప్రభుత్వ సహకారంతో చిరుధాన్యాలు సాగు చేస్తున్న రైతులు మరే రాష్ట్రంలో రానంత ఎక్కువ దిగుబడి సాధిస్తున్నారు. నాబార్డు అధ్యయన నివేదిక వెల్లడించిన వాస్తవమిది. ఆ నివేదిక ప్రకారం.. 2022లో చిరుధాన్యాలు, జొన్నల దిగుబడిలో దేశంలోనే రాష్ట్రం మొదటి స్థానంలో ఉంది. ఒక హెక్టారుకు చిరుధాన్యాలు 2,363 కిలోలు దిగుబడి వచ్చింది. హెక్టారుకు 2,310 కిలోలతో గుజరాత్ రెండో స్థానంలో ఉంది. రాష్ట్రంలో జొన్నలు హెక్టారుకు 3,166 కిలోల దిగుబడి రాగా, ఆ తరువాతి స్థానంలో ఉన్న మధ్యప్రదేశ్‌లో హెక్టార్‌కు కేవలం 1,941 కిలోలే వచ్చింది.

రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహం..

వైఎస్ జగన్ ప్రభుత్వం బాధ్యతలు చేపట్టిన తొలి నాళ్లలోనే చిరుధాన్యాల సాగుపై దృష్టి సారించింది. ప్రజల ఆరోగ్యం, పర్యావరణం, రైతులకు లాభసాటి అయిన వీటి సాగును పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తోంది. వీటి సాగు విస్తీర్ణాన్ని, ఉత్పత్తిని, వినియోగాన్ని పెంచేందుకు ప్రత్యేకంగా మిల్లెట్ మిషన్‌ను ఏర్పాటు చేసింది. మరే రాష్ట్రంలోనూ లేని విధంగా ఈ పంటలకు కనీస మద్దతు ధర ఇస్తోంది. ఈ ఆర్థిక సంవత్సరంలో 1,66,736 హెక్టార్లలో సాగు లక్ష్యంగా నిర్దేశించింది. ఇది గత సంవత్సరానికన్నా 39,365 హెక్టార్లు అదనం. ఈ పంటలను రైతు భరోసా కేంద్రాల ద్వారా పౌరసరఫరాల సంస్థ కనీస మద్దతు ధరకు కొంటోంది. వర్షాధార ప్రాంత అభివృద్ధి పథకం కింద రాష్ట్రంలో 160 చిరుధాన్యాల ప్రైమరీ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తోంది. వీటికి ప్రోత్సాహకాలు కూడా అందించనుంది. చిరుధాన్యాల మార్కెటింగ్‌కు జిల్లా కేంద్రాలు, నగరాలు, పట్టణాల్లో స్టాల్స్ ఏర్పాటు చేస్తోంది. మహిళా సంఘాల మహిళా మార్ట్‌లలోనూ చిరుధాన్యాలు, వాటి ఉత్పత్తుల అమ్మకాలను ప్రోత్సహిస్తోంది. ప్రజలు వీటిని వినియోగించేలా మండల, జిల్లా స్థాయిలో పలు కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పిస్తోంది. బాలింతలు, గర్భిణులు, పిల్లల్లో పౌష్టికాహార లోపం, రక్తహీనతను నివారించేందుకు రాష్ట్ర ప్రభుత్వమే స్వయంగా వైఎస్సార్ సంపూర్ణ పోషణ, వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్ కింద రాగి పిండిని పంపిణీ చేస్తోంది.

60 ఏళ్లుగా తగ్గిపోయిన సాగు, వినియోగం

హరిత విప్లవంతో పాటు ఎక్కువ ఆదాయం వచ్చే వరి, గోధుమల సాగుకు రైతులు మళ్లడం, ప్రజల ఆహారపు అలవాట్లు మారిపోవడంతో 60 ఏళ్లుగా దేశంలో చిరుధాన్యాల సాగు తగ్గిందని తెలిపింది. 1960లో దేశంలో వీటి తలసరి వార్షిక వినియోగం 30.9 కిలోలుండగా 2022కి 3.9 కిలోలకు పడిపోయిందని పేర్కొంది. 1973లో గ్రామీణ ప్రాంతాల్లో సజ్జలు వార్షిక తలసరి వినియోగం 11.4 కేజీలుండగా 2005కి 4.7 కిలోలకు, పట్టణ ప్రాంతాల్లో 4.1 కిలోల నుంచి 1.4 కిలోలకు తగ్గిపోయిందని తెలిపింది. ఇదే సమయంలో గ్రామీణ ప్రాంతాల్లో జొన్నలు వార్షిక తలసరి వినియోగం 19.4 కిలోల నుంచి 5.2 కిలోలకు, పట్టణ ప్రాంతాల్లో 8.5 కిలోల నుంచి 2.7 కిలోలకు తగ్గిపోయినట్లు నివేదిక పేర్కొంది. ఇటీవల ఆరోగ్య కారణాలు, పశుగ్రాసం, పరిశ్రమలు, ఇథనాల్, డిస్టిలరీల్లో వాడకానికి చిరుధాన్యాలకు డిమాండ్ పెరుగుతోందని చెప్పింది.

గిరిజన రైతులు, మహిళలను ప్రోత్సహించాలి

ఇతర పంటలకంటే తక్కువ నీటితో చిరుధాన్యాలు సాగుచేయవచ్చని నాబార్డు తెలిపింది. దేశంలో లభించే నీటిలో 80 శాతం వరి, గోధుమ, చెరకు పంటలకు వినియోగం అవుతోందని, దీనివల్ల మంచి నీటి కొరత ఏర్పడుతోందని పేర్కొంది. అందువల్ల చిరుధాన్యాల సాగును ప్రోత్సహించాలని, ఇందుకోసం మెరుగైన ఉత్పత్తి, స్థిరమైన వ్యవసాయ, ఆహార వ్యవస్థలను ఏర్పాటు చేయాలని సూచించింది. తొలుత వర్షాభావ, గిరిజన ప్రాంతాల్లో చిన్న, గిరిజన రైతులు, మహిళా రైతుల ద్వారా వీటి సాగును ప్రోత్సహించాలని సూచించింది. ఆ ఉత్పత్తులకు బ్రాండింగ్, మార్కెట్ కల్పించాలని సూచించింది. తద్వారా మంచి పోషకాహారం, ఆరోగ్యవంతమైన జీవితాన్ని అందించడమే కాకుండా సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించవచ్చని నివేదిక సూచించింది.

ఆరోగ్యాన్నిచ్చే చిరుధాన్యాలు

చిరుధాన్యాల వినియోగంపై ప్రజల్లో ఆసక్తి కనిపిస్తోందని ఇటీవల నిర్వహించిన ఓ సర్వేలో వెల్లడైనట్లు నివేదిక పేర్కొంది. ఆరోగ్య కారణాల దృష్ట్యా 28 శాతం మంది చిరుధాన్యాలకు మారారని తెలిపింది. బరువు తగ్గేందుకు 15 శాతం మంది వీటిని ఆహారంగా తీసుకుంటున్నట్లు పేర్కొంది.

ఇవీ ఉపయోగాలు

- హృదయనాళాల వ్యాధుల నుంచి విముక్తి
- చక్కెర స్థాయిలు తగ్గిస్తాయి. మధుమేహ వ్యాధిగ్రస్తులకు అనువైన ఆహారం
- చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గిస్తాయి
- కాల్షియం పుష్కలంగా ఉండటంతో ఎముకల ఆరోగ్యం
- రక్తనాళాలు, కండరాల సంకోచాలకు మంచి మందు
- నరాల పనితీరు పెంచుతాయి
- మెదడు కణాలను ఆరోగ్యంగా ఉంచుతాయి
- క్యాన్సర్‌ను నిరోధిస్తాయి



భూ ఆక్రమణల గురించి కేంద్రానికి చెబుతా..

- రాష్ట్ర రెవెన్యూ అధికారులపై నాకు నమ్మకం లేదు
- వారాహి యాత్రలో జనసేన అధినేత పవన్‌కళ్యాణ్



సాక్షి, అనకాపల్లి/సాక్షి, విశాఖపట్నం : అనకాపల్లి జిల్లా కశింకోట మండలం విసన్నపేట భూముల్లో అక్రమాలను బయటికి తీస్తానని జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ చెప్పారు. రాష్ట్ర రెవెన్యూ అధికారులపై తనకు నమ్మకం లేదని, ఇక్కడి భూ ఆక్రమణలను కేంద్రం దృష్టికి తీసుకెళ్తానన్నారు. అడ్డగోలుగా రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేస్తూ, కొండలను తొలిచేస్తూ పర్యావరణాన్ని కలుషితం చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై కేంద్ర పర్యావరణ శాఖకు, గ్రీన్ ట్రిబ్యునల్‌కు ఫిర్యాదు చేస్తానని చెప్పారు. వారాహి యాత్రలో భాగంగా సోమవారం అగనంపూడి, మారేడుపూడి, గొల్లవానిపాలెం, కశింకోట, బయ్యవరం జంక్షన్ నుంచి విసన్నపేట వరకూ పవన్ ర్యాలీగా వెళ్లారు. విసన్నపేట భూములను పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ అడ్డగోలుగా రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని, కొండలను పిండి చేసి, ప్రభుత్వ భూములను ఆక్రమించుకుని వ్యాపారం చేసుకుంటున్నారని ఆరోపించారు.

మీ వల్ల విశాఖకు ఏం లాభం? : పవన్‌ను నిలదీసిన యువకుడు

మీ వల్ల విశాఖకు ఏం లాభం అంటూ ఓ యువకుడు పవన్‌ను నిలదీయడంతో అందరూ కంగుతిన్నారు. ఆదివారం సాయంత్రం గాజువాక బహిరంగ సభకు పవన్ వెళ్లారు. మార్గంమధ్యలో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అక్కడ ఓ యువకుడు పవన్ వద్దకొచ్చి 'మూడు రోజులుగా విశాఖలో మీ వల్లే ఇబ్బందులు పడుతున్నాం. రోడ్లపై ట్రాఫిక్ జామ్‌కు మీరే కారణమవుతున్నారు. ఇలా ట్రాఫిక్‌కు ఎన్నాళ్లు ఇబ్బంది కలిగిస్తారు? పైగా విశాఖ అభివృద్ధికి మీరేం చేస్తున్నారు? ప్రభుత్వంపై దుమ్మెత్తిపోయడమే తప్ప మరో అంశమే లేదా? స్టీల్ ప్లాంట్ గురించి పట్టించుకున్న పాపాన పోలేదు.. ఇదేం పద్ధతి' అంటూ పవన్‌ను నిలదీసినట్టు తెలిసింది. దీంతో పవన్‌తో పాటు జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ కూడా ఆయనతో వాదనకు దిగారు. అయినా ఆ వ్యక్తి వెనక్కి తగ్గలేదు. చివరకు అక్కడ నుంచి పవన్, మనోహర్లు వెనుదిరిగారు. ఈ వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

ఆరోపణలకు ఆధారాలేవి?

- కొండను తవ్వి ఎలుక వెంట్రుకనూ పవన్ పట్టుకోలేదు
- ఉడుకుబోతు గుణంతో సీఎం జగన్‌పై ఆక్రోశం
- వైఎస్సార్‌సీపీ నేతలు గుడివాడ అమర్‌నాథ్, పేర్ని నాని, కారుమూరి, రోజా, అదీప్‌రాజ్

దొండపర్తి/చిలకలపూడి (మచిలీపట్నం)/పుత్తూరు రూరల్ (తిరుపతి జిల్లా)/పుంగనూరు (చిత్తూరు జిల్లా)/సింహాచలం : జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ ఐదు రోజుల విశాఖ పర్యటనలో కొండను తవ్వి ఎలుకను కాదు కదా.. దాని వెంట్రుకను కూడా పట్టుకోలేదని వైఎస్సార్‌సీపీ నేతలు చురకలంటించారు. విశాఖ పర్యటనకు ముందు విశాఖలో అక్రమాలు జరిగిపోతున్నాయని, రూ.13 వేల కోట్లు దోచుకున్నారని చెప్పిన పవన్ ఇక్కడకొచ్చి ఒక్క ఆధారమైనా ఎందుకు చూపించలేదని ప్రశ్నించారు. విశాఖ పర్యటనలో పవన్ చేస్తున్న వ్యాఖ్యలపై మంత్రులు గుడివాడ అమర్‌నాథ్, ఆర్కే రోజా, కారుమూరి నాగేశ్వరరావు, మాజీమంత్రి పేర్ని నాని, ఎమ్మెల్యే అదీప్‌రాజ్ స్పందించారు. వారేమన్నారంటే..

పవన్‌కు ప్రజలతో రాళ్ల దెబ్బలు తప్పవు : రోజా



సీఎం వైఎస్ జగన్ గురించి పిచ్చిపిచ్చిగా మాట్లాడితే ప్రజల నుంచి పవన్‌కు రాళ్ల దెబ్బలు తప్పవు. భూమి పేలిపోవాలి.. రుషికొండ అందులోకి వెళ్లిపోవాలి.. దానిలో జగన్ సమాధి కావాలనడం ఏమిటా మాటలు? పవన్ కడుపుమంటకు ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స పొందాలి. అవసరమైతే ఎర్రగడ్డ ఆస్పత్రిలో చికిత్సకు సిఫారసు చేస్తాం. పర్యావరణం గురించి ఇప్పుడు మాట్లాడుతున్న పవన్.. రుషికొండకు ఎదురుగా ఓ కొండపై రామానాయుడు స్టూడియో, మరో కొండపై ఐటీ టవర్స్, ఇంకో దానిపై విశాఖ అర్బన్ డెవెలప్‌మెంట్ హౌస్ వంటి నిర్మాణాలు జరిగినప్పుడు ఎందుకు స్పందించలేదు? అమరావతిలో తమ భూముల రేట్లు పడిపోతాయనే రుషికొండపై విషం చిమ్ముతున్నారు.

కథానాయకుడికి ప్రజానాయకుడిపై ఈర్ష్య ఎందుకు? : అమర్‌నాథ్



పవన్ సినిమాలోనే హీరో అయితే జగన్ నిజజీవితంలో హీరో. ఆయన్ను చూసి పవన్ ఎందుకు అసూయ పడుతున్నాడో అర్థంకావడంలేదు. రాజకీయంగా పవన్ దిగజారిపోయాడు. జగన్, ప్రభుత్వం చేసిన తప్పేంటి? ఎందుకంత ద్వేషం? అసలు గీతం భూఆక్రమణలపై పవన్ ఎందుకు మాట్లాడడంలేదు? కొండలను మింగేసిన అనకొండలు చంద్రబాబు బ్యాచ్. ఇక విస్సన్నపేటలో భూములను ఆక్రమించినట్లు ఆరోపణలు చేసిన పవన్ దాన్ని ఎందుకు నిరూపించలేదు? అక్కడున్న 693 ఎకరాల్లో పవన్ దత్తడాడీ సీఎంగా ఉన్న సమయంలో 45ఎకరాలకు నష్టపరిహారం కూడా ఇచ్చారు. నేను పవన్‌లా అన్నయ్యను అడ్డుపెట్టుకుని పైకి రాలేదు. చిరంజీవి సినిమా షూటింగ్ చేసినప్పుడు ఎర్రమట్టి దిబ్బలు ఎలా ఉన్నాయో.. ఇప్పుడూ అలానే ఉన్నాయి.

పవన్‌ది పూటకో మాట : పేర్ని



వారాహి యాత్ర పేరుతో పవన్ కళ్యాణ్ పూటకో మాట మాట్లాడుతున్నాడు. ఏదో ఒకటి మాట్లాడి ప్రజలను రెచ్చగొట్టడం.. సీఎం జగన్‌పై బురద జల్లటం, చంద్రబాబుకు మేలు చేయటం ఆయనకు పరిపాటిగా మారింది. జనం నవ్వుకుంటున్నారన్న కనీస ఆలోచన లేకుండా పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారు. రాష్ట్ర విభజన గురించి పవన్ తప్పుడు మాటలు మాట్లాడుతున్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి వల్ల విభజన జరిగినట్లు మాట్లాడటం విడ్డూరంగా ఉంది. కూలీ తీసుకుని గుడ్డిగా పనిచేయటం తప్ప వాస్తవాలతో అతనికి పనిలేదు. ఇక జనసేన, టీడీపీ వారు ఎన్నో హత్యలు, గంజాయి కేసులు, మానభంగం కేసుల్లో ముద్దాయిలుగా ఉన్నారు.. వాటన్నింటికీ మీరెందుకు బాధ్యత తీసుకోలేదు? 2014–19 మధ్య నువ్వు, చంద్రబాబు కలిసి చేసిన పాలనను మళ్లీ తెస్తామని ప్రజలకు చెప్పే సత్తా ఉందా? ఓ సామాజికవర్గం ఓట్లను పొట్లం కట్టి బాబుకు అమ్మేయటమే పవన్ స్కీం.

సభ్యత, సంస్కారంలేని వ్యక్తి పవన్ : కారుమూరి



సభ్యత, సంస్కారం లేకుండా పవన్ మాట్లాడుతున్న తీరు చూసి కాపులు సైతం బాధపడుతున్నారు. చంద్రబాబు పథకం ప్రకారం పోలీసులపై దాడులుచేసి, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నారు. వైఎస్ జగన్ పాలనలో విద్యారంగం రెండో స్థానంలో ఉంది. గతంలో 17వ స్థానంలో ఉండేది. పుంగనూరులో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసి ఓర్వలేక చంద్రబాబు దిగజారి ప్రవర్తించారు. పథకం ప్రకారం రాళ్లు, బాటిళ్లు, కట్టెలతో దాడిచేయడం బాధాకరం. పోలీసులు కాల్పులు జరపకుండా సహనంతో వ్యవహరించినందుకు వారికి శిరస్సు వంచి నమస్కరిస్తున్నా.

రెచ్చగొట్టే వ్యాఖ్యలు మానుకో : అదీప్‌రాజ్



ప్రతీ విషయాన్ని పవన్ రాజకీయం చేస్తే సహించేదిలేదు. సుజాతనగర్‌లో వరలక్ష్మి హత్యకేసులో నిందితుడిని ముందే వలంటీర్ విధుల నుంచి తొలగించినా.. వలంటీరే హత్య చేశారనడం ఆ వ్యవస్థపై పవన్ ఆక్రోశానికి నిదర్శనం. టీడీపీ పాలనలో కాల్‌మనీ వేధింపులు జరిగినప్పుడు ఎందుకు స్పందించలేదు? టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీలు వేసేటప్పుడు వారి క్యారెక్టర్ సర్టిఫికెట్ తీసుకుని నియమించారా? రెచ్చగొట్టే వ్యాఖ్యలు పవన్ మానుకోవాలి.

జగన్‌ను ఎదుర్కోలేకే అరాచక మూక దుష్ప్రచారం

- చంద్రబాబులో మెగలోమానియా, స్కిజోఫ్రీనియా వ్యాధుల లక్షణాలు
- ఈ లక్షణాలే దత్తపుత్రుడు పవన్ కళ్యాణ్‌లో కూడా..
- రుషికొండ వద్ద పవన్ ఊగిపోయింది అందుకే
- వాస్తవాలు మర్చి, భ్రమలు దాటి, ఉన్మాదిలా మారిన చంద్రబాబు
- అంగళ్లలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై, పుంగనూరులో పోలీసులపై దాడులు చేయించింది ఆయనే
- గతంలో సీబీఐని రాష్ట్రంలోకి రానివ్వనంటూ ఉత్తర్వులిచ్చి.. ఇప్పుడెలా సీబీఐ దర్యాప్తు కోరుతారు?
- వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు సజ్జల ఫైర్



సాక్షి, అమరావతి : ప్రజాక్షేత్రంలో సీఎం వైఎస్ జగన్‌ను ఎదుర్కోలేక టీడీపీ అధినేత చంద్రబాబు నేతృత్వంలో కొడుకు లోకేశ్, దత్తపుత్రుడు పవన్ కళ్యాణ్‌లతో కూడిన అరాచకమూక వ్యక్తిత్వ హననానికి పాల్పడుతూ దుష్ప్రచారం చేస్తోందని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి మండిపడ్డారు. ఈ మూకకు మద్దతుగా వారు పెట్టించిన పార్టీలు, దివాలా తీసిన చెల్లని నాణేల్లాంటి కొన్ని పార్టీల నేతలు ప్రకటనలు చేస్తూ.. సృష్టిస్తున్న శబ్ద కాలుష్యాన్ని ప్రజలు భరించలేని స్థాయికి చేరిందన్నారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. అరాచకమూక చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రజలెవరూ నమ్మొద్దన్నారు. సీఎం వైఎస్ జగన్ చెప్పింది చేస్తారనే నమ్మకం ప్రజల్లో ఉందని.. రానున్న ఎన్నికల్లో అది మరోసారి నిరూపితమవుతుందని సజ్జల స్పష్టంచేశారు. ఆయన ఇంకా ఏమన్నారంటే..

- రుషికొండ ప్రభుత్వ భూమి. అన్ని అనుమతులు తీసుకుని నిర్మిస్తున్న భవనాలు ప్రభుత్వానివే. అంతా చట్టబద్ధంగానే జరుగుతోంది. అక్కడకు వెళ్లిన పవన్ ఎందుకంతగా ఊగిపోయారు? పవన్ మాటల్లో విషయం ఉండదు.. పూనకం, అరుపులు, తిట్లు తప్ప.
- పవన్ యజమాని చంద్రబాబు వేషాలైతే మరీ అన్యాయం. అంగళ్లలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తల పైకి.. పుంగనూరులో పోలీసులపైకి టీడీపీ కార్యకర్తలనే చంద్రబాబు ఉసిగొల్పడాన్ని ప్రజలందరూ చూశారు. ఆ దాడుల్లో 40 నుంచి 50 మంది పోలీసులు గాయపడ్డారు. ఒక కానిస్టేబుల్‌కు కన్నుపోయింది. పోలీసులు కాల్పులు జరపాలి.. తమ వాళ్లు కొందరు చనిపోవాలి.. దాంతో ప్రభుత్వాన్ని దేశమంతా అప్రతిష్ట పాల్జేసి.. 2024 ఎన్నికల్లో అధికారంలోకి రావాలన్నది చంద్రబాబు కుట్ర. అయితే అది జరగకపోవడంతో తనపై హత్యాయత్నం జరిగిందని, దీనిపై సీబీఐ దర్యాప్తు జరిపించాలని కోరుతూ రాష్ట్రపతి, ప్రధానికి చంద్రబాబు లేఖ రాశారు.
- చంద్రబాబుకు పిచ్చి, ఉన్మాదం ఎక్కి.. ప్రజలూ పిచ్చివారని అనుకుంటున్నాడేమో? ఎందుకంటే ఇదే చంద్రబాబు గతంలో సీబీఐని రాష్ట్రంలో అడుగుపెట్టనివ్వనంటూ ఉత్తర్వులు ఇచ్చి.. ఇప్పుడు అదే సీబీఐ దర్యాప్తు కావాలంటున్నాడు.
- చంద్రబాబుకు 'మెగలోమానియా', 'స్కిజోఫ్రీనియా' అనే జబ్బులు వచ్చాయి. వాటి లక్షణాలు ఏమిటంటే.. అధికారం నా హక్కు. నా సొంతం అనుకోవడం, తనకు మించిన అర్హులులేరని భావించడం, అహంకారం పెంచుకోవడం, అధికారంపోతే ఉన్మాదిలా మారడం... ఈ లక్షణాలు చంద్రబాబులో స్పష్టంగా కనిపిస్తున్నాయి.
- ఇక మూ్డ్రోజులు విశాఖలో పర్యటించిన పవన్.. గాజువాకలో తన ఓటమిని ప్రస్తావించి, అది తనకు పెద్ద విషయం కాదని చెప్పడం విడ్డూరం. పవన్ పోటీచేసి ఓడిపోయావంటే.. అది ఓటమి అన్నట్టే. ఆయన రాజకీయం చేస్తోంది చంద్రబాబు ప్రయోజనాల కోసమే.
- సభలకు జనం వస్తున్నారు కాబట్టి.. నా వెనక అంతమంది ఉన్నారనుకోవడం... ఇష్టమొచ్చినట్లు మాట్లాడడం ఏమిటి పవన్? నీకు కూడా చంద్రబాబుకు పట్టిన జబ్బు మెగలోమానియా నుంచి దాటిపోయి స్కిజోఫ్రీనియా రోగం వచ్చిందేమో? మా ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలు, కార్యక్రమాలను చంద్రబాబు, పవన్ నమ్మడంలేదు. కానీ, జనం ఆదరిస్తున్నారు కదా? ఈనాడు, ఆంధ్రజ్యోతి రాతలు నమ్మి మాట్లాడితే ఏం ప్రయోజనం పవన్?
- పరిపాలన వికేంద్రీకరణలో భాగంగా సీఎం జగన్ విశాఖకు ఎప్పుడైనా వెళ్లొచ్చు. సీఎం ఎక్కడి నుంచైనా పాలించవచ్చు. తాడికొండ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి ప్రస్తుతం మా పార్టీలో లేరు. ఆమెను ఎవరూ అవమానించలేదు. ఆమెతో టీడీపీ రాజకీయం చేస్తోంది.

ప్రజాదరణ లేకే లోకేశ్ కారుకూతలు

- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు న్యాయం చేస్తున్నది సీఎం వైఎస్ జగన్
- చంద్రబాబు తీవ్ర అన్యాయం చేయడం వల్లే టీడీపీకి ఆ వర్గాలు దూరం
- ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్




సాక్షి, అమరావతి: గుంటూరు జిల్లాలో పాదయాత్రకు ప్రజాస్పందన లేకపోవడం వల్లే లోకేశ్ కారు కూతలు కూస్తున్నారని ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్ చెప్పారు. ఆయన సోమవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. చంద్రబాబు 14 ఏళ్లు సీఎంగా ఉన్నప్పుడు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు తీవ్రమైన అన్యాయం చేయడం వల్లే ఆ వర్గాలు టీడీపీని దూరం పెట్టాయని, ఈ వాస్తవాన్ని లోకేశ్ తెలుసుకోవాలని చెప్పారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు న్యాయం చేసింది నాడు వైఎస్ రాజశేఖరరెడ్డి, నేడు సీఎం వైఎస్ జగన్ మాత్రమేనని స్పష్టం చేశారు. సీఎం వైఎస్ జగన్ 'నాడు–నేడు' కార్యక్రమంతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చి, ఇంగ్లిష్ మీడియంలో బోధిస్తూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల పిల్లలను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దుతున్నారని చెప్పారు. మైనార్టీలకు 4 శాతం రిజర్వేషన్ కల్పించి విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో ప్రోత్సహించి వారిని వైద్యులుగా, ఇంజినీర్లుగా తయారు చేసిన ఘనత వైఎస్సార్‌కే దక్కుతుందన్నారు. ఆర్వోఎఫ్ఆర్ పట్టాలు ఇచ్చి గిరిజనులకు తోడునీడగా నిలించింది వైఎస్సార్, సీఎం జగన్ మాత్రమేనన్నారు. అందుకే 2014, 2019 ఎన్నికల్లో ఎస్టీ నియోజకవర్గాల్లో ఒక్క స్థానంలోనూ టీడీపీని గిరిజనులు గెలిపించలేదన్నారు. రాష్ట్రంలో 29 ఎస్సీ నియోజకవర్గాల్లో 28 చోట్ల వైఎస్సార్‌సీపీనే గెలిపించారని చెప్పారు. బీసీలను చంద్రబాబు వెన్నుపోటు పొడవడం వల్లే ఆ వర్గాలు కూడా టీడీపీకి దూరమయ్యాయని తెలిపారు. సీఎం వైఎస్ జగన్ నామినేటెడ్ నుంచి కేబినెట్ వరకు సింహభాగం పదవులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకే ఇచ్చి సామాజిక న్యాయమంటే ఇదీ అని దేశానికి చాటిచెప్పారని అన్నారు. అమరావతిలో నిజమైన రైతులకు ప్రభుత్వం న్యాయం చేస్తుందని తెలిపారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు, పచ్చ కండువాలు ధరించి రైతుల ముసుగులో మాట్లాడే మాటలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోదన్నారు. వైఎస్సార్‌సీపీ తరఫున ఎమ్మెల్యేగా గెలిచి.. పార్టీకి రాజీనామా చేయకుండా లోకేశ్ పక్కన నిలబడి ఉండవల్లి శ్రీదేవి మాట్లాడిన మాటలను ఆమె విజ్ఞతకే వదిలేస్తున్నామని చెప్పారు. పవన్‌కళ్యాణ్ ఓ రాజకీయ పార్టీ అధ్యక్షుడిగా ఉండి, భావోద్వేగాలను రెచ్చగొట్టేలా మాట్లాడటం సరైంది కాదని అన్నారు.

క్లుప్తంగా...

చంద్రయాన్-3కి నాలుగోసారి కక్ష్య తగ్గింపు

సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) గత నెల 14న ప్రయోగించిన చంద్రయాన్-3 మిషన్ లూనార్ ఆర్బిట్ (చంద్రుడి కక్ష్య)లో చంద్రుడికి దగ్గరగా 177 కిలోమీటర్లు, దూరంగా 150 కిలోమీటర్ల ఎత్తులోకి చేరుకుంది. దీర్ఘ వృత్తాకార కక్ష్యలో తిరుగుతున్న చంద్రయాన్-3 మిషన్‌కు నాలుగోసారి సోమవారం మధ్యాహ్నం కక్ష్య దూరాన్ని తగ్గించే ప్రక్రియను విజయవంతంగా నిర్వహించారు. కక్ష్య దూరాన్ని వంద కిలోమీటర్లకు తగ్గించే ప్రక్రియను ఈనెల 17న చేపట్టనున్నారు. అయితే రష్యా ప్రయోగించిన లూనా-25 అనే మిషన్ చంద్రుడిపైన దిగింది. చంద్రుని ఉపరితలంపై ఈ నెల 23న దక్షిణ ధృవంలో దిగబోయే మొట్టమొదటి మిషన్ చంద్రయాన్-3దేపై చేయి అవుతుంది.



సెప్టెంబర్‌లో ఆదిత్య-ఎల్1 ప్రయోగం!

సూర్యుడిపై అధ్యయనం చేయనున్న ఇస్రో

సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): చందమామపై పరిశోధనల కోసం చంద్రయాన్-3 మిషన్‌ను ప్రయోగించిన భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) ఇక సూర్యుడిపై అధ్యయనం కోసం ఏర్పాట్లు చేస్తోంది. ఆదిత్య-ఎల్1 పేరిట అంతరిక్ష నౌకను ప్రయోగించనుంది. సెప్టెంబర్ మొదటివారంలో ప్రయోగం ఉటుందని ఇస్రో సోమవారం వెల్లడించింది. ఆదిత్య-ఎల్1 స్పేస్ క్రాఫ్ట్ బెంగళూరులోని యూఆర్ రావు శాటిలైట్ సెంటర్ నుంచి శ్రీహరి కోటలో ఉన్న 'షార్'కు చేరుకుంది. షార్‌లోని రెండో ప్రయోగవేదిక నుంచి పీఎస్ఎల్‌వీ సీ57 రాకెట్ ద్వారా ఆదిత్య-ఎల్1 స్పేస్‌క్రాఫ్ట్‌ను ప్రయోగిస్తారు. ఇక్కడి వెహికల్ అసెంబ్లింగ్ బిల్డింగ్‌లో మూడు దశల రాకెట్ అనుసంధానం పనులు పూర్తి చేశారు. ఆదిత్య-ఎల్1కు క్లీన్‌రూంలో పరీక్షల అనంతరం రాకెట్ శిఖరభాగంలో అమర్చుతారు. ప్రయోగం ద్వారా సూర్యుడు-భూమి వ్యవస్థలోని లాంగ్‌రేంజ్ పాయింట్ 1(ఎల్1) చుట్టూ ఉన్న కక్ష్యలోకి ప్రవేశపెడతారు. ఇది భూమికి 10.5 లక్షల కిలోమీటర్ల దూరంలో ఉంది. అక్కడి నుంచి సూర్యుడిపై అధ్యయనానికి అడ్డంకులుండవని సైంటిస్టులు చెబుతున్నారు.



షిమ్లాలో కొండచరియలు పడకముందు శివాలయం(ఎడమ). పద్దాక శిథిలాల కింద ముమ్మర గాలింపు దృశ్యం

హిమాచల్, ఉత్తరాఖండ్‌లో భీకర వర్షం

- విరిగిపడుతున్న కొండచరియలు
- కూలుతున్న ఇళ్లు
- హిమాచల్‌లో 51 మంది మృతి
- షిమ్లాలో శివాలయం ధ్వంసం
- ఏడుగురి సజీవ సమాధి
- చార్‌ధామ్ యాత్ర రెండు రోజులపాటు రద్దు

షిమ్లా/డెహ్రాడూన్: హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాలను భీకర వర్షాలు ముంచెత్తుతున్నాయి. కొంచచరియలు విరిగిపడుతుండడంపై పలు రహదారులపై రాకపోకలు నిలిచిపోయాయి. ఇళ్లు సైతం కూలిపోతున్నాయి. హిమాచల్ ప్రదేశ్‌లో ఆదివారం సాయంత్రం మొదలైన వర్షాలు ఎడతెరిపి లేకుండా కురుస్తున్నాయి. వర్షాలు, కొండచరియల ధాటికి రాష్ట్రంలో కనీసం 51 మంది మరణించారని అధికారులు సోమవారం ప్రకటించారు. వీరిలో ఏడుగురు రాజధాని షిమ్లాలోని సమ్మర్ హిల్ ప్రాంతంలో శివాలయంపై కొండచరియలు విరిగిపడడంతో రాళ్ల కింద చిక్కుకొని సజీవ సమాధి అయ్యారని వెల్లడించారు. ఆలయం కూడా ధ్వంసమైంది. ఈ రాళ్ల కింద మరికొంత మంది ఉండొచ్చని భావిస్తున్నట్లు తెలిపారు. షిమ్లాలో ఈ శివాలయం ఎంతగానో ప్రసిద్ధిగాంచింది. నిత్యం పద్ద సంఖ్యలో భక్తులు వస్తుంటారు. అలాగే షిమ్లాలోని ఫగ్లీ ప్రాంతంలో కొండచరియల వల్ల ఐదుగురు మరణించారు. ఇక్కడ శిథిలాల కింద చిక్కుకున్న 17 మందిని అధికారులు రక్షించారు. అంతేకాకుండా చాలా ఇళ్లు బురదలో కూరుకుపోయాయి. వర్షాల కారణంగా హిమాచల్ ప్రదేశ్‌లో సోమవారం కాలేజీలు, స్కూళ్లకు సెలవు ప్రకటించారు. ముందుజాగ్రత్తగా 752 రహదారులపై రాకపోకలను నిలిపివేశారు. సైన్యంతోపాటు ఎస్‌డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్, ఐటీబీపీ సిబ్బంది, రాష్ట్ర పోలీసులు సహాయక చర్యల్లో నిమగ్నమయ్యారు. రాష్ట్రంలో అత్యధికంగా కాంగ్రాలో 273 మిల్లీమీటర్లు, ధర్మశాలలో 250 మిల్లీమీటర్లు, సుందర్‌నగర్‌లో 168 మిల్లీమీటర్లు, మండీలో 140 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. రాష్ట్రంలో 12 జిల్లాలకుగాను 9 జిల్లాల్లో రానున్న రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఎల్లో అలర్ట్ జారీ చేసింది. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.

అమిత్ షా దిగ్భ్రాంతి

షిమ్లాలో కొండచరియలు విరిగిపడడం వల్ల ధ్వంసమైన శివాలయాన్ని ముఖ్యమంత్రి సుఖ్వీందర్‌సింగ్ సుఖూ సందర్శించారు. శిథిలాల కింద చిక్కుకున్న వారిని క్షేమంగా బయటకు తీసుకురావడానికి సహాయక చర్యలు ప్రారంభించినట్లు తెలిపారు. హిమాచల్ ప్రదేశ్‌లో వర్షాల వల్ల పెద్ద సంఖ్యలో జనం మరణించడం పట్ల కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సహాయక చర్యలు ముమ్మరం చేయాలని ఎన్డీఆర్ఎఫ్ అధికారులను ఆదేశించారు.

కేదార్‌నాథ్‌కు రాకపోకలు బంద్

ఎడతెరిపిలేని భారీ వర్షాలతో ఉత్తరాఖండ్ రాష్ట్రం చిగురుటాకులా వణికిపోతోంది. కొండచరియలు విరిగి పడడంతో పలు ఇళ్లు నేలకూలాయి. రహదారులు దెబ్బతిన్నాయి. వర్షాల ధాటికి రాజధాని డెహ్రాడూన్ సమీపంలోని ప్రైవేట్ డిఫెన్స్ ట్రైనింగ్ సెంటర్ ధ్వంసమైంది. వర్ష బీభత్సం వల్ల రాష్ట్రంలో నలుగురు మరణించారు. మరో 10 మంది గల్లంతయ్యారు. పలుచోట్ల జాతీయ రహదారులు ధ్వంసం కావడంతో ప్రఖ్యాత పుణ్యక్షేత్రాలైన బద్రీనాథ్, కేదార్‌నాథ్, గంగోత్రికి రాకపోకలు నిలిచిపోయాయి. చార్‌దామ్ యాత్రను రెండు రోజుల పాటు రద్దు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. ఫలితంగా లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వాహనాలు కొట్టుకుపోయాయి. రుద్రప్రయాగ్, దేవప్రయాగ్, రిషికేశ్‌లో అలకనంద, మందాకినీ, గంగా నదులు ప్రమాదకర స్థాయిని మించి ప్రవహిస్తున్నాయి. రిషికేశ్‌లో 435 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.



ప్రవాహంలో కూలిపోతున్న ప్రైవేట్ డిఫెన్స్ శిక్షణకేంద్రం



మట్టి కొట్టుకుపోయి గాల్లో వేలాడుతున్న షిమ్లా-కల్కా హెరిటేజ్ రైల్వే ట్రాక్

కుజునిపై జీవముండేదా?

- ఉపరితలంపై పురాతన పగుళ్లు
- భూమిపై జీవం పుట్టుకలో అవే కీలకం

కుజ గ్రహం మీద పరిశోధనల కోసం అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ నాసా పంపిన క్యూరియాసిటీ రోవర్ తాజాగా కీలకమైన విశేషాలను సేకరించింది. కుజుని ఉపరితలంపై పురాతన పగుళ్లను కనిపెట్టింది. ఇప్పటికీ ఏ మాత్రం చెక్కు చెదరకుండా ఉన్న ఆ పగుళ్లను ఫొటోలు, వీడియోలు తీసి భూమికి పంపింది. వాటిని చూసి సైంటిస్టులే ఆశ్చర్యపోతున్నారు. ఒకదాని తరువాత ఒకటిగా వచ్చి పోయే తడి, పొడి ఆవర్తనాలకు సూచికలైన ఈ తరహా పగుళ్ల జీవం పుట్టుకకు అత్యంత అనుకూలమని చెబుతారు.


..ఎండా, వానా కాలాలు

కుజ గ్రహంపై అత్యంత పురాతన కాలం నాటి బురదమయమైన పగుళ్లను క్యూరియాసిటీ రోవర్ కనిపెట్టింది. షట్కోణాకృతిలోని ఆ పగుళ్ల ఇప్పటికీ చెక్కుచెదరకుండా ఉండటం విశేషం. వీటిని తొలినాటి కుజునిపై తడి, పొడి ఆవర్తనాల తాలూకు ఆనవాళ్లుగా భావిస్తున్నారు. జీవం పుట్టుకకు ఇవి అత్యంత కీలకమే గాక ఎంతో అనుకూలం కూడా. భూమిపై మాదిరిగా కుజునిపై క్రమానుగతంగా తడి, పొడి ఋతువులు, మరోలా చెప్పాలంటే వేసవి, వానాకాలాలు ఒకదాని తర్వాత ఒకటిగా వస్తూ పోతూ ఉండేవనేందుకు ఈ ఆవర్తనాలు నిదర్శనమని పరిశోధనకు సారథ్యం వహించిన విలియం రేపిన్ అభిప్రాయపడ్డారు. మట్టి పొర, లవణ ఖనిజాలతో సమృద్ధమైన వాటి పై పొరల మధ్య జోన్‌లో ఈ చక్రాలను కనిపెట్టారు. బురద ఎండిపోయినకొద్దీ కుంచించుకుపోయి, పగుళ్లిచ్చి టీ ఆకారపు జంక్షన్ మాదిరిగా ఏర్పడ్డాయి. పదేపదే నీరు పారిన మీదట వై ఆకృతిలోకి, అంతిమంగా షట్కోణాకృతిలోకి మారి గట్టిపడ్డాయి. భూమ్మీద మాదిరిగానే ఎండా, వానా కాలాలు క్రమం తప్పకుండా వచ్చేవని కచ్చితంగా చెప్పవచ్చని రేపిన్ చెప్పారు. 'పైగా భూమి మాదిరిగా కుజునిపై టెక్టానిక్ ఫలకాలు లేవు. కనుక ఆ గ్రహం తాలూకు పురాతన చరిత్ర సురక్షితంగా ఉంది'అని అన్నారు. ఈ పరిశోధన ఫలితాలను నేచర్ జర్నల్‌లో తాజాగా ప్రచురించారు.

– సాక్షి, నేషనల్ డెస్క్



> జీవం తాలూకు ఆనవాళ్లు ఇప్పటికీ ఇంత సురక్షితంగా ఉన్న కుజుని వంటి గ్రహం భూమికి ఇంత సమీపంగా ఉండటం ఒక రకంగా మన అదృష్టం. విశ్వ రహస్యాలను ఛేదించే క్రమంలో ఇదో పెద్ద ముందడుగు కాగలదు'
>
> – విలియం రేపిన్, పరిశోధన సారథి



క్యూరియాసిటీ రోవర్ పంపిన ఫొటోలో షట్కోణాకృతి పగుళ్లు కనిపిస్తున్న దృశ్యం

ఆండ్రాయిడ్ ఆపరేటింగ్ సిస్టంలో చాలా లోపాలు

ఇండియన్ కంప్యూటర్ ఎమర్జెన్సీ టీమ్ హెచ్చరిక

న్యూఢిల్లీ: ఆండ్రాయిడ్ ఆపరేటింగ్ సిస్టంలో చాలా లోపాలున్నాయని కేంద్ర ప్రభుత్వ సంస్థ ఇండియన్ కంప్యూటర్ ఎమర్జెన్సీ టీమ్ పేర్కొంది. ఆండ్రాయిడ్- 13 సహా పలు వెర్షన్లు వైరస్‌ల బారిన పడే ప్రమాదం చాలా ఉందని ఆందోళన వెలిబుచ్చింది. వాటి వినియోగంలో జాగ్రత్తగా ఉండాలంటూ యూజర్లకు సోమవారం 'అతి తీవ్ర' హెచ్చరికలు జారీ చేసింది. లేదంటే మొబైల్స్ తదితరాల్లో సున్నిత సమాచారం హాకర్ల బారిన పడే ప్రమాదం పొంచి ఉందని వివరించింది. ఆండ్రాయిడ్ 10, 11, 12, 12ఎల్, 13 వెర్షన్లలో వీటిని ప్రధానంగా గమనించినట్టు చెప్పింది. వీటివల్ల ఫ్రేంవర్క్, ఆండ్రాయిడ్ రన్ టైం, సిస్టం కంపోనెంట్, గూగుల్ ప్లే సిస్టమ్ అప్డేట్స్, కెర్నల్, ఆర్మ్ కంపోనెంట్స్, మీడియా టీ కంపోనెంట్, కలోకాం క్లోజ్డ్ సోర్స్ కంపోనెంట్స్ వంటివాటి పనితీరు లోపభూయిష్టంగా మారుతుందని వివరించింది.

అప్‌డేషన్ ఇలా...

ఆండ్రాయిడ్ ఆధారిత డివైస్‌ల భద్రత కోసం లేటెస్ట్ సెక్యూరిటీ ప్యాచెస్‌కు తక్షణం అప్డేట్ చేసుకోవాలని సూచించింది. ఇందుకు డివైస్ సెట్టింగ్స్‌లోకి వెళ్లి సిస్టమ్‌పై క్లిక్ చేయాలి..సిస్టమ్ అప్ డేట్స్‌పై క్లిక్ చేయండి. అప్డేట్స్ ఉంటే డౌన్ లోడ్ చేసుకోండి.

పాక్ ఆపద్ధర్మ ప్రధానిగా కకర్ ప్రమాణం

ఇస్లామాబాద్: పాకిస్తాన్ ఆపద్ధర్మ ప్రధానమంత్రిగా అన్వరుల్ హక్ కకర్(52) సోమవారం పదవీ ప్రమాణం చేశారు. సోమవారం అధ్యక్ష భవనంలో నిరాడంబరంగా జరిగిన కార్యక్రమంలో కకర్‌తో అధ్యక్షుడు అరిఫ్ అల్వీ ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో ప్రధాని పదవి నుంచి వైదొలగిన షెహబాజ్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు. మరికొద్ది నెలల్లో జరగాల్సిన నేషనల్ అసెంబ్లీ(దిగువసభ) ఎన్నికలను నిష్పాక్షికంగా నిర్వహించడం, దేశాన్ని ఆర్థిక కష్టాల నుంచి గట్టెక్కించడం కకర్ ముందున్న ప్రధాన లక్ష్యాలు. త్వరలోనే ఆయన తన మంత్రివర్గాన్ని ప్రకటించనున్నారు.

'నీట్' భయంతో చెన్నై విద్యార్థి ఆత్మహత్య

- కుమారుడి మరణాన్ని తట్టుకోలేక తండ్రి సైతం బలవన్మరణం
- విద్యార్థులకు 'నీట్' అవరోధంగా మారిందని సీఎం స్టాలిన్ ఆగ్రహం



చెన్నై: దేశవ్యాప్తంగా మెడికల్ కాలేజీల్లో ప్రవేశానికి ఉద్దేశించిన నేషనల్ ఎలిజిబిటీ-కమ్-ఎంట్రెన్స్ టెస్ట్(నీట్) తమిళనాడులో అగ్గిరాజేస్తోంది. ఈ పరీక్షలో అర్హత సాధించలేనన్న భయంతో జగదీశ్వరన్ అనే 19 ఏళ్ల విద్యార్థి ఉరివేసుకున్నాడు. తనయుడి మరణాన్ని తట్టుకోలేక తండ్రి సెల్వశేఖర్(48) సైతం బలవన్మరణానికి పాల్పడ్డాడు. జగదీశ్వరన్ సీబీఎస్ఈ స్కూల్‌లో 2021లో ప్లస్ టూ పూర్తిచేశాడు. 500 మార్కులకు గాను 427 మార్కులు సాధించాడు. రెండుసార్లు 'నీట్' రాశాడు. అర్హత సాధించలేకపోయాడు. మూడోసారి పరీక్ష రాయడానికి సన్నద్ధమవుతున్నాడు. ఈసారి కూడా విఫలమవుతానన్న ఆందోళనతో శుక్రవారం చెన్నైలోని కురింజీలో తన ఇంట్లో ఉరివేసుకొని ప్రాణం విడిచాడు. కుమారుడి మృతిని తండ్రి సెల్వశేఖర్ జీర్ణించుకోలేపోయాడు. ఆదివారం రాత్రి ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అంతకముందు మీడియాతో మాట్లాడాడు. విదేశాల్లో చదువుకోవాలని తన కుమారుడికి సూచించినా వినిపించుకోలేదని, ఇక్కడే మెడికల్ కాలేజీలో సీటు సంపాదిస్తానని చెప్పాడని, ఇంతలోనే ఘోరం జరిగిందని బోరుమన్నాడు. మన దేశంలో 'నీట్' వ్యవస్థ సరిగ్గా లేదని ఆరోపించాడు.

'నీట్'ను రద్దు చేస్తాం: స్టాలిన్

తండ్రికొడుకుల మృతి పట్ల తమిళనాడు సీఎం స్టాలిన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రాష్ట్రంలో నీట్‌ను రద్దు చేస్తామని, ఈ దిశగా న్యాయ పోరాటం సాగిస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థులెవరూ ఆత్మహత్యలు చేసుకోవద్దని, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. 'నీట్' నుంచి తమిళనాడును మినహాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ రాష్ట్ర అసెంబ్లీలో గతంలోనే తీర్మానం చేశారు. ఇదిలా ఉండగా స్టాలిన్ సర్కారు తీసుకొచ్చిన యాంటీ-నీట్ బిల్లుపై సంతకం చేయబోనని గవర్నర్ రవి తేల్చిచెప్పారు. అలాగైతే పదవి నుంచి తప్పుకోవాలని స్టాలిన్ అన్నారు.

స్కూలు సిలబస్‌లో 'పోక్సో' చట్టం

- హైకోర్టుకు తెలిపిన కేరళ ప్రభుత్వం
- ఇప్పటికే 12 ఏళ్లు ఆలస్యమైందన్న న్యాయస్థానం

తిరువనంతపురం: పోక్సో చట్టాన్ని పాఠ్యాంశంగా తీసుకువచ్చేందుకు తాజాగా కేరళ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను రాష్ట్ర హైకోర్టు ప్రశంసించింది. పాఠశాల స్థాయి విద్యార్థులకు పోక్సో చట్టంపై అవగాహన కల్పించడంలో ఇప్పటికే 12 ఏళ్లు ఆలస్యమైందని ఈ సందర్భంగా వ్యాఖ్యానించింది. ఈ చట్టంపై అవగాహన లేకపోవడంతోనే స్కూలు విద్యార్థులు, టీనేజర్లపై లైంగిక దాడులు జరుగుతున్నాయని పేర్కొంది. ఇటీవల ఓ పిటిషన్‌పై విచారణ సందర్భంగా జస్టిస్ బెచు కరియన్ థామస్ ఈ వ్యాఖ్యలు చేశారు. చిన్నారులు, ముఖ్యంగా టీనేజర్లపై లైంగిక నేరాలు ఇటీవల పెరిగి పోయాయని ఆయన అన్నారు. పోక్సో చట్టంలోని తీవ్రమైన శిక్షల గురించి తెలియకనే చాలా మంది విద్యార్థులు పరస్పరం లైంగిక సంబంధాలు పెట్టుకుంటున్నారన్నారు. పోక్సో చట్టంపై వారికి ఎలాంటి అవగాహన లేదన్నారు. వీటన్నిటినీ పరిగణనలోకి తీసుకుని రాజ్యాంగంలోని ఆర్టికల్ 226 ప్రకారం.. లైంగిక నేరాలు, వాటి పరిణామాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు గాను పాఠశాల సిలబస్‌లో పోక్సో చట్టం చేర్చేందుకు చర్యలు తీసుకోవాలని కేరళ రాష్ట్ర ప్రభుత్వం, సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్ఈ), కేరళ రాష్ట్ర న్యాయ సేవల ప్రాధికార సంస్థలకు ఆదేశాలు జారీ చేసింది. కేరళ రాష్ట్ర న్యాయ సేవల ప్రాధికార సంస్థ, రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర విద్యాశాఖ కలిసి బడికి వెళ్లే బాలల్లో లైంగిక నేరాలపై అవగాహన కల్పించేందుకు తీసుకుంటున్న చర్యలను హైకోర్టు ప్రశంసించింది.

జలుబుతో రక్తం గడ్డకట్టే ప్రమాదం?

న్యూఢిల్లీ: శ్వాస ప్రక్రియను ఇబ్బంది పెట్టే సాధారణ జలుబు ఒక్కోసారి రక్తాన్ని గడ్డకట్టేలా చేసే ప్రమాదకర వ్యాధికి దారి తీయగలదట! దీనివల్ల ప్లేట్లెట్లు తగ్గే ప్రమాదం సైతం ఉందని యూనివర్సిటీ ఆఫ్ నార్త్ కరోలినా స్కూల్ ఆఫ్ మెడిసిన్ చేసిన అధ్యయనంలో తేలింది. ముందుగానే గుర్తించిచర్యలు తీసుకునేందుకు తాజా ఫలితాలు దోహదపడతాయని అధ్యయన బృందం చెబుతోంది. ఈ పరిశోధన వివరాలు న్యూ ఇంగ్లాండ్ జర్నల్ ఆఫ్ మెడిసిన్‌లో పబ్లిష్ అయ్యాయి.

ఇథియోపియాలో వైమానిక దాడి.. 26 మంది మృతి

నైరోబీ: ఇథియోపియాలోని కల్లోలిత అంహారా ప్రాంతంలోని ఓ పట్టణ కూడలిలో జరిగిన వైమానిక దాడిలో 26 మంది చనిపోగా మరో 55 మంది గాయాలపాలయ్యారు. స్థానిక మిలీషియా ముఠాలను నిర్వీర్యం చేసేందుకు దేశ ఆర్మీ ప్రయత్నాలు చేస్తోంది. ఇదే క్రమంలో ఫినోట్ సెలామ్‌లోని కమ్యూనిటీ సెంటర్‌పై ఆదివారం ఉదయం వైమానిక దాడి జరిపింది.

ఇద్దరికి యావజ్జీవ కారాగారం

లఖీంపూర్ ఖేరి: దాదాపు ఏడాది క్రితం సంచలనం సృష్టించిన దళిత బాలికలపై గ్యాంగ్ రేప్, హత్య కేసులో దోషుల్లో ఇద్దరికి జీవిత ఖైదు, మరో ఇద్దరికి ఆరేళ్ల జైలు శిక్ష విధిస్తూ పోక్సో కోర్టు సోమవారం తీర్పునిచ్చింది. 2022 సెప్టెంబర్ 14న నిఘాసన్ గ్రామంలో తోబుట్టువులు విగతజీవులై ఓ చెట్టుకు వేలాడుతూ కనిపించారు. దీనిపై సిట్ అధికారులు దర్యాప్తు జరిపి ఆరుగురిని అరెస్ట్ చేశారు. 2022 సెప్టెంబర్ 22న పోక్సో కోర్టులో చార్జిషీటు వేశారు. అదనపు జిల్లా జడ్జి రాహుల్ సింగ్ దోషుల్లో నలుగురిపై శుక్రవారం వివిధ నేరారోపణలను నిర్ధారించి, సోమవారం తీర్పును ప్రకటించారు. సునీల్, జునాయిద్ అనే వారికి జీవిత ఖైదుతోపాటు రూ.46 వేల జరిమానా విధించారు. కరీముద్దీన్, ఆరిఫ్ అనే వారికి ఆరేళ్ల కఠిన కారాగారంతోపాటు రూ.5 వేల చొప్పున జరిమానా విధించారు.

కశ్మీర్‌లో మూడంచెల భద్రత

న్యూఢిల్లీ/శ్రీనగర్: స్వాతంత్య్ర వేడుకలు ప్రశాంతంగా కొనసాగేందుకు కశ్మీర్‌లో మూడంచెల భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఉత్సవాలు జరిగే బక్షీ స్టేడియంతోపాటు దాల్ సరస్సు పరిసరాల్లో జమ్మూకశ్మీర్ ప్రత్యేక పోలీసు బలగాలు, ఇతర భద్రతా సిబ్బంది సోమవారం కవాతు చేపట్టారు. 'స్వాతంత్య్ర వేడుకల రోజున ఇంటర్నెట్ సర్వీసులు యథా ప్రకారం కొనసాగుతాయి'అని అదనపు డీజీపీ విజయ్ పేర్కొన్నారు. కాగా, బారాముల్లా జిల్లా కనిస్పోరా వద్ద ఓ ఐఈడీని గుర్తించి, నిర్వీర్యం చేసినట్లు పోలీసులు తెలిపారు.

41 కెమెరాలతో ప్రసారభారతి లైవ్ కవరేజ్

స్వాతంత్య్ర వేడుకల ప్రత్యక్ష ప్రసారానికి ప్రభుత్వ రంగ ప్రసారభారతి అయిదు రోబోటిక్ కెమెరాలు సహా 41 కెమెరాలను వినియోగించనుంది. వేడుకలను దూరదర్శన్, ప్రాంతీయ చానెళ్లతోపాటు ఆల్ ఇండియా రేడియో జాతీయ చానళ్లన్నీ ప్రత్యక్ష ప్రసారం చేయనున్నాయి.



స్వాతంత్య్రదినోత్సవాన్ని పురస్కరించుకుని ఢిల్లీలోని రైసినాహిల్స్‌లో జెండా రంగుల విద్యుత్‌దీప వెలుగుల్లో వెలిగిపోతున్న భవనాలు

సామరస్య స్ఫూర్తిని పాటిద్దాం

- పౌరులంతా కలిసిమెలిసి జీవనం సాగించాలి
- రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పిలుపు
- దేశ ప్రజలకు స్వాతంత్య్ర దినోత్సవ సందేశం

న్యూఢిల్లీ: విభిన్నమైన గుర్తింపులు ఉన్నప్పటికీ భారతీయులంతా సమాన అవకాశాలు, సమాన హక్కులు, సమాన విధులు ఉన్న సమాన పౌరులేనని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఉద్ఘాటించారు. దేశ ప్రజలంతా ఒక్కటేనని స్పష్టం చేశారు. సామరస్యం, సౌభ్రాతృత్వ స్ఫూర్తితో కలిసిమెలిసి జీవనం సాగించాలని, ఉమ్మడిగా ముందుకు ప్రజలకు పిలుపునిచ్చారు. 77వ స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి ముర్ము సోమవారం దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. స్వాతంత్య్ర దినోత్సవ సందేశం ఇచ్చారు. ఆమె ఏం చెప్పారంటే..

జాతి నిర్మాతల కలలు సాకారం కావాలంటే..

''ప్రతి భారతీయుడికి కులం, మతం, జాతి, భాష, ప్రాంతం, కుటుంబం, వృత్తి తదితర గుర్తింపులు ఉంటుంది. వీటన్నింటికంటే మరో ముఖ్యమైన గుర్తింపు ఉంది. అదే 'భారతదేశ పౌరుడు'. దాన్ని మించిన గుర్తింపు మరొకటి లేదు. మనమంతా సమానమే. మన దేశం ప్రజాస్వామ్యానికి తల్లిలాంటిది. ప్రాచీన కాలం నుంచి చూసినా ఇక్కడ ప్రజాస్వామ్య వ్యవస్థలు బలంగా ఉన్నాయి. బ్రిటిష్ వలస పాలన ఆ విలువలను తుడిచిపెట్టేసింది. 1947 ఆగస్టు 15న భరతమాత స్వాతంత్య్రం పొందింది. అదొక నూతన ఉషోదయం. విదేశీ పాలన నుంచి మాత్రమే కాకుండా మన విధిరాతను తిరిగి రాసుకోవడానికి స్వాతంత్య్రం లభించింది. మన జాతి నిర్మాతల కలలు సాకారం కావాలంటే మనమంతా కలిసికట్టుగా ముందుకు నడవాలి. స్వాతంత్య్ర పోరాటంలో మహిళల పాత్ర మరువలేనిది. దేశాభివృద్ధిలో, ప్రజలకు సేవ లందించడంలో వారి భాగస్వామ్యం ప్రశంసనీయం. మహిళలు కచ్చితంగా ఆర్థిక సాధికారిత సాధించాలి'' అని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము వెల్లడించారు.

స్విచ్‌బోర్డ్‌లో రూ. 15 కోట్ల గోల్కొండ వజ్రం

కోల్‌కతా: సత్యజిత్ రే దర్శకత్వంలో 1979లో వచ్చిన 'జోయ్ బాబా ఫెలూనాథ్' అనే బెంగాలీ సినిమాలో అత్యంత ఖరీదైన వజ్రం దుర్గామాత అధిష్టించిన సింహం బొమ్మ నోటిలో చాలాకాలం తర్వాత దొరుకుతుంది. మిస్టరీ వీడిపోతుంది. అలాంటి సంఘటనే పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో జరిగింది. ఇక్కడ కరెంటు స్విచ్‌బోర్డులో రూ.15 కోట్ల విలువైన 32 క్యారెట్ల బరువైన గోల్కొండ వజ్రం దొరికింది. అసలు విషయమేమిటంటే.. ప్రణబ్ కుమార్ రాయ్ అనే వ్యక్తి వద్ద ఈ వజ్రం ఉండేది. 2002లో దాని నాణ్యత, ధర తెల్సుకునేందుకు ఇంద్రజిత్ తపాదార్ అనే వజ్రాల మధ్యవర్తిని సంప్రదించాడు. 2002 జూన్‌లో ఇంద్రజిత్ మరొకడిని తీసుకొని ప్రణబ్ ఇంటికి వచ్చాడు. వారిద్దరూ కలిసి ప్రణబ్‌ను పిస్టోల్‌తో బెదిరించి వజ్రంతో ఉడాయించారు. బాధితుడి ఫిర్యాదులో పోలీసులు రంగంలోకి దిగారు. ఇంద్రజిత్ ఇంట్లో గాలింపు చేపట్టారు. వజ్రం ఆచూకీ దొరకలేదు. మరోవైపు తనకేమీ తెలియదని ఇంద్రజిత్ బుకాయించాడు. వజ్రం కచ్చితంగా అతడి ఇంట్లోనే ఉంటుందున్న నమ్మకంతో పోలీసులు అన్వేషణ కొనసాగించారు. అయినాదొరకలేదు. చిట్టచివరకు చాలా రోజుల తర్వాత అదే ఇంట్లో మెట్ల కింద కరెంటు స్విచ్‌బోర్డు లోపలున్న చిన్న సొరంగంలో వజ్రం లభ్యమైంది. నిందితుడు ఇంద్రజిత్‌కు ట్రయల్ కోర్టు రెండేళ్ల జైలుశిక్ష విధించింది. ఇంకోవైపు వజ్రం యజమాని ప్రణబ్ కుమారేనా కాదా అనే దానిపై న్యాయ వివాదం కొనసాగింది. ఆ వజ్రం అసలు సొంతదారు అతడేనని సిటీ సెషన్స్ కోర్టు గతవారం తీర్పునిచ్చింది. వజ్రం రూపురేఖలు మార్చొద్దని, ఇందుకోసం రూ.2 కోట్ల విలువైన బాండ్ సమర్పించాలని ప్రణబ్‌ను ఆదేశించింది. ప్రపంచ ప్రఖ్యాత కోహినూర్, షాజహాన్ వజ్రాలు సైతం గోల్కొండ ప్రాంతానికి చెందినవే.

వరుసగా పదోసారి..



న్యూఢిల్లీ: వరుసగా పదోసారి ప్రధాని మోదీ నేడు స్వాతంత్య్ర దినోత్సవ ప్రసంగం చేయనున్నారు. 2024 లోక్‌సభ ఎన్నికలకు ముందు ఇదే ఆయన చివరి ప్రసంగం కానుంది. ఈ వార్షిక ప్రసంగంలో ప్రధాని మోదీ తన ప్రభుత్వ ప్రగతి రిపోర్టు, కీలక కార్యక్రమాలను ప్రకటించడంతోపాటు రానున్న సంవత్సరాల్లో దేశాన్ని ఎలా ముందుకు నడిపించాలనుకుంటున్నారో కూడా వివరిస్తారు. 2014 మొదలుకొని వివిధ రంగాల్లో దేశం సాధించిన ప్రగతిని వివరించడంతోపాటు భవిష్యత్ కార్యాచరణను ప్రధాని ప్రకటించనున్నారు. రాజకీయ పరమైన అంశాలను కూడా ఆయన స్పృశిస్తారని పరిశీలకులు భావిస్తున్నారు.

ఎక్కువ ఫాలోయర్లు ఉన్నారని..

భార్యను చంపేసిన భర్త

లక్నో: సోషల్ మీడియా ఇన్‌స్టాగ్రామ్‌లో ఎక్కువ మంది ఫాలోయర్లు ఉండటంతో భార్యపై అసూయ చెందిన ఓ భర్త ఆమెను కన్నబిడ్డల ఎదుటే గొంతు పిసికి చంపేశాడు. యూపీలో ఈ దారుణం చోటుచేసుకుంది. లక్నోలోని పారా ప్రాంతంలో నివాసం ఉండే ఓ ట్రావెల్ ఏజెంట్(37)కి 15 ఏళ్ల క్రితం పెళ్లయ్యింది. ఆ దంపతులకు 12 ఏళ్ల కూతురు, 5 ఏళ్ల కొడుకు ఉన్నారు. భార్య గృహిణి. ఇంటి వద్ద ఉంటూనే ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టులు పెట్టేవారు. ఆమె ఎకౌంట్‌కు భారీగా ఫాలోయర్లున్నారు. ఎవరో ఒక ఫాలోయర్‌తో ఆమె అక్రమ సంబంధం నడుపుతోందని భర్తకు అనుమానం. ఇదే విషయంలో వారి గొడవలు జరుగుతున్నాయి. ఇటీవల తన ఇన్‌స్టా ఎకౌంట్‌లో భర్తను బ్లాక్ చేసింది. దీంతో, అతడి అనుమానం ఎక్కువైంది. ఆదివారం ఆ దంపతులు పిల్లలిద్దరినీ తీసుకుని కారులో రాయ్‌బరేలీకి బయలుదేరారు. అయితే, భర్త కారును పూర్వాంచల్ ఎక్స్‌ప్రెస్ వేపైకి మళ్లించాడు. ఉదయం 5 గంటల సమయంలో సుల్తాన్‌పూర్ వద్ద ఇద్దరి మధ్యా గొడవ తీవ్ర స్థాయికి చేరుకుంది. తీవ్ర కోపంతో ఉన్న భర్త భార్యను గొంతు నులిమి చంపేశాడు. ఈ హఠాత్పరిణామంతో పిల్లలిద్దరూ వణికిపోయారు. వారు ఏడుస్తూ ఉండటంతో కారును లోపలి నుంచే లాక్ చేశాడు నిందితుడు. పోలీసులు అనుమానంతో అక్కడికి చేరుకుని ప్రశ్నించగా దారుణం వెలుగులోకివచ్చింది. ఇన్‌స్టాగ్రామ్‌లో భార్యకు ఎక్కువ ఫాలోయర్లు ఉండటంతో ఆత్మన్యూనత వల్లే అతడు దారుణానికి తెగబడ్డాడని పోలీసులు తెలిపారు.



మీరే భారత భాగ్య విధాతలు

కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీతో కలిసి భోజనం చేస్తున్న ఈ వ్యక్తి పేరు రామేశ్వర్. ఢిల్లీలో తోపుడు బండిపై కూరగాయల ముక్కునే వ్యక్తి. ద్రవ్యోల్బణం దెబ్బకు కూరగాయలు కొనలేని పరిస్థితి ఉందంటూ ఖాళీ తోపుడుబండి చూపిస్తూ రామేశ్వర్ రోదిస్తున్న వీడియో ఇటీవల వైరల్ మారింది. విషయం తెల్సుకున్న రాహుల్ ఈయనను సోమవారం ఢిల్లీలో ఇంటికి పిలిచి భోజనం పెట్టారు. కష్టాల్లోనూ చిరునవ్వుతూ ముందుకు సాగే ఇలాంటి వారే 'భారత భాగ్య విధాతలు' అంటూ సోషల్ మీడియా 'ఎక్స్'లో రాహుల్ ట్వీట్‌చేశారు.

ఎగ్మోర్-గురువాయూర్ ఎక్స్‌ప్రెస్ వేళల్లో మార్పు

కొరుక్కుపేట: చెన్నై ఎగ్మోర్–గురువాయుర్ ఎక్స్‌ప్రెస్ ప్రయాణ సమయాన్ని అధికారులు పెంచారు. అలాగే బయలుదేరే సమయంలోనూ మార్పులు చేశారు. ఇవి సోమవారం నుంచి అమలులోకి వచ్చాయి. వివరాలు.. చెన్నై ఎగ్మోర్ నుంచి గురువాయూర్ వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలు (నంబర్ 16127)ను తాజాగా రీషెడ్యూల్ చేశారు. దీంతో ఈ రైలు చెన్నై ఎగ్మోర్‌లో ఉదయం 9 గంటలకు బదులు 45 నిమిషాలు ఆలస్యంగా 9.45 గంటలకు బయలుదేరుతుందని ప్రకటించారు. ఈ క్రమంలో అన్ని స్టేషన్‌లలో రైలు ఆగే సమయాల్లో మార్పులు ఉంటాయన్నారు. రైల్వే శాఖ రైళ్ల వేగాన్ని పెంచి ప్రయాణ సమయాన్ని తగ్గిస్తున్న వేళ.. అందుకు విరుద్ధంగా గురువాయూర్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రయాణ సమయాన్ని పెంచడంపై ప్రయాణికుల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

న్యూస్‌రీల్

ఐదు జిల్లాల్లో వర్షాలు

– చెన్నైలో మోస్తరుగా..

సాక్షి, చెన్నై: విల్లుపురం, కల్లకురిచ్చి, చెంగల్పట్టు, కాంచీపురం, తిరువణ్ణామలై జిల్లాలో అనేక చోట్ల వర్షాలు పడుతున్నాయి. ఆదివారం రాత్రంతా కురిసిన వర్షాలకు చెన్నైలో పలు విమానాల సేవలకు ఆటంకాలు నెలకొన్నాయి. రాత్రి 10 గంటల సమయంలో ఉరుములు మెరుపులతో వర్షం పడింది. చెంగల్పట్టు, కాంచీపురం జిల్లాల పరిధిలో వరుణుడు బీభత్సం సృష్టించాడు. దీంతో రోడ్లపై వర్షపు నీరు పోటెత్తింది. సోమవారం ఉదయం నుంచి విల్లుపురం, కళ్లకురిచ్చి, తిరువణ్ణామలైల్లో వర్షాలు కురుస్తున్నాయి. ఈ వర్షాలు రెండు రోజులు కొనసాగుతాయని వాతవరణ కేంద్రం ప్రకటించింది. చెన్నైలో పలుచోట్ల మోస్తరుగా వర్షం పడింది. కొన్ని చోట్ల భారీవర్షం కురిసింది. ఇక చెన్నై, శివారు జిల్లాల్లో రోడ్లపైన చేరిన నీటిని కొన్ని గంటల్లో సిబ్బంది పూర్తిగా తొలగించేశారు.

1,016 మంది టీచర్లకు ఉద్యోగోన్నతి

తిరువొత్తియూరు: ప్రభుత్వ హయ్యర్ సెకండరీ పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయ పోస్టులకు గాను 1,016 మంది టీచర్లకు ఉద్యోగోన్నతి కల్పించినట్లు డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ అధికారులు సోమవారం వెల్లడించారు. ప్రిన్సిపల్ ఎడ్యుకేషన్ ఆఫీసర్లకు పంపిన సర్క్యులర్‌లోని వివరాల మేరకు.. తమిళనాడు జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత స్థాయి పాఠశాల ప్రధానోపాధ్యాయుని పదోన్నతి కోసం గత జనవరిలో ప్రమోషన్‌కు అర్హులైన వారితో సీనియారిటీ జాబితాను సిద్ధం చేశారు. ఈ మేరకు 1,016 మంది ఉపాధ్యాయుల వివరాలను జిల్లా ప్రాథమిక విద్యాశాఖాధికారులకు కూడా పంపించినట్లు వెల్లడించారు.

తేనీటి విందు రద్దు

సాక్షి, చెన్నై: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాజ్‌భవన్‌లో మంగళవారం జరగాల్సిన తేనేటి విందును గవర్నర్ ఆర్‌ఎన్ రవి రద్దు చేశారు. తమిళనాడు ప్రభుత్వానికి, గవర్నర్‌కు మధ్య జరుగుతున్న మాటల యుద్ధం ముదిరిన నేపథ్యంలో తేనేటి విందును బహిష్కరిస్తున్నట్లు సీఎం స్టాలిన్ ప్రకటించగా.. అదే సమయంలో చెన్నైలో వర్షం పడుతోందన్న విషయాన్ని ప్రస్తావిస్తూ ఏకంగా తేనిటి విందును గవర్నర్ రద్దు చేశారు. ఈ విషయాన్ని సోమవారం రాత్రి రాజ్‌భవన్ వర్గాలు వెల్లడించాయి.

చెన్నై వేదికగా గోల్ఫ్ టోర్నీ

– రేపటి నుంచి ప్రారంభం



లోగోను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

సాక్షి, చెన్నై: ఇండియా సిమెంట్స్ ప్రో ఛాంపియన్ షిప్ గోల్ఫ్ గేమ్ చెన్నై వేదికగా జరగనుంది. ఈనెల 16వ తేదీ నుంచి 19వ తేదీ వరకు కాస్మో గోల్ఫ్ మైదానంలో పోటీలు జరగనున్నాయి. ముందుగా మంగళవారం ప్రో–యామ్ కార్యక్రమం నిర్వహించనున్నారు. సోమవారం స్థానికంగా జరిగిన కార్యక్రమంలో లోగోను నిర్వాహకులు ఆవిష్కరించారు. ఇండియా సిమెంట్స్ టైటిల్ స్పాన్సర్‌గా, గోల్ఫ్ టూర్ ఆఫ్ ఇండియా నేతృత్వంలో తమిళనాడు గోల్ఫ్ ఫెడరేషన్ ఈ ఛాంపియన్ షిప్‌ను నిర్వహిస్తోంది. ఈ విషయంపై ఇండియా సిమెంట్స్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్. శ్రీనివాసన్ మాట్లాడుతూ, గోల్ఫ్ ప్రపంచ వ్యాప్తంగా అత్యంత ప్రసిద్ధి చెందిన క్రీడల్లో ఒకటిగా పేర్కొన్నారు. చెన్నైలో గోల్ఫ్ అభివృద్ధికి, టోర్నమెంట్ నిర్వహణకు తమ వంతు కృషి చేపట్టామన్నారు. ఇండియా సిమెంట్ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ పార్థసారథి రామానుజం మాట్లాడుతూ, గొప్ప క్రీడా సంప్రదాయాన్ని కలిగిన తమ సంస్థ, ప్రస్తుతం టైటిల్ స్పాన్సర్‌గా చెన్నైలో ప్రో ఛాంపియన్ మీద దృష్టి పెట్టడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ పోటీల్లో 126 మంది గోల్ఫ్ క్రీడాకారులు పాల్గొంటారని, ఇందులో భారత్‌కు చెందిన ఓం ప్రకాష్ చౌహాన్, అమన్ రాజ్, కరణ్‌ప్రతాప్ సింగ్, సచిన్ బైసోయా, గౌరవ్ ప్రతాప్‌సింగ్ ఉన్నారని వివరించారు. విజేతకు రూ. 50 లక్షలు నగదు బహుమతి ఇవ్వనున్నామని ప్రకటించారు. కార్యక్రమంలో బిస్లరీ ఇంటర్నేషనల్ హెడ్ తుషార్ మల్హోత్రా, పీజీటీఐ సీఈఓ ఉత్తమ్ సింగ్, తమిళనాడు గోల్ఫ్ ఫెడరేషన్ కార్యదర్శి ఆర్‌కే జావెర్, క్రౌన్ ప్లాజా జీఎం ఆనంద్ నాయర్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో అర్చకుడు మృతి

తిరువొత్తియూరు: మైక్‌లో మాట్లాడుతున్న సమయంలో విద్యుత్ షాక్ తగిలి ఆలయ అర్చకుడు మృతి చెందారు. వివరాలు.. తిరువారూరుకి చెందిన జ్ఞాన సుందరం (42) స్థానిక కార్పొరేషన్ కార్యాలయం ఎదురుగా ఉన్న కాశీ విశ్వనాథ ఆలయంలో అర్చకులుగా పనిచేస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం ప్రదోష పూజలను పురస్కరించుకొని కాశీవిశ్వనాథ ఆలయంలో విశేష పూజలు చేశారు. ఈ సమయంలో జ్ఞానసుందరం మైక్ ద్వారా భక్తులకు సూచనలు చేస్తుండగా.. విద్యుత్ షాక్‌తో మరణించాడు. తిరువారు టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

త్రివర్ణ శోభితం



విద్యుత్ కాంతుల్లో చెన్నై కార్పొరేషన్ భవనం

స్వాతంత్ర్య వేడుకలకు రాష్ట్రం త్రివర్ణ శోభితంగా మారింది. కామరాజర్ సాలై సెయింట్ జార్జ్ కోటలోని రాష్ట్ర సచివాలయం ఈ వేడుకలకు ప్రత్యేకంగా ముస్తాబైంది. ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ మంగళవారం మువ్వన్నెల జెండాను జార్జ్ కోటలో ఎగుర వేయనున్నారు. ఇంటింటా జాతీయ జెండాలను ఆవిష్కరించేందుకు ప్రజలు సిద్ధమయ్యారు. కాగా నీట్ రద్దు ముసాయిదాపై గవర్నర్ వ్యాఖ్యలకు నిరసనగా ఆయన ఇచ్చే తేనీటి విందును బహిష్కరిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది.

- స్వాతంత్ర్య వేడుకలకు సర్వం సిద్ధం
- నేడు జార్జ్‌కోటలో జెండా ఎగుర వేయనున్న సీఎం స్టాలిన్
- 21 మంది పోలీసు అధికారులకు రాష్ట్రపతి పతకాలు
- రాష్ట్రవ్యాప్తంగా భద్రత కట్టుదిట్టం
- గవర్నర్ విందును బహిష్కరిస్తూ సీఎం ప్రకటన

సాక్షి, చెన్నై: ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు స్వాతంత్ర్య దినోత్సవం వేళ ఇంటింటా జాతీయ జెండాలను ఎగుర వేయడానికి రాష్ట్ర ప్రజలు సన్నద్ధమయ్యారు. ఇప్పటికే తపాల కార్యాలయాల ద్వారా సుమారు ఐదు లక్షల జెండాలను అధికారులు విక్రయించారు. కొందరు ఒక రోజు ముందుగా సోమవారమే తమతమ ఇళ్లపై జెండాలను ఎగుర వేశారు. బీజేపీ రాష్ట్ర కో– ఇన్‌చార్జ్ పొంగలేటి సుధాకర్‌రెడ్డి నేతృత్వంలో సెంట్రల్ చెన్నై పరిధిలో సోమవారం జెండాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఇక, మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా వాడవాడల్లో మువ్వన్నెల జెండారెప రెప లాడేందుకు తగ్గట్లుగా అన్ని పాఠశాలలు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, సంస్థల్లో ఏర్పాట్లు జరిగాయి. ఢిల్లీలో జరగనున్న వేడుకలకు రాష్ట్రం నుంచి 45 మందికి ఆహ్వానాలు వచ్చాయి. వీరంతా ఢిల్లీ బయలుదేరి వెళ్లారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా రైల్వే స్టేషన్లు, విమానాశ్రయాల్లో భద్రతను మరింత కట్టుదిట్టం చేసి నిఘాను పోలీసు అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

జార్జ్‌కోట ముస్తాబు

స్వాతంత్ర్య వేడుకలకు రాష్ట్ర పరిపాలనా కేంద్రం జార్జ్ కోట ముస్తాబైంది. ఇక్కడి స్తూపంపై అతిపెద్ద జాతీయ జెండాను సీఎం స్టాలిన్ ఎగుర వేయనున్నారు. 150 అడుగుల ఈ స్తూపాన్ని రూ. 45 లక్షలతో ఆధునీకరించారు. ఈ వేడుకల దృష్ట్యా, సచివాలయం నుంచి గాంధీ విగ్రహం వరకు కామరాజర్ సాలైకు ఇరువైపులా బారికేడ్లను ఏర్పాటు చేశారు. ఆ పరిసరాల్ని సుందరంగా తీర్చిదిద్దారు. ఇక విద్యుత్ దీపాల వెలుగులో సచివాలయం దేదీప్యమానంగా వెలుగుతోంది. ఇప్పటికే జార్జ్‌కోట, పరిసరాలను పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. అణువణువు తనిఖీలు చేశారు. జార్జ్ కోటలో జాతీయ పతాకాన్ని ఎగుర వేసినానంతరం సీఎం గౌరవ వందనం స్వీకరిస్తారు. తర్వాత ఓపెన్ టాప్‌వాహనంలో వాహనంలో సచివాలయం నుంచి గాంధీ విగ్రహం వరకు పర్యటించి, రోడ్డుకు ఇరువైపులా ఉండే ప్రజలకు అభివాదం ,శుభాకాంక్షలు తెలియజేయనున్నారు. అనంతరం జరిగే వేడుకలో సాహసవనితలకు, దివ్యాంగుల సంక్షేమానికి కృషి చేసిన వారికి, మహిళా సంక్షేమానికి, సాంఘిక సంక్షేమానికి కృషి చేసిన వారికి, సాహస వీరులకు అవార్డులను అందజేయనున్నారు. అలాగే ద్రవిడ కళగం నేత వీరమణికి ప్రత్యేక తమిళర్ బిరుదుతో పాటు రూ. పది లక్షలు చెక్కును అందజేయనున్నారు. ఇక విజ్ఞాన శాస్త్రంలో ఉత్తమ సేవలకు డాక్టర్ అబ్దుల్ కలాం, వీర ధీర సేవలకు కల్పాన చావ్లా బిరుదులు ప్రదానం చేస్తారు. సీఎం ప్రత్యేక అవార్డులు, మహిళా సంక్షేమం, దివ్యాంగుల సంక్షేమం కోసం శ్రమిస్తున్న వారికి సత్కారాలు, ఉత్తమ పంచాయతీలు, పురపాలక సంస్థలు, నగర పాలక సంస్థలకు అవార్డులను అందజేయనున్నారు. మధ్యాహ్నం దేవదాయ శాఖ పరిధిలోని 32 ప్రధాన ఆలయాల్లో సహపంక్తి భోజనాలకు ఏర్పాట్లు చేశారు. మంత్రులు అందరూ ఈ కార్యక్రమానికి హాజరు కానున్నారు. కాగా, స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల దృష్ట్యా, ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కామరాజర్ సాలైలోని సచివాలయం మార్గంలో శ్రామిక చిహ్నం నుంచి వార్ మెమోరియల్, రిజర్వు బ్యాంక్ సబ్ వే వరకు ట్రాఫిక్ మార్పులు చేశారు. ఇదిలా ఉండగా కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరిలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు బీచ్ రోడ్డు సిద్ధమైంది. ఇక్కడ సీఎం రంగస్వామి జాతీయజెండాను ఎగుర వేయనున్నారు.



జెండాలను పంపిణీ చేస్తున్న బీజేపీ నేత సుధాకర్ రెడ్డి



కాంతులీనుతున్న జార్జ్ కోటలోని సచివాలయం



రైల్వే స్టేషన్‌లో తనిఖీలు



దేదీప్యమానంగా కామరాజర్ సాలై

రాష్ట్ర ప్రజలకు గవర్నర్, నేతల శుభాకాంక్షలు

స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రజలకు రాష్ట్ర గవర్నర్ ఆర్‌ఎన్ రవి, పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, సీఎం ఎంకే స్టాలిన్, పుదుచ్చేరి సీఎం రంగస్వామి, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి పళణి స్వామి , పీఎంకే నేత రాందాసు, అమ్మ మక్కల్ మున్నేట్ర కళగం నేత టీటీవీ దినకరన్, తమిళ మానిల కాంగ్రెస్ నేత జికే వాసన్, మక్కల్ నీది మయ్యం నేత కమల్, ఎస్ఎంకే నేత శరత్‌కుమార్ శుభాకాంక్షలు తెలియజేశారు. స్వాతంత్ర్య దినోత్సవ వేళ అందరం సమిష్టిగా ముందుకు సాగుదామని, దేశ సర్వతో ముఖాభివృద్ధికి పాటుపడుదామని పిలుపు నిచ్చారు. ఇక జెండా ఎగుర వేయడం కోసం తనకు భద్రత కల్పించాలని మదురై జిల్లా చేడపట్టి పలయూరు పంచాయతీలో దళిత మహిళా ప్రజా ప్రతినిధి విద్య పోలీసులను ఆశ్రయించారు. ఇదిలా ఉండగా, ఇదిలా ఉండగా నీట్ వ్యవహారంలో గవర్నర్ ఆర్ఎన్ రవి చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా మంగళవారం సాయంత్రం రాజ్‌భవన్‌లో ఆయన ఇచ్చే తేనేటి విందును బహిష్కరిస్తూ సీఎం స్టాలిన్ నిర్ణయం తీసుకున్నారు.

అన్నాడీఎంకే జ్యోతి యాత్ర ప్రారంభం

- చెన్నై నుంచి మదురై వరకు పయనం
- శ్రీకారం చుట్టిన పళణి స్వామి



యాత్రను ప్రారంభిస్తున్న పళణి స్వామి

సాక్షి, చెన్నై : మదురై మహానాడు నేపథ్యంలో అన్నాడీఎంకే నేతృత్వంలో జ్యోతి యాత్ర ర్యాలీకి చెన్నై నుంచి సోమవారం శ్రీకారం చుట్టారు. అన్నాడీఎంకే కార్యాలయం ఎంజీఆర్ మాళిగైలో ఈ యాత్రను ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి పళణి స్వామి ప్రారంభించారు. వివరాలు.. అన్నాడీఎంకేను పూర్తిగా తన గుప్పెట్లోకి తీసుకున్న తర్వాత ప్రప్రథమంగా భారీ మహానాడుకు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి పళణి స్వామి నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. దక్షిణ తమిళనాడులో ప్రధాన కేంద్రంగా ఉన్న మదురైలో మహానాడును ఈనెల 20వ తేదీ జరగనుంది. మదురై వలయ కులం కరుప్పుస్వామి ఆలయ మైదానాన్ని మహానాడుకు ఎంపిక చేశారు. ఇక్కడ బ్రహ్మాండ ఏర్పాట్లు జరుగుతున్నాయి. లక్షలాది మందిని తరలించేందుకు జన సమీకరణ ప్రయత్నాలు వేగవంతం అయ్యాయి. తమ బలాన్ని చాటే మహానాడు కావడంతో ఇక్కడకు వచ్చే ప్రతి నాయకుడు, కార్యకర్తలకు అవసరమయ్యే అన్ని రకాల ఏర్పాట్లను పార్టీ నేతృత్వంలో ఏర్పాటైన కమిటీలు పర్యవేక్షిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో యాత్ర విజయవంతాన్ని కాంక్షిస్తూ, చెన్నై నుంచి మదురై వరకు జ్యోతి యాత్రకు అన్నాడీఎంకే యువజన విభాగం నిర్ణయించింది. సోమవారం ఈ యాత్రకు పళణి స్వామి జ్యోతి వెలిగించారు. జ్యోతి కాగడను యువజన విభాగం నేతలకు అందజేశారు. ఎంజీఆర్ మాళిగై నుంచి మదురై వరకు 50 మంది యువజన నేతలతో ఈ యాత్రతో ప్రధాన ప్రాంతాల మీదుగా పయనమయ్యారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రిసీడియం చైర్మన్ తమిళ్ మగన్ హుస్సేన్, నేతలు జయకుమార్, గోకుల ఇందిర తదితరులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టుకు చేరిన కావేరి వివాదం



కావేరి నది

సాక్షి, చెన్నై: కావేరి జలాల కోసం సుప్రీం కోర్టును తమిళనాడు ప్రభుత్వం ఆశ్రయించింది. న్యాయనిపుణులతో చర్చల మేరకు ఢిల్లీలో సోమవారం పిటిషన్ దాఖలు చేసినట్టు తెలిసింది. ఈ పరిణామాల నేపథ్యంలో నీటి విడుదల శాతాన్ని కర్ణాటక కాస్త పెంచినట్లు సమాచారం. ఈమేరకు మంగళవారం ఈ నీరు పిలికుండులుకు చేరే అవకాశం ఉందని భావిస్తున్నారు. వివరాలు.. మూడేళ్ల అనంతరం తమిళనాడు – కర్ణాటకల మధ్య కావేరి వివాదం మళ్లీ తెర మీదకు వచ్చిన విషయం తెలిసిందే. తమిళనాడుకు వాటాగా ఇవ్వాల్సిన నీటిని ఇంత వరకు కర్ణాటక సక్రమంగా విడుదల చేయడంలేదు. దీంతో డెల్టా రైతుల్లో ఆందోళన నెలకొంది. మేట్టూరు జలాశయంలో మరో వారం రోజులకు సరిపడ్డ నీరు మాత్రమే ఉండడంతో పంటలు ఎండి పోయే పరిస్థితులు తప్పవనే ఆందోళన నెలకొంది. దీంతో కావేరి జలాలను విడుదల చేయాలని కోరుతూ సీపీఐ, రైతు సంఘాల నేతృత్వంలో డెల్టా జిల్లాలలో ఆందోళనలకు సిద్ధమయ్యాయి. సోమవారం పలు చోట్ల ధర్నాలు జరిగాయి. అదే సమయంలో కావేరి యాజమాన్య సంస్థ ద్వారా నీటిని విడుదల చేయించుకునేందుకు చేసిన ప్రయత్నాలు విఫలం కావడం, నీళ్లు ఇచ్చేప్రసక్తే లేదని కర్ణాటక తేల్చి చెప్పడంతో ఇక, గత్యంతరం లేక సుప్రీంకోర్టు తలుపు తట్టక తప్పలేదు. తమిళనాడు నీటి పారుదల శాఖ అధికారులు సోమవారం ఢిల్లీలో న్యాయనిపుణులతో చర్చించినానంతరం నీటి పంపిణీ కోసం సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేసినట్టు సంకేతాలు వెలువడ్డాయి. తమిళనాడు కోర్టును ఆశ్రయించిన సమాచారం నేపథ్యంలో కర్ణాటక తమ జలాశయాల నుంచి నీటి విడుదల శాతాన్ని పెంచినట్లు తెలిసిందే. ఈనీళ్లు మంగళవారం మధ్యాహ్నం నాటికి రెండు రాష్ట్రాల సరిహద్దులలోని పిలిగుండులుకు చేరే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

నాంగునేరి విద్యార్థికి ప్లాస్టిక్ సర్జరీ

కొరుక్కుపేట: తిరునెల్వేల్లి జిల్లా నాంగునేరిలో చోటు చేసుకున్న దాడిలో తీవ్రంగా గాయపడిన చిన్నదురై అనే విద్యార్థికి ప్లాస్టిక్ సర్జరీ చేయాలని చెన్నై స్టాన్లీ ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు నిర్ణయించారు. వివరాలు.. నాంగునేరి చెందిన ప్లస్–2 విద్యార్థి చిన్నదురై (17), చెల్లెలు చంద్ర సెల్విపై అదే ప్రాంతానికి చెందిన కొంతమంది విద్యార్థులు ఈనెల 9న ఇంట్లోకి చొరబడి వేట కొడవళ్లతో దాడి చేశారు. దీంతో అన్నా చెల్లెలికి తీవ్ర గాయాలయ్యాయి. వీరు ప్రస్తుతం తిరునెల్వేల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో చెన్నైలోని స్టానీ ప్రభుత్వ ఆసుపత్రి ప్లాస్టిక్ సర్జరీ విభాగానికి చెందిన వైద్యులు డాక్టర్ శ్రీదేవి, మహేష్, శ్రీధర్ ఆసుపత్రికి వెళ్లి బాధితులను పరీక్షించారు. ఇందులో చేతికి గాయాలైన విద్యార్థి చిన్నదురైకు ప్లాస్టిక్ సర్జరీ చేయాలని నిర్ణయించారు.

15 మంది పోలీసులకు సీఎం మెడల్స్

సాక్షి, చెన్నై: ప్రజలకు ఉత్తమ సేవలు అందించిన 15 మంది పోలీసులకు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా సీఎం మెడల్స్‌ను ప్రకటించారు. సీఐడీ క్రైం బ్రాంచ్ ఏడీజీపీ జి. వెంకటరమణ, నార్త్ చెన్నై లా అండ్ ఆర్డర్ అదనపు కమిషనర్ అస్రా కార్గ్, సీఐడీ ఇంటిలిజెన్స్ డీఐజీ ఎస్. రాజేంద్రన్, గ్రేటర్ చెన్నై సైబర్ క్రైం అదనపు డిప్యూటీ కమిషనర్ బీహెచ్ షజిత ఉన్నారు. అలాగే తిరుప్పూర్ అసిస్టెంట్ కమిషనర్ వి. అనిల్‌కుమార్, మదురై సీఐడీ క్రైం డీఎస్పీ జి. శరవణన్, కోయంబత్తూరు సూలూరు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఆర్. మాధయ్యన్, మదురై పీలమేడు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం. అముదా, తూత్తుకుడి మసర పట్టి స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం. అనిత, శివగంగై మానా మదురై మహిళా పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఆర్. విజయ, అరియలూరు మహిళా పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎ. మహాలక్ష్మి, తిరుప్పూర్ సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్ ఎ. చిత్రాదేవి, చెన్నై క్రైం బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ ఎస్. మణిమేఘలై, తిరుచ్చీ క్రైంబ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ కె. శివ ఉనారు. ఈ సారి సీఎం పతకాలను అందుకుంటున్న వారిలో ఏడుగురు మహిళా పోలీసు అధికారిణిలు ఉండడం విశేషం.

'నీట్' మింగేసింది!

- వైద్య విభాగంలో సీటు దక్కలేదని విద్యార్థి ఆత్మహత్య
- తనయుడి మృతిని తట్టుకోలేక తండ్రి బలవన్మరణం
- క్రోంపేటలో తీవ్ర విషాదం



జగదీశ్వరన్, సెల్వ శేఖరన్ (ఫైల్)

సాక్షి, చెన్నై: నీట్‌లో సీటు దక్కలేదనే మనస్తాపంతో క్రోంపేటకు చెందిన విద్యార్థి జగదీశ్వరన్ (19) బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ క్రమంలో కుమారుడి మృతిని తట్టుకోలేక తండ్రి సెల్వ శేఖరన్(48) కూడా ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తండ్రి తనయుడు మృతి చెందడంపై సీఎం స్టాలిన్‌ను దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వివరాలు.. వైద్యకోర్సుల్లో ప్రవేశానికి కేంద్రం తీసుకొచ్చిన నీట్ పరీక్షను ఆది నుంచి డీఎంకే ప్రభుత్వం వ్యతిరేకిస్తున్న విషయం తెలిసిందే. నీట్ రద్దు, తమిళనాడుకు మినహాయింపు నినాదంతో అసెంబ్లీలో చేసిన తీర్మానాలను గవర్నర్ ఆమోదం ఇంతవరకు లభించలేదు. అదే సమయంలో ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న విద్యార్థుల కోసం ప్రత్యేకంగా 7.5 శాతం సీట్లను కేటాయిస్తూ వస్తున్నారు. ప్లస్–2లో మంచి మార్కులు సాధించినా, నీట్‌లో ఉత్తీర్ణత సాధించినా కటాఫ్ మార్కుల ఆధారంగా ఈ సీట్లు కూడా దక్కక పోవడంతో అనేక మంది పేద విద్యార్థులు తీవ్ర మనస్తాపం చెందుతున్నారు. ఏటా సీట్లు దక్కక బలన్మరణానికి పాల్పడుతున్న విద్యార్థులు రాష్ట్రంలో ఉన్నారు. ఈ ఏడాది జగదీశ్వరన్ ఆత్మహత్య చేసుకున్నారు. అతడి తండ్రి కూడా విగత జీవి కావడం చర్చనీయాంశంగా మారింది

మంచి మార్కులు సాధించినా..

చెన్నై క్రోంపేట కురింజి నగర్‌కు చెందిన సెల్వ శేఖరన్(48) ఫొటోగ్రాఫర్. సింగిల్ పేరెంట్‌గా ఉన్న ఆయన తనయుడు జగదీశ్వరన్‌ను సీబీఎస్ఈలో చదివించాడు. ప్లస్–2లో 85 శాతానికి పైగా మార్కులు సాధించాడు. చిన్నప్పటి నుంచి డాక్టర్ కావాలనే ఆశతో జగదీశ్వరన్ ఉన్నాడు. అయితే, ప్రైవేటులో లక్షలు పోసి సీట్ల కొనే స్తోమత లేకపోవడంతో.. ఎలాగైనా ప్రభుత్వ కోటా సీటు దక్కించుకోవాలని ప్రయత్నం చేశాడు. రెండు సార్లు నీట్ పరీక్ష రాసి ఉత్తీర్ణుడయ్యాడు. ఈ ఏడాది కూడా కటాఫ్ మార్కులతో ప్రభుత్వ కోటా సీటు దూరమైంది. దీంతో తీవ్ర ఆవేదనకు లోనైన జగదీశ్వరన్ శనివారం రాత్రి ఇంట్లో బలన్మరణానికి పాల్పడ్డాడు. ఆదివారం అతడి గదిలో లభించిన లేఖ ఆధారంగా తన కుమారుడిని నీట్ మింగేసినట్టు మీడియా ముందుకు వచ్చి సెల్వ శేఖరన్ రోదించాడు. తన కుమారుడికి ఎదురైన పరిస్థితి మరో విద్యార్థికి రాకూడదని కన్నీటి పర్యంతమయ్యారు. నీట్‌ను రద్దు చేయాలని నినాదించాడు. అదే సమయంలో తనయుడి మరణాన్ని తట్టుకోలేక ఆదివారం రాత్రి ఆయన కూడా ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సమాచారం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం కలిగించింది. క్రోంపేట జీహెచ్‌లో ఉన్న వీరి మృత దేహాలకు మంత్రి ఉదయ నిధి స్టాలిన్ నివాళులర్పించారు. కాగా తమ మిత్రుడికి మార్కులు ఉన్నా, ఆర్థిక స్తోమత అడ్డు రావడంతోనే సీటు దూరమైందని జగదీశ్వరన్ కన్నీటి పర్యంతమయ్యారు.

నీట్ ముసాయిదాను ఆమోదించాలని రాష్ట్రపతికి సీఎం స్టాలిన్ లేఖ

తండ్రి , తనయుడి మరణ సమాచారంతో సీఎం స్టాలిన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విద్యార్థులు ఆందోళన, ఒత్తిడికి లోను కావద్దు అని, త్వరలో నీట్ రద్దు అయ్యేపరిస్థితులు ఉన్నాయన్నారు. త్వరలో రాజకీయ మార్పులు తప్పవని, నీట్ అనే గోడలను బద్దలు కొట్టి తీరుతామని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ముసాయిదాలను ఆమోదించకుండా, ప్రైవేటు కోచింగ్ సెంటర్లకు అనుకూలంగా ఈ గవర్నర్ వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఇక నీట్ మినహాయింపు ముసాయిదాను ఆమోదించాలని సోమవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకి సీఎం స్టాలిన్ లేఖ రాశారు. తమిళనాడులో విద్యార్థుల బలవన్మరణాలను అందులో ప్రస్తావించారు. న్యాయం చేయాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు లారీ డ్రైవర్ల మృతి

తిరువళ్లూరు: తిరువళ్లూరు జిల్లా చోళవరం వద్ద ద్విచక్ర వాహనాన్ని కంటైనర్ బలంగా ఢీకొన్న ఘటనలో ఇద్దరు లారీ డ్రైవర్లు ఘటన స్థలంలోనే మృతి చెందారు. వివరాలు.. తంజావూర్ జిల్లా తిరువుడైమరుదూర్ గ్రామానికి చెందిన ముత్తురసన్(34), సెంథిల్‌కుమరన్(45) ఇద్దరూ లారీ డ్రైవర్లుగా పని చేస్తున్నారు. ప్రస్తుతం చోళవరంలోని లారీయార్డులో నివాసం ఉంటున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి లారీ యార్డు నుంచి విధులు ముగించుకుని ఒకే ద్విచక్ర వాహనంలో ప్రస్తుతం నివాసం ఉంటున్న ఇంటికి బయలుదేరారు. చోళవరం జీఎస్‌టీ రోడ్డుపై వెళ్తుండగా గుమ్మిడిపూండి సిప్‌కాట్ నుంచి చోళవరం వైపు వస్తున్న కంటైనర్ బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరూ గాయపడి ఘటనా స్థలంలోనే మృతి చెందారు. చోళవరం ట్రాఫిక్ పోలీసులు మృతదేహాలను తిరువళ్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రమాదానికి కారణమైన కంటైనర్ డ్రైవర్ పరారయ్యాడు. ఈమేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

విద్యుత్‌షాక్‌తో రైతు మృతి

తిరువళ్లూరు: ఎరువులు తీసుకెళ్తున్న అల్యూమినియం గంపకు విద్యుత్ వైర్లు తాకడంతో షాక్‌కు గురై ఓ రైతు మృతి చెందాడు. వివరాలు.. తిరువళ్లూరు జిల్లా గుమ్మిడిపూండి తాలుకా మానెల్లూరు గ్రామానికి చెందిన రవి(54) అదే గ్రామంలో వరి సాగు చేస్తున్నాడు. కాగా వరికి ఎరువు వేయడానికి అల్యూమినియం గంపతో వెళ్లాడు. అయితే తల మీద ఉంచిన గంపకు విద్యుత్ వైర్లు తాకడంతో షాక్‌కు గురై పడిపోయాడు. స్థానికులు అంకయ్యను వైద్యశాలకు తరలించగా అప్పటికే మరణించినట్టు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై పాదిరివేడు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆంధ్రా యువకుడి దుర్మరణం

తిరువళ్లూరు: అమ్మవారి దర్శనం కోసం వచ్చిన యువకుడు కొలనులో మునిగి మృతి చెందిన ఘటన స్థానికంగా విషాదాన్ని నింపింది. వివరాలు.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సూళూరుపేటకు చెందిన ఆరుముగం కుమారుడు యుగేంద్రన్(26). ఇతను స్నేహితులతో కలిసి పెద్దపాళ్యం సమీపంలోని కాట్టుచెల్లియమ్మన్ ఆలయానికి వచ్చి అమ్మవారి దర్శించుకున్నాడు. అనంతరం తిరుగు ప్రయాణంలో సూళైమేణి గ్రామంలోని పుష్కరిణిలో సరదాగా ఈత కోసం వెళ్లినట్టు తెలుస్తుంది. ఈక్రమంలో యుగేంద్రన్ లోతైన ప్రాంతానికి వెళ్లడంతో నీటిలో మునిగిపోయాడు. స్నేహితులు రక్షించి సమీపంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బీజేపీ నాయకుల రాస్తారోకో



తిరుత్తణి: పళవేర్కాడులో బీజేపీ మైనారిటీ విభాగం నేత అరెస్టుకు నిరసగా తిరుత్తణిలో సోమవారం బీజేపీ శ్రేణులు రాస్తారోకో చేపట్టారు. వివరాలు.. తిరువళ్లూరు జిల్లా పళవేర్కాడు సముద్రతీరంలో జాలర్లు చేపల వేటకు వెళ్లి వచ్చేందుకు వీలుగా ముఖద్వారం ఏర్పాటుకు వీలుగా ప్రభుత్వం నిధులు కేటాయించింది. ఈ క్రమంలో అటవీశాఖ అనుమతి లేదంటూ ఆ శాఖ అధికారులు పనులు ప్రారంభానికి ముందే అడ్డుపడ్డారు. ఈ క్రమంలో పళవేర్కాడు సముద్రతీర ప్రాంతంలో జాలర్లతో మాట్లేడుందుకు వెళ్లిన బీజేపీ మైనారిటీ విభాగం నేత ఇబ్రహీం బీజేపీ శ్రేణులతో కలిసి వెళ్లేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకుని అరెస్ట్ చేశారు. బీజేపీ శ్రేణుల అరెస్టుకు నిరసనగా ఆ పార్టీ కార్యకర్తలు తిరుత్తణి బస్టాండు సమీపంలోని అరక్కోణం రోడ్డు కూడలిలో రాస్తారోకో చేపట్టారు. దీంతో ట్రాఫిక్ స్తంభించింది.

శివాలయాల్లో ఘనంగా ప్రదోష పూజలు



అరుణాచలేశ్వరాలయంలో నంది భగవాన్‌కు అభిషేకం చేస్తున్న శివాచార్యులు

వేలూరు : వేలూరు, తిరువణ్ణామలై జిల్లాలోని శివాలయాల్లో తమిళ ఆడి మాస ప్రదోష దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం సాయంత్రం నంది భగవాన్‌కు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వివరాలు.. తిరువణ్ణామలై అరుణాచలేశ్వరాలయంలోని పెద్ద నంది భగవాన్‌కు శివాచార్యులు వేద మంత్రాల నడుమ ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసి వివిధ కాయకూరలతో ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం శివాచార్యులు కర్పూర హారతి పట్టి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నందీశ్వరుడిని అలంకరించిన బంగారు వృషభ వాహనంలో ఉంచి ఆలయ మూడవ ప్రాకారం నుంచి మాడ వీధుల్లో భక్తుల దర్శనార్థం ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు మాడ వీధుల్లో కర్పూర హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. అదేవిధంగా వేలూరు కోట మైదానంలోని జలగంతేశ్వరాలయంలోని నంది భగవాన్‌కు ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించి కర్పూర హారతులు పట్టారు. అదే విధంగా వాలాజాలోని శ్రీ ధన్వంతరి ఆరోగ్య పీఠంలో స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. ఈ పూజా కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని నంది భగవాన్‌ను దర్శించుకున్నారు. ప్రదోష దినోత్సవాన్ని పురస్కరించుకుని వేలూరు, తిరువణ్ణామలై జిల్లాలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అనంతరం ఆలయ నిర్వాహకులు భక్తులకు స్వామి వారి ప్రసాదాలను అందజేశారు.

నైపుణ్యాల మెరుగుతో ఉజ్వల భవిష్యత్



అతిథులు, నిర్వాహకులతో డిగ్రీ పట్టాలు అందుకున్న విద్యార్థులు

కొరుక్కుపేట: నైపుణ్యాలు మెరుగు పరుచుకుంటేనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని విద్యార్థులకు ఏఐసీటీఈ - న్యూఢిల్లీ చైర్మన్ డాక్టర్ టి.జి. సీతారాం హితవు పలికారు. సత్యభామ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ 32వ స్నాతకోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఇన్‌స్టిట్యూషన్ ఆడిటోరియం వేదికగా జరిగిన ఈ కార్యక్రమానికి ఇన్‌స్టిట్యూట్ గౌరవ చాన్సలర్ డాక్టర్ మరియాజీనా జాన్సన్ అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా అఖిల భారత కౌన్సిల్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ), న్యూఢిల్లీ చైర్మన్ డాక్టర్ టి.జి. సీతారాం పాల్గొన్నారు. ఈ సందర్భంగా మొత్తం 4,064 మంది విద్యార్థులకు డిగ్రీ పట్టాలను ప్రదానం చేశారు. ఇందులో యూజీ విద్యార్థులు 3,503 మంది, పీజీ విద్యార్థులు 551 మంది, డిప్లొమా విద్యార్థులు 9 మంది, 104 మంది పీహెచ్‌డీ స్కాలర్లు డిగ్రీలు అందుకున్నారు. వీరిలో 47 మంది విద్యార్థులు అకడమిక్స్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకు బంగారు పతకాలను బహూకరించారు. మరియా జీనా జాన్సన్ మాట్లాడుతూ మూడు దశాబ్దాలుగా నాణ్యమైన విద్యా ప్రమాణాలతో విద్యను బోధిస్తున్నట్లు తెలిపారు.2022–23 విద్యా సంవత్సరంలో తమ విద్యార్థులు క్యాంపస్ రిక్రూట్ మెంట్ ద్వారా 3,094 మంది ఉపాధి ఆఫర్‌లను విడుదల చేశాయని అన్నారు. దీని ఫలితంగా, సత్యభామ మనదేశంలోని టాప్ 100 విశ్వవిద్యాలయాలలో 51వ స్థానంలో నిలిచిందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఇసుక లారీ ఢీకొని విశ్రాంత ఉద్యోగి మృతి

తిరువళ్లూరు: పట్టణ పరిధిలో సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగి మృతి చెందగా, పంచాయతీ రాజ్‌శాఖలో పని చేస్తున్న ఓ మహిళ ఉద్యోగి తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. తిరువళ్లూరు జిల్లా కాకలూరు గ్రామానికి చెందిన ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగి పచ్చయప్పన్ (65). ఇతడి కోడలు సుధాణ (38) చోళవరం బీడీఓ కార్యాలయంలో సీనియర్ టైపిస్టుగా పని చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సుధాణ సోమవారం కార్యాలయానికి వెళ్లడానికి తన మామ పచ్చయప్పన్‌తో కలిసి ద్విచక్ర వాహనంలో తిరువళ్లూరు బస్టాండుకు బయలుదేరారు. స్థానిక రైతు బజారు వద్ద వెళ్తుండగా ఇసుక లారీ బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో పచ్చయప్పన్ అక్కడిక్కడే మృతి చెందగా తీవ్రంగా గాయపడిన సుధాణను చెన్నైలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. తిరువళ్లూరు టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మదురై మహానాడులో సత్తాచాటాలి

తిరుత్తణి: మదురై మహానాడు ద్వారా అన్నాడీఎంకే సత్తాచాటేందుకు భారీ సంఖ్యలో పార్టీ శ్రేణులతో పాటు ప్రజలు తరలిరావాలని తిరుత్తణి యూనియన్ కార్యదర్శి ఈఎస్.కండ్రిగ రవి పిలుపునిచ్చారు. ఈ మేరకు కేజీ.కండ్రిగ బస్టాండ్‌లో సోమవారం వాహనాలకు స్టిక్కర్లు అతికించారు. భారీస్థాయిలో మహానాడుకు తరలిరావాలని కార్యకర్తలను కోరారు.

మహిళపై బీర్ బాటిల్‌తో దాడి

తిరువొత్తియూరు: చెన్నై కాశిమేడులో మహిళపై బీర్ బాటిల్‌తో దాడి చేసిన ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సింగారవేలన్ నగర్‌కు చెందిన సౌమ్య (35) కొత్త చాకలిపేటలో ఉన్న ఓ హాస్టల్‌లో ఉంటున్నారు. సోమవారం ఉదయం కొందరితో ఏర్పడిన ఘర్షణలో ఆమెపై ఇద్దరు వ్యక్తులు బీర్ బాటిల్‌తో దాడి చేశారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి బాలు, సంగీతను అరెస్ట్ చేశారు.

వసతి గృహాల్లో కనీస వసతుల కల్పనకు కృషి



ప్రభుత్వ హాస్టల్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ కుమరవేల్ పాండియన్

వేలూరు: ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థులకు అవసరమైన కనీస వసతులు కల్పించాలని కలెక్టర్ కుమరవేల్ పాండియన్ అధికారులను ఆదేశించారు. వేలూరు తందై పెరియార్ ప్రభుత్వ ఇంజినీర్ కళాశాలలో నూతనంగా నిర్మించిన విద్యార్థుల హాస్టల్ భవనాన్ని సీఎం స్టాలిన్ రాష్ట్ర సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. దీంతో వేలూరులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన హాస్టల్‌లో నిర్మించిన మరుగుదొడ్లు, తరగతి గదులు, విద్యార్థులకు అవసరమైన కనీస వసతులపై ఆరాతీశారు. కలెక్టర్ మాట్లాడుతూ హాస్టల్‌లో గదుల్లో ఉంటున్న విద్యార్థులకు రోజూ నాణ్యమైన ఆహారం పెట్టడంతో పాటు కనీస వసతులు సక్రమంగా కల్పించాలన్నారు. పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఆయనతో పాటు ఎమ్మెల్యే కార్తికేయన్, తందై పెరియార్ ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ శ్రీరామ్ బాబు, సబ్ కలెక్టర్ కవిత, అధికారులు, ప్రొఫెసర్‌లు, విద్యార్థులున్నారు. అనంతరం కలెక్టరేట్‌లో జరిగిన గ్రీవెన్‌సెల్‌లో పాల్గొని ప్రజల నుంచి వినతులను స్వీకరించి పలువురికి సంక్షేమ పథకాలను కలెక్టర్ అందజేశారు.

వింత వ్యాధితో చిన్నారి మృతి



ఆరునెలల చిన్నారి (ఫైల్)

వేలూరు: తిరుపత్తూరు జిల్లా కురిసిలాంబట్టు సమీపంలోని వసంతపురం గ్రామానికి చెందిన దీపన్(36) ఓ ప్రవేటు బ్యాంకులో ఉద్యోగం చేస్తున్నాడు. ఇతని భార్య రమ్య(31) వీరికి ఆరు సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. 2021వ సంవత్సరం కవిమిత్ర అనే పాప జన్మించి వెంటనే మృతి చెందింది. అలాగే దీపన్ కూడా కొద్ది నెలల క్రితం గుండెపోటుతో మృతి చెందాడు. దీపన్ మృతి చెందిన సమయంలో గర్భవతిగా ఉన్న రమ్యకు ఆరు నెలల క్రితం ఓ కుమార్తె జన్మించింది. పుట్టుకతోనే పాప కాళ్లలో కదలిక లేదు. కొద్ది రోజులు గడిచిన తర్వాత మెడ నిలవలేదు. తరచూ కొన ఊపిరితో కొట్టి మిట్టాడుతుండేది. దీంతో కుటుంబ సభ్యులు సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. అనంతరం వేలూరులోని సీఎంసీ ఆసుపత్రికి తరలించి వైద్య చికిత్స అందించారు. వైద్య పరీక్షలు చేసిన డాక్టర్‌లు చిన్నారికి ప్రపంచంలోనే ఎక్కడా లేని విధంగా అరుదైన స్పైనల్ మస్కులర్ అట్రోఫీ అనే అరుదైన వ్యాధి ఉందని.. ఈ నేపథ్యంలో చిన్నారిని రక్షించడం సులువు కాదని సీఎంసీ డాక్టర్‌లు తెలిపారు. ఈ వ్యాధికి వ్యాక్సిన్ భారతదేశంలో లేదని అమెరికాలో ఉందని ఇంజెక్షన్ ఖరీదు రూ.17 కోట్లు అవుతుందని డాక్టర్లు తెలిపారు. దీంతో రమ్య చిన్నారితో పాటు తిరుపత్తూరు కలెక్టరేట్ చేరుకొని కలెక్టర్ భాస్కర పాండియన్ వద్ద వనతిపత్రం అందజేసి తనకు సాయం చేయాలని గత వారంలో వేడుకుంది. ఈ వీడియో వైరల్‌గా మారింది. ఈ నేపథ్యంలో సీఎంసీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారి సోమవారం ఉదయం మృతి చెందింది. దీంతో రమ్య ఒంటరిగా మిగిలింది.

గుండె చికిత్సలకు డిజిటల్ క్లినిక్

సాక్షి, చెన్నై: గుండె సంబంధిత సమస్యలు, గుండెపోటు, నివారణ చికిత్స నిమిత్తం డిజిటల్ హెల్త్ క్లీనిక్ ఏర్పాటు చేశామని లుపిన్ ఇండియా రీజియన్ ఫార్ములేషన్స్ అధ్యక్షుడు రాజీవ్ సిబల్ తెలిపారు. ఈ – క్లినిక్ డిజిటల్ సేవలను గురించి స్థానికంగా సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయన వివరించారు. దేశంలో 10 మిలియన్లకు పైగా ప్రజలు గుండె వైఫల్యం తదితర సమస్యలతో బాధ పడుతున్నారని పేర్కొన్నారు. వీరు పదేపదే ఆసుపత్రిలో చేరడం, గుండె సంబంధిత చికిత్సల వైఫల్యంతో మరణించడం జరుగుతోందని ఆవేదన వ్యక్తంచేశారు. ఇలాంటి సమస్యలను అధిగమించేందుకు వీలుగా డిజిటల్ హార్ట్ ఫెయిల్యూర్(హెచ్ఎఫ్) క్లినిక్‌ల అభివృద్ధి చేయాలనే కాంక్షతో తాము ఈ ప్రయత్నానికి శ్రీకారం చుట్టామన్నారు. ఈ డిజిటల్ హెల్త్ క్లినిక్‌లో అనుభవజ్ఞులైన వైద్యులు, ఇతర సిబ్బంది ఉంటారని, అధునాతన సాంకేతను కలిగి రోగులకు ఎప్పటికప్పుడు సంరక్షణ మార్గాలు, అత్యావసర సేవలు తదితర అన్ని రకాల అంశాలను విశదీకరిస్తూ అవగాహన కల్పిస్తారని వివరించారు.

అపూర్వ సమ్మేళనం

తమిళ సినిమా: పూర్వ విద్యార్థుల సమ్మేళనం నేటి యాంత్రిక జీవనంలో నూతనోత్సాహాన్ని ఇస్తుందనడంలో సందేహం లేదు. ఇక నటుడు ధనుష్ గురించి ఇప్పుడు ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం ఉండదు. చేతి నిండా చిత్రాలతో యమా బిజీగా ఉన్నారు. తమిళం, తెలుగు, హిందీ భాషల్లో నటిస్తున్నున్నారు. మరో వైపు దర్శకుడు తన 50వ చిత్రాన్ని తెరకెక్కించనున్నారు. ఇలా క్షణం తీరిక లేకుండా వర్క్ హాలిక్ మారిపోయారు. ఇటీవలే తాను కథానాయకుడిగా నటిస్తున్న కెప్టెన్ మిల్లర్ చిత్రాన్ని పూర్తి చేశారు. తాజాగా తన 50వ చిత్రం షూటింగ్ పనిలో మునిగి పోయారు. అలాంటిది అంత బిజీలోనూ ధనుష్ తన పాఠశాల సహా విద్యార్థులను చెన్నైకి పిలిపించి ఓ హోటల్‌లో రీయూనియన్ అయ్యారు. వారితో కలిసి పాఠశాలలో చదువుకునే రోజుల్లోని స్మృతులను పంచుకున్నారు. సహ విద్యార్థులతో కలిసి ముచ్చటించి వారితో ఫోటోలు దిగారు. ఇది ఏ రోజు జరిగిందో గానీ ఆ ఫోటోలు ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి.

స్కూల్ మేట్స్‌తో నటుడు ధనుష్



కోలీవుడ్ టాక్స్

డబ్బిచ్చి మరీ తప్పుడు ప్రచారం

చంద్రముఖి - 2 చిత్రంలో కంగనా రనౌత్



తమిళ సినిమా: బాలీవుడ్ సంచలన నటి కంగనా రనౌత్ మరోసారి వార్తల్లోకి ఎక్కారు. ఈమెను వివాదాలకు కేంద్ర బిందువు అంటారు. తాను విమర్శించ తలుచుకుంటే వారు ఎంతటి వారనే విషయాన్ని ఆమె పట్టించుకోరని అంటారు. ఈ విషయంలో సినిమా వారినే కాదు, రాజకీయవాదులను కూడా వదిలిపెట్టరు. అయితే నటిగా మాత్రం కంగనా రనౌత్‌ను వంకపెట్టలేం. ఈ బహుభాషా నటి నిర్మాత, దర్శకురాలు కూడా. ముఖ్యంగా తమిళంలో ధామ్ ధూమ్ చిత్రంతో ఎంట్రీ ఇచ్చిన ఈమె ఆ మధ్య దివంగత ముఖ్యమంత్రి జయలలిత బయోపిక్ తలైవి చిత్రంలో టైటిల్ పాత్రను పోషించి మెప్పించారు. తాజాగా పి.వాసు దర్శకత్వంలో లారెన్స్ కథానాయకుడిగా నటిస్తున్న చంద్రముఖి– 2 చిత్రంలో టైటిల్ పాత్రను పోషించారు. ఈ చిత్రం వచ్చే నెల తెరపైకి రావడానికి ముస్తాబు అవుతోంది. ఈమె పాత్రను బేస్ చేసుకునే చిత్రవర్గాలు ప్రచారం చేస్తుండటం విశేషం. కాగా నటి కంగనా రనౌత్ తాజాగా తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారంటూ ట్విట్టర్ ద్వారా విరుచుకు పడ్డారు. అందులో తనకు వ్యతిరేకంగా డబ్బిచ్చి మరీ కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారు అని ఆరోపించారు. తన చిత్రాల వసూళ్ల గురించి ఇలాంటి అవాస్తవాలే ప్రచారం చేస్తున్నారన్నారు. అయితే అలా చేసేవారి ఆత్మకు సంతృప్తి కలగాలని అన్నారు. రూ.150 కోట్లకు పైగా వసూలు చేసి రికార్డు సృష్టించిన తన చిత్రాలను ఫ్లాప్ అంటూ దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. దీని వెనుక ఒక పెద్ద మాఫియా ఉందని అన్నారు. ఇలాంచి సంకుచిత భావాలు వీరికి ఎలా వస్తాయో తెలియడం లేదన్నారు. ఇతరులు చెడ్డవారిగా చిత్రీకరించడానికి రాత్రింబవళ్లు ఆలోచించి డబ్బులు వృథా చేస్తున్నారని నటి కంగనా రనౌత్ పేర్కొన్నారు.



నటి ఆండ్రియా

నా జీవితంలో అంతకు మించి

తమిళ సినిమా: బోల్డ్ అండ్ బ్యూటిఫుల్ నటి ఆండ్రియా. తమిళనాడుకు చెందిన ఆంగ్లో ఇండియన్ కుటుంబంలో పుట్టిన ఈమెకు చిన్నతనం నుంచి సంగీతంపై మక్కువ. ఆండ్రియా పియానో వాయిద్య కళాకారిణి. ఇక ఈమె న్యాయవాది అన్న విషయం చాలా మందికి తెలియదు. అదేవిధంగా నటిగా కంటే కూడా గాయనిగా ముందు సినీ రంగ ప్రవేశం చేశారు. గాయనిగా గుర్తింపు పొందిన తర్వాత పచ్చైక్కిళి ముత్తుచ్చారం చిత్రంతో కథానాయకిగా రంగ ప్రవేశం చేశారు. ఆ తర్వాత మంగాత్తా, విశ్వరూపం, తరమణి, వడచెన్నై అంటూ పలు చిత్రాల్లో పలు రకాల పాత్రలు పోషించి ప్రేక్షకులను మెప్పించారు. మలయాళం, తమిళం, తెలుగు తదితర భాషల్లో నటిస్తూ బహుభాషా నటిగా రాణిస్తున్నారు. 36 ఏళ్ల ఈ అవివాహిత భామ ఇప్పటికీ నటిగా గాయనిగా బిజీగా ఉన్నారు. కాగా ఇటీవల పుష్ప చిత్ర తమిళ్ వెర్షన్లో ఊ అంటావా మామ పాటను పాడి ఆ పాటకు ఇక్కడ కూడా క్రేజ్ తెచ్చిపెట్టింది ఈమెనే. అయితే వ్యక్తిగతంగా ఈమె పలు విమర్శలను ఎదుర్కొన్నారు. ఇటీవల దర్శకుడు వెట్రిమారన్ నిర్మించిన అనల్ మేల్ పణితులి చిత్రంలో ఆండ్రియా అర్థ నగ్నంగా నటించారనే విమర్శలు ఎదుర్కొన్నారు. దీనిపై ఇటీవల ఒక భేటీలో స్పందించిన ఆండ్రియా నిజమే ఆ చిత్రంలో ఒక సన్నివేశంలో నటిస్తున్నప్పుడు తనకే చాలా బిడియంగా అనిపించిందని అన్నారు. అయితే నిజ జీవితంలో తనకు ఇంతకు మించిన సంఘటనలను జరిగాయని పేర్కొన్నారు. కాగా ప్రస్తుతం ఈమె పిశాచి 2, మాలిగై, నో ఎంట్రీ, బాబి ఆంటోనీ చిత్రం అంటూ అరడజను చిత్రాలు చేస్తూ బిజీగా ఉన్నారు. అదేవిధంగా తెలుగులో సైంధవ్ చిత్రంలో ముఖ్యపాత్రను పోషిస్తున్నారు.

నటీనటులకు ప్రోత్సాహక అవార్డుల ప్రదానం

తమిళ సినిమా: మహా ఆర్ట్స్ నిర్వాహకులు అనురాధ జయరామన్, యునైటెడ్ ఆర్టిస్ట్ ఆఫ్ ఇండియా సంస్థ అధినేత కలైమామణి, డా.నెల్‌లై సుందర్ రాజన్ కలిసి వెళ్లితే రా బుల్లితెర ప్రోత్సహించే విధంగా చాలా కాలంగా అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. వీరికి పలువురు సినీ ప్రముఖులు అండగా నిలుస్తున్నారు. అదేవిధంగా ఆదివారం సాయంత్రం స్థానిక వడపళని, కమరస్ కాలనీలోని శిఖరం హాల్లో ఈ అవార్డుల కార్యక్రమాన్ని అత్యంత వేడుకగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చెన్నై హైకోర్టు మాజీ న్యాయమూర్తి ఎస్కే. కృష్ణన్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ వేదికపై ఆయన పలువురు సినీ కళాకారులకు అవార్డులను ప్రధానం చేసి అభినందించారు. ఇందులో నటుడు కరికాలన్, నటి సుకన్య పళనీ వెల్, సాయి రోహిణి, షాను తదితరులు అవార్డులను అందుకున్నారు. ఈ సందర్భంగా వారు తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ నిర్వాహకులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కోడంబాక్కం శ్రీ, డాక్టర్ వెంకటేశన్ తదితరులు అతిథులుగా పాల్గొన్నారు. ముందుగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి.

అవార్డుల ప్రదానోత్సవంలో నిర్వాహకులు



కుల వివక్షకు కారణం రాజకీయ నాయకులే



తమిళ్ కుడిమగన్ చిత్ర ఆడియో ఆవిష్కరణలో అతిథులు

తమిళ సినిమా: నటుడు, దర్శకుడు చేరన్ చాలా గ్యాప్ తరువాత కథానాయకుడిగా నటించిన చిత్రం తమిళ్ కుడిమగన్. నటి శ్రీ ప్రియాంక, దర్శకుడు ఎస్ఏ చంద్రశేఖర్, లాల్, వేల రామమూర్తి, దీపిక్ష, అరుళ్ దాస్, రవి మరియా తదితరులు ముఖ్య పాత్రలు పోషించిన ఈ చిత్రాన్ని లక్ష్మీ క్రియేషన్స్ పతాకంపై ఇస్సక్కీ కార్వానన్ స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. శ్యామ్. సీఎస్ సంగీతాన్ని అందించిన ఈ చిత్రం నిర్మాణ కార్యక్రమాలను పూర్తి చేసుకుని త్వరలో విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా చిత్ర ఆడియో ట్రైలర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని సోమవారం ఉదయం స్థానిక వడపళనిలోని కమలా థియేటర్లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నటుడు శరత్ కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని చిత్ర ఆడియోను ఆవిష్కరించగా దర్శకుడు అమీర్, తంగర్ బచ్చన్, మారి సెల్వరాజ్, నటుడు పొన్ వన్నన్ తొలి ప్రతిని అందుకున్నారు. ఈ సందర్భంగా చిత్ర దర్శక, నిర్మాత ఇస్సక్కీ కార్వానన్ మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో భగ్గుమంటున్న కుల చిచ్చు ఇతివృత్తంతో రూపొందించిన చిత్రం తమిళ్ కుడిమగన్ అని చెప్పారు. ఇది చిత్రం కాదు పాఠం అని పేర్కొన్నారు. నటుడు శరత్ కుమార్ మాట్లాడుతూ కుల విభేదాలను కారణం రాజకీయాలేనని పేర్కొన్నారు. మనిషి పుట్టినప్పుడు తన కులమేమిటన్నది తెలియదన్నారు. అదేవిధంగా పాఠశాల దేశంలో, కళాశాల దేశంలోనూ అందరూ కలిసి మెలిసి ఆడుకుంటారు. రాజకీయాల్లోకి ప్రవేశించిన తరువాత కుల, మత భేదాలు తలకెక్కుతాయన్నారు. కుల వివక్షత రూపుమాపడానికి వేరే రాజకీయం ఉందన్నారు. అదే సమానత్వం అనీ దాని కోసం అందరూ పాటు పడాలని అన్నారు. తాను రాజకీయ నాయకుడినేననీ, సమానత్వం కోసమే తాను భవిష్యత్తు కార్యక్రమాలు ఉంటాయని శరత్ కుమార్ అన్నారు. ఈ చిత్రం మంచి విజయాన్ని సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు.

క్లుప్తంగా

ముఖ్య ప్రాంతాల్లో గస్తీ పెంపు

కొరుక్కుపేట: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా చెన్నైలో అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు అప్రమత్తమయ్యారు. పోలీస్ కమిషనర్ సందీప్ రాయ్ రాథోడ్ ఆదేశాల మేరకు నగరవ్యాప్తంగా వాహనాల తనిఖీలు ముమ్మరం చేశారు. రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు ద్విచక్ర వాహనాలు, కార్లు తదితర వాహనాలను పలుచోట్ల సోదాలు చేశారు. దీంతో పాటు హోటళ్లు, హాస్టళ్లలో తనిఖీలు నిర్వహిస్తున్నారు. పాత నేరస్తులపై నిఘా ఉంచారు. పెరియమేడు, ఎగ్మోర్, తిరువల్లికేణిలో వాహనాల తనిఖీ ముమ్మరం చేశారు. అనుమానితుల వివరాలు, ఆధార్ నంబర్‌ను పరిశీలించారు.

రైల్వేస్టేషన్‌లో ముమ్మర తనిఖీలు



తిరువళ్లూరు రైల్వేస్టేషన్‌లో తనిఖీలు చేస్తున్న పోలీసులు

తిరువళ్లూరు: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నేపథ్యంలో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా ఉండేందుకు పోలీసులు తనిఖీలను ముమ్మరం చేశారు. జనసంచార ప్రాంతాలు, బస్‌స్టేషన్, రైల్వేస్టేషన్‌లలో అనుమానితుల బ్యాగులను క్షుణ్ణంగా పరిశీలించిన తరువాతే లోపలికి అనుమతించారు. రైల్వే భద్రత విభాగం ఇన్‌స్పెక్టర్ సెబాస్టియన్, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

గో సంరక్షణ ట్రస్ట్‌కు విరాళం



విరాళమిస్తున్న చెన్నైవాసులు

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలో గో సంరక్షణ ట్రస్ట్‌కు రూ.లక్ష విరాళాన్ని సోమవారం చెన్నైకు చెందిన శ్రీనివాస్, రాజేష్ ఆలయ అధికారులకు అందజేశారు. దాతలకు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి, స్వామివారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ రంగ స్వామి, ఇన్‌స్పెక్టర్ బాబు పాల్గొన్నారు.

నవ వరుడు ఆత్మహత్య

అన్నానగర్: తిరువారూర్ జిల్లా ముత్తుపేట సమీపంలోని కోవిలూరు శ్మశాన వాటిక సమీపంలో సోమవారం ఉదయం చెట్టుకు ఉరి వేసుకుని యువకుడు మృతి చెందాడు. దీంతో ప్రజలు ముత్తుపేట పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని యువకుడి మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం తిరుతురపూండి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు జరిపిన విచారణలో అతను ముత్తుపేట సమీపంలోని కోవిలూరు ఉత్తర అటవీ ప్రాంతానికి చెందిన మణికంఠన్ కుమారుడు సంతోష్ (20) అని తేలింది. మంగళూరుకు చెందిన ఓ అమ్మాయిని ప్రేమిస్తున్నాడు. దీంతో ఆ యువతి గర్భం దాల్చింది. పెళ్లికి నిరాకరించడంతో యువతి ముత్తుపేట పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆ తర్వాత పోలీసులు ఇరు కుటుంబాలను పిలిపించి రాజీ చేసి నెల క్రితం పెళ్లి చేశారు. ఈ క్రమంలో అతను సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

టింబర్ గోడౌన్‌లో అగ్నిప్రమాదం

తిరువొత్తియూరు: చెన్నై మనలి పుదునగర్ ప్రాంతంలో ఉన్న టింబర్ గోడౌన్‌లో చోటు చేసుకున్న అగ్ని ప్రమాదంలో రూ. 3 లక్షలు విలువైన కట్టెలు దగ్ధమయ్యాయి. వివరాలు.. చెన్నై మనలి పుదునగర్ ప్రాంతంలో వైద్య లింగం టింబర్ గోడౌన్ నిర్వహిస్తున్నాడు. ఇక్కడ భారీ స్థాయిలో కట్టెలను లారీలలో తరలించుటకు సిద్ధం చేశారు. ఈ క్రమంలో సోమవారం తెల్లవారుజామున ఈ కట్టెల గోడౌన్‌లో నిప్పు అంటుకుని మంటలు వ్యాపించాయి. ఈ పొగలు వల్ల స్థానికులకు ఊపిరి తీసుకోవడంలో ఇబ్బందులు పడ్డారు. మాధవరం మనాలి, కొలతూర్ నుంచి వచ్చిన ఏడు అగ్నిమాపక బృందాలు సుమారు రెండు గంటల సమయం పోరాడి మంటలను అదుపు చేశారు. ఈ ఘటనలో సుమారు మూడు లక్షలు విలువైన కలిగిన కట్టెలు దగ్ధమయ్యాయి. మనలి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఏకాంత వీడియోలు తీసి భార్యకు బెదిరింపులు

- భర్త సహా ఆరుగురిపై కేసు నమోదు

తిరువొత్తియూరు: ఏకాంతంగా ఉన్న సమయంలో వీడియో తీసి భార్యను బెదిరించిన భర్త, అతని తల్లి, తండ్రి సహా ఆరుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. మదురైలోని ముత్తుపట్టి కృష్ణానగర్‌కు చెందిన రాజ్ కమలేష్. ఇతని భార్య మదురై సౌత్ మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తన భర్త తనను నగ్నంగా వీడియో తీసి సెల్‌ఫోన్‌లో రికార్డు చేశాడని, ఇందుకు అతని స్నేహితులు శరత్, అతని భార్య లిల్లీ, తల్లి రతి ప్రియా, తండ్రి పళని, సహోదరీ రాజ్య తిలకం సహకరిస్తున్నట్లు ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ వీడియోను డిలీట్ చేయకుండా సామాజికమాధ్యమాల్లో పెడుతానని బెదిరించినట్లు వాపోయారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి కమలేష్, శరత్, లిల్లీ, రతిప్రియ, పళనిని అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం



ప్రభుత్వ భవనాలను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభిస్తున్న సీఎం స్టాలిన్

సాక్షి, చెన్నై: సచివాలయం నుంచి సీఎం ఎంకే స్టాలిన్ సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు ప్రారంభోత్సవాలు చేశారు. మరికొన్ని పనులకు శంకుస్థాపన చేశారు. సచివాలయంలో ఉదయం తొలుత తమిళాభివృద్ధి శాఖ నేతృత్వంలో ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఇందులో రచయిత మనన్నాని రచనలను జాతీయం చేశారు. ఇందుకు సంబంధించిన కాపీ రైట్‌లో భాగంగా ఆయన సతీమణి పార్వతీ అమ్మాల్‌కు రూ. 10 లక్షలు చెక్కును సీఎం అందజేశారు. ఈకార్యక్రమంలో మంత్రి స్వామినాథన్, సీఎస్ శివదాస్ మీన తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఉన్నత విద్యాశాఖ తరపున రూ.87.77 కోట్లతో విద్యా భవనాలను సీఎం స్టాలిన్ ప్రారంభించారు. ఇందులో తరగతి గదులు, ప్రయోగశాలలు, వసతి గృహాలు, రీసెర్చ్ సెంటర్, సెమినార్ హాల్స్, ల్యాబ్‌లు తదితర భవనాలు ఉన్నాయి. ఈ కారక్రమంలో ఉన్నత విద్యా శాఖ మంత్రి పొన్ముడి తదితరులు పాల్గొన్నారు. అలాగే దేవాదాయ శాఖ నేతృత్వంలో రూ.80 కోట్లతో నిర్మించనున్న కొత్త భవనాలు, కల్యాణ మండపాలు, భక్తులకు ఆలయాలలో అందించే వసతి సదుపాయాలకు సంబంధించిన పనులను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ మంత్రి శేఖర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

బీరకుప్పం సర్పంచ్‌కు అవార్డు



అబ్దుల్‌కలాం అవార్డుతో సత్కరిస్తున్న నిర్వాహకులు

తిరుత్తణి: పంచాయతీ నిర్వాహణలో ఉత్తమ సేవలందిస్తున్న బీరకుప్పం పంచాయతీ సర్పంచ్ పీసీ సుబ్రహ్మణ్యంరాజుకు డాక్టర్ అబ్దుల్‌కలాం అవార్డుతో సత్కరించారు. తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి యూనియన్ బీరకుప్పం పంచాయతీ సర్పంచ్‌గా పీసీ సుబ్రహ్మణ్యంరాజు వ్యవహరిస్తున్నారు. పంచాయతీలో రోడ్లు, తాగునీరు, విద్యుత్‌దీపాలు సహా కనీస సదుపయాలు కల్పించడంతో పాటు జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామ పంచాయతీలో మొక్కలు పెంచి పర్యావరణ పరిరక్షణకు విశేషంగా కృషి చేస్తున్నారు. అదే సమయంలో గ్రామీణ మహిళలకు ఉపాధి హామీ పథకం ద్వారా పనులు కల్పిస్తూ జీవనోపాధి కల్పిస్తున్నారు. ఈ క్రమంలో ఉత్తమ పంచాయతీ సేవలకు గుర్తింపుగా గ్లోబల్ అచ్చీవర్స్ అకాడమీ ద్వారా ఉత్తమ సేవలకు గుర్తించి అబ్దుల్‌కలాం అవార్డుకు ఎంపిక చేసింది. చెన్నైలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో నిర్వాహకులు అవార్డుతో సత్కరించారు.

టాస్మాక్ దుకాణాలను తొలగించాలని వినతి



సహాయ కలెక్టర్ మధుసూదనన్‌కు సమస్యలు వివరిస్తున్న వళ్లిమాపురం వాసు

తిరుత్తణి: తిరుత్తణి శివార్లలోని టాస్మాక్ మద్యం దుకాణాలు తొలగించాలని సహాయ కలెక్టర్‌కు స్థానికులు డిమాండ్ చేశారు. వివరాలు.. స్థానిక అరక్కోణం రోడ్డు మార్గంలో కార్తికేయపురం పంచాయతీలోని వళ్లిమాపురం వద్ద రెండు టాస్మాక్ దుకాణాలున్నాయి. ఆ దుకాణాల్లో మద్యం కొనుగోలు చేస్తున్న మందుబాబులు రోడ్డు, అక్కడున్న పాఠశాల ప్రాంగణాల వద్ద వీరంగం సృష్టిస్తున్నట్లు తెలిసింది. దీంతో గ్రామీణులు, మహిళలు, విద్యార్థులు ఇబ్బందులు చెందుతున్నట్లు జిల్లా కలెక్టర్, ఆర్డీఓకు పది రోజుల కిందట పంచాయతీ సర్పంచ్ ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు. ఈక్రమంలో సహాయ కలెక్టర్ మధుసూదనన్ సోమవారం టాస్మాక్ దుకాణాల వద్ద తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా స్థానికులు సహాయ కలెక్టర్‌ను కలుసుకుని సమస్యలను వివరించారు. తహసీల్దారు మదన్, ఆర్‌ఐ కమల్ పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన

కొరుక్కుపేట: ఆలయాల్లో రూ. 80.56 కోట్లతో చేస్తున్న అభివృద్ధి పనులకు సీఎం స్టాలిన్ సచివాలయం నుంచి విర్చువల్ విధానం ద్వారా శంకుస్థాపన చేశారు. చెన్నై ట్రిప్లికేన్‌లోని పార్థసారథిస్వామి ఆలయం వద్ద రూ. 8.37 కోట్లతో అపార్ట్‌మెంట్ నిర్మాణం, మైలాపూర్ కపాలీశ్వరర్ ఆలయంలో రూ.1.25 కోట్లతో అన్నదాన సత్రం, నాగపట్నం, కృష్ణగిరి జిల్లా హోసూరులో రూ.1.07 కోట్లతో చీకాల్‌లోని నవనీతేశ్వర స్వామి ఆలయం వద్ద వాణిజ్య సముదాయ నిర్మాణం, కోయంబత్తూరు జిల్లా తేకంబట్టిలోని వనభద్ర కాళియమ్మన్ ఆలయంలో రూ. 14.50 కోట్లతో అభివృద్ధి పనులను చేయనున్నారు. హిందూ ధర్మాదాయశాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు, ప్రధాన కార్యదర్శి శివదాస్ మీనా, ధర్మాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ మణివాసన్, హిందూ మత ధర్మాదాయశాఖ ప్రత్యేక మిషన్ అలువలర్ జె.కుమారగురుపరన్, కమిషనర్ మురళీధరన్, అదనపు కమిషనర్ శంకర్ పాల్గొన్నారు.

తిరువళ్లూరు రైల్వేస్టేషన్-బస్‌స్టేషన్ మధ్య బస్సులు



నూతన సర్వీసును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజేంద్రన్

తిరువళ్లూరు: దాదాపు మూడేళ్ల క్రితం నిలిచిపోయిన రైల్వేస్టేషన్-బస్‌బస్టాండ్ మధ్య బస్సు రాకపోకలను తిరువళ్లూరు ఎమ్మెల్యే వీజీ రాజేంద్రన్ ప్రత్యేక చొరవతో సోమవారం ఉదయం నుంచి పునఃప్రారంభమయ్యాయి. తిరువళ్లూరు రైల్వేస్టేషన్ నుంచి వేర్వేరు ప్రాంతాలకు వేలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో రైల్వేస్టేషన్ నిత్యం రద్దీగా ఉంటుంది. అయితే రైల్వేస్టేషన్ నుంచి బస్టాండ్ మధ్య గతంలో ఉన్న బస్సు సర్వీసును మూడేళ్ల క్రితం నిలిపివేశారు. దీంతో ప్రయాణికులు ఆటోలపైనే ఆధారపడి రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే ప్రయాణికుల రద్దీ పెరగడంతో ప్రయాణికుల వద్ద ఆటో డ్రైవర్లు చార్జీలను ఎక్కువగా వసూలు చేయడం ప్రారంభించారు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో బస్సు సర్వీసులను పునః ప్రారంభించాలని ఎమ్మెల్యేకు పలువురు వినతి పత్రం సమర్పించారు. స్పందించిన ఎమ్మెల్యే రవాణా శాఖ ఉన్నత అధికారులతో మాట్లాడి బస్సు సర్వీసును పునరుద్ధరించడానికి చర్యలు తీసుకున్నారు. ఇందులో భాగంగానే రైల్వేస్టేషన్-బస్‌స్టేషన్ వరకు నూతన సర్వీసును పచ్చజెండా ఊపి ప్రారంభించారు. కాగా రోజుకు 82 సర్వీసులను ఈ మార్గంలో నడపనున్నారు. ప్రతి 30 నిమిషాలకు బస్సు సర్వీసు అందుబాటులోకి రానుంది. మహిళలకు ఉచిత ప్రయాణం ఉంటుందని అధికారులు తెలిపారు.

యువకుడిపై పోక్సో కేసు

తిరువొత్తియూరు: బాలికను గర్భవతిని చేసిన యువకుడిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. వివరాలు.. తిరుపూర్ జిల్లా పల్లడానికి చెందిన బాలిక (16) విషం తాగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. దీంతో తల్లిదండ్రులు ఆమెను ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం తిరుపూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ బాలికకు చికిత్స అందిస్తున్న సమయంలో ఆమె గర్భవతి అని తెలిసింది. దీని గురించి తల్లిదండ్రులు పల్లడం మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేయగా, పల్లడంకు చెందిన దామోదరన్ (23) బాలికతో పరిచయం పెంచుకుని మాయమాటలు చెప్పి గర్భవతిని చేసినట్లు తెలిసింది. దీంతో దామోదర్‌ను పోలీసులు పోక్సో చట్టం కింద అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచి జైలుకు తరలించారు.

చార్జ్‌షీట్ నకలు కోసం సెంథిల్ పిటిషన్

సాక్షి, చెన్నై : ఈడీ దాఖలు చేసిన చార్జ్‌షీట్ నకలు కోసం చెన్నై జిల్లా మొదటి మేజిస్ట్రేట్ కోర్టులో మంత్రి సెంథిల్ బాలాజీ సోమవారం పిటిషన్ దాఖలు చేశారు. మంత్రి సెంథిల్ బాలాజీ వద్ద ఈడీ విచారణ ముగిసిన విషయం తెలిసిందే. తమ అదుపులో ఉన్న ఆయన సోదరుడు అశోకన్ వద్ద ఈడీ విచారణ జరుగుతోంది. ఈ పరిస్థితుల్లో చెన్నై కోర్టులో 3 వేల పేజీలో కూడిన చార్జ్‌షీట్‌ను ఈడీ దాఖలు చేసింది. ఇందులో పేర్కొన్న వివరాలు, సమాచారం గురించి తెలుసుకునేందుకు సెంథిల్ తరపు న్యాయవాదులు ప్రయత్నాలు మొదలెట్టారు. ఇందులో భాగంగా సోమవారం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

పోలీసులమని నమ్మించి రూ.3.5 లక్షలతో పరారీ

తిరువొత్తియూరు: చెన్నైలోని చూలైమేడు ప్రాంతానికి చెందిన ప్రభాకరరావు (44) అన్నానగర్‌లోని ఓ ప్రైవేట్ కార్యాలయంలో విదేశీ కరెన్సీ చేంజర్‌గా పనిచేస్తున్నాడు. దీని కార్యాలయ శాఖలు అన్నానగర్, పల్లవరం, క్రోంపేటలో ఉన్నాయి. ఆదివారం ప్రభాకరరావు ఎగ్మూరు రైల్వే స్టేషన్‌లో డబ్బులు తీసుకుని బైక్‌పై బయలుదేరాడు. అన్నానగర్‌కు రాగానే ప్రభాకరరావును వెంబడిస్తూ బైక్‌పై వచ్చిన ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు తాము అన్నానగర్ పోలీసులమని తెలిపారు. అనుమానం ఉందని బైక్‌ను తనిఖీ చేశారు. అతని బ్యాగ్‌లో ఉన్న రూ.3.5 లక్షలను తీసుకుని అన్నానగర్ పోలీస్ స్టేషన్ వెళుతున్నామని, అక్కడికి వచ్చి విచారణ తరువాత డబ్బులు అప్పగిస్తామని వెళ్లారు. దీంతో ప్రభాకర రావు అన్నానగర్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి విచారించగా నగదు తీసుకున్న వాళ్లు పోలీసులు కాదని తెలిసింది. దీంతో అన్నానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటన జరిగిన ప్రాంతంలోని నిఘా కెమెరాను పరిశీలించగా.. ఇద్దరు వ్యక్తులు డబ్బులు దోచుకుంటున్నట్లు తెలిసింది. ప్రభాకర రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అన్నానగర్ క్రైం డివిజన్ ఇన్‌స్పెక్టర్ జయచంద్రన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

దొంగ నోట్ల ముఠా అరెస్ట్

అన్నానగర్: మేట్టూరు సమీపంలో అప్పులు తీర్చేందుకు రూ.200 నోట్ల కలర్ ప్రింట్లు తీసుకుని చెలామణి చేసిన ముగ్గురిని పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. సేలం జిల్లా మేట్టూరులోని కావేరి నగర్‌కు చెందిన కాజా మైదీన్ (38) మెట్టూరులోని 3 చోట్ల ఫ్యాన్సీ దుకాణాలు నడుపుతున్నాడు. చాలా అప్పులు చేశాడు. అప్పు తీర్చాలని ప్లాన్ చేశాడు. ధర్మపురి నుంచి తన బంధువు అబ్దుల్‌హకీమ్ (24)ని మెట్టూరుకు తీసుకొచ్చాడు. అతనికి సాయం చేసేందుకు కరూర్ కు చెందిన ఉబైస్ అలీ(24)ని కూడా తీసుకొచ్చాడు. మెట్టూరులోని చతురంగ్ గడిలోని తన ఫ్యాన్సీ దుకాణంలో కలర్ ప్రింటర్ అమర్చి సెల్‌ఫోన్ యాప్ ద్వారా రూ.200 నోట్లను కాపీ చేశాడు. అవి మేట్టూరు అంతటా చెలామణిలో చేశాడు. సోమవారం కాజామైదీన్ కలర్ ప్రింటర్ చేసిన 3 రెండు వందల రూపాయల నోట్లను ఉబైస్ అలీకి ఇచ్చి చికెన్ కొనమని పంపించాడు. రాజగణపతి నగరంలోని అన్నాదురై మాంసం దుకాణంలో చికెన్ కొనుగోలు చేసిన అబ్దుల్ హకీం.. మూడు 200 రూపాయల నోట్లను అన్నాదురైకి ఇచ్చాడు. ఆ మూడు పేపర్లు నకిలీ కరెన్సీ నోట్లని తెలుసుకొని కేకలు వేయడంతో పబ్లిక్ అబ్దుల్ హకీమ్‌ని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. పోలీసులు అతడిని విచారించగా.. కలర్ ప్రింటర్ ద్వారా రూ.200 నోట్లను కాపీ చేసి చెలామణిలోకి తెచ్చినట్లు తేలింది. అనంతరం ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసిన పోలీసులు కరెన్సీ నోట్లను కాపీ చేయడానికి ఉపయోగించిన కలర్ ప్రింట్ ఉపయోగించిన వారిని అరెస్టు చేశారు. సెల్‌ఫోన్లు, నకిలీ 200 రూపాయల నోట్లను స్వాధీనం చేసుకుని తనిఖీలు నిర్వహిస్తున్నారు.

అన్నాడీఎంకే నేతల ఆందోళన

తిరువొత్తియూరు: ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ వైఖరిని నిరసిస్తూ పుదుచ్చేరిలో సోమవారం అన్నాడేంకే నాయకులు ఆందోళన చేశారు. 1989 అసెంబ్లీలో దివంగత మాజీ ముఖ్యమంత్రి జయలలితపై దాడి జరిగిందని అన్నాడీఎంకే ఆరోపణలు చేస్తున్న సమయంలో ఆమెపై దాడి జరగలేదని ఆమె నాటకం ఆడారని ముఖ్యమంత్రి స్టాలిన్ పేర్కొన్నారు. దీనిని నిరసిస్తూ పుదుచ్చేరిలో సోమవారం అన్నాడీఎంకే నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. అన్నాడీఎంకే రాష్ట్ర కార్యదర్శి అన్బలగన్ నేతృత్వం వహించారు.

విజ్ఞాన నగర నిర్మాణానికి వ్యతిరేకత



కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించడానికి వచ్చిన రైతులు

- భూములు ఇవ్వబోమని కలెక్టర్‌కు రైతుల స్పష్టీకరణ

తిరువళ్లూరు: ఊత్తుకోట తాలుకా పరిధిలో విజ్ఞాన నగరం నిర్మించడానికి వేలాది ఎకరాల వ్యవసాయ భూముల సేకరణకు ప్రభుత్వం కొత్తగా ఇచ్చిన జీఓను వెనక్కు తీసుకోవాలని లేనిపక్షంలో ఆందోళనకు దిగుతామని రైతులు హెచ్చరించారు. ఇదే విషయంపై కలెక్టర్ ఆల్బీజాన్‌వర్గీష్‌కు వినతి పత్రం సమర్పించారు. తిరువళ్లూరు జిల్లా ఊత్తుకోట తాలుకా పరిధిలో తమిళనాడు నాలెడ్జ్ నగరాన్ని నిర్మించడానికి ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నగరం కోసం కల్పట్టు, ఏనంబాక్కం, మేల్‌మాలిగపట్టు, సెంగాత్తుకుళం, ఏర్నాకుప్పం, తదితర గ్రామాల్లోని వేలాది ఎకరాల భూసేకరణ జరపాలని జీఓ 148ను ప్రభుత్వం జారీ చేసింది. అయితే ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల ద్వారా వేలాది ఎకరాల వ్యవసాయ భూములు నష్టపోయే ప్రమాదం ఉందని రైతులు వాపోయారు. సోమవారం ఉదయం కలెక్టర్ ఆల్బీజాన్‌వర్గీష్‌కు వినతి పత్రం సమర్పించారు. అనంతరం వ్యవసాయ సంఘం నేత సంపత్ మాట్లాడుతూ.. తిరువళ్లూరు జిల్లాలో రోడ్డు విస్తరణ, శాటిలైట్ సిటీ, పరిశ్రమల స్థాపన కోసం ఇప్పటికే మూడు పంటలు పండే వ్యవసాయ భూములను ధారాదత్తం చేసి రైతులు రోడ్డున పడ్డారని వాపోయారు. వరిసాగులో తిరువళ్లూరు ఆశించిన స్థాయిలో ఉందని.. అయితే ప్రస్తుతం నాలెడ్జ్ నగరానికి వేలాది ఎకరాలు సేకరించాలని ప్రభుత్వం నిర్ణయించడం సరికాదన్నారు. ప్రస్తుతం తమ ప్రాంతంలో 30 నుంచి 50 అడుగుల్లో నీరు వస్తుందని అలాంటి భూములను ప్రభుత్వం బలవంతంగా తీసుకోవాలని చూడడం సరికాదన్నారు. నాలెడ్జ్ నగర నిర్మాణం చేయడానికి వ్యవసాయానికి పనికిరాని భూములను సేకరించాలని సూచించారు. రైతుల నుంచి బలవంతంగా భూములను లాక్కోవాలని చూస్తే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

గ్రీవెన్స్‌డేకు 268 వినతులు



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆల్బీజాన్‌వర్గీష్

తిరువళ్లూరు: కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఉదయం నిర్వహించిన గ్రీవెన్స్‌డేకు 268 వినతులు వచ్చినట్లు కలెక్టర్ ఆల్బీజాన్‌వర్గీష్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు గ్రీవెన్స్‌డే నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. ఇందులో ఇంటి పట్టాల కోసం 89 వినతులు, ఉపాధి -29, ప్రాథమిక అవసరాలు-43, పక్కా గృహాల కోసం 69 వినతులు సహా మొత్తం 268 వినతులు వచ్చాయి.. వీటిని విచారించి పరిష్కరించాల్సిందిగా ఆయా శాఖలకు చెందిన అధికారులను ఆదేశించారు. సమావేశంలో డీఎస్‌ఓ జవహర్‌భేగం, ఆదిద్రావిడ సంక్షేమశాఖ అధికారి సెల్వరాణి, డిప్యూటీ కలెక్టర్‌లు మధుసూదనన్, గాయత్రిసుబ్రమణ్యం, వికలాంగుల సంక్షేమశాఖ అధికారి శ్రీనివాసన్ పాల్గొన్నారు.

డీఎంకే కౌన్సిలర్ దారుణ హత్య

అన్నానగర్: మద్యం తాగొద్దని చెప్పినందుకు డీఎంకే కౌన్సిలర్‌ను కొడవలితో నరికి చంపిన ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. నెల్‌లై జిల్లా పాలయంకోట కేటీసీ నగర్ సమీపంలోని కీలానంతం వడకూర్‌కు చెందిన నారాయణన్ కుమారుడు రాజామణి (30). కీలనంతం పంచాయతీ డీఎంకే కౌన్సిలర్‌గా వ్యవహరిస్తున్నాడు. అతని తోబుట్టువులు మేకలు మేపుతున్నారు. కుటుంబానికి సహాయంగా అతను అప్పుడప్పుడు మేకలను కూడా మేపేవాడు. ఈయన భార్య సుడలైవడివు (25). ఆదివారం సాయంత్రం 4 గంటల సమయంలో వెల్లిమలై బస్టాప్ సమీపంలోని ఔట్ పోస్ట్ వెనుక ఉన్న పొలాల్లో మేకలను మేపేందుకు రాజామణి వెళ్లాడు. అప్పుడు ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి రాజామణిని కొడవలితో నరికి పరారయ్యారు. కేకలు విన్న స్థానికులు అతన్ని హుటాహుటిన నెల్‌లై ప్రభుత్వ వైద్య కళాశాల ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. పోలీసులు సీసీటీవీ ఫుటేజీని పరిశీలించారు. ఇందులో కీళనంతం పాషార్‌కు చెందిన ఇసకి పాండి(25), కీళనంతం మేలూరుకు చెందిన మాయాండి హత్యకు పాల్పడ్డారని తేలింది. పోలీసులు వారిద్దరినీ అరెస్టు చేశారు. విచారణలో మా ప్రాంతంలో మద్యం తాగొద్దని చెప్పడంతో హత్య చేసినట్లు తెలిసింది.

అప్పారావు సేవలు వెలకట్టలేనివి



జయంతి వేడుకల్లో అతిథులు, నిర్వాహకులు

కొరుక్కుపేట: మానవతా సుగంధాల మల్లెపువ్వు ఆచార్య గంధం అప్పారావు అని వక్తలు వ్యాఖ్యానించారు. మద్రాసు విశ్వ విద్యాలయం తెలుగుశాఖ ఆధ్వర్యంలో సాహితీవేత్తల జయంత్యుత్సవాలను పురస్కరించుకుని మానవతా సుగంధాల మల్లెపూవు ఆచార్య గంధం అప్పారావు జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలుగుశాఖ అతిథి ఉపన్యాసకులు పాండురంగం కాళియప్ప స్వాగతం పలికారు. శాఖాధిపతి ఆచార్య విస్తాలి శంకరరావు అధ్యక్షత వహించారు. గంధం అప్పారావు గారికి తెలుగుశాఖకుఎంతో అనుబంధం ఉందని పేర్కొన్నారు. 100 ఏళ్ల పూర్తి చేసుకోనున్న తెలుగుశాఖ వికాసంలో అప్పారావు పాత్ర కీలకమైందిగా పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా శ్రీకన్యకా పరమేశ్వరి మహిళా విశ్వవిద్యాలయం ప్రిన్సిపల్ మోహనశ్రీ మాట్లాడుతూ.. గంధం అప్పారావు సాహిత్య సేవలను సంస్కరిస్తూ జయంతి వేడుకలతో నివాళిని సమర్పించడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. ప్రముఖ కవి కాసల నాగభూషణం అప్పారావు సేవలను వివరించారు. తెలుగుశాఖ అతిథి ఉపన్యాసకులు శంకరబాబు పాల్గొన్నారు.

తమిళనాడు అబ్బాయి.. ఇథియోపియా అమ్మాయి

- హిందూ సంప్రదాయం ప్రకారం ఒక్కటైన జంట



పెళ్లి పీటలపై వధూవరులు

కొరుక్కుపేట: ఇథియోపియా అమ్మాయితో సేలం అబ్బాయి హిందూ సంప్రదాయం ప్రకారం తాళికట్టి పెళ్లి చేసుకున్నాడు. సోమవారం జరిగిన ఈ వేడుక మంగళ వాయిద్యాల నడుమ అంగరంగ వైభవంగా సాగింది. సేలం జిల్లా అత్తూర్ సమీపంలోని కల్పగనూర్ గ్రామానికి చెందిన సెల్లదురై కుట్టి మార్క్స్(32), ముంబై యూనివర్సిటీలో 5 సంవత్సరాలుగా అసోసియేట్ ప్రొఫెసర్, పరిశోధకుడిగా పనిచేస్తున్నారు. తనతో పనిచేసిన ఇథియోపియన్ అసోసియేట్ ప్రొఫెసర్ రియార్ మెన్‌బారే అక్లీలతో ప్రేమలో పడ్డాడు. ఆ తర్వాత ఇద్దరూ పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. దీనిపై వారి తల్లిదండ్రులను సంప్రదించారు. సెల్లదురై కుట్టిమార్క్ హిందూ సంప్రదాయం ప్రకారం పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. దీనికి అతని తల్లిదండ్రులు కూడా అంగీకరించారు. దీంతో పెత్తనాయకన్‌పాళయంలోని హిందూ కల్యాణ మండపంలో వీరి వివాహ వేడుక జరిగింది. బంధువుల సమక్షంలో చెల్లదురై కుట్టి మార్క్స్, మెన్‌బారే అక్లీ మెడలో తాళి కట్టి పెళ్లి చేసుకున్నారు. ఈ వివాహానికి పలువురు హాజరై వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు.

భక్తి పారవశ్యం.. అఖండ పారాయణం

తిరుమల: ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని శ్రీవారిని ప్రార్థిస్తూ తిరుమల నాదనీరాజనం వేదికపై సోమవారం ఉదయం 7 నుంచి 9 గంటల వరకు రెండో విడత అయోధ్యకాండ అఖండ పారాయణం భక్తిపారవశ్యంగా సాగింది. అయోధ్యకాండలోని 4 నుంచి 8 సర్గల వరకు గల 174 శ్లోకాలను పారాయణం చేశారు. యోగవాశిష్టం, ధన్వంతరి మహామంత్రం కలిపి 25 శ్లోకాలు కలిపి మొత్తం 199 శ్లోకాలను పారాయణం చేశారు. వేద పండితులు అఖండ పారాయణం చేయగా పలువురు భక్తులు భక్తిభావంతో వారిని అనుసరించారు. ధర్మగిరికి చెందిన ప్రఖ్యాత పండితులు రామానుజాచార్యులు ప్రతి శ్లోకం ప్రాముఖ్యతను వివరించారు. అనంత వేణుగోపాల్ శ్లోక పారాయణం చేశారు. అఖండ పారాయణంలో ధర్మగిరి వేద పాఠశాల, ఎస్వీ వేద విశ్వవిద్యాలయం అధ్యాపకులు, ఎస్వీ ఉన్నత వేద అధ్యాయన సంస్థకు చెందిన వేద పారాయణదారులు, రాష్ట్రీయ సంస్కృత విశ్వవిద్యాలయానికి చెందిన పండితులు పాల్గొన్నారు. అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారుడు శ్రీనివాస్ బృందం 'రాముని భజన సేయవే ఓ మనసా..', 'రామ రామ శ్రీరామ దశరథ రామ..' నామ సంకీర్తనను ఆలపించారు. టీటీడీ అధికారులు, పండితులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

తొలి దశ కౌన్సెలింగ్‌లో 3,688 ఎంబీబీఎస్ సీట్ల భర్తీ

సాక్షి, అమరావతి: ఎంబీబీఎస్ 2023–24 విద్యా సంవత్సరం సీట్ల భర్తీ ప్రక్రియను డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం చేపడుతోంది. తొలి దశ ఆన్‌లైన్ కౌన్సెలింగ్‌లో భాగంగా 3,688 కన్వీనర్ కోటా సీట్లను భర్తీ చేశారు. సీట్ల కేటాయింపు జాబితాను సోమవారం విడుదల చేశారు. ప్రత్యేక కేటగిరీ సీట్లతో కలిపి 3,856 సీట్లు తొలి దశ కౌన్సెలింగ్‌కు పరిగణలోకి తీసుకోగా, 115 సీట్లు ఖాళీగా ఉన్నాయి. విద్యార్థులు తమకు సీట్లు కేటాయించిన కళాశాలల్లో ఈ నెల 19వ తేదీ సాయంత్రం మూడు గంటల లోపు రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. ఈ గడువు ముగిసిన అనంతరం మిగిలిన సీట్ల భర్తీకి రెండో దశ కౌన్సెలింగ్ చేపట్టనున్నారు.

'గీతం' ఆక్రమణలను ఎందుకు ప్రశ్నించలేదు?

- పవన్‌ను నిలదీసిన కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు

సాక్షి, అమరావతి: విశాఖలోని రుషికొండ వద్ద ప్రభుత్వ నిర్మాణాల గురించి జనసేననేత పవన్‌కళ్యాణ్ కనీస అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషగిరి ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ నేత లోకేశ్ తోడల్లుడికి చెందిన గీతం యూనివర్సిటీ రుషికొండకు సమీపంలోనే చేసిన కబ్జాలపై ఎందుకు నోరు మెదపలేదని పవన్‌ను నిలదీశారు. విశాఖ యాత్రలో పవన్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై అడపా శేషు సోమవారం తాడేపల్లిలో మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేస్తున్న వలంటీర్లను దండుపాళ్యం బ్యాచ్ అని పవన్ కళ్యాణ్ మాట్లాడటం దారుణమన్నారు.

రాష్ట్రాన్ని ఎయిడ్స్ రహితంగా తీర్చిదిద్దేందుకు కృషి

- ఏపీశాక్స్ పీడీ కుమార్ లఖింశెట్టి



సాక్షి, అమరావతి: ఎయిడ్స్ రహిత రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దేందుకు శాయశక్తులా కృషి చేస్తానని ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ (ఏపీశాక్స్) ప్రాజెక్ట్ డైరెక్టర్ (పీడీ) డాక్టర్ ఎస్బీఆర్ కుమార్ లఖింశెట్టి చెప్పారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని ఏపీశాక్స్ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం ఆయన పీడీగా బాధ్యతల్ని స్వీకరించారు. ఆయుష్ కమిషనర్‌గా వ్యవహరిస్తోన్న కుమార్‌కు ఏపీశాక్స్ పీడీగా పూర్తి అదనపు బాధ్యతలిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. కుమార్ మాట్లాడుతూ ఏపీ శాక్స్ పనితీరును మెరుగుపర్చేందుకు కార్యాచరణను సిద్ధం చేస్తామన్నారు. విజయవాడ జీజీహెచ్‌లోని ఐసీటీసీ, ఏఆర్టీ సెంటర్లను పరిశీలించి అక్కడి సేవలపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఏపీడీ కోటేశ్వరి, జేడీలు కామేశ్వర ప్రసాద్, సుబ్రమణ్యం రెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ పాలనలోనే ఉర్దూ అకాడమీలో అక్రమాలు

- రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్‌కలీమ్



మదనపల్లె: టీడీపీ పాలనలోనే ఉర్దూ అకాడమీలో అక్రమాలు జరిగాయని ప్రస్తుత ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్ చెప్పారు. ఉర్దూ అకాడమీ సేవలు, ఉర్దూ భాషాభివృద్ధిపై ఎల్లో మీడియా, మైనార్టీ సంఘాల ముసుగులో కొందరు ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. సోమవారం మదనపల్లెలో ఆయన మీడియాతో మాట్లాడారు. టీడీపీ పాలనలో ఉర్దూ అకాడమీని భ్రష్టు పట్టించారని, నిధులు స్వాహా చేశారని గుర్తుచేశారు. సీఐడీ విచారణ కూడా జరుగుతోందని చెప్పారు. తమ హయాంలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థతో ఎంవోయూ చేసుకుని.. విడతకు 30 మంది చొప్పున కంప్యూటర్ శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలోని 36 ఉర్దూ అకాడమీ కంప్యూటర్ శిక్షణా కేంద్రాలు, గ్రంథాలయాలు ఇప్పటికీ పనిచేస్తున్నాయని, ఏ ఒక్క సెంటర్ కూడా మూతపడలేదన్నారు. వీటికి రెండేళ్లుగా అద్దె బకాయిలు ఉన్నట్లు ఆరోపించడం దారుణమన్నారు.

రాష్ట్ర ఆర్థికస్థితికి సీఎం కారణం: యనమల

సాక్షి, అమరావతి: రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దేశంలోని రాష్ట్రాల్లో 11వ స్థానానికి పడిపోవడానికి సీఎం జగన్ వైఖరే కారణమని టీడీపీ నేత యనమల రామకృష్ణుడు విమర్శించారు. రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోతోందని నాలుగేళ్లుగా ఏకరవు పెడుతున్నా ప్రతిపక్షాలపై విరుచుకుపడటం తప్ప ఏమాత్రం దిద్దుబాటు చర్యలు తీసుకోలేదని ఆయన సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డాయిష్ బ్యాంకు ముఖ్య ఆర్థికవేత్త కౌశిక్ దాస్ చేసిన సర్వేపై వైఎస్సార్‌సీపీ నేతలు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. ఏపీ కంటే తక్కువ వనరులున్న తెలంగాణ ఆర్థికస్థితి ఎంతో మెరుగ్గా 4వ స్థానానికి వృద్ధి చెందిందని తెలిపారు. రాష్ట్రం వెనకబడటానికి సీఎం చేతగానితనమే కారణమని పేర్కొన్నారు. ఆర్థికలోటు, పన్నుల ఆదాయం, అప్పులు, జీఎస్డీపీ కేటగిరీల్లో రాష్ట్రం చాలా దారుణమైన స్థితిలో ఉందని, రాష్ట్ర రెవెన్యూ నుంచి దాదాపు రూ.30 వేల కోట్లు వడ్డీల చెల్లింపులకే వెచ్చించాల్సిన పరిస్థితి దాపురించిందని విమర్శించారు.

పద్మావతి... సూపర్ క్రియేటివిటీ!



సేమియాపై వందేమాతరం

టూత్ స్టిక్‌పై సారేజహాసే అచ్ఛా

సృజనాత్మకత ఉండాలే కానీ సృష్టిలోని ప్రతీ వస్తువును కళాత్మకంగా మలచవచ్చునని నిరూపించింది విజయవాడకి చెందిన కారుమూరి మౌల్య పద్మావతి. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా దారపు పోగుపై జాతీయ గీతం జనగణమన, సేమియా పై వందేమాతరం, టూత్ పిక్‌పై సారే జహాసె అచ్ఛా గీతాలను చిత్రీకరించింది. విజయవాడ పాతబస్తీకి చెందిన మౌల్య కేబీఎన్ కళాశాలలో ఇంటర్ చదువుతోంది. – విజయవాడ కల్చరల్

'మొక్క'వోని దేశభక్తి

స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని తూర్పు గోదావరి జిల్లా కడియంపల్ల వెంకన్న నర్సరీలో మొక్కల కూర్పుతో దేశభక్తిని చాటారు. గ్లోబల్ వార్మింగ్‌ను అధిగమించేందుకు 'పచ్చదనాన్ని ప్రేమించాలి' అనే సందేశంతో ఈ మొక్కల ఆకృతిని ఏర్పాటు చేశారు. – కడియం




సీతాకోక చిలుకైన త్రివర్ణ పతాకం



అనకాపల్లి జిల్లా, మాకవరపాలెం మండలంలోని తూటిపాలకు చెందిన మైక్రో రైటర్ రవికుమార్ స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆవ, తోటకూర గింజలతో సీతాకోక చిలుక ఆకారంలో జాతీయ జెండాను రూపొందించారు. – మాకవరపాలెం(అనకాపల్లి జిల్లా)

ఆరుబయట ఉంటే తడవదా!?

వర్షాకాలంలో బొగ్గు తడిగా ఉండటం సహజం



- దేశవ్యాప్తంగా ఏటా ఈ సీజన్‌లో బొగ్గు కొరత
- ఇప్పుడూ అదే పరిస్థితితో తగ్గిన ఉత్పత్తి
- జెన్‌కోల అధికారులతో బొగ్గు శాఖ సమీక్షలు
- ఆ తర్వాతే కేటాయింపులు
- ప్రస్తుతం రాష్ట్రంలో ఎక్కడా విద్యుత్ కోతల్లేవు
- వాస్తవాలు ఎంత చెప్పినా మారని 'ఈనాడు' తీరు.. అదే పనిగా అబద్ధాలతో విషప్రచారం
- 'సాక్షి'కి వాస్తవాలు వెల్లడించిన రాష్ట్ర విద్యుత్ సంస్థలు



ఫ్యాక్ట్ చెక్

సాక్షి, అమరావతి: కనీవినీ ఎరుగని రీతిలో విద్యుత్ డిమాండ్ పెరగడంతోపాటు రకరకాల ప్రతికూల పరిస్థితులు నెలకొన్నప్పటికీ రాష్ట్రవ్యాప్తంగా నిరంతరాయంగా విద్యుత్ సరఫరాకు సంస్థలు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకున్నాయి. ఇందులో భాగంగానే ఆదివారం రాష్ట్రంలో ఎక్కడా కోతల్లేకుండా విద్యుత్ సరఫరా చేశాయి. అయినా, 'విద్యుత్ ఉత్పత్తి లేదు.. కోతలే!' అంటూ సోమవారం 'ఈనాడు' మళ్లీ ఓ అసత్య కథనాన్ని వండివార్చింది. వాస్తవ పరిస్థితులను అధికారులు ఎన్నిసార్లు వివరించినా పెడచెవిన పెట్టి, విద్యుత్ సంస్థల మనోస్థైర్యాన్ని దెబ్బతీసేలా, ప్రజలను ఆందోళనకు గురిచేసేలా తప్పుడు ప్రచారాన్ని కొనసాగిస్తోంది. ఈ నేపథ్యంలో పచ్చపత్రిక తీరుపై విద్యుత్ సంస్థలు తీవ్రంగా మండిపడ్డాయి. ఈ మేరకు డిస్కంలు, ఏపీ జెన్‌కో 'సాక్షి'కి వాస్తవాలు వెల్లడించాయి. ఆ వివరాలు..

'కోత' లేకుండా సరఫరా..

ఇక ఏటా జూన్ మొదటి వారంలో నైరుతి రుతుపవనాల రాకతో ఎగువ రాష్ట్రాల్లో వర్షాలు కురవడంతో జూలై లేదా ఆగస్టు నెలల్లో కృష్ణా బేసిన్‌లోకి నీరు రావడంవల్ల జల విద్యుదుత్పత్తి ప్రారంభమయ్యేది. అలాగే, ఇది గాలుల సీజన్ అయినందున పవన విద్యుత్ అధికంగా వస్తుంది. అయితే, ఈ ఏడాది ఇందుకు పూర్తి భిన్నమైన పరిస్థితి ఉంది. ఇలాంటి అనూహ్య పరిస్థితులతో ఏర్పడ్డ విద్యుత్ కొరత కారణంగా రెండు మూడ్రోజులు అక్కడక్కడా స్వల్ప అంతరాయాలు ఏర్పడ్డాయి. కానీ, ప్రజలకు అసౌకర్యం కలగకుండా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయడానికి వెంటనే అన్ని రకాల చర్యలు తీసుకున్నాయి. దీంతో ఆదివారం ఏపీఈపీడీసీఎల్ పరిధిలో 91.097, ఏపీసీపీడీసీఎల్ పరిధిలో 48.842, ఎస్పీడీసీఎల్ పరిధిలో 89.445 కలిపి మొత్తం 229.384 మిలియన్ యూనిట్ల విద్యుత్ డిమాండ్ ఏర్పడినా ఎక్కడా కోతలేకుండా ఆ మేరకు విద్యుత్‌ను రాష్ట్ర గ్రిడ్ నుంచి డిస్కంలు సరఫరా చేశాయి. గతేడాది ఇదే రోజు విద్యుత్ వినియోగం 200.138 మిలియన్ యూనిట్లు కాగా ఈ ఏడాది డిమాండు ఊహించని విధంగా 29.146 మిలియన్ యూనిట్లు అధికంగా ఉంది. అయినా, రాష్ట్రంలో లభిస్తున్న విద్యుత్‌కు అదనంగా బహిరంగ మార్కెట్‌లో రూ.30.137 కోట్లు వెచ్చించి 50.621 మిలియన్ యూనిట్లు కొనుగోలు చేసి మరీ విద్యుత్ సమకూర్చాయి. ముందస్తు ప్రణాళికతో ఉత్పత్తి చేయడంతో పాటు ఇలా కొనుగోళ్లు చేస్తుండటంవల్లే కోతల్లేకుండా నిరంతరాయ విద్యుత్ సరఫరా సాధ్యమైంది. వాస్తవాలిలా ఉంటే.. విద్యుత్ సరఫరా చేయకుండా డిస్కంలు చేతులెత్తేశాయని పచ్చ పత్రిక నానా యాగీచేసింది.

వర్షాకాలంలో సర్వసాధారణం

వర్షాకాలంలో థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో తడిసిన బొగ్గు వినియోగించడం సర్వసాధారణంగా జరిగేదే. ఇప్పుడే, ఈ ఏడాదే ఇది కొత్తగా జరుగుతున్నది కాదు. బొగ్గును ఆరుబయట స్టాక్ ఉంచడంవల్ల వానకు తడుస్తుంది. అందువల్ల బొగ్గులో నీటిశాతం ఎక్కువ ఉంటుంది. అంతమాత్రానికే 'థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన బొగ్గును ముందస్తుగా నిల్వచేయడంలో ఏపీ జెన్‌కో అధికారులు విఫలమయ్యారంటూ 'ఈనాడు' గగ్గోలు పెట్టడం సరికాదు. నిజానికి.. దేశవ్యాప్తంగా బొగ్గు కొరత ఉంది. అందువల్లే కేంద్ర ఇంధన, బొగ్గు మంత్రిత్వ శాఖల అధికారులు వారంలో రెండు మూడ్రోజులు జనరేషన్ సంస్థల అధికారులతో వీడియో కాన్ఫరెన్సులు నిర్వహిస్తూ కేటాయింపులు చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ కేటాయింపుల ప్రకారమే ఆయా బొగ్గు గనుల నుంచి ఉత్పత్తికి అంతరాయం లేకుండా ఏపీ జెన్‌కో బొగ్గు తెచ్చుకుంటోంది. ప్రస్తుతం వీటీపీఎస్, ఆర్టీపీపీలో రెండ్రోజులు, కృష్ణపట్నంలో పది రోజులు, హిందూజాలో మూడ్రోజులకు సరిపడా బొగ్గు నిల్వలున్నాయి.



మురిసిన వెయ్యి అడుగుల మువ్వన్నెల జెండా

స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని అనకాపల్లి జిల్లా దేవరాపల్లిలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక ఆధ్వర్యంలో వెయ్యి అడుగుల జాతీయ పతాకంతో సోమవారం భారీ ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, అధికారులు పాల్గొన్నారు. - దేవరాపల్లి

మారణహోమానికే టీడీపీ నేతల దాడి

- ముందస్తు ప్రణాళికతోనే అంగళ్లు నుంచి పుంగనూరు వరకు విధ్వంసం
- హైకోర్టుకు నివేదించిన అదనపు ఏజీ సుధాకర్‌రెడ్డి
- విచారణ బుధవారానికి వాయిదా
- అప్పటి వరకు పిటిషనర్లపై చర్యలు తీసుకోవద్దని ఏఏజీకి న్యాయమూర్తి మౌఖిక ఆదేశాలు

సాక్షి, అమరావతి: మారణహోమం సృష్టించాలన్న ముందస్తు పక్కా ప్రణాళికతోనే అన్నమయ్య జిల్లా అంగళ్లు వద్ద తెలుగుదేశం పార్టీ నేతలు, కార్యకర్తలు దాడికి పాల్పడ్డారని పోలీసుల తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డి హైకోర్టుకు నివేదించారు. అందులో భాగంగానే పోలీసులకు కూడా చెప్పకుండా టీడీపీ అధినేత చంద్రబాబు ప్రయాణ మార్గాన్ని కూడా మార్చారని వివరించారు. పోలీసుల నుంచి ఓ మార్గానికి అనుమతి తీసుకుని, మరోమార్గంలో రావడంవెనుక కుట్ర ఉందన్నారు. టీడీపీ అగ్రనేతల ఆదేశాలతో ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు అధికార పార్టీ కార్యకర్తలపై దాడులు చేశారని, అంగళ్లు నుంచి పుంగనూరు వరకు విధ్వంసం సృష్టించారని తెలిపారు. అడ్డుకోబోయిన పోలీసులపైనా విచక్షణారహితంగా దాడి చేశారన్నారు. టీడీపీ దాడిలో దాదాపు 47 మంది పోలీసులు గాయపడి చికిత్స పొందుతున్నారని, ఓ పోలీసు ఏకంగా కంటి చూపు కోల్పోయారని వివరించారు. అధికార పార్టీ కార్యకర్తలను చూడగానే ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు 'వాళ్లను తరమండిరా, వేసేయండిరా..' అంటూ టీడీపీ కార్యకర్తలను ఉసిగొల్పారన్నారు. ఆయన ఆదేశాలతోనే వారు విధ్వంసం సృష్టించారన్నారు. పోలీసులు రాకుండా ఉంటే వారిచేతిలో పలువురు చనిపోయి ఉండేవారని వివరించారు. కార్యకర్తలను రెచ్చగొట్టినందుకే చంద్రబాబు, ఇతర నేతలపై హత్యాయత్నం కేసు కూడా నమోదు చేశామన్నారు. 'యుద్ధభేరి' పేరుతో ప్రాజెక్టుల సందర్శన కోసం వచ్చి అంగళ్లు నుంచి పుంగనూరు వరకు యుద్ధ వాతావరణం సృష్టించారని, వారు చేయాలనుకున్నది చేసి చూపారని చెప్పారు. ఇలాంటి ఘటనలను, ఇందుకు బాధ్యులైన వారిని న్యాయస్థానాలు ఉపేక్షించకూడదని కోరారు. అంగళ్లు వద్ద టీడీపీ దాడులపై చంద్రబాబు సహా పలువురు టీడీపీ నేతలపై ముదివీడు పోలీసులు కేసులు నమోదు చేశారు. ఈ కేసుల్లో ముందస్తు బెయిల్ కోరుతూ టీడీపీ సీనియర్ నేతలు దేవినేని ఉమామహేశ్వరరావు, నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి, పులివర్తి నాని వేర్వేరుగా దాఖలు చేసిన వ్యాజ్యాలపై జస్టిస్ కంచిరెడ్డి సురేష్‌రెడ్డి సోమవారం విచారణ జరిపారు.

ఉపయోగపడే ప్రాజెక్టును అడ్డుకోవద్దని కోరితే చంపేస్తారా?

ఈ సందర్భంగా ఏఏజీ సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. పలు గ్రామాల ప్రజలకు అత్యంత ఉపయుక్తమైన పిచ్చివాండ్లపల్లి ప్రాజెక్టును అడ్డుకునేందుకు కొందరు టీడీపీ నేతలు హైకోర్టులో స్టే తెచ్చారని, దీనిపై నిరసన తెలిపి, చంద్రబాబుకు వినతిపత్రం ఇచ్చేందుకు స్థానిక అధికార పార్టీ నేతలు అంగళ్లు వద్ద శిబిరం ఏర్పాటు చేసుకున్నారని తెలిపారు. అక్కడికి రాగానే అధికార పార్టీ నేతలను చూసిన చంద్రబాబు ఆగ్రహంతో ఊగిపోతూ, వారిని తరమండి, కొట్టండి, వేసేయండి అంటూ కార్యకర్తలను రెచ్చగొట్టారని వివరించారు. అక్కడినుంచి విధ్వంసం మొదలైందన్నారు. మొదటి ముద్దాయి చంద్రబాబును ఎందుకు అరెస్ట్ చేయలేదని న్యాయమూర్తి ప్రశ్నించగా.. విధ్వంసంతో సంబంధం ఉన్న వారందరినీ అరెస్టు చేస్తామని సుధాకర్‌రెడ్డి చెప్పారు. పిటిషనర్ ఉమా సైతం అధికార పార్టీ నేతలను బెదిరించేలా వారి వైపు వేలు చూపుతూ వారిని కొట్టండంటూ టీడీపీ కార్యకర్తలను రెచ్చగొట్టారన్నారు. ప్రతిపక్ష నేతలు వస్తున్నారని తెలిసీ, అధికార పార్టీ నేతలు అక్కడికి ఎందుకు వెళ్లారని న్యాయమూర్తి ప్రశ్నించగా.. ప్రజలకు ఉపయుక్తమైన ప్రాజెక్టును అడ్డుకోవద్దని విజ్ఞప్తి చేయడానికే వెళ్లారని, వినతిపత్రం ఇవ్వడానికి సిద్ధమైనంత మాత్రానా చంపేస్తారా అంటూ సుధాకర్‌రెడ్డి ప్రశ్నించారు.

రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే కేసు

అంతకుముందు దేవినేని ఉమా తరఫు సీనియర్ న్యాయవాది పోసాని వెంకటేశ్వర్లు వాదనలు వినిపిస్తూ, ఫిర్యాదుదారు ఉమాపతిరెడ్డికి ఎలాంటి గాయాలు కాలేదన్నారు. ఉమాపై ఎలాంటి ప్రత్యక్ష ఆరోపణలు లేవని, రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే కేసు నమోదు చేశారన్నారు. మరింత మంది నేతలను ఇరికించేందుకే కేసు నమోదులో జాప్యం చేశారన్నారు. నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి తరఫు న్యాయవాది ఎన్వీ సుమంత్ వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్‌పై ఎలాంటి ఆరోపణలు లేవని, ఉద్దేశపూర్వకంగానే కేసు నమోదు చేశారని అన్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి జస్టిస్ సురేష్‌రెడ్డి ఏఏజీ అభ్యర్థన మేరకు విచారణను బుధవారానికి వాయిదా వేశారు. అప్పటి వరకు పిటిషనర్లను అరెస్ట్ చేయవద్దని, ఆ మేర పోలీసులకు సూచన చేయాలని సుధాకర్‌రెడ్డికి న్యాయమూర్తి మౌఖికంగా చెప్పారు.

విజన్-2047 పేరిట చంద్రబాబు కొత్త మోసం

- స్వయం ప్రకటిత దార్శనికుడు చంద్రబాబు
- రుషికొండలో ఎలాంటి అక్రమాలు జరగలేదు
- వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని



మహారాణిపేట (విశాఖ దక్షిణ): విజన్-2047 పేరుతో చంద్రబాబు మరో కొత్త మోసానికి తెర తీశారని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని ధ్వజమెత్తారు. విశాఖ కేజీహెచ్‌లో సుమారు రూ.60 లక్షల వ్యయంతో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవానికి సోమవారం మంత్రి విడదల రజిని హాజరయ్యారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. చంద్రబాబు తనకు తానే ఒక దార్శనికుడిగా ప్రకటించుకుంటున్నారని, ఆయన స్వయం ప్రకటిత దార్శనికుడు అనే విషయం రాష్ట్ర ప్రజలందరికీ తెలుసని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న మంచి చంద్రబాబుకు కనిపించదు, వినిపించదని దుయ్యబట్టారు. చంద్రబాబు సూచనల మేరకే పవన్ కళ్యాణ్ పర్యటనలు చేస్తున్నారని మంత్రి చెప్పారు. రుషికొండపై గతంలో ఎంత విస్తీర్ణంలో భవనాలు ఉన్నాయో.. అదే విస్తీర్ణంలో ఇప్పుడు భవనాలు నిర్మిస్తున్నారని స్పష్టం చేశారు. కోర్టు ఉత్తర్వులను అమలు చేస్తూనే భవనాల నిర్మాణం కొనసాగుతోందని చెప్పారు. ప్రభుత్వ భూమిలో ప్రభుత్వ భవనాలు కట్టడంలో తప్పు ఏముంటుందో చెప్పాలని డిమాండ్ చేశారు.

వైద్య, ఆరోగ్య రంగంలో సరికొత్త విప్లవం

వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయిన నాటినుంచి ఆంధ్రప్రదేశ్ వైద్య విభాగం స్వరూపం పూర్తిగా మారిపోయిందని మంత్రి రజిని తెలిపారు. ఏకంగా రూ.3,820 కోట్లతో రాష్ట్రంలోని 11 ప్రభుత్వ మెడికల్ కళాశాలలు, టీచింగ్ ఆస్పత్రులను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. సుమారు రూ.8,500 కోట్లతో రాష్ట్రంలో కొత్తగా 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలలు నిర్మిస్తున్నామన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు గ్రామస్థాయి నుంచి అందాలనే లక్ష్యంతో ఏకంగా రూ.16 వేల కోట్లకు పైగా నిధులతో అన్ని స్థాయిల్లో ఆస్పత్రులను జగనన్న అభివృద్ధి చేస్తున్నారని వివరించారు. ఉత్తరాంధ్రకు వెన్నెముకలాంటి కేజీహెచ్‌ను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఏకంగా రూ.79 కోట్లతో ఆస్పత్రి అవసరాలకు పరికరాలు కొనుగోలు చేశామని చెప్పారు. రూ.500 కోట్లతో నాడు-నేడు కింద కేజీహెచ్‌ను అభివృద్ధి చేస్తున్నామన్నారు. రూ.12 కోట్లతో ఎమ్మార్ స్కానింగ్‌ను సమకూర్చామని చెప్పారు. రూ.46 కోట్లతో క్యాన్సర్ విభాగాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, కలెక్టర్ మల్లికార్జునరావు పాల్గొన్నారు.

చిక్కిన చిరుత

- డీఎన్‌ఏ పరీక్షలు నిర్వహిస్తాం.. బాలికను చంపింది ఇదేనని తేలితే జూపార్కుకు తరలిస్తాం
- రాష్ట్ర అటవీ శాఖ అడిషనల్ పీసీసీఎఫ్ శాంతి ప్రియ పాండే వెల్లడి




తిరుమల/తిరుపతి మంగళం: శేషాచలం అడవుల్లో టీటీడీ అటవీ శాఖ, రాష్ట్ర అటవీ శాఖ సంయుక్తంగా ఏర్పాటు చేసిన బోనులో సోమవారం తెల్లవారుజామున చిరుత చిక్కుకుంది. నెల్లూరు జిల్లాకు చెందిన లక్షిత(6) అనే బాలికపై వన్యమృగం బలి తీసుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో వన్యమృగం దాడికి పాల్పడిన శేషాచల అటవీ ప్రాంతంలోని అలిపిరి–తిరుమల నడక మార్గంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం, ఘంటా మండపం మధ్య మూడు బోన్లను ఉంచారు. సోమవారం వేకువజామున ఒక బోనులో మగ చిరుత చిక్కింది. ఆ చిరుత వయసు ఐదేళ్లకు పైగా ఉంటుందని అటవీ అధికారులు నిర్ధారించారు. టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి, టీటీడీ డీఎఫ్‌వో శ్రీనివాస్ చిరుతను పట్టుకున్న ప్రదేశాన్ని సందర్శించారు. అనంతరం చిరుతను ఎస్వీ జూ పార్కుకు తరలించారు. శ్రీవారి దర్శనార్థం తిరుమల శేషాచలం అటవీ ప్రాంతం గుండా వెళ్లే అలిపిరి, తిరుమల శ్రీవారి మెట్టు మార్గంలో క్రూర మృగాల నుంచి భక్తులకు ఇబ్బందులు లేకుండా రక్షణ కల్పిస్తామని టీటీడీ ఈవో ధర్మారెడ్డి చెప్పారు. భక్తులు ప్రశాంతంగా తిరుమలకు చేరుకునేలా చర్యలు తీసుకోవాలని అటవీ శాఖను కోరామన్నారు.

ఆ చిరుతకు డీఎన్‌ఏ పరీక్షలు

రాష్ట్ర అటవీ శాఖ అడిషనల్ పీసీసీఎఫ్ శాంతి ప్రియ పాండే ఎస్వీ జూ పార్క్‌లో సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. తిరుమల నడక దారిలో చిన్నారి లక్షితపై చిరుత దాడి చేయడం వెనుక చంపి తినాలన్న ఉద్దేశం ఉండదని, చిరుత వెళుతుండగా బాలిక అటుగా రావడంతో అది దాడి చేసినట్టు తెలుస్తోందన్నారు. ప్రస్తుతం పట్టుబడిన చిరుత బాలికను చంపిందా లేదా అనేది డీఎన్‌ఏ పరీక్షల ద్వారా తేలుస్తామన్నారు. ఒకవేళ బాలికను చంపింది ఇదే చిరుత అని తేలితే ఎస్వీ జూకే పరిమితం చేస్తామన్నారు. జంతువుల కదలికలు తెలుసుకోవడానికి, వాటిని నియంత్రించడానికి తిరుమల కనుమ దారిలో పూర్తి పరికరాలతో కూడిన వైల్డ్‌లైఫ్ చెక్‌పోస్ట్‌ను ఏర్పాటు చేస్తామని, ఇందుకోసం టీటీడీ సహకారం కోరామని చెప్పారు. అలాగే మరిన్ని సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. కాలిబాట ఎస్వీ నేషనల్ పార్క్ పరిధిలో ఉందని, దీని పరిధిలో 20 నుంచి 30 వరకు చిరుత పులులు ఉన్నాయని చెప్పారు. వీటిని నియంత్రించేందుకు నడక దారికి ఇరువైపులా కంచెలు ఏర్పాటు చేసినా ప్రయోజనం ఉండదన్నారు. అయితే భక్తులు, ప్రజాసంఘాల వినతుల మేరకు కంచె నిర్మాణంపై నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. జంతువుల కదలికలు ఉన్న చోట వెలుతురు బాగా ఉండేలా ఫ్లడ్‌లైట్లు ఏర్పాటు చేయాలని టీటీడీకి సూచించామన్నారు.

భక్తుల రక్షణే ప్రధాన ధ్యేయం

- అటవీశాఖ సిబ్బందితో ప్రత్యేక భద్రత
- రక్షణ కోసం భక్తులకు చేతికర్ర అందిస్తాం
- టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి



తిరుపతి సిటీ: తిరుమల వచ్చే శ్రీవారి భక్తుల ప్రాణరక్షణే తమ ప్రధాన ధ్యేయమని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి పేర్కొన్నారు. సోమవారం తిరుపతిలోని పద్మావతి అతిథి గృహంలో మీడియాతో మాట్లాడుతూ.. చిరుత దాడిలో గతంలో కౌశిక్ గాయపడటం, ఇటీవల చిన్నారి లక్షిత ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా టీటీడీ అప్రమత్తమై అటవీ శాఖ అధికారులు, పోలీసులతో కలసి కొన్ని నిర్ణయాలు తీసుకున్నామని తెలిపారు. అలిపిరి, శ్రీవారి మెట్టు నడక మార్గాల్లో 12 ఏళ్ల వయసులోపు పిల్లలతో వచ్చే భక్తులకు ఉదయం 5 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. పెద్దలను మాత్రం రాత్రి 10 వరకు అనుమతిస్తామని తెలిపారు. నడక దారిలో వెళ్లే ప్రతి భక్తునికి సహకారం కోసం ఊత కర్ర అందిస్తామన్నారు. ఘాట్ రోడ్డులో ద్విచక్ర వాహనాలను ఉదయం 6 నుంచి సాయంత్రం 6గంటల వరకు మాత్రమే అనుమతిస్తామని చెప్పారు. భక్తులను గుంపులుగా వెళ్లేందుకు అనుమతిస్తూ.. ముందు వెనుక అటవీశాఖ సెక్యూరిటీతో భద్రత కల్పిస్తామన్నారు.. అటవీశాఖ అధికారులు నిపుణులైన భద్రతా సిబ్బందిని నియమించుకోవాలని సూచించామని.. వారి వేతనాలు టీటీడీయే భరిస్తుందన్నారు.

జంతువులకు ఆహారం అందించడం నిషేధం

నడక దారిలో వెళ్లే భక్తులు సాధు జంతువులకు ఆహారం అందించడం నిషేధించామని, అలా అందించే వారిపై చర్యలు తప్పవని కరుణాకర్‌రెడ్డి పేర్కొన్నారు. నడక దారిలోని దుకాణదారులు, హోటళ్ల యజమానులు వ్యర్థాలను బయట వేయరాదని, అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తిరుపతి నుంచి తిరుమల వరకు నడకమార్గంలో సుమారు 500 కెమెరాలను అమర్చనున్నామని, అవసరమైతే డ్రోన్ వ్యవస్థను ప్రవేశపెట్టనున్నట్టు పేర్కొన్నారు. వైల్డ్‌లైఫ్ అవుట్ పోస్టులు 24 గంటలు పనిచేస్తాయని, డాక్టర్లు సైతం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. దారి పొడవునా సుమారు 30 అడుగుల వరకు వెలుతురు ఉండేలా ఫోకస్ లైట్లు అమర్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అలిపిరి భూదేవి కాంప్లెక్స్, శ్రీవారి మెట్టు వద్ద 15వేల దివ్య దర్శనం టోకెన్లు జారీ చేస్తున్నామని, మధ్యలో వీటిని తనిఖీ చేయాల్సిన అవసరం లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. టోకెన్లు పొందిన భక్తులు రోడ్డు మార్గాన సైతం వెళ్లేందుకు అనుమతిస్తామని తెలిపారు. ఫెన్సింగ్ ఏర్పాటుపై అటవీ అధికారులతో చర్చించామని.. కేంద్ర అటవీశాఖ ఉన్నత స్థాయి కమిటీ వేసి అధ్యయనం చేసిన తర్వాత నిర్ణయం ఉంటుందన్నారు.

ఆగస్టు 15

ఆమె... దేశంలో సగం ఎప్పుడు!?

స్వాతంత్య్ర దినోత్సవం దేశ ఔన్నత్యాన్ని మాట్లాడుతుంది. దేశ ఉజ్వల భవిష్యత్తును కాంక్షిస్తుంది. కాని దేశంలో సగమైన స్త్రీలు సంపూర్ణ స్వాతంత్య్ర ఫలాలు ఇంకా పొందవలసే వుంది. ఏనాడైతే స్త్రీల పట్ల సురక్షితమైన, సంస్కారవంతమైన ప్రవర్తనను ఈ సమాజం చూపుతుందో అప్పుడే స్త్రీలకు సంపూర్ణ స్వాతంత్య్రం వచ్చినట్టు. అప్పుడే దేశ ఔన్నత్యం ఇనుమడించినట్టు. 'ఆకాశంలో సగం'లాగా దేశంలో సగం ఇంకెప్పుడు?



నేడు ఆగస్టు 15న ఎర్రకోట మీద జెండా ఎగురవేసే సమయంలో ప్రధాని నరేంద్ర మోడీకి ఇద్దరు మహిళా ఆర్మీ ఆఫీసర్లు సహకారం అందిస్తారు. మేజర్ నికితా నాయర్, మేజర్ జాస్మిన్ కౌర్ పతాకావిష్కరణ సమయంలో ప్రధానితో పాటుగా ఉండి జెండా వందనం సమర్పిస్తారు. ఈ విశేష ఘట్టంలో ఇద్దరు మహిళలకు ఈ విధంగా చోటు దక్కడం సంతోషపడాల్సిన సంగతి. 76 ఏళ్ల క్రితం స్వాతంత్య్రం వచ్చిన నాటి నుంచి నేటి వరకు స్త్రీల స్థితిగతుల్లో వచ్చిన పురోభివృద్ధికి ఇదీ ఒక సంకేతమే. నాటి నుంచి నేటి వరకు విద్య, ఉపాధి, ఉద్యోగం, సైన్యం, పాలనా యంత్రాంగం, శాసన వ్యవస్థ... వీటిల్లో స్త్రీలకు గణనీయంగా స్థానం దక్కింది. ప్రాముఖ్యం లభించింది. అయితే అంతమాత్రాన స్త్రీలు సంపూర్ణంగా స్వాతంత్య్ర ఫలాలు అనుభవిస్తున్నారా అనేది ప్రశ్న.

స్త్రీల త్యాగం

దాస్య భారతంలో జరిగిన స్వాతంత్య్ర పోరాటంలో ఎందరో స్త్రీలు పాల్గొన్నారు. అన్నింటికి మించి పురుషులు దేశం కోసం ప్రాణాలు అర్పించినా, జైళ్ల పాలైనా స్త్రీలు ధైర్యంగా ఇళ్లు నడిపి కష్టాలను ఈదారు. దేశ విభజన సమయంలో తీవ్ర హింసను ఎదుర్కొన్నారు. అంతెందుకు 1930 నాటికి దేశ వ్యాప్తంగా 30 వేల మంది స్త్రీలు స్వాతంత్య్ర పోరాటంలో ఏదో విధాన జైలు శిక్ష అనుభవిస్తున్నారని తెలిస్తే ఆశ్చర్యం వేస్తుంది. ఈ స్త్రీల పోరాటం చాలామటుకు చరిత్రలో నమోదు కాకుండానే కాలగర్భంలో కలిసిపోయింది. ఇప్పుడిప్పుడే నాటి వీర వనితల గాథలు వెలికి వస్తున్నాయి. ఇంత పోరాటం, త్యాగం చేసి స్త్రీల భాగస్వామ్యంతో తెచ్చుకున్న స్వాతంత్య్రంలో స్త్రీలు నిజంగా సంతోషంగా ఉన్నారా?

సురక్షితం కాని దేశం

'ఒక స్త్రీ అర్ధరాత్రి క్షేమంగా నడిచి వెళ్లినప్పుడే ఈ దేశానికి నిజమైన స్వాతంత్య్రం వచ్చినట్టు' అని గాంధీజీ ఏ ముహూర్తంలో అన్నారో కాని అలాంటి స్థితి నేటికీ రాకపోగా నానాటికీ తీసికట్టుగా తయారవుతోంది. ఎన్ని చట్టాలు చేసినా, శిక్షలు తెచ్చినా స్త్రీలను గౌరవించాలి, వారి ఆత్మగౌరవాన్ని కాపాడాలి అని మెజారిటీ సమాజం అనుకోవడం లేదు. 'నస్త్రీ స్వాతంత్య్ర మర్హతి' అనే భావన సమాజంలో ఆది కాలం నుంచి చొప్పించి ఉండటం వల్ల స్త్రీ చేసే ప్రతి పనిలో తప్పు ఎంచడం, అదుపు చేయడం, చులకనగా చూడటం, వివక్ష చూపడం, దండించడం ఆనవాయితీగా మారింది. పిల్లల పెంపకం దశ నుంచే స్త్రీలను గౌరవించడం నేర్పించడం లేదు. ఇంట్లో అమ్మాయిని ఒకలాగా, అబ్బాయిని ఒకలాగా పెంచడం వల్ల ఈ అబ్బాయిలు 'సమాజం'గా మారి స్త్రీ పాలిట బెడదగా మారుతున్నారు. తమ మాటకు ఎటువంటి తిరస్కారం చెప్పినా పురుషుడు శిక్షించేవాడై స్త్రీని చంపేందుకు వెనుకాడటం లేదు. స్త్రీకి ఒక అభిప్రాయం కలిగి ఉండే స్వాతంత్య్రం ఆమెకు ఎందుకు ఇవ్వడం లేదు?

స్త్రీలను ప్రేమ, మర్యాద, గౌరవాలతో కుటుంబం చూసుకోవాలి. అప్పుడు ఆ మర్యాద, గౌరవాలు సమాజంలోకి ఆటోమేటిక్‌గా వస్తాయి. కుటుంబం స్త్రీకి ఎలా రక్షణ ఇస్తుందో సమాజం కూడా స్త్రీకి అలా రక్షణ ఇవ్వాలనే పౌర శిక్షణ, సంస్కారం అవసరం. పురుషులు మాత్రమే కాదు స్త్రీలు కూడా కుటుంబం, సమాజం, దేశం కోసం గొప్పగా ఆలోచించగలరు. వారికి స్వేచ్ఛ, స్వాతంత్య్రం ఇచ్చి చూస్తే తెలుస్తుంది. అటువంటి వేకువలోకి దేశం ఉదయించాలని ఈ స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా కోరుకుందాం.



● ఫ్రీడమ్ ఫిల్లింగ్ స్టేషన్. శిక్ష(ణ)లో ఉన్న మహిళలే నిర్వాహకులు

77వ స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా...

ఆల్ ఉమెన్ పెట్రోల్ బంక్

కారాగారంలో గడిపే సమయం శిక్ష సమయం కాదు, శిక్షణ సమయం. కారాగారం మానసిక పరివర్తన దిశగా శిక్షణ ఇచ్చే ప్రదేశం. శిక్ష పూర్తయి విడుదలైన తర్వాత సమాజంలో గౌరవంగా జీవించడానికి అవసరమైన నైపుణ్య శిక్షణ కూడా ఇచ్చే ప్రదేశంగా ఉండాలి. అలాగే ఉంటాయి కూడా. అయితే ఈ ఏడాది దేశం మరో అడుగు ముందుకేసింది. శిక్ష అనుభవిస్తున్న మహిళలకు ఉపాధి అవకాశాలను జైలు గోడల మధ్య కాకుండా సమాజంలో కల్పించడం ఈ స్వాతంత్య్ర దినోత్సవం ప్రత్యేకత.

చెన్నై నగర శివారులో అంబత్తూరు– పుఴల్ రోడ్డులో ఉన్న ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకు 'ఆల్ ఉమెన్ పెట్రోల్ బంక్' అనే ప్రయోగాత్మకమైన సంస్కరణకు వేదికైంది. పుఴల్ మహిళల కారాగారంలో శిక్ష అనుభవిస్తున్న మహిళల్లో ముప్ఫై మందికి ఉద్యోగం ఇచ్చింది. దేశంలో ఇదే మొదటి ప్రయత్నం. ఈ ప్రయత్నంతో ఈ పెట్రోల్ బంకు ఫ్రీడమ్ ఫిల్లింగ్ స్టేషన్ అనే గౌరవ సూచికకు అర్హత సాధించింది. ఉదయం ఆరు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు పన్నెండు గంటలు మహిళలు విధులు నిర్వర్తిస్తారు. ఆ తర్వాత పురుష ఖైదీలు విధుల్లోకి వస్తారు.

ఖైదీలు తమ శిక్ష కాలం పూర్తయిన తర్వాత సమాజంలో గౌరవంగా జీవించడం కోసం రకరకాల వృత్తుల్లో శిక్షణ ఇస్తారు. అవన్నీ జైలు గోడల మధ్యనే ఉంటాయి. మారుతున్న సమాజానికి తగినట్లు కొత్త కొత్త ఉపాధి మార్గాలకు తగిన ఏర్పాట్లు ఉండవు. అందుబాటులో ఉన్న పనుల్లోనే శిక్షణ ఇవ్వడమే జరిగేది. ఇదిలా ఉంటే... జైళ్లలో మహిళా ఖైదీలకు తగిన సౌకర్యాల పర్యవేక్షణ కోసం అన్ని రాష్ట్రాల్లో పర్యటించిన మహిళా కమిషన్ సభ్యుల పరిశీలనలో కొత్త విషయాలు తెలిశాయి. జైలు గోడల మధ్య ఉండడం వల్ల మహిళలు మానసికంగా కుంగుబాటుకు లోనవుతున్నారని, వారికి సమాజంలో భాగస్వామ్యం కల్పించాలని సూచించడంతో, ఆ సూచనను అందుకున్న జైలు అధికారుల్లో మొదటగా పుఴల్ జైలు అధికారులు ఈ ప్రయత్నం చేశారు. మహిళలకు పెట్రోల్ పట్టడంలో శిక్షణ ఇవ్వడంతోపాటు వినియోగదారులతో మాట్లాడడం, ఉద్యోగానికి తగిన ప్రవర్తనా నియమావళిలో కూడా మహిళలకు శిక్షణ ఇప్పించారు.

పెట్రోల్ బంకులో విధులు నిర్వర్తిస్తున్న మహిళలు తమకు స్వాతంత్య్రం వచ్చినట్లు సంతోషిస్తున్నారు. శిక్ష కాలాన్ని ఆనందంగా పూర్తి చేస్తామని, పరిపూర్ణమైన వ్యక్తిత్వంతో సమాజంలోకి విడుదలవుతామని చెప్పారు.

> **శిక్ష కాలం సమాజంలోనే!**
> శిక్షణ కాలంలో మారుతున్న కాలానికి అనుగుణంగా సంస్కరణలు తీసుకురావడంతోపాటు ఖైదీలను సమాజంతో అనుసంధానం చేయడం, వారి పునరావాసం కోసం పని చేయడం కూడా అవసరమే. ఆ అవసరాన్ని గుర్తించి మహిళలతోనే ముందడుగు వేసింది జైళ్ల శాఖ. శిక్ష సమయంలో కూడా సమాజంలో మనుషులతో మాట్లాడుతూ ఉంటే మానసికంగా ఆరోగ్యంగా ఉంటారు. సమాజానికి దూరంగా ఉన్నామనే ఆవేదన దూరమవుతుంది. సమాజంలోనే నివసిస్తున్న భావనతో జీవిస్తారు.

స్వాతంత్య్రాన్ని ఇలా ఎంజాయ్ చేయండి!

నేటి టెక్నాలజీ యుగంలో స్వాతంత్య్ర దినోత్సవాన్ని హాలిడేగా తీసుకుని ఆనందించే వారే ఎక్కువ. స్కూలు, కాలేజీ విద్యార్థులైతే జెండా వందనం తరువాత ఇంటికెళ్లిపోవచ్చు అని తెగ సంబరపడిపోతుంటారు. కానీ డెబ్బై ఆరేళ్లుగా విరామం లేకుండ జరుపుకొంటూ నేడు 77వ వసంతంలో అడుగు పెట్టాం. దేశాన్ని పాలించే అధికారులు అధికారికంగా ఈ వేడుకలు జరిపిస్తున్నారు. బాధ్యత గల పౌరులుగా మనం ఇలా సెలబ్రేట్ చేసుకుందాం....



● ఉదయాన్నే ఎర్రకోటపై జరిగే జెండావందనం, వివిధ కార్యక్రమాలను టీవీలో చూడాలి. డెబ్బై ఏడేళ్ల స్వాతంత్య్ర భారతం ఎంత ఎత్తుకు ఎదిగిందన్న అంశాలను ప్రత్యక్ష ప్రసారాలు చూడడం ద్వారా తెలుసుకోవచ్చు ● తరువాత ఎప్పటి నుంచో అనుకుంటున్న ప్లేసుకి ఈరోజు వెళ్లండి. ఒక రోజులో వెళ్లిరాగల ప్రాంతానికి వెళ్లి అక్కడ గడిపి మీ ఒత్తిడిని దూరం చేసుకోండి. అక్కడ స్వతంత్ర దినోత్సవాన్ని గుర్తుండిపోయేలా గడపండి. ● రోజూ వేసుకునే దుస్తులు కాకుండా భారతీయ సంప్రదాయం ఉట్టిపడేలాంటి దుస్తులు ధరించండి. వీలైనంత వరకు డ్రెస్‌లో తెలుపు, కాషాయం, ఆకుపచ్చని రంగులు ఉండేలా చూసుకుని వేసుకోవాలి. అప్పుడు త్రివర్ణ పతాకానికి మరింత వన్నె తెచ్చిన వారవుతారు ● ఎక్కడికీ వెళ్లే ఓపిక లేనప్పుడు ఇంట్లోనే ఉండి దేశభక్తి సినిమాలు చూడండి. మీతోపాటు మీ పిల్లలకు మన దేశ చరిత్ర, ఔన్నత్యాలు తెలుస్తాయి ● మరింత ఉత్సాహంగా సెలబ్రేట్ చేసుకోవాలంటే మూడు రంగులు ఉండేలా వెరైటీ డిష్‌లు తయారు చేసుకుని తినండి ● స్వాతంత్య్ర దినోత్సవం అర్థం ఉట్టిపడేలా గాలిపటాలు ఎగరవేయండి. మూడు రంగుల్లో ఉన్న గాలిపటాలను వీలైనంత ఎత్తుకుఎగరేస్తూ మనకొచ్చిన స్వేచ్ఛను ఎంజాయ్ చేయవచ్చు ● పుస్తకాల పురుగులు అయితే దేశభక్తి పుస్తకాలను చదవండి. స్వాతంత్య్ర సమర యోధుల విజయగాథలు, వీరిలో బాగా పాపులర్ అయిన నాయకుల బయోగ్రఫీని చదివి ఎన్నో విషయాలు తెలుసుకోవచ్చు ● దేశభక్తి గీతాలు వింటూ కూడా సంబరాలు జరుపుకోవచ్చు. అలనాటి పోరాట, అసామాన్య త్యాగాలను గుర్తుచేసే పాటలను వినాలి. లతా మంగేష్కర్, మహ్మద్ రఫీ, ఏఆర్ రెహ్మాన్ పాటలు మనలో నిద్రపోతున్న దేశభక్తిని తట్టి లేపుతాయి ● ఇంటి చుట్టుపక్కల వారు లేదా బంధువులు, కుటుంబ సభ్యులతో దగ్గరలో జరుగుతోన్న జెండా పండుగకు వెళ్లి రెపరెపలాడే త్రివర్ణ పతాకానికి జైహింద్ కొట్టాలి ● దేశానికి పెద్ద సేవ చేయలేక పోయినప్పటికీ మీ చుట్టుపక్కల ఉన్న వారందరికి స్వీట్లు పంచి, నోరు తీపి చేస్తూ స్వతంత్ర దినోత్సవ వేడుకలు జరుపుకోండి.

ప్రతి భారతీయుడికి ఎంతో విలువైన బహుమతులు స్వేచ్ఛా స్వాతంత్య్రాలు. అందుకే వీలైనంత వరకు అందరితో కలిసి జరుపుకోవాల్సిన జెండా పండుగ ఇది. సెలవు దొరికింది అని సంబరపడిపోక వీటిలో ఏ ఒక్కదాన్ని పాటించినా స్వాతంత్య్ర దినోత్సవాన్ని గౌరవించినట్లే.

జీవన సేద్యం!

● పెద్ద కమతాల్లో సేంద్రియ వరి సేద్యంలో జీవన ఎరువులు/పురుగుమందులు కీలకం

సాగుబడి
అశ్లేష కార్తె: ఆగస్టు 17 వరకు
మఖ: 18 నుంచి



● వ్యవసాయ క్షేత్రంలో సిద్ధమవుతున్న జీవన ఎరువులు


సేంద్రియ/ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో ద్రావణాలు, కషాయాలను చిన్న, సన్నకారు రైతులు తయారు చేసుకొని వాడగలుగుతున్నారు. అయితే, ఎక్కువ విస్తీర్ణంలో సేంద్రియ/ప్రకృతి సేద్యం చేసే పెద్ద రైతులకు వీటి తయారీ కష్టం కావటంతో జీవన ఎరువులు, జీవన పురుగుమందులను విరివిగా వినియోగిస్తున్నారు. రైతు శాస్త్రవేత్త, తునికిలోని ఏకలవ్య కేవీకే సలహాదారు, హార్ట్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఎం.ఎస్.సుబ్రహ్మణ్యం రాజు గత కొన్ని సంవత్సరాలుగా చిన్న, పెద్ద కమతాల్లో సాగు చేసే రైతులతో కలసి పనిచేస్తున్నారు. ఖరీఫ్/లేటు ఖరీఫ్ వరి సాగులో చిన్న కమతాల రైతులు, పెద్ద కమతాల రైతులు ఏయే ఉత్పాదకాలను, ఎంతెంత మోతాదులో వాడితే మంచి ఫలితాలు వస్తున్నాయన్న అంశాలను ఆయన 'సాక్షి సాగుబడి'కి ఇలా వివరించారు.

వరి నారుమడిని నీరు నిలవని విధంగా తయారు చేసుకోవాలి. విత్తనాన్ని ఒక రోజు ముందు ఎండబెట్టి మరునాడు విత్తన శుద్ధి చేయాలి. నిద్రావస్థ ఉన్న విత్తనాలను, నిద్రావస్థ తొలగించడానికి గోరువెచ్చని నీటిలో నానబెట్టి, అనంతరం విత్తనాలను నారుమడిపై వెదజల్లాలి. 2వ రోజు నీరు బయటకు తీయాలి. 5వ రోజు నీరు పెట్టాలి. తర్వాత తగినంత నీరు ఇస్తుండాలి. చాలా ప్రాంతాల్లో నారు 6 అంగుళాల సైజు నుంచి 10 అంగుళాల సైజు వచ్చినప్పుడు మాత్రమే ఊడ్పు/నాట్లు వేస్తుంటారు. నాట్లు వేసిన 7 రోజులకు.. చనిపోయిన మొక్కల స్థానంలో మళ్లీ నాట్లు వేయాలి.

ప్రధాన పొలాన్ని ఊడ్పుకు ముందు 20 రోజుల నుంచి దఫ దఫాలుగా వారానికి ఒకసారి దుక్కి దున్ని, చదును చేసుకోవాలి. ఎకరాకు 3 నుంచి 5 టన్నుల పశువుల ఎరువు వెయ్యాలి. నాట్లతో పాటుగా వివిధ రకాల జీవన ఎరువుల (బ్యాక్టీరియాల)ను ఇవ్వాలి. మొక్కల మధ్య 20 సెం.మీ. దూరం ఉండేలా వరి నాట్లు వేయాలి. మధ్యలో కాలి బాటలు తీయాలి. గట్లపై నువ్వుల విత్తనాలను చల్లుకుంటే నువ్వుల పువ్వులు ఎనాగరస్ అనే కీటకాన్ని ఆకర్షించటం ద్వారా తెల్లదోమ నివారణ జరుగుతుంది.

సేంద్రియ వరి సాగులో చిన్న, పెద్ద రైతులకు అనువైన ఉత్పాదకాల పట్టిక

వివరణ	చిన్న రైతులకు అనువైన ప్రాచీన పద్ధతులు	పెద్ద రైతులకు అనువైన ఆధునిక పద్ధతులు
1వ రోజు విత్తనశుద్ధి	బీజామృతంతో విత్తన శుద్ధి చేయాలి	హ్యూమిక్ యాసిడ్, బవేరియా, మెటారైజియం, సూడోమోనాస్
10వ రోజు పిచికారీ	జీవామృతం + పంచగవ్య + పుల్ల మజ్జిగ	మీనామృతం + సూడోమోనాస్+ తౌడు కషాయం
12వ రోజు ఎరువు	ఘనజీవామృతం	ఘనజీవామృతం / వర్మీకంపోస్టు + హ్యూమిక్ ఆసిడ్
20వ రోజు సస్యరక్షణ	ఆగ్నేయ అస్త్రం + జీవామృతం + మొలకల ద్రావణం	మీనామృతం + బేవేరియా, మెటారైజియం + వెర్టిసీలియం పిచికారీ చేయాలి.
ఊడ్పు అనంతరం 22వ రోజు స్ప్రే	పంచగవ్య + అగ్ని అస్త్రం + పుల్ల మజ్జిగ	మీనామృతం+బవేరియా +మెటారైజియం+ వెర్టిసీలియం + కొబ్బరి నీరు పిచికారీ చేయాలి. కాండం తొలిచే పురుగుకు ల్యూర్ పెట్టాలి లేదా ట్రైకోగ్రామా కార్డులు పెట్టాలి లేదా తూజా 200 (హోమియో) పిచికారీ చేయాలి.
25వ రోజు ఊడ్పు	ఘనజీవామృతం 1 టన్ను / 1 ఎకరం + వేప పిండి 200 కిలోలు/ఎకరం	ఘనజీవామృతం 1 టన్ను/ 1ఎ + బ్యాక్టీరియాలు, ఎన్‌పికె, బవేరియా, మెటారైజియం బాక్టీరియాలు.
25 రోజులకు	కలుపు తీయాలి.	కలుపు తీయాలి.
35 రోజులకు	మొలకల ద్రావణం + ఆగ్నేయ అస్త్రం + ఇంగువ కషాయం లేదా పుల్ల మజ్జిగ పిచికారీ చేయాలి.	మీనామృతం, సోయాబీన్, పెసలు మొలకల ద్రావణం, సూడోమోనాస్, బవేరియా, మెటారైజియం, వెర్టిసీలియం పిచికారీ చేయాలి.
40 రోజులకు	కలుపు తీయాలి.	కలుపు తీయాలి.
45 రోజులకు	మొలకల ద్రావణం + వేప గింజల కషాయం	మీనామృతం + నేల వేము కషాయం + ఉలవల కషాయం
45 రోజులకు	ఘనజీవామృతం 500 కిలోలు/1 ఎకరం	ఘనజీవామృతం 500 కిలోలు / 1 ఎకరం
65వ రోజు పిచికారి	మొలకల ద్రావణం + ఇంగువ కషాయం + పసుపు దుంపల కషాయం + ఆగ్నేయ అస్త్రం	మీనామృతం + సూడోమోనాస్ + వెర్టిసీలియం + వావిలాకు కషాయం
80వ రోజు పిచికారీ	మొలకల ద్రావణం + పుల్ల మజ్జిగ + దశపర్ణి కషాయం	మీనామృతం + సూడోమోనాస్ + వెర్టిసీలియం + బవేరియా



● జీవామృతం

మోతాదు ఎంత?

● ఎకరం పంటకు సగటున 100–120 లీ. నీటిని పిచికారీ చేయాలి ● మీనామృతాన్ని నారుమడిపై లీ. నీటికి 5 ఎం.ఎల్., పైరు ఎదిగిన దశలో లీ. నీటికి / 10ఎం.ఎల్. చొప్పున కలిపి పిచికారీ చేయాలి ● బవేరియాను లీ. నీటికి /10 గ్రా. కలిపి పిచికారీ చేయాలి ● మెటారైజిమ్ లీ. నీటికి/10 గ్రా. వాడాలి ● హ్యూమిక్ యాసిడ్ కిలో విత్తనాలకు/10 గ్రా. వాడాలి. ● కిలో నేల వేము పొడిని 100 లీ. నీటిలో కలిపి కషాయం తయారు చేయాలి ● 1500 గ్రా. వావిలాకు పొడిని కషాయం చేసుకొని 100 లీ. నీటిలో కలిపి పిచికారీ చేయాలి ● ఎకరానికి రకానికి ఒక కిలో చొప్పున జీవన ఎరువులు వాడాలి ● లీ. నీటికి 10 ఎం.ఎల్. కొబ్బరి నీరు కలపాలి ● పంచగవ్య నారుమడిలో పిచికారీకి లీ. నీటికి 5 ఎం.ఎల్. కలపాలి. పైరు ఎదిగే దశలో పిచికారీకి లీ. నీటికి 20 ఎం.ఎల్. కలపాలి ● అర కేజీ ఇంగువతో ద్రావణం చేసుకొని వంద లీ. నీటిలో కలిపి పిచికారీ చేయాలి ● 200 గ్రా. పసుపును కషాయం చేసుకొని వంద లీ. నీటితో కలిపి పిచికారీ చేసుకోవాలి ● 2 కిలోల మొలకలతో ద్రావణం చేసుకొని వంద లీ. నీటితో కలిపి పిచికారీ చేసుకోవాలి ● 6 లీ. పుల్ల మజ్జిగను వంద లీ. నీటితో కలిపి పిచికారీ చేయాలి. ● ఆగ్నేయ అస్త్రం తయారీలో మిర్చి, అల్లం, వెల్లుల్లిలను అర కిలో చొప్పున తీసుకొని నూరి కషాయం తయారు చేసి వంద లీ. నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

(ఇతర వివరాలకు.. సుబ్రహ్మణ్యం రాజు మొబైల్: 76598 55588)

నిర్వహణ: పంతంగి రాంబాబు, సాగుబడి డెస్క్



● థార్ ఎడారిలో సాగవుతున్న మొలకగడ్డి

ఎడారిలో ఆశల మొలక

ప్రపంచంలోనే అత్యధిక పాలను ఉత్పత్తి చేస్తున్న మన దేశంలో పచ్చిగడ్డి లభ్యత 11 శాతం తక్కువగా ఉందని భారతీయ గడ్డి నేలలు, పశుగ్రాస పరిశోధనా సంస్థ లెక్కగట్టింది. భూతాపం ప్రమాదకరమైన రీతిలో పెరుగుతున్న ప్రస్తుత కాలంలో పచ్చి గడ్డి సాగుకు హైడ్రోపోనిక్స్ పద్ధతి చక్కని ప్రత్యామ్నాయంగా మారుతోంది. ఈ పద్ధతిలో తక్కువ స్థలంలో, పది శాతం నీటితోనే ఏడాది పొడవునా మొలక గడ్డిని పెంచుకోవచ్చు. మొలక గడ్డిని పాడి ఆవులు, గొర్రెలు, మేకలకు మేపటం మన రాష్ట్రాల్లోనే కాదు.. రాజస్థాన్‌లోని థార్ ఎడారి ప్రాంత పశుపోషకులను సైతం ఆకర్షిస్తోంది. అక్కడ ఏడాదిలో రెండు నెలలే వర్షం పడుతుంది. మండు వేసవిలో ఎండ వేడి 120 డిగ్రీల సెల్షియస్‌కు చేరుతుంటుంది. అటువంటి క్లిష్ట పరిస్థితుల్లో జీవించే థార్ ప్రాంత రైతులు, సంచార పశుపోషకులు స్వచ్ఛంద సంస్థలు, స్టార్టప్‌ల తోడ్పాటుతో ఇటీవల హైడ్రోపోనిక్ మొలక గడ్డి సాగు చేపట్టారు. సునాయాసంగా నాణ్యమైన పాల దిగుబడితో పాటు ఆదాయాన్ని పెంచుకుంటున్నారు.



● మొలకగడ్డి వేస్తున్న మహిళారైతు పలు హేమారామ్

స్వచ్ఛంద సంస్థలు, స్టార్టప్‌లు ఎడారి ప్రాంత రైతులు, పశుపోషకుల కోసం హైడ్రోపోనిక్ మొలక గడ్డిని పెంచే షెడ్లను నెలకొల్పుతున్నాయి. రైతులే వాటిలో మొక్కజొన్నలు, గోధుమలను నానబెట్టి, వర్టికల్ గార్డెన్ మాదిరిగా అనేక దొంతర్లలో ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ ట్రేలలో మొలక గడ్డిని పెంచుతున్నారు. సాధారణంగా పొలంలో పచ్చి గడ్డిని పెంచడానికి 2 నెలలు పడుతుంది. మొలక గడ్డి 8 రోజుల్లో పెరుగుతుంది. ముఖ్యంగా పది శాతం నీటితోనే ఈ గడ్డి పెరగటం థార్ ఎడారి ప్రాంత రైతులు, పశుపోషకులకు ఉపయుక్తంగా మారింది.

స్వచ్ఛంద సంస్థ ఉర్ముల్ సీమంత్ సమితి, డిజర్ట్ రిసోర్స్ సెంటర్‌తో కలసి హైడ్రోగ్రీన్స్, బహుళ నేచురల్స్ స్టార్టప్‌లు మొలక గడ్డి ఉత్పత్తి యూనిట్లను థార్ ఎడారి గ్రామాల్లో ఏర్పాటు చేస్తుండటంతో కొందరు మహిళా రైతులు హాయిగా ఊపిరిపీల్చుకుంటున్నారు. బహుళ నేచురల్స్ వీరి వద్ద నుంచి దేశీ ఆవు పాలను, ఒంటె పాలను సేకరించి, విలువ జోడించి ఆన్‌లైన్‌లో విక్రయిస్తోంది. వెయ్యి మంది పాడి రైతులు, 4 వేల మంది పశుపోషకులు తమ ఆవులు, మేకలకు మొలక గడ్డిని మేపుకుంటూ ఏడాది పొడవునా స్థిరమైన ఆదాయం పొందుతున్నారు.

పశుపోషణ కోసం గొడ్డు చాకిరీ చేసే మహిళా రైతులకు మొలక గడ్డి అందుబాటులోకి రావటం గొప్ప ఊరటనిస్తోంది. మొలక గడ్డి మేపుతో దేశీ ఆవు పాల దిగుబడి మూడింట ఒక వంతు పెరగడంతో పాటు, నాణ్యత కూడా పెరిగిందని రాజస్థాన్‌లోని ఘంటియాలి గ్రామానికి చెందిన దళిత మహిళా పశుపోషకురాలు 'పలు', ఆమె భర్త హెమారామ్ సంతోషంగా చెబుతున్నారు. వీరికి 8 ఆవులు, మేకలు ఉన్నాయి. 4 మైళ్ల దూరంలో ఉన్న పొలానికి వెళ్లి గడ్డి కోసుకొని, ఎండలో నెత్తిన పెట్టుకొని మోసుకు రావటం ఆమెకు కనాకష్టంగా ఉండేది. రెండేళ్ల క్రితం ఇంటి పక్కనే మొలకగడ్డి ఉత్పత్తి యూనిట్‌ను ఏర్పాటు చేసుకున్నాక ఆ బాధ తప్పింది. మిగులు గడ్డిని, గోధుమ గడ్డి పొడిని అమ్ముతూ ఆదాయం పొందుతుండటం విశేషం.

దూడలకు పెట్టే కాన్సంట్రేట్ మిక్చర్ దాణాను 75% తగ్గించి మొక్కజొన్న మొలక గడ్డిని మేపటం వల్ల మంచి ఫలితం కనిపించిందని బికనెర్ వెటరినరీ కాలేజీ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్.కె. ధురియా అన్నారు. హైడ్రోపోనిక్ మొలక గడ్డి వల్ల మేకల్లో జీర్ణశక్తి, పెరుగుదల బాగుందని సౌదీ అరేబియాలోని కింగ్ సౌద్ యూనివర్సిటీ అధ్యయనంలో వెల్లడైంది. మొలకగడ్డి యూనిట్ ఏర్పాటుకు రూ. 18 లక్షల నుంచి 25 లక్షల వరకు ఖర్చవుతోంది. అయితే, ఇసుక తుపాన్లకు మొలకగడ్డి షెడ్లు దెబ్బతినటం వల్ల నష్టం జరుగుతోంది.

అందుకని, ముమ్ముందు షిప్పింగ్ కంటెయినర్లలో మొలకగడ్డి ఉత్పత్తి కేంద్రాలు ఏర్పాటు చేయటమే దీనికి పరిష్కారమని బహుళ నేచురల్స్ భావిస్తోంది. లక్షల ఖర్చుతో కూడిన పని కావటంతో రైతులను బృందాలుగా ఏర్పాటు చేసి మొలకగడ్డి యూనిట్లను నెలకొల్పితే మేలు. అయితే, రూ. 17.500 ఖర్చుతో చిన్నపాటి మొలకగడ్డి యూనిట్లు ఏర్పాటు చేసుకోవచ్చని హైడ్రోగ్రీన్స్ స్టార్టప్ చెబుతోంది.

బయోచార్‌తో సేంద్రియ ఇంటిపంటల సాగుపై శిక్షణ

సేంద్రియ ఇంటిపంటల సాగుపై పట్టణ/నగర వాసులపై ఆసక్తి పెరుగుతోంది. బయోచార్ (బొగ్గుపొడి) కలిపిన మట్టి మిశ్రమంతో టెర్రస్ గార్డెన్లు, పెరటి తోటలు, బాల్కనీలలో కూరగాయల పెంపకంపై ఈ నెల 24, 25 తేదీల్లో హైదరాబాద్ మలకపేటలోని న్యూలైఫ్ ఫౌండేషన్ శిక్షణ ఇవ్వనుంది. మిగులు పంట దిగుబడులను సోలార్ డ్రయ్యర్‌తో ఎండబెట్టే విధానం కూడా వివరిస్తామని న్యూలైఫ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు శివ షిండే తెలిపారు. వివరాలకు.. 81210 08002.

17న అమలాపురంలో ప్రకృతి సేద్యంపై శిక్షణ

శ్రీనివాస సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 17న కోనసీమ జిల్లా అమలాపురంలోని (ముక్తేశ్వరం– కొత్తపేట రోడ్డు) శ్రీసత్యనారాయణ గార్డెన్స్‌లో ప్రకృతి వ్యవసాయంపై నిపుణులు విజయరామ్ రైతులకు అవగాహన కల్పిస్తారని నిర్వాహకులు నిమ్మకాయల సత్యనారాయణ తెలిపారు. ప్రవేశం ఉచితం. ముందుగా పేరు నమోదు చేసుకోవాలి. వివరాలకు.. 64091 11427 (సా. 3 గం. నుంచి 6 గం. వరకు మాత్రమే).



అయ్యర్, రాహుల్ ప్రాక్టీస్ షురూ

గాయాలతో జట్టుకు దూరమైన భారత క్రికెటర్లు శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహుల్ మళ్లీ బ్యాట్ పట్టారు. గాయాలు మానడంతో బెంగళూరులోని జాతీయ క్రికెట్ అకాడమీలో ప్రాక్టీస్ మొదలుపెట్టారు. ఆసియా కప్ కోసం భారత జట్టును ఎంపిక చేసేందుకు త్వరలోనే అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ సమావేశం కానుంది. ఈ నేపథ్యంలో అయ్యర్, రాహుల్ ప్రస్తుతం ఫిట్‌నెస్ నిరూపించుకునే పనిలో పడ్డారు. దీనికి సంబంధించిన వీడియో ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారు.

ఐక రాజు 'డబుల్ ధమాకా'



అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య జూనియర్ సర్క్యూట్‌లో హైదరాబాద్ అమ్మాయి ఐక రాజు కనుమూరి రెండు టైటిల్స్ సాధించింది. నికరాగ్వాలో జరిగిన జే30 కేటగిరీ టోర్నీలో 16 ఏళ్ల ఐక సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో విజేతగా నిలిచింది. సింగిల్స్ ఫైనల్లో ఐక 6-3, 2-6, 6-3తో వాలెంటీనా టిజారో (కొలంబియా)పై గెలిచింది. టాప్ సీడ్‌గా బరిలోకి దిగిన ఐక ఫైనల్ చేరే క్రమంలో కేవలం ఐదు గేమ్‌లు మాత్రమే కోల్పోయింది. డబుల్స్‌లో వాలెంటీనాతో జత కట్టిన ఐక టైటిల్ దక్కించుకుంది.

భారత రెజ్లింగ్ ట్రయల్స్ 25, 26వ తేదీల్లో

ఈసారి ఎవరికీ దక్కని మినహాయింపు



న్యూఢిల్లీ: పారిస్ ఒలింపిక్స్ బెర్త్‌లను ఖరారు చేసే ప్రపంచ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే భారత జట్లను ఈనెల 25, 26వ తేదీల్లో ఎంపిక చేయనున్నారు. పాటియాలాలో నిర్వహించే ఈ ట్రయల్స్ నుంచి ఎవరికీ మినహాయింపు లేదని... ప్రపంచ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించాలనుకుంటే అందరూ ఈ ట్రయల్స్‌కు హాజరు కావాల్సిందేనని భారత రెజ్లింగ్ సమాఖ్య వ్యవహారాలను పర్యవేక్షిస్తున్న అడ్-హక్ ప్యానెల్ వెల్లడించింది. ఆసియా క్రీడల్లో పాల్గొనే భారత జట్ల ఎంపిక కోసం నిర్వహించిన ట్రయల్స్ నుంచి స్టార్ రెజ్లర్లు బజరంగ్ పూనియా, వినేశ్ ఫొగాట్‌లకు మినహాయింపు ఇవ్వడం వివాదాస్పదమైంది. సెప్టెంబర్ 16 నుంచి 24 వరకు బెల్‌గ్రేడ్‌లో ప్రపంచ చాంపియన్‌షిప్ జరగనుంది. ప్రపంచ చాంపియన్‌షిప్‌లో ఆయా కేటగిరీల్లో టాప్-5లో నిలిచిన రెజ్లర్లు పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధిస్తారు.

సినెర్ తొలిసారి...

టొరంటో: మూడో ప్రయత్నంలో ఇటలీ రైజింగ్ టెన్నిస్ స్టార్ యానిక్ సినెర్ తన కెరీర్‌లో తొలి ఏటీపీ మాస్టర్స్ సిరీస్-1000 టైటిల్ గెలిచాడు. నేషనల్ బ్యాంక్ ఓపెన్ ఏటీపీ-1000 మాస్టర్స్ సిరీస్ టెన్నిస్ టోర్నీలో 21 ఏళ్ల సినెర్ విజేతగా నిలిచాడు. సోమవారం జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో సినెర్ 6-4, 6-1తో అలెక్స్ డి మినార్ (ఆస్ట్రేలియా)పై విజయం సాధించాడు. సినెర్‌కు 10,19,335 డాలర్ల (రూ. 8 కోట్ల 47 లక్షలు) ప్రైజ్‌మనీతో పాటు 1000 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. 2021, 2023లలో మయామి మాస్టర్స్ సిరీస్ టోర్నీ ఫైనల్లో సినెర్ ఓడిపోయాడు. ఫాబియో ఫాగ్నిని తర్వాత ఏటీపీ మాస్టర్స్ సిరీస్ టైటిల్ గెలిచిన రెండో ఇటలీ ప్లేయర్‌గా సినెర్ గుర్తింపు పొందాడు. 2019లో ఫాబియో ఫాగ్నిని మోంటెకార్లో ఓపెన్ మాస్టర్స్ సిరీస్ టోర్నీలో టైటిల్ గెలిచాడు.



తిలక్ వర్మ... పేరు గుర్తుంచుకోండి!

- తొలి అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్న హైదరాబాద్ క్రికెటర్
- విండీస్‌తో టి20 సిరీస్‌లో టాప్ స్కోరర్
- నిలకడ కొనసాగిస్తే వన్డే ప్రపంచకప్‌లోనూ చాన్స్



తిలక్ పేరులో 'లక్' ఉంది. ఈ 'లక్' చోటు వచ్చేందుకు పనికొస్తుందేమో కానీ... రాణించేందుకు ఏమాత్రం ఉపయోగపడదు. శక్తి, సామర్థ్యాలతో పాటు టెక్నిక్, వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్న పట్టుదల, పాతుకుపోవాలన్న సంకల్పమే ఏ ఆటగాడినైనా నిలబెడతాయి. ఎడంచేతి వాటం బ్యాటర్ తిలక్ వర్మ కూడా అదే చేశాడు. కష్టపడే జట్టులోకి వచ్చాడు. వచ్చాక ప్రత్యర్థి బౌలర్ల భరతం పడుతున్నాడు. బ్యాటింగ్‌లో ఈ నిలకడే భారత టీమ్ మేనేజ్‌మెంట్ కంట నాలుగో స్థానంపై ఆశాకిరణమయ్యేలా చేస్తోంది.

–సాక్షి క్రీడా విభాగం

ఠాకూర్ తిలక్ వర్మ ఐపీఎల్‌లో దంచేస్తుంటే అందరికి తెలిసొచ్చింది. కానీ హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) డివిజన్ లీగ్ క్రికెట్‌లోనే అతను వార్తల్లో వ్యక్తి అని చాలా మందికి తెలియదు. మూడు రోజుల ఆటలో జట్టును అర్ధ సెంచరీలతో ఆదుకున్నాడు. సెంచరీలతో గెలిపించాడు. ఐపీఎల్ వేలంలోకి వచ్చాక లీగ్‌లో మనోడున్నాడు అనిపించాడు. నిలకడైన ఆటతో మెల్లిగా ముంబై ఇండియన్స్ జట్టు మొనగాడయ్యాడు. ఇప్పుడు కరీబియన్‌కు తీసుకెళ్తే భారత ఆశాకిరణమయ్యాడు. అలా ఒక్కో మెట్టెక్కుతూ... కింది నుంచే పైకొచ్చాడు.

గతేడాది ఐపీఎల్‌లో అరంగేట్రం చేసిన తిలక్ ఆ సీజన్‌లో ముంబైని మురిపించాడు. షాట్ల ఎంపిక, బంతిని పంపిన ప్లేసింగ్ తీరు, ధాటిగా ఆడే నైపుణ్యం ఇవన్నీ గమనించిన ముంబై యాజమాన్యం అతనికి విరివిగా అవకాశాలిచ్చింది. అన్ని మ్యాచ్‌ల్లో బరిలోకి దింపింది. దాంతో 131.02 స్ట్రయిక్‌రేట్‌తో 397 పరుగులు చేశాడు. 36.09 సగటు నమోదు చేశాడు. ఈ సీజన్‌లోనూ 11 మ్యాచ్‌ల్లో ఆడిస్తే 164.11 స్ట్రయిక్ రేట్‌తో 343 పరుగులు చేశాడు. సగటేమో 42.87! అంటే ఈ రెండేళ్లలో సగటు, స్ట్రయిక్‌రేట్ రెండు పెంచుకున్నాడు. జట్టు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టాడు. ఈ గణాంకాలతోనే తిలక్ వర్మ అదరగొట్టాడనుకుంటే పొరబడినట్లే! ఎందుకంటే ముంబై కష్టాల్లో ఉంటే ఆటగాళ్లపై ఒత్తిడి పెరిగితే... అతను మాత్రం యథేచ్ఛగా ఆడిన తీరే అందరిమెప్పు పొందేలా చేసింది. క్రికెట్ విశ్లేషకులు, ప్రముఖ టీవీ వ్యాఖ్యాతలే కాదు... దిగ్గజ క్రికెటర్లు సైతం తిలక్ వర్మ ఆటకు, ఆడిన తీరుకు ముచ్చటపడ్డారు. ప్రశంసలు కురిపించారు.

విండీస్‌లో సిక్సర్లతో...

అతని ప్రతిభను బీసీసీఐ సీనియర్ సెలక్షన్ కమిటీ కూడా గుర్తించి కరీబియన్ పర్యటనకు పంపింది. కేవలం టి20ల్లో మాత్రమే అవకాశమిచ్చింది. అంతర్జాతీయ క్రికెట్‌లో అరుదుగా లభించిన ఈ సదవకాశాన్ని హైదరాబాదీ లెఫ్ట్ హ్యాండర్ వదులుకోలేదు. కోచ్ రాహుల్ ద్రవిడ్, కెప్టెన్ హార్దిక్ పాండ్యాల గేమ్ ప్లాన్‌లో భాగమైన తిలక్... విండీస్ తురుపుముక్కలైన సీమర్లను సునాయాసంగా ఎదుర్కొన్నాడు. ఎదుర్కొన్న తొలి బంతికి పరుగు తీయలేకపోయాడు... కానీ అంతర్జాతీయ పరుగుల ప్రయాణాన్ని మాత్రం సిక్సర్లతో ప్రారంభించాడు. తొలి రెండు టి20ల్లో 39 పరుగులు, 51 పరుగులు అతనిదే టాప్ స్కోర్! తర్వాత మూడు మ్యాచ్‌ల్లో 49 నాటౌట్, 7 నాటౌట్, 27 పరుగులు... ఇలా ప్రతి మ్యాచ్‌లోనూ బాధ్యత కనబరిచాడు. ఓవరాల్‌గా 173 పరుగులతో ఈ సిరీస్‌లో భారత టాప్ స్కోరర్‌గా అవతరించాడు. అందుకే భారత కెప్టెన్ రోహిత్ ఓ ఇంటర్వ్యూలో హైదరాబాదీ ఆటగాడిని ప్రత్యేకంగా ప్రస్తావించాడు, ప్రశంసించాడు.

ఆసియా కప్, ప్రపంచకప్‌లపై...

యువరాజ్ సింగ్ రిటైర్మెంట్ తర్వాత బదులు తోచని ప్రశ్నగా మిగిలిపోయిన నాలుగో స్థానం ఇప్పుడు తిలక్‌ను ఊరిస్తోంది. ఆసియా కప్‌లో సెలక్టర్లు మాత్రం అతన్ని కొనసాగించే అవకాశాలు మెరుగ్గా ఉన్నాయి. ఇక అక్కడ కూడా మ్యాచ్ మ్యాచ్‌కు ఇలాంటి నిలకడ, ధాటైన జోరు కొనసాగిస్తే మాత్రం స్వదేశంలో జరిగే వన్డే ప్రపంచకప్ కోసం అతని పేరును పరిశీలించడం, చోటివ్వడం ఖాయమవుతుందేమో చూడాలి.

విదిత్ సంచలనం

ప్రపంచ ఐదో ర్యాంకర్‌పై గెలుపుతో క్వార్టర్స్‌లోకి



బకూ (అజర్‌బైజాన్): ప్రపంచకప్ చెస్ టోర్నీ ఓపెన్ విభాగంలో భారత గ్రాండ్‌మాస్టర్ విదిత్ సంతోష్ గుజరాతి సంచలనం సృష్టించాడు. ప్రపంచ ఐదో ర్యాంకర్, రష్యా గ్రాండ్‌మాస్టర్ ఇయాన్ నిపోమ్‌నిషితో జరిగిన ప్రీక్వార్టర్ ఫైనల్లో విదిత్ 4-2తో నెగ్గి క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. నిర్ణీత రెండు క్లాసికల్ గేమ్‌ల తర్వాత ఇద్దరూ 1-1తో సమంగా ఉండటంతో విజేతను నిర్ణయించేందుకు సోమవారం ర్యాపిడ్ ఫార్మాట్‌లో టైబ్రేక్ గేమ్‌లు నిర్వహించారు. ముందుగా 25 నిమిషాల నిడివిగల రెండు ర్యాపిడ్ గేమ్‌లను ఆడించగా ఈ రెండూ 'డ్రా'గా ముగిశాయి. దాంతో స్కోరు 2-2తో సమమైంది. అనంతరం 10 నిమిషాల నిడివిగల రెండు ర్యాపిడ్ గేమ్‌లను ఆడించారు. ఈ రెండింటిలో విదిత్ గెలుపొందడం విశేషం. తొలి గేమ్‌లో 60 ఎత్తుల్లో గెలిచిన విదిత్ రెండో గేమ్‌లో 52 ఎత్తుల్లో నెగ్గాడు. దాంతో విదిత్‌కు క్వార్టర్ ఫైనల్ బెర్త్ ఖరారైంది. ఈ టోర్నీలో నాలుగో భారత ప్లేయర్ క్వార్టర్ ఫైనల్ చేరాడు. ఇప్పటికే ఇరిగేశి అర్జున్, దొమ్మరాజు గుకేశ్, ప్రజ్ఞానంద క్వార్టర్ ఫైనల్ చేరారు. నేడు జరిగే క్వార్టర్ ఫైనల్స్ తొలి గేమ్‌లలో కార్ల్‌సన్ (నార్వే)తో గుకేశ్; నిజాత్ అబసోవ్ (అజర్‌బైజాన్)తో విదిత్; ప్రజ్ఞానందతో అర్జున్; కరువానా (అమెరికా)తో లీనియర్ (అమెరికా) తలపడతారు.

హారిక ఓటమి

మహిళల విభాగంలో భారత గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారిక పోరాటం ముగిసింది. క్వార్టర్ ఫైనల్లో హారిక 3.5-4.5తో అలెగ్జాండ్రా గోర్యాచ్‌కినా (రష్యా) చేతిలో ఓడిపోయింది. వీరిద్దరి మధ్య రెండు క్లాసికల్ గేమ్‌లు 'డ్రా'గా ముగియడంతో విజేతను నిర్ణయించేందుకు ర్యాపిడ్ ఫార్మాట్‌లో టైబ్రేక్ గేమ్‌లు నిర్వహించారు. తొలి గేమ్‌లో గోర్యాచ్‌కినా, రెండో గేమ్‌లో హారిక గెలిచారు. దాంతో స్కోరు 2-2తో సమమైంది. అనంతరం నిర్వహించిన రెండు గేమ్‌లు 'డ్రా' కావడంతో స్కోరు 3-3తో సమమైంది. ఈసారి రెండు గేమ్‌లు నిర్వహించగా... తొలి గేమ్‌లో గోర్యాచ్‌కినా 43 ఎత్తుల్లో గెలిచి, రెండో గేమ్‌ను 95 ఎత్తుల్లో 'డ్రా' చేసుకొని సెమీఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది.

క్రికెట్‌కు ఫిన్ వీడ్కోలు



లండన్: ఇంగ్లండ్ జట్టు పేస్ బౌలర్ స్టీవెన్ ఫిన్ అన్ని రకాల క్రికెట్ ఫార్మాట్‌ల నుంచి వీడ్కోలు తీసుకున్నాడు. తీవ్రమైన మోకాలి గాయం కారణంగానే తాను ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు 34 ఏళ్ల ఫిన్ వెల్లడించాడు. తన 13 ఏళ్ల అంతర్జాతీయ కెరీర్‌లో ఫిన్ ఇంగ్లండ్ తరఫున 36 టెస్టులు, 69 వన్డేలు, 21 టి20 మ్యాచ్‌లు ఆడాడు. 6 అడుగుల 7 అంగుళాల ఎత్తున్న ఫిన్ టెస్టుల్లో 125 వికెట్లు, వన్డేల్లో 102 వికెట్లు, టి20ల్లో 27 వికెట్లు పడగొట్టాడు. ఆస్ట్రేలియాపై 2010-11, 2013, 2015లలో యాషెస్ సిరీస్ గెలిచిన ఇంగ్లండ్ జట్లలో ఫిన్ సభ్యుడిగా ఉన్నాడు.

రన్నరప్ సంతోష్ జోడీ



కాలిఫోర్నియా: సూపర్ స్మాష్ ఓపెన్ బ్యాడ్మింటన్ డబుల్స్ టోర్నమెంట్‌లో యూఎస్ అకాడమీకి ప్రాతినిధ్యం వహించిన భారత ప్లేయర్ రావూరి సంతోష్ రన్నరప్‌గా నిలిచాడు. అమెరికాలో జరిగిన ఈ టోర్నీలో సంతోష్-రత్నజీత్ తమాంగ్ జోడీ 6-21, 14-21తో శ్లోక్ రామచంద్రన్-సిబాయాన్ (అమెరికా) ద్వయం చేతిలో ఓటమి పాలైంది. హైదరాబాద్‌కు చెందిన సంతోష్ గతంలో భారత జూనియర్ జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. పుల్లెల గోపీచంద్ అకాడమీలో శిక్షణ పొందాడు.

విజేత జెస్సికా



మాంట్రియల్: పదేళ్ల తర్వాత నేషనల్ బ్యాంక్ ఓపెన్ డబ్ల్యూటీఏ-1000 టెన్నిస్ టోర్నీలో అమెరికా ప్లేయర్‌కు టైటిల్ లభించింది. సోమవారం జరిగిన ఈ టోర్నీ మహిళల సింగిల్స్ ఫైనల్లో నాలుగో సీడ్ జెస్సికా పెగూలా (అమెరికా) 6-1, 6-0తో లుద్మిలా సమ్సోనోవా (రష్యా)పై అలవోకగా గెలిచి చాంపియన్‌గా నిలిచింది. జెస్సికాకు 4,54,500 డాలర్ల (రూ. 3 కోట్ల 77 లక్షలు) ప్రైజ్‌మనీతోపాటు 900 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. 2013లో సెరెనా విలియమ్స్ తర్వాత ఈ టోర్నీలో విజేతగా నిలిచిన అమెరికన్ ప్లేయర్‌గా జెస్సికా ఘనత వహించింది.

మేరా భారత్ మహాన్

దేశం అనగానే భారతీయ ప్రేక్షకులు వెంటనే కనెక్ట్ అయిపోతారు. సరైన దేశభక్తి సినిమా వస్తే సూపర్ డూపర్ హిట్ చేసి భావోద్వేగంతో ఊగిపోతారు. బాలీవుడ్‌లో మంచి మంచి దేశభక్తి సినిమాలు వచ్చాయి. 77వ స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ తప్పక చూడాల్సిన 10 దేశభక్తి సినిమాలు..



హకీకత్ (1964): దేశాల మధ్య యుద్ధాలు వస్తే సైనికుల వీరోచిత పోరాటాలు, త్యాగాలు తప్పనిసరి. వాటిని చూపుతూనే యుద్ధాలు ఎలా సగటు సైనికుడి ప్రాణాలు బలిగొంటాయో కూడా చూపిన సినిమా హకీకత్. 1962 నాటి ఇండో చైనా యుద్ధం మీద వచ్చిన ఈ సినిమా అతి తక్కువ మంది భారత సైనిక పటాలం చైనా భారీ సేనతో ఎలా తలపడిందో చూపుతుంది. బల్‌రాజ్ సహానీ, ధరేంద్ర తదితరులు నటించిన ఈ సినిమాకు చేతన్ ఆనంద్ దర్శకుడు. కైఫీ ఆజ్మీ రాసిన ప్రఖ్యాత దేశభక్తి గీతం 'కర్ చలే హమ్ ఫిదా జాన్ ఏ వతన్ సాథియో' ఇందులోదే.



ఉప్‌కార్ (1967): దేశభక్తి సినిమాలు తీసి 'మిస్టర్ భరత్' బిరుదు పొందిన నటుడు మనోజ్ కుమార్ నాటి ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి సూచన మేరకు 'జై జవాన్ జై కిసాన్' నినాదానికి ఇచ్చిన సినీ రూపం 'ఉప్‌కార్'. సైనికులు దేశ సరిహద్దుల వద్ద మాత్రమే సంఘర్షణ చేస్తారు... కాని రైతులు దేశంలో జీవితాంతం సంఘర్షణ చేసి గింజలు పండించి జనం కడుపులు నింపుతారు... వారే నిజమైన హీరోలు అని చెప్పే సినిమా ఇది. 'మేరీ దేశ్ కి ధర్తీ సోనా ఉగ్‌లే...ఉగ్‌లే హీరే మోతీ' హిట్ గీతం ఇందులోదే.




బోర్డర్ (1997): యుద్ధంలో చావు కళ్ల ముందు కదలాడుతుంటే దేశం తప్ప మరేమీ గుర్తు రాక సంతోషంగా బలిదానం ఇచ్చే సైనికుల వీర త్యాగం ఎలా ఉంటుందో 'బోర్డర్'లో చూడాలి. 1971 నాటి ఇండో పాక్ యుద్ధాన్ని కథాంశంగా తీసుకుని దర్శకుడు జె.పి. దత్తా తీసిన ఈ సినిమా ఒక గొప్ప వార్ మూవీ. సన్నీ డియోల్, సునీల్ శెట్టి తదితరులు నటించిన ఈ సినిమాలో సైనికుల జీవితాన్ని వాస్తవికంగా చూపడంలో దర్శకుడు సఫలం అయ్యాడు. యుద్ధ వ్యూహాలు కూడా ఈ సినిమాలో తెలుస్తాయి.




లగాన్ (2001): దేశభక్తికి క్రీడలు జత చేసి గొప్ప సంచలనం సృష్టించిన సినిమా 'లగాన్'. పన్నుల మీద పన్నులు వేసి దాష్టీకం చేస్తున్న బ్రిటిష్ వారిని చిన్న పల్లెజనం క్రికెట్‌లో ఓడించడం ప్రేక్షకులకు ఎంతగానో నచ్చింది. ఆమిర్ ఖాన్ నిర్మించిన ఈ సినిమాకు అశుతోష్ గోవారికర్ దర్శకుడు. ఆస్కార్ నామినేషన్ పొందింది. అద్భుతమైన కథనం, సంగీతం, నటన, భావోద్వేగాలు, ఆటలో ఉండే మలుపులు తోడు కావడంతో ప్రేక్షకులు జేజేలు పలికారు.



ది లెజెండ్ ఆఫ్ భగత్‌సింగ్ (2002): అమర దేశభక్తుడు భగత్ సింగ్ కథను తీసుకుని రాజ్ కుమార్ సంతోషి తీసిన అద్భుతమైన సినిమా ఇది. అజయ్ దేవగణ్- భగత్ సింగ్ పాత్రను పోషించి ప్రేక్షకుల కంట కన్నీరు తెప్పించాడు. భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్‌దేవ్... ఈ ముగ్గురు దేశభక్తులు తమ ఉడుకు నెత్తురుతో దేశం కోసం పోరాడి లేత వయసులో మరణించడం ప్రేక్షకుల మనసు కలచి వేసేలా ఈ సినిమా చూపుతుంది. దేశం కోసం ఎలాంటి స్ఫూర్తితో ఉండాలో తెలుపుతుంది.




లక్ష్య (2004): మంచి దేశభక్తి సినిమా మాత్రమే కాదు యువతను లక్ష్యం వైపు నడిపించే సినిమా కూడా. రిలీజైనప్పుడు ప్రేక్షకుల నుంచి స్పందన అంతంత మాత్రంగా ఉన్నా ఆ తర్వాత కల్ట్ క్లాసిక్‌గా నిలిచింది. కార్గిల్ వార్‌ను నేపథ్యంగా తీసుకుని గొప్ప సాంకేతిక విలువలతో తీశారు. హృతిక్ రోషన్‌తో పాటు అమితాబ్ బచ్చన్ కూడా నటించారు. మిలట్రీ వాతావరణం, క్రమశిక్షణ, ధీరత్వం ఈ సినిమాలో పుష్టిగా చూడొచ్చు.



స్వదేశ్ (2004): ఈ దేశం నీకేమిచ్చిందని కాదు... ఈ దేశానికి నువ్వేమిచ్చావ్ అని తరచి ప్రశ్నించుకోవాలని నెహ్రూ అన్నారు. ఆ ప్రశ్నకు జవాబు ఈ సినిమా. ఈ దేశంలో పుట్టి పెరిగి చదువుకుని పరాయి దేశానికి వెళ్లి ఆ దేశానికి సేవ చేయడం తప్పు కాదు కానీ మన దేశానికి ఏదైనా చేయాలన్న బాధ్యతను మరువకూడదని ఎంతో గట్టిగా చెప్పింది 'స్వదేశ్'. షారూక్ ఖాన్ నటించిన ఈ చిత్రానికి అశుతోష్ గోవారికర్ దర్శకుడు. ఎన్ఆర్ఐల బాధ్యతను నిలదీసిన సినిమా ఇది.



రంగ్ దే బసంతి (2006): ఉద్యోగం వచ్చే చదువును చదువుకోవడం వేరు, దేశం పట్ల చైతన్యాన్ని కలిగించుకుని బాధ్యతను గుర్తెరగడం వేరు. నేటి యువత తమ కెరీర్‌ను వెతుక్కుంటున్నది గాని దేశం కోసం ఏం చేయాలో ఆలోచించడం లేదు. 'రంగ్ దే బసంతి'... అల్లరి చిల్లరి యూనివర్సిటీ కుర్రాళ్లను దేశం కోసం ఏదైనా గట్టిగా చేయాలని నిర్ణయించుకోవడాన్ని చూపుతుంది. పుచ్చిపోయిన వ్యవస్థను సరిచేయాలనుకుని ప్రాణాలు అర్పించే కుర్రాళ్ల కథ ఇది. రాకేష్ మెహ్రా దర్శకుడు. ఆమిర్ ఖాన్ హీరో.



ది ఫర్‌గాటెన్ హీరో (2004): నేతాజీ సుభాష్ చంద్రబోస్ కోసం ఈ దేశం గుండె సగర్వంగా స్పందిస్తూనే ఉంటుంది. బ్రిటిష్ వారిపై పోరాడటానికి ఏకంగా సైన్యాన్ని నిర్మించిన ధీరుడు ఆయన. నేతాజీ మరణం ఇంకా మిస్టరీనే. నేతాజీ జీవితాన్ని అథెంటిక్‌గా చూపిన సినిమా ఇది. శ్యామ్ బెనగళ్ దర్శకునిగా ఎంత రీసెర్చ్ చేశాడో తెలుస్తుంది. నేతాజీగా సచిన్ ఖడేకర్ అద్భుతంగా నటించారు. గతించిన చరిత్రకు దర్పణం ఈ సినిమా.



రాజీ (2018): దేశం కోసం గూఢచారిగా పని చేసి త్యాగాలు చేసిన వారు ఎందరో. వారిలో పురుషులతో పాటు స్త్రీలు కూడా ఉన్నారు. అలాంటి ఒక స్త్రీ కథ 'రాజీ'. ఆలియా భట్ నటించిన ఈ సినిమా పాకిస్తాన్‌కు కోడలుగా వెళ్లి అక్కడ భారత్ కోసం గూఢచారిగా పని చేసిన సెహమత్ అనే స్త్రీ ఎదుర్కొన్న సవాళ్లను చూపుతుంది. మేఘనా గుల్జార్ దర్శకత్వం వహించిన ఈ సినిమా చిన్న బడ్జెట్‌తో నిర్మితమైనా భారీ వసూళ్లను రాబట్టింది.

సినిమా

ఆపరేషన్ డేట్ ఫిక్స్



• వరుణ్ తేజ్

వరుణ్ తేజ్ హీరోగా నటిస్తున్న తొలి హిందీ చిత్రానికి 'ఆపరేషన్ వాలెంటైన్' టైటిల్ ఖరారు చేశారు. అంతేకాదు.. ఈ మూవీని డిసెంబర్ 8 రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. శక్తి ప్రతాప్ సింగ్ హడా దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో వరుణ్ తేజ్ ఇండియన్ ఎయిర్ ఫోర్స్ పైలట్‌గా, రాడార్ ఆఫీసర్ పాత్రలో మానుషి చిల్లర్ నటిస్తున్నారు. సోనీ పిక్చర్స్ ఇంటర్నేషనల్ ప్రొడక్షన్స్, రినైసెన్స్ పిక్చర్స్‌పై ఈ చిత్రం రూపొందుతోంది. ''వాస్తవ ఘటనల స్ఫూర్తితో, భారత వైమానిక దళ ధైర్య సాహసాలను చూపే యాక్షన్ మూవీ ఇది. శక్తి ప్రతాప్ సింగ్, అమిర్ ఖాన్, సిద్ధార్థ్ రాజ్ కుమార్ ఈ చిత్రకథ రాశారు. హిందీ, తెలుగులో రూపొందిస్తున్నాం'' అని మేకర్స్ ప్రకటించారు. ఈ చిత్రానికి సహనిర్మాత: నందకుమార్ అబ్బినేని.

హే కృష్ణా... వస్తున్నాం



• నవీన్ పొలిశెట్టి, అనుష్క

మా సినిమాని రిలీజ్ చేయడానికి మంచి తేదీ చెప్పు అంటూ జ్యోతిష్కుడు మహేశ్ దగ్గరికి వెళ్లాడు పొలిశెట్టి. ఓ 70, 80 ఏళ్ల తర్వాత రిలీజ్ చేసుకో అని మహేశ్ అంటే... 'హే కృష్ణా' అంటూ ఉట్టి కొట్టి కృష్ణాష్టమికి రిలీజ్ చేసుకుంటాం అంటాడు పొలిశెట్టి. మిస్ శెట్టిగా అనుష్కా శెట్టి, మిస్టర్ పొలిశెట్టిగా నవీన్ పొలిశెట్టి నటించిన చిత్రం 'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి'. మహేశ్ బాబు పి. దర్శకత్వంలో యూవీ క్రియేషన్స్‌పై వంశీ, ప్రమోద్ నిర్మించిన ఈ చిత్రం విడుదల వాయిదా పడుతూ వస్తోంది. ఫైనల్లీ కృష్ణాష్టమి సందర్భంగా సెప్టెంబర్ 7న రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించే వీడియోను సోమవారం విడుదల చేశారు. నవీన్ పొలిశెట్టి, మహేశ్‌ల కామెడీతో సాగే ఈ ఫన్నీ వీడియో ద్వారా విడుదల తేదీని ప్రకటించారు.

ధనుష్‌కి జోడీగా...



• రష్మిక

హీరో ధనుష్, డైరెక్టర్ శేఖర్ కమ్ముల కాంబినేషన్‌లో 'డీ 51' (వర్కింగ్ టైటిల్) సినిమా రూపొందనున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో హీరోయిన్‌గా రష్మికా మందన్నని ఖరారు చేశారు మేకర్స్. శ్రీ నారాయణ్ దాస్ కె. నారంగ్ ఆశీస్సులతో శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్ఎల్‌పీ (ఏషియన్ గ్రూప్), అమిగోస్ క్రియేషన్స్‌పై సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా రష్మిక మందన్న తన ఆనందాన్ని పంచుకుంటూ– ''చాలా ఎగ్జయిటెడ్‌గా ఉంది. ఈ ఆనందాన్ని మీ అందరితో పంచుకోవాలనుకుంటున్నాను'' అంటూ 'డీ 51' ఫొటో ఫ్రేమ్‌ని షేర్ చేశారు. ఈ చిత్రానికి సమర్పణ: సోనాలి నారంగ్.


మరో థ్రిల్లర్‌తో...



• కార్తీక్

'**వి**రూపాక్ష' సినిమాతో ఘన విజయం అందుకున్న డైరెక్టర్ కార్తీక్ దండు తన తర్వాతి చిత్రాన్ని ప్రకటించారు. 'విరూపాక్ష' నిర్మాతలే ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. బి. బాపినీడు సమర్పణలో శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర ఎల్ఎల్‌పీ, సుకుమార్ రైటింగ్స్‌పై బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మించనున్న ఈ సినిమా అనౌన్స్‌మెంట్ ప్రీ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. ''విరూపాక్ష'ను మిస్టిక్ థ్రిల్లర్‌గా రూపొందించిన కార్తీక్ దండు తన తదుపరి చిత్రాన్ని మిథికల్ థ్రిల్లర్ జానర్‌లో తీయబోతున్నాడు'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.

ఐబీ ఆఫీసర్ రాఘవేంద్ర



• అనుపమ్ ఖేర్

ఐబీ ఆఫీసర్ (ఇంటెలిజెన్స్ బ్యూరో) రాఘవేంద్ర రాజ్‌పుత్‌గా చార్జ్ తీసుకున్నారు అనుపమ్ ఖేర్. టైగర్ నాగేశ్వర రావుని పట్టుకునే మిషన్ విషయంలో రాఘవేంద్ర ఎలాంటి ప్లాన్స్ వేశారు? అనేది 'టైగర్ నాగేశ్వరరావు' చిత్రంలో చూడాల్సిందే. రవితేజ టైటిల్ రోల్‌లో వంశీ దర్శకత్వంలో తేజ్ నారాయణ్ అగర్వాల్ సమర్పణలో అభిషేక్ అగర్వాల్ నిర్మిస్తున్న చిత్రం 'టైగర్ నాగేశ్వరరావు'. ఈ చిత్రంలో అనుపమ్ ఖేర్ చేస్తున్న కీలక పాత్ర అయిన ఐబీ ఆఫీసర్ రాఘవేంద్ర రాజ్‌పుత్ లుక్‌ని విడుదల చేశారు. ''టైగర్ నాగేశ్వరరావు' టీజర్‌ను ఈ నెల 17న విడుదల చేయనున్నాం. అలాగే ఈ మూవీని అక్టోబర్ 20న రిలీజ్ చేస్తాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రంలో నూపుర్ సనన్, గాయత్రీ భరద్వాజ్ హీరోయిన్లుగా నటిస్తున్నారు.

సాక్షి బిజినెస్
మంగళవారం
15-8-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
79	6
65,402	19,435

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	13,734	▽	32
డోజోన్స్	35,250	▽	90
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,507	▽	17
డాక్స్	15,904	▲	72
షాంఘై	3,178	▽	11
నికాయ్	32,060	▽	414

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (24 క్యారెట్)	58,874
బంగారం (22 క్యారెట్)	58,638
వెండి (కిలో)	69,937

ఐటీసీ డార్క్ ఫ్యాంటసీకి బ్రాండ్ అంబాసిడర్‌గా షారుఖ్



ముంబై: ఐటీసీ సన్‌ఫీస్ట్ డార్క్ ఫ్యాంటసీ బిస్కెట్స్‌కు బాలీవుడ్ నటుడు షారుఖ్ ఖాన్ బ్రాండ్ అంబాసిడర్‌గా నియమితులయ్యారు. దీనికి సంబంధించిన ప్రచార ప్రకటనలను పలు భాషల్లో ఆవిష్కరిస్తున్నట్లు ఐటీసీ ఫుడ్స్ డివిజన్ సీవోవో అలీ హ్యారిస్ షేర్ తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఫ్యాన్స్ ఉన్న షారుఖ్ ఖాన్‌తో జట్టు కట్టడం బ్రాండ్‌కి మరింత తోడ్పడగలదని ఆయన పేర్కొన్నారు. కంపెనీ తలపెట్టిన హార్ దిల్ కీ ఫ్యాంటసీ ప్రచార కార్యక్రమాలు జీవితాన్ని అసాధారణంగా గడిపేలా స్ఫూర్తినిచ్చే విధంగా ఉన్నాయని షారుఖ్ ఖాన్ తెలిపారు.

టచ్ మొబైల్స్ 'ఫ్రీ ఫోన్' ఆఫర్



హైదరాబాద్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని మొబైల్ రిటైల్ చెయిన్ సంస్థ టచ్ మొబైల్స్ 'ఫ్రీ ఫోన్' ఆఫర్ ప్రకటించింది. 1947 ఆగస్టు నెలలో జన్మించిన వారికి మొబైల్ ఉచితంగా ఇస్తుంది. ఇండిపెండెన్స్ డే రోజున టచ్ స్టోర్‌ను సందర్శించి తమ ఆధార్ కార్డులోని పుట్టిన తేదీని చూపించి ఎలాంటి చార్జీలు లేకుండా ఫ్రీగా మొబైల్ ఫోన్‌ను సొంతం చేసుకోవచ్చు. ఈ ఆఫర్ ఆగస్టు 15 ఒక్క రోజుకే పరిమితం. అలాగే బ్రాండెడ్ ఫోన్లపై 50%, యాక్సెసరీస్‌లపై 77% వరకు తగ్గింపు అందిస్తుంది. ఒప్పో అన్ని మోడళ్లపై 15% వరకు క్యాష్ బ్యాక్ పొందవచ్చు. ప్రారంభ ధర రూ.6,999తో 32 అంగుళాల ఎల్‌ఈడీ టీవీని అందిస్తుంది. హెచ్‌డీఎఫ్‌సీ డెబిట్, క్రెడిట్ కార్డులపై 10% తక్షణ క్యాష్ బ్యాక్ పొందవచ్చు. సున్నా వడ్డీతో సులభ వాయిదా పద్ధతిలో అధునాతన మోడల్స్ పొందే అవకాశం ఉంది.

వొడాఐడియాకు భారీ నష్టాలు

క్యూ1లో రూ. 7,840 కోట్లు



న్యూఢిల్లీ: మొబైల్ టెలికం కంపెనీ వొడాఫోన్ ఐడియా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023–24) తొలి త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్–జూన్ (క్యూ1)లో నికర నష్టం మరింత పెరిగి రూ. 7,840 కోట్లను తాకింది. అధిక వ్యయాలు ప్రభావం చూపాయి. గతేడాది(2022–23) ఇదే కాలంలో రూ. 7,296 కోట్ల నష్టం నమోదైంది. మొత్తం ఆదాయం మాత్రం 2 శాతం స్వల్ప వృద్ధితో రూ. 10,656 కోట్లకు చేరింది. గత క్యూ1లో రూ. 10,407 కోట్ల టర్నోవర్ ప్రకటించింది. ఒక్కో వినియోగదారునిపై సగటు ఆదాయం(ఏఆర్‌పీయూ) రూ. 128 నుంచి రూ. 139కు మెరుగుపడింది.

ధర 'దడ'!



- జూలైలో టోకు, రిటైల్ ఆహార ధరల సెగ
- రిటైల్ ద్రవ్యోల్బణం 7.44%
- 15 నెలల గరిష్టం
- టోకున 14.25 శాతం పెరిగిన ఆహార బాస్కెట్ ధర

న్యూఢిల్లీ: ఆహార ధరలు ఇటు రిటైల్‌గానూ, అటు టోకుగానూ ఆకాశాన్నంటుతున్నాయి. ప్రభుత్వం జూలైకి సంబంధించి సోమవారం వెలువరించిన గణాంకాలు ఈ విషయాన్ని తెలిపాయి. రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) కీలక ద్రవ్య పరపతి విధానానికి ప్రాతిపదిక అయిన వినియోగ ధరల సూచీ (సీపీఐ) ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణం జూలైలో ఏకంగా 7.44%గా (2022 ఇదే నెల ధరలతో పోల్చి ధరల పెరుగుదల) నమోదయ్యింది. గడచిన 15 నెలల్లో ఈ స్థాయి రిటైల్ ద్రవ్యోల్బణం ఇదే తొలిసారి. సూచీలో కీలక విభాగాలైన కూరగాయలు, ఇతర ఆహార పదార్థాల ధరలు తీవ్రంగా పెరగడం దీనికి కారణం. ఆర్‌బీఐకి కేంద్రం నిర్దేశాల ప్రకారం, రిటైల్ ద్రవ్యోల్బణం ప్లస్ లేదా మైనస్‌తో 4% వద్ద ఉండాలి. అంటే అప్పర్ బ్యాండ్‌లో 6% అధిగమిస్తే... దానిని ఎకానమీలో డేంజర్ బెల్స్‌గా పరిగణించాల్సి ఉంటుంది. తాజా సమీక్షా నెలలో అంకెలు ఈ స్థాయిని అధిగమించడం గమనార్హం. 2022 జూలైలో రిటైల్ ద్రవ్యోల్బణం 6.71% ఉంటే, ఈ ఏడాది జూన్‌లో 4.87గా నమోదయ్యింది. 2022 ఏప్రిల్‌లో 7.79% రిటైల్ ద్రవ్యోల్బణం నమోదయ్యింది. ఆ స్థాయికి మళ్లీ రిటైల్ ద్రవ్యోల్బణం చేరడం ఆందోళన కలిగిస్తున్న అంశం.

ఫుడ్ బాస్కెట్ 11.51 శాతం అప్

వినియోగ ధరల సూచీలో కీలక విభాగాలు చూస్తే.. ఒక్క ఫుడ్ బాస్కెట్ ద్రవ్యోల్బణం జూలైలో 11.51%గా నమోదయ్యింది. జూన్‌లో ఈ రేటు 4.55 శాతం. జూలై 2022లో ఈ రేటు 6.69%గా ఉంది. ఒక్క కూరగాయల ధరలు జూలైలో ఏకంగా 37.43% ఎగశాయి. తృణ ధాన్యాలు, సంబంధిత ఉత్పత్తుల ధరలు 13% పెరిగినట్లు జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్‌ఎస్‌ఓ) పేర్కొంది.

టోకు సూచీ మైనస్ 1.36 శాతం...

టోకు ధరల సూచీ (డబ్ల్యూపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం జూలైలో వరుసగా నాల్గవనెల మైనస్‌లోనే కొనసాగింది. టోకు సూచీ బాస్కెట్ మొత్తంగా చూస్తే జూలై ధరలు అసలు పెరగకపోగా మైనస్ 1.36 శాతంగా నమోదయ్యింది. ఈ ధోరణిని ప్రతి ద్రవ్యోల్బణంగా పరిగణిస్తారు. కాగా, సూచీలో కీలక విభాగమైన ఫుడ్ బాస్కెట్‌లో ధరల స్పీడ్ మాత్రం ఏకంగా 14.25% ఎగసింది (గత ఏడాది జూలై ధరలతో పోల్చి). ఒక్క కూరగాయల ధరలు భారీగా 62.12% ఎగశాయి. తృణ ధాన్యాలు, పప్పు దినుసుల ధరలు వరుసగా 8.31%, 9.59% చొప్పున పెరిగాయి. ఇక మినరల్ ఆయిల్స్, బేసిక్ మెటల్స్, కెమికల్ అండ్ కెమికల్ ప్రొడక్ట్స్, జౌళి ధరలు మాత్రం తగ్గాయని వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వశాఖ పేర్కొంది. ఇదే ధోరణిలో ఆహార ధరలు పెరిగితే, టోకున ధరలు ప్రతి ద్రవ్యోల్బణం నుంచి ద్రవ్యోల్బణం బాటకు మారతాయని కేర్‌ఎడ్జ్ చీఫ్ ఎకనమిస్ట్ రజనీ సిన్హా పేర్కొన్నారు.

జూలైలో ఎగుమతులు 16% డౌన్

- విలువలో 32.25 బిలియన్ డాలర్లు
- అంతర్జాతీయ మందగమనం నేపథ్యం



న్యూఢిల్లీ: అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితి పరిస్థితులు భారత్ ఎగుమతులపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. దేశ జూలై ఎగుమతుల్లో (2022 ఇదే నెల గణాంకాలతో పోల్చి) అసలు వృద్ధిలేకపోగా 16 శాతం క్షీణించాయి. విలువలో 32.25 బిలియన్ డాలర్లుగా నమోదయ్యింది. కీలక పెట్రోలియం, రత్నాలు–ఆభరణాలు, ఇతర కీలక రంగాల ఎగుమతులు భారీగా పడిపోయాయి. వాణిజ్య పరిశ్రమల శాఖ తాజా గణాంకాలను విడుదల చేసింది.

దిగుమతులూ క్షీణతే..: ఇక దిగుమతుల విలువ కూడా జూలైలో 17% పడిపోయి 52.92 బిలియన్ డాలర్లకు పడిపోయింది. దీనితో ఎగుమతులు–దిగుమతుల మధ్య నికర వ్యత్యాసం– వాణిజ్యలోటు 20.67 బిలియన్ డాలర్లుగా నమోదయ్యింది. 2022 జూలైలో 25.43 బిలియన్ డాలర్లుగా ఉన్న వాణిజ్య లోటు తాజాగా దాదాపు 5 బిలియన్ డాలర్లకు తగ్గిపోవడం గమనార్హం.

నాలుగు నెలల్లోనూ..

ఈ ఏడాది (2022–23) ఏప్రిల్ నుంచి జూలై మధ్య ఎగుమతులు 14.5% పడిపోయి 136.22 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. దిగుమతులు 13.79 శాతం పడిపోయి 213.2 బిలియన్ డాలర్లకు చేరాయి. వెరసి వాణిజ్యలోటు 76.98 బిలియన్ డాలర్లుగా నమోదయ్యింది. ఇక ఈ నాలుగు నెలల్లో పసిడి దిగుమతులు 2.7% పెరిగి 13.2 బిలియన్ డాలర్లకు చేరాయి. చమురు దిగుమతుల బిల్లు 23.4% తగ్గి 55 బిలియన్ డాలర్లకు దిగివచ్చింది.

ఎలక్ట్రానిక్ వస్తువుల దిగుమతులపై మరిన్ని ఆంక్షలు ఉండబోవు: కేంద్రం

మరిన్ని ఎలక్ట్రానిక్ వస్తువులపై దిగుమతి ఆంక్షలు విధించే ప్రతిపాదన ప్రస్తుతానికి లేదని వాణిజ్య కార్యదర్శి సునీల్ బరత్వాల్ తెలిపారు. చైనా వంటి దేశాల నుంచి దిగుమతులను తగ్గించడానికి అలాగే దేశీయ తయారీని పెంచడానికి నవంబర్ 1 నుండి ల్యాప్‌టాప్‌లు, కంప్యూటర్లు, మరికొన్ని ఎలక్ట్రానిక్ పరికరాలపై దిగుమతి ఆంక్షలు విధించాలని ప్రభుత్వం నిర్ణయించడం తెలిసిందే. ఎలక్ట్రానిక్స్, మొబైల్ తయారీకి ప్రొడక్షన్–లింక్డ్ ఇన్సెంటివ్ (పీఎల్ఐ) పథకం వర్తిస్తుందని మంత్రి చెప్పారు.

ఐటీసీ లాభం జూమ్

క్యూ1లో రూ. 5,180 కోట్లు

న్యూఢిల్లీ: డైవర్సిఫైడ్ దిగ్గజం ఐటీసీ లిమిటెడ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) తొలి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్–జూన్(క్యూ1)లో నికర లాభం 16% ఎగసి రూ. 5,180 కోట్లను అధిగమించింది. గతేడాది(2022–23) ఇదే కాలంలో రూ. 4,462 కోట్లు ఆర్జించింది. నిర్వహణ ఆదాయం మాత్రం రూ. 19,831 కోట్ల నుంచి రూ. 18,639 కోట్లకు తగ్గింది. ఇది 6% క్షీణతకాగా.. మొత్తం వ్యయాలు సైతం 13% తగ్గి రూ. 12,422 కోట్లకు పరిమితమయ్యాయి. ఇక మొత్తం టర్నోవర్ 4% నీరసించి రూ. 19,362 కోట్లుగా నమోదైంది.

విభాగాలవారీగా..: తాజా క్యూ1లో ఐటీసీ.. ఎఫ్ఎంసీజీ విభాగం 13 శాతంపైగా వృద్ధితో రూ. 13,528 కోట్ల ఆదాయాన్ని సాధించింది. దీనిలో సిగరెట్ల బిజినెస్ నుంచి 12 శాతం అధికంగా రూ. 8,356 కోట్లు అందుకుంది. హోటళ్ల బిజినెస్ 8% బలపడి రూ. 625 కోట్ల ఆదాయం అందుకుంది.

'హోటల్' షేర్ల జారీ తీరిదీ..: ఐటీసీ హోటల్స్ పేరుతో ఆతిథ్య రంగ బిజినెస్‌ను ప్రత్యేక కంపెనీగా ఐటీసీ విడదీస్తున్న సంగతి తెలిసిందే. దీనిలో భాగంగా కంపెనీ బోర్డు 1:10 నిష్పత్తిలో షేర్ల జారీకి ఆమోదముద్ర వేసినట్లు ఐటీసీ పేర్కొంది. వాటాదారులకు ఐటీసీ లోగల ప్రతీ 10 షేర్లకుగాను 1 ఐటీసీ హోటల్ షేరును కేటాయించనుంది. షేర్ల జారీ తదుపరి ఐటీసీ హోటల్స్‌లో 60% వాటాను ఐటీసీ వాటాదారులు పొందనుండగా.. ఐటీసీ 40% వాటాను కలిగి ఉండనుంది. హోటల్ షేర్లు త్వరలో బీఎస్‌ఈ, ఎన్ఎస్ఈలో లిస్ట్‌కానున్నాయి. ఐటీసీ హోటల్స్‌ను ప్రత్యేక కంపెనీగా విడదీసి స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్ట్ చేసేందుకు సుమారు 15 నెలలు పట్టవచ్చని ఐటీసీ తాజాగా అంచనాలు ప్రకటించింది.

ఫలితాల నేపథ్యంలో ఐటీసీ షేరు బీఎస్ఈలో నామమాత్ర లాభంతో రూ. 449 వద్ద ముగిసింది.

రికార్డు కనిష్టానికి రూపాయి

26 పైసలు డౌన్; 83.08 వద్ద క్లోజింగ్

ముంబై: అంతర్జాతీయ మార్కెట్లలో ముడి చమురు ధరలు పెరగడం, డాలరు బలపడటం తదితర పరిణామాలతో రూపాయి మారకం విలువ సోమవారం ఆల్ టైమ్ కనిష్టానికి పడిపోయింది. డాలరుతో పోలిస్తే 26 పైసలు క్షీణించి 83.08 వద్ద క్లోజయ్యింది. విదేశీ పెట్టుబడులు తరలిపోతుండటం కూడా దేశీ కరెన్సీపై ప్రతికూల ప్రభావం చూపినట్లు విశ్లేషకులు తెలిపారు.



ఇంటర్ బ్యాంక్ ఫారిన్ ఎక్స్ఛేంజీలో 83.04 వద్ద రూపాయి ట్రేడింగ్ ప్రారంభమైంది. 82.94–83.11 గరిష్ట, కనిష్ట స్థాయిల మధ్య తిరుగాడింది. చివరికి క్రితం ముగింపుతో పోలిస్తే 26 పైసలు తగ్గి 83.08 వద్ద క్లోజయ్యింది. గత శుక్రవారం సైతం డాలరుతో పోలిస్తే 16 పైసలు క్షీణించి 82.82 వద్ద రూపాయి క్లోజయ్యింది.

నష్టాల్లోంచి లాభాల్లోకి...

- ఆదుకున్న ఆఖరి గంట కొనుగోళ్లు
- ఇంట్రాడే కనిష్టాల నుంచి రికవరీ
- రాణించిన రిలయన్స్, ఇన్ఫోసిస్ షేర్లు
- స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నేడు మార్కెట్లకు సెలవు



ముంబై: ఆఖరి గంటలో అధిక వెయిటేజీ రిలయన్స్, ఇన్ఫోసిస్, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లు రాణించడంతో స్టాక్ సూచీలు సోమవారం ఇంట్రాడే నష్టాలను భర్తీ చేసుకొని స్వల్ప లాభాలతో గట్టెక్కాయి. యూరప్ మార్కెట్ల లాభాల ప్రారంభం నుంచీ సానుకూల సంకేతాలు అందిపుచ్చుకున్నాయి. ట్రేడింగ్‌లో 501 పాయింట్లను కోల్పోయిన సెన్సెక్స్ చివరికి 79 పాయింట్ల లాభంతో 65,402 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 170 పాయింట్ల పతనం నుంచి తేరుకొని ఆరు పాయింట్ల స్వల్ప లాభంతో 19,435 వద్ద ముగిసింది. మెటల్, బ్యాంక్స్, ఫైనాన్స్, ఇంధన, ఫార్మా, కన్జూమర్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మంగళవారం ఎక్స్ఛేంజీలకు సెలవు ప్రకటించారు.

- అదానీ పోర్ట్స్ ఆడిటర్ బాధ్యతల నుంచి డెలాయిట్ నిష్క్రమణతో అదానీ గ్రూప్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. అత్యధికంగా అంబుజా సిమెంట్స్ షేరు 3.50% పతనమైంది. ప్రధాన కంపెనీ అదానీ ఎంటర్ ప్రైజెస్ షేరు 3.26% నష్టపోయింది. అదానీ ట్రాన్స్‌మిషన్స్ 2.50%, ఏసీసీ, అదానీ గ్రీన్ ఎనర్జీ, అదానీ విల్మార్, అదానీ టోటల్ గ్యాస్ షేర్లు 2% వరకు నష్టపోయాయి. అదానీ పోర్ట్స్ 1.50%, ఎన్‌డీటీవీ 1.30%, అదానీ పవర్ ఒక శాతం పతనయ్యాయి.
- రూ.880 కోట్ల నిధుల సమీకరణ లక్ష్యంతో గత వారం ఐపీఓకు వచ్చిన టీవీఎస్ సప్లై చివరి రోజు నాటికి 2.78 రెట్ల సబ్‌స్క్రిప్షన్ సాధించింది. ఇష్యూలో భాగంగా కంపెనీ 2.51 కోట్ల ఈక్విటీ షేర్లను జారీ చేయగా మొత్తం 6.98 కోట్ల షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి.

విద్య, ఉద్యోగ సమాచారం

జామ్-2024

దేశంలోని ఐఐటీ(ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ)ల్లో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎమ్మెస్సీ, ఎమ్మెస్సీ–పీహెచ్‌డీ(డ్యూయల్ డిగ్రీ) కోర్సుల్లో ప్రవేశాలకు జాయింట్ అడ్మిషన్ టెస్ట్ ఫర్ మాస్టర్స్(జామ్–2024) పరీక్షను నిర్వహిస్తారు. అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం సీట్ల సంఖ్య: 3000

» **తెలుగు రాష్ట్రాల ఐఐటీల్లో సీట్ల వివరాలు:** ఐఐటీ హైదరాబాద్‌లో ఎమ్మెస్సీ కెమిస్ట్రీ, మ్యాథ్స్, ఫిజిక్స్ సబ్జెక్టులలో 105 సీట్లను జామ్ ర్యాంకు ఆధారంగా కేటాయిస్తారు. ఐఐటీ తిరుపతిలో ఎమ్మెస్సీ కెమిస్ట్రీ, ఫిజిక్స్, మ్యాథ్స్–స్టాటిస్టిక్స్‌లో మొత్తం 60 సీట్లున్నాయి.

» **అర్హత:** నిర్దేశిత విభాగాల్లో డిగ్రీ ఉత్తీర్ణులైన వారు అర్హులు. ప్రస్తుతం ఆఖరి సంవత్సరం చదువుతున్నవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

» **సబ్జెక్టులు:** ఏడు సబ్జెక్టుల్లో ఈ ప్రవేశ పరీక్షను నిర్వహిస్తారు. అవి బయోటెక్నాలజీ, కెమిస్ట్రీ, ఎకనామిక్స్, జియాలజీ, మ్యాథమేటిక్స్, మ్యాథమేటికల్ స్టాటిస్టిక్స్, ఫిజిక్స్. వీటిలో ప్రతిభ చూపిన వారు ఏడు సబ్జెక్టులకు చెందిన పలు స్పెషలైజేషన్లతో కోర్సులు ఎంచుకోవచ్చు. పరీక్ష కోసం అభ్యర్థులు ఒకటి లేదా గరిష్టంగా రెండు సబ్జెక్టులు ఎంచుకోవచ్చు. సెషన్–1లో ఒకటి, సెషన్–2లో మరొక సబ్జెక్టులో పరీక్ష రాసుకోవచ్చు. సెషన్–1లో కెమిస్ట్రీ, జియాలజీ, మ్యాథమేటిక్స్ సబ్జెక్టుల్లో పరీక్ష నిర్వహిస్తారు. రెండో సెషన్‌లో బయోటెక్నాలజీ, ఎకనామిక్స్, మ్యాథమేటికల్ స్టాటిస్టిక్స్, ఫిజిక్స్ సబ్జెక్టులు ఉంటాయి.

» **పరీక్ష విధానం:** ఆన్‌లైన్ విధానంలో పరీక్ష జరుగుతుంది. పరీక్ష వ్యవధి 3 గంటలు. ఇంగ్లిష్ మాధ్యమంలో ప్రశ్నపత్రం ఉంటుంది. ఏ సబ్జెక్టు ప్రశ్నపత్రంలోనైనా మొత్తం ఆబ్జెక్టివ్ 60 ప్రశ్నలు–వంద మార్కులు. మూడు విభాగాల్లో(మల్టిపుల్ ఛాయిస్, మల్టిపుల్ సెలెక్ట్, న్యూమరికల్) ప్రశ్నలు అడుగుతారు. వీటికి ఎ, బి, సి సెక్షన్లుగా విభజించారు.

» **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: ఆంధ్రప్రదేశ్:** విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, ఒంగోలు, తిరుపతి. **తెలంగాణ:** హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, ఖమ్మం.

ముఖ్య సమాచారం

» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి

» ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభతేది: 05.09.2023.

» దరఖాస్తులకు గడువుతేది: 13.10.2023.

» పరీక్ష తేది: 11.02.2024.

» వెబ్‌సైట్: https://jam.iitm.ac.in

ఏకలవ్య స్కూల్స్.. గురువులకు ఆహ్వానం

» టీచింగ్,నాన్-టీచింగ్ విభాగాల్లో 6,329 కొలువులు
» టీజీటీ హోదాలో మొత్తం 5,660 పోస్టులు
» కేంద్ర గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నోటిఫికేషన్
» రాత పరీక్షలో మెరిట్ ఆధారంగా నియామకాలు



ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్ కొలువు కోరుకునే వారికి చక్కటి అవకాశం స్వాగతం పలుకుతోంది! జాతీయ స్థాయిలో కేంద్ర ప్రభుత్వ పరిధిలోని..ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్‌లో.. టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నియామక ప్రక్రియ ద్వారా టీచింగ్, నాన్-టీచింగ్ విభాగాల్లో మొత్తం 6,329 పోస్టులను భర్తీ చేయనున్నారు. టీచింగ్ విభాగంలో 5,660 టీజీటీ పోస్టులున్నాయి. ఈ నేపథ్యంలో.. ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్ ప్రత్యేకత, భర్తీ చేయనున్న పోస్టుల వివరాలు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం తదితర వివరాలు..

కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటైన విద్యా సంస్థలు.. ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్. ప్రస్తుతం జాతీయ స్థాయిలో మొత్తం 740 పాఠశాలలు ఉండగా.. తెలుగు రాష్ట్రాలైన ఏపీలో 28, తెలంగాణలో 23 స్కూల్స్ ఉన్నాయి. వీటిలో ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు.. పూర్తిగా గురుకుల విధానంలో విద్యాబోధన సాగుతోంది.

మొత్తం 6,329 పోస్టులు

తాజా నియామక ప్రక్రియ ద్వారా టీచింగ్, నాన్-టీచింగ్ విభాగాల్లో మొత్తం 6,329 పోస్టులను భర్తీ చేయనున్నారు. టీచింగ్ విభాగంలో ట్రెయిన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్(టీజీటీ) 5,660 పోస్టులు, నాన్ టీచింగ్ పోస్టుల విభాగంలో 669 హాస్టల్ వార్డెన్ పోస్టుల భర్తీకి ఎంపిక ప్రక్రియ చేపడతారు.

వేతనాలు

- టీజీటీ(తృతీయ భాష) వేతన శ్రేణి–రూ.44,900–రూ.1,42,400.
- టీజీటీ(ఇతర విభాగాలు) వేతన శ్రేణి–రూ.35,400–రూ.1,12,400.
- హాస్టల్ వార్డెన్స్ వేతన శ్రేణి రూ.29,200–రూ.92,300.

అర్హతలు

- అభ్యర్థులు తాము దరఖాస్తు చేసుకుంటున్న సబ్జెక్ట్‌తో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు సంబంధిత సబ్జెక్ట్ మెథడాలజీలో బీఈడీ పాసై ఉండాలి.
- థర్డ్ లాంగ్వేజ్ పోస్టుల అభ్యర్థులు మూడేళ్ల బ్యాచిలర్ డిగ్రీలో సదరు భాషను ఎలక్టివ్ సబ్జెక్ట్‌గా మూడేళ్ల పాటు చదివుండాలి. –సీటెట్‌లో ఉత్తీర్ణత సాధించాలి.
- ఎన్‌సీటీఈ నిర్వహించే నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ బీఈడీ కోర్సు పూర్తి చేసుకున్న వారికి బీఈడీ అర్హత నిబంధన అవసరం ఉండదు.
- మ్యూజిక్ టీచర్ పోస్టుల అభ్యర్థులు గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి మ్యూజిక్‌లో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి.
- **ఆర్ట్ టీచర్:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఫైన్ ఆర్ట్స్/క్రాఫ్ట్‌లో ఉత్తీర్ణత లేదా రీజనల్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ నుంచి ఫైన్ ఆర్ట్స్‌లో బీఈడీ పాసవ్వాలి.
- **టీజీటీ-పీఈటీ:** బీపీఈడీ ఉత్తీర్ణత ఉండాలి.
- **లైబ్రేరియన్:**గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బ్యాచిలర్ ఆఫ్ లైబ్రరీ సైన్స్ ఉత్తీర్ణులవ్వాలి. లేదా బ్యాచిలర్ డిగ్రీ అర్హతగా లైబ్రరీ సైన్స్‌లో ఏడాది వ్యవధిలోని డిప్లొమా ఉత్తీర్ణత సాధించాలి.
- **హాస్టల్ వార్డెన్:** బ్యాచిలర్ డిగ్రీ లేదా ఎన్‌సీటీఈ నిర్వహించే నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ బీఈడీ కోర్సు ఉత్తీర్ణులవ్వాలి.

వయసు

- అన్ని పోస్టులకు 18.08.2023 నాటికి వయసు 18–35 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు అయిదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు చొప్పున గరిష్ట వయో పరిమితిలో సడలింపు లభిస్తుంది.

ఎంపిక ప్రక్రియ

ఏకలవ్య గురుకుల పాఠశాలల్లో పోస్టుల భర్తీకి జాతీయ స్థాయిలో ఈఎంఆర్ఎస్ స్టాఫ్ సెలక్షన్ ఎగ్జామ్(ఈఎస్ఈఈ)ను నిర్వహించనున్నారు. ఈ పరీక్షలో మెరిట్ ఆధారంగా తుది జాబితా రూపొందించి నియామకాలు ఖరారు చేస్తారు.

120 మార్కులకు టీజీటీ పరీక్ష

టీజీటీ పోస్టులకు సంబంధించి రాత పరీక్షను నాలుగు విభాగాలుగా మొత్తం 120 మార్కులకు నిర్వహిస్తారు. పార్ట్–1 జనరల్ అవేర్‌నెస్ 10 ప్రశ్నలు–10 మార్కులు; పార్ట్–2 రీజనింగ్ ఎబిలిటీ 10 ప్రశ్నలు–10 మార్కులు; పార్ట్–3 ఐసీటీ నాలెడ్జ్ 10 ప్రశ్నలు–10 మార్కులు; పార్ట్–4 టీచింగ్ ఆప్టిట్యూడ్ 10 ప్రశ్నలు–10 మార్కులు; పార్ట్–5 సంబంధిత సబ్జెక్ట్ 80 ప్రశ్నలు–80మార్కులు.. ఇలా మొత్తం 120 ప్రశ్నలు–120 మార్కులకు పరీక్ష జరుగుతుంది. టీజీటీ పరీక్ష వ్యవధి మూడు గంటలు.

హాస్టల్ వార్డెన్ రాత పరీక్ష

ఏకలవ్య గురుకుల పాఠశాలల్లో భర్తీ చేయనున్న హాస్టల్ వార్డెన్ పోస్టులకు ప్రత్యేక రాత పరీక్ష నిర్వహిస్తారు. ఈ పరీక్ష ఆరు విభాగాల్లో 120 మార్కులకు ఉంటుంది. పార్ట్–1 జనరల్ అవేర్‌నెస్ 10 ప్రశ్నలు–10 మార్కులు; పార్ట్–2 రీజనింగ్ ఎబిలిటీ 20 ప్రశ్నలు–20 మార్కులు; పార్ట్–3 ఐసీటీ నాలెడ్జ్ 20 ప్రశ్నలు–20 మార్కులు; పార్ట్–4 పోస్కో, బాలల భద్రతకు సంబంధించిన చట్టాలు 10 ప్రశ్నలు–10 మార్కులు; పార్ట్–5 అడ్మినిస్ట్రేటివ్ ఆప్టిట్యూడ్ 30 ప్రశ్నలు–30 మార్కులు; పార్ట్–6 లాంగ్వేజ్ కాంపిటెన్సీ(హిందీ, ఇంగ్లిష్, ప్రాంతీయ భాష) 30 ప్రశ్నలు–30 మార్కులు.. ఇలా మొత్తం 120 ప్రశ్నలు–120 మార్కులకు పరీక్ష జరుగుతుంది. పరీక్ష వ్యవధి రెండున్నర గంటలు.

లాంగ్వేజ్ కాంపిటెన్సీ టెస్ట్

- టీజీటీ, హాస్టల్ వార్డెన్ పోస్టులకు అయిదు విభాగాల్లో పరీక్షతోపాటు.. ప్రత్యేకంగా లాంగ్వేజ్ కాంపిటెన్సీ టెస్ట్‌ను 30 మార్కులకు నిర్వహిస్తారు. అభ్యర్థులు తాము పరీక్షకు హాజరవుతున్న మాధ్యమానికి సంబంధించిన భాషలో ఈ టెస్ట్ ఉంటుంది. ఇందులో జనరల్ ఇంగ్లిష్ నుంచి 10 ప్రశ్నలు, హిందీ నుంచి 10 ప్రశ్నలు, ఎంచుకున్న లాంగ్వేజ్ నుంచి 10 ప్రశ్నలు చొప్పున అడుగుతారు.
- లాంగ్వేజ్ కాంపిటెన్సీ టెస్ట్‌లో భాగంగా మొత్తం 18 భాషల్లో ఏదో ఒకదాన్ని ఎంచుకునే అవకాశముంది. బెంగాలీ, డోంగ్రి, గారో, గుజరాతీ, హిందీ, కన్నడ, కశ్మీరీ, ఖాసీ, మళయాళం, మణిపురి, మరాఠి, మిజో, నేపాలి, ఒడియా, సంథాలి, తెలుగు, ఉర్దూ బాషల్లో ఏదో ఒక భాషను రీజనల్ లాంగ్వేజ్‌గా ఎంచుకోవచ్చు.
- టీజీటీ పోస్టులకు సంబంధించి లాంగ్వేజ్ కాంపిటెన్సీ టెస్ట్‌ను కేవలం అర్హత విభాగంగానే పేర్కొన్నారు. ఇందులో ఇంగ్లిష్, హిందీ, రీజనల్ లాంగ్వేజ్ మూడు భాషల్లోనూ 40 శాతం మార్కులు చొప్పున పొందాల్సి ఉంటుంది. అప్పుడే మిగతా విభాగాలను మూల్యాంకన చేస్తారు.

నెగెటివ్ మార్కులు

- టీజీటీతోపాటు హాస్టల్ వార్డెన్.. ఈ రెండు పరీక్షలు ఓఎంఆర్ బేస్డ్ టెస్ట్‌గా పెన్–పేపర్ విధానంలో ఆబ్జెక్టివ్ తరహాలో ఉంటాయి. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు కేటాయిస్తారు. ప్రతి తప్పు సమాధానానికి 1/4వ వంతు మార్కు తగ్గిస్తారు.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: 18.08.2023
- ఈఎస్ఈఈ పరీక్ష తేదీ: నవంబర్‌లో నిర్వహించే అవకాశం ఉంది.
- తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: విజయవాడ, హైదరాబాద్.
- వెబ్‌సైట్: emrs.tribal.gov.in

రాత పరీక్షలో రాణించేలా

జనరల్ అవేర్‌నెస్

ఈ విభాగంలో మంచి మార్కుల కోసం స్టాక్ జీకేతో పాటు కరెంట్ అఫైర్స్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలి. ముఖ్యంగా ఇటీవల కాలంలో జరిగిన జాతీయ–అంతర్జాతీయ ఒప్పందాలు, కేంద్ర ప్రభుత్వ తాజా సంస్కరణలు/విధానాలు వంటి వాటిపై దృష్టి పెట్టాలి.

రీజనింగ్ ఎబిలిటీ

పజిల్స్, సీటింగ్ అరేంజ్‌మెంట్, డేటా సఫిషియన్సీ, వెర్బల్ రీజనింగ్, బ్లడ్ రిలేషన్స్, సీక్వెన్సెస్, సిరీస్, డైరెక్షన్స్, అసెర్షన్ అండ్ రీజన్, వెన్ డయాగ్రమ్‌లను ప్రాక్టీస్ చేయాలి.

టీచింగ్ ఆప్టిట్యూడ్

ఈ విభాగం కోసం టీచింగ్ విధానాలు, భావనలు,లక్ష్యాలు, ప్రాథమిక అవసరాలు, అభ్యాసకు లక్షణాలు, టీచింగ్‌ను ప్రభావితం చేసే అంశాలు, టీచింగ్ మెథడ్స్, టీచింగ్ ఎయిడ్స్, మూల్యాంకన విధానాలపై అవగాహన పెంచుకోవాలి.

ఐసీటీ నాలెడ్జ్

ఈ విభాగం కోసం కంప్యూటర్ సిస్టమ్ ప్రాథమిక భావనలు, ఆపరేటింగ్ సిస్టమ్స్ బేసిక్స్, ఎంఎస్ ఆఫీస్, కీ–బోర్డ్ షాట్ కట్స్, కంప్యూటర్‌కు సంబంధించిన పదజాలం, అబ్రివేషన్లు, కంప్యూటర్ నెటవర్క్స్, సైబర్ సెక్యూరిటీ, ఇంటర్నెట్ సంబంధిత అంశాలపై దృష్టి పెట్టాలి.

సబ్జెక్ట్ మెథడాలజీ

పార్ట్–5గా ఉండే డొమైన్ నాలెడ్జ్‌లో.. సబ్జెక్ట్ మెథడాలజీ నుంచి 65 ప్రశ్నలు అడుగుతారు. అభ్యర్థులు బ్యాచిలర్ డిగ్రీ స్థాయిలో తాము చదివిన సబ్జెక్ట్‌లపై అవగాహన పెంచుకోవాలి. ఆయా సబ్జెక్ట్‌లకు సంబంధించి భావనలు, సిద్ధాంతాలు, నిబంధనలను విశ్లేషిస్తూ అధ్యయనం చేస్తే..ఏ కోణంలో ప్రశ్న అడిగినా సమాధానం ఇచ్చే సన్నద్ధత లభిస్తుంది.

పెడగాజీపైనా

పార్ట్–5లోనే యాక్టివిటీ బేస్డ్ పెడగాజీ, కేస్ ఆధారిత ప్రశ్నలు 10 అడుగుతారు. అభ్యర్థులు.. విద్యా దృక్పథాలు, పెడగాజీ, చైల్డ్ డెవలప్‌మెంట్, శిశు వికాసం వంటి అంశాలపై దృష్టి పెట్టాలి. పెడగాజికి సంబంధించి సహిత విద్య, శిశువు విద్యా ప్రణాళిక, బోధన పద్ధతులు, మూల్యాంకనం–నాయకత్వం–గైడెన్స్–కౌన్సెలింగ్ గురించి అధ్యయనం చేయాలి. ఎడ్యుకేషన్‌కు సంబంధించిన చట్టాలపై పూర్తి అవగాహన పొందాలి. ముఖ్యంగా నూతన విద్యా విధానం–2020పై ప్రత్యేక దృష్టి పెట్టాలి.

లైబ్రేరియన్ రాత పరీక్ష

లైబ్రేరియన్ పోస్టులకు నిర్వహించే రాత పరీక్షలో రాణించేందుకు.. లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ ఫౌండేషన్, నాలెడ్జ్ ఆర్గనైజేషన్, ఇన్ఫర్మేషన్ ప్రాసెసింగ్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ బేసిక్స్, మేనేజ్‌మెంట్ ఆఫ్ లైబ్రరీస్ అండ్ ఇన్ఫర్మేషన్ సెంటర్స్/ ఇన్‌స్టిట్యూషన్స్, ఇన్ఫర్మేషన్ సోర్సెస్, సర్వీసెస్, లైబ్రరీ యూజర్స్‌కు సంబంధించి అన్ని అంశాలపైనా అవగాహన పెంచుకోవాలి.

ఏపీలో ఇక 'స్వాభిమానం'తో ట్రాన్స్‌జెండర్లు

జూన్ 12న వైజాగ్ నుంచి టోల్‌ఫ్రీ నంబర్ 1091కు కాల్ వచ్చింది. ట్రాన్స్‌జెండర్ (విద్యార్థిని) సెకండ్ షో సినిమాకెళ్లి ఇంటికొచ్చేందుకు ఆటో ఎక్కింది. అందులో నలుగురు యువకులు. డ్రైవర్ కలిసి ట్రాన్స్‌జెండర్ పట్ల అసభ్యంగా ప్రవర్తించారు. దీంతో ఆటో నుంచి దూకేసింది. స్వాభిమాన్ హెల్ప్‌లైన్ 1091కి ఫిర్యాదు చేసింది. దీంతో వైజాగ్‌లోని ఆరిలోవ పీఎస్‌లో యువకులపై కేసు నమోదైంది. చట్టపరమైన చర్యలు చేపట్టారు. స్వాభిమాన్ హెల్ప్‌లైన్ ద్వారా రాష్ట్రంలో నమోదైన తొలి ఎఫ్‌ఐఆర్ ఇదే.

◇

రాజమండ్రిలో ఓ ట్రాన్స్‌జెండర్‌ను కుటుంబ సభ్యులు హేళన చేసేవారు. మాటలతో హింసించేవారు. ఇక భరించలేక టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి ఆవేదన వ్యక్తం చేసింది. 'స్వాభిమాన్' నుంచి వచ్చిన వారు కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. అప్పట్నుంచి ట్రాన్స్‌జెండర్‌కు కుటుంబ సభ్యుల నుంచి వేధింపుల్లేవు.

- రాష్ట్రంలో స్వాభిమాన్ టోల్ ఫ్రీ నంబర్ 1091
- ఫిర్యాదు చేయగానే అందుబాటులోకి పోలీసులు
- నేరం తీవ్రత ఆధారంగా కేసు లేదా కౌన్సెలింగ్
- విశాఖలో మొదటి ఎఫ్‌ఐఆర్ నమోదు

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): రాష్ట్రంలో ట్రాన్స్‌జెండర్ల భద్రత, రక్షణ కోసం ఏపీ ప్రభుత్వం తొలిసారి మే 17న 24/7 స్వాభిమాన్ టోల్‌ఫ్రీ నంబర్ 1091ను అందుబాటులోకి తెచ్చింది. క్రైం ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్(సీఐడీ) ఆధ్వర్యంలో ఇది పనిచేస్తుంది. మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ గుంటూరు సీఐడీ ప్రాంతీయ కార్యాలయంలో దీనిని ప్రారంభించారు. జిల్లాల్లోని దిశ మహిళా పోలీస్‌స్టేషన్(పీఎస్) డీఎస్పీ జిల్లా నోడల్ అధికారిగా, సీఐడీ ఎస్పీ రాష్ట్ర నోడల్ అధికారిగా ఉన్నారు. ఇప్పటి వరకు 14కి పైగా కాల్స్ వచ్చాయి. వైజాగ్, పీఎస్ఆర్ నెల్లూరు జిల్లా, ఒంగోలు, గుంటూరు జిల్లాల నుంచి ఎక్కువ మంది కాల్స్ చేశారు. ట్రాన్స్‌జెండర్ల ఫిర్యాదులను ఫోన్లో విని.. నేరాలకు సంబంధించినవైతే స్వాభిమాన్ బృందం జిల్లా నోడల్ అధికారి/దిశ(పీఎస్) డీఎస్పీ దృష్టికి తీసుకెళ్తారు. ఫిర్యాదు ఆధారంగా ఎఫ్‌ఐఆర్ నమోదు చేస్తారు. కుటుంబ సభ్యుల నుంచి, ఇతరుల నుంచి ఇబ్బందులైతే వారికి కౌన్సెలింగ్ ఇస్తారు. ఒకవేళ టోల్‌ఫ్రీ నంబర్ 1091కు బాధను వ్యక్తపరచలేకపోతే 'స్వాభిమాన్ సెల్, సీఐడీ సబ్‌హెడ్ క్వార్టర్స్, గుంటూరు' అనే చిరునామాకు ఉత్తరాలు పంపొచ్చు. అత్యంత గోప్యంగా విచారించి సమస్యకు పరిష్కార మార్గం చూపుతారు. అంతేకాదు గతేడాది నవంబర్‌లో సీఐడీ ప్రధాన కార్యాలయంలో రాష్ట్ర స్థాయిలో ట్రాన్స్‌జెండర్ పర్సన్స్ ప్రొటెక్షన్ సెల్‌ను అందుబాటులోకి తెచ్చారు. వారి భద్రత, రక్షణతో పాటు వారి సమస్యలు పరిష్కరించేందుకు దీనిని నెలకొల్పారు. ప్రేమ పేరుతో మోసపోయి ఆత్మహత్యలకు పాల్పడుతున్న ఘటనలను పూర్తిగా నివారించాలన్నదే ఈ సెల్ లక్ష్యం.



స్వాభిమాన్ టోల్‌ఫ్రీ నంబర్ 1091



స్వాభిమాన్ హెల్ప్‌లైన్ 1091ను ప్రారంభిస్తున్న వాసిరెడ్డి పద్మ(ఫైల్)

వివక్షకు గురిచేయడం నేరం..



టోల్‌ఫ్రీ నంబర్ 1091కు ఫిర్యాదు వచ్చిన వెంటనే పరిష్కరిస్తున్నాం. ట్రాన్స్‌జెండర్లను తక్కువగా చూడకూడదు. వారిపై వివక్ష చూపడం నేరం. మానవతా దృక్పథంతో వారిని ఆదరించాలి.

– సీఐడీ ఎస్పీ సరిత, స్వాభిమాన్ రాష్ట్ర నోడల్ అధికారి

పోలీసులు అండగా నిలుస్తున్నారు..



ట్రాన్స్‌జెండర్ల రక్షణ, భద్రత కోసం ప్రత్యేకంగా సీఐడీ ఆధ్వర్యంలో టోల్‌ఫ్రీ నంబర్ 1091 అమలు చేయడం ఆనందంగా ఉంది. ఎక్కడైనా ఏదైనా జరిగితే వెంటనే ఆ నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయొచ్చు. పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి వచ్చి మాకు అండగా నిలుస్తారు.

– శివమ్మ, ట్రాన్స్‌జెండర్, గుంటూరు జిల్లా

కౌన్సెలింగ్ సెంటర్ల ఏర్పాటు

ట్రాన్స్‌జెండర్ల సాధకబాధలు విని వారికి కౌన్సెలింగ్ ఇచ్చేందుకు విజయవాడ, కాకినాడ, తిరుపతి, కర్నూలు, అనంతపురం, విశాఖల్లో కౌన్సెలింగ్ సెంటర్లను ఏర్పాటు చేశారు. ఒక్కో కేంద్రంలో నిష్ణాతులైన ఇద్దరు కౌన్సెలర్లుంటారు. కాగా, గత నెలలో జిల్లాల నోడల్ అధికారులు, గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులకు నిపుణులతో ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో తర్ఫీదునిచ్చారు. ట్రాన్స్‌జెండర్లకు చట్టం కల్పించిన హక్కులు, బాధ్యతలపై అవగాహన కల్పిస్తున్నారు.

ఆదిమ మహిళలూ వేట నిపుణులే!



- పురుషులతో సమానంగా జంతు వేట
- పురుషుల కంటే మెరుగైన వేట వ్యూహాలు
- బిడ్డ తల్లులుగా, వృద్ధాప్యంలోనూ వేటను కొనసాగింపు
- మృతి చెందిన మహిళలతో పాటే అప్పట్లో వేట సామగ్రి ఖననం
- సియాటెల్ పసిఫిక్ వర్సిటీ పరిశోధకుల అధ్యయనంలో వెల్లడి

సాక్షి, అమరావతి: ఆదిమ కాలంలో 'మగవాళ్లు వేటాడేవారు, ఆడవాళ్లు ఆ వేటను సేకరించేవారు' అనే అభిప్రాయాన్ని ఓ కొత్త అధ్యయనం కొట్టిపారేసింది. అప్పట్లో ఆహార సేకరణలో ఆడవాళ్లు కూడా పెద్ద జంతువులను వేటాడేవారని ఆ అధ్యయనం స్పష్టం చేసింది. అమెరికాలోని సియాటెల్ పసిఫిక్ విశ్వవిద్యాలయం బృందం చేసిన పరిశోధనల్లో ఆదిమ కాలం నాటి మహిళల శక్తి సామర్థ్యాలపై పలు ఆసక్తికర విషయాలు వెలుగు చూశాయి. ఆర్కియాలజిస్టులు, ఆంత్రోపాలజిస్టులు ఇంతకాలం నమ్ముతూ వచ్చిన **'మగవాళ్లే** వేటగాళ్లు' అనే అభిప్రాయాన్ని పటాపం**చలు** చేసేలా ఆడవాళ్లు కూడా మగవాళ్ల**తో** సమానంగా వేట సాగించేవారు అనేందుకు తగిన ఆధారాలను అధ్యయన బృందం సేకరించింది. ఉత్తర, దక్షిణ అమెరికాలతో పాటు ఆసియా, ఆఫ్రికా, ఆస్ట్రేలియా, ఓషియానిక్ ప్రాంతానికి చెందిన వేటాడే మానవ సమూహాలపై వారు అధ్యయనం చేశారు. నేటి సమాజంలో వేటతో పాటు ఇతర వన ఆహారాన్ని సేకరించే 63 సమూహాలను పరిశోధకుల బృందం గుర్తించింది. వీరికి సంబంధించిన రెండు శతాబ్దాల డేటాను విశ్లేషించింది. దీనిలో 80 శాతం సమూహాల్లో మహిళలు కూడా వేట సాగించేవారు అనేది నిర్ధారణ అయింది. అవకాశం వస్తేనే వేటాడడం అనేది కాకుండా జంతువు కోసం మాటు వేయడం, దానిని చంపడం వంటి పనులు మహిళలు కూడా చేసేవారు.

మహిళల సమాధుల్లో వేట సామగ్రి

ఆదిమ సమాజాల్లో మృతి చెందిన మహిళలతో పాటే వారి వేట సామగ్రిని ఖననం చేసినట్టు పరిశోధకులు ధ్రువీకరించారు. గతంలో వీటిని వేటాడే సాధనాలుగా ఎవరూ చూడలేదని.. వాస్తవానికి అవి ఆహారాన్ని సేకరించే వస్తువులేనని అప్పట్లో తేల్చారు. యుక్త వయసులోనే కాకుండా, బిడ్డకు తల్లి అయిన తర్వాత, ప్రౌఢ వయసులో కూడా వేట కొనసాగించారని గుర్తించారు. పురుషుల కంటే మెరుగైన వేట వ్యూహాలను ప్రదర్శించడం, వేట **పద్ధతులను** బోధించడంలో మహిళలు **చురుకై**న పాత్ర పోషించినట్టు **కను**గొన్నారు.



ఆయుధాల ఎంపికలోనూ..

ఆదిమ మహిళలు వేట కోసం పురుషు**ల** కంటే ఎక్కువ రకాల ఆయుధాలను **వాడి**నట్లు తెలుస్తోంది. వేస్ స్టేట్ వర్సిటీకి **చెందిన** రాండీ హాస్ బృందం పెరూలో 2018లో పెద్ద సంఖ్యలో వేట సాధనాలతో ఖననం చేసిన 9 వేల సంవత్సరాల నాటి మహిళ సమాధిని కనుగొన్నారు. పురుషులు ఒంటరిగా లేదా జంటగా వేటాడేందుకు మొగ్గు చూపగా, స్త్రీలు ఒంటరిగా, పురుషునితో లేదా తోటి స్త్రీలతో, కుక్కల సహాయంతో వేటాడేవారు. వారి వేటలో చిన్న **జం**తువుల నుంచి పెద్ద జం**తు**వుల వరకు ఉండటం **గమ**నార్హం. ఉదాహరణకు **ఫిలిప్పీన్స్**లో విల్లులు, బాణా**లపై ఆధా**రపడే అగ్టా పురుషులతో పోలిస్తే మహిళలు విభిన్న వేట సాధనాలు ఉపయోగించారు. తరచుగా కత్తులను వాడుతూ పగటి పూట వేటలో పాల్గొనే వారు. పెరువియన్ అమెజాన్‌లోని మాట్సెస్ సొసైటీలోని మహిళలు కర్రలు, మాచేట్ (పదునైన ఆయుధం)లను ఉపయోగించి పెద్ద జంతువులను వేటాడేవారని అధ్యయనం వెల్లడించింది.

ఎర్రకోటపై ఏకవస్త్ర జెండా ఎగురవేయాలి

- రాష్ట్రపతికి చేనేత జెండా తయారీదారు సత్యనారాయణ వినతి
- అభినందించిన ముర్ము

సాక్షి, న్యూఢిల్లీ: ఎర్రకోటపై ఎలాంటి అతుకులు, కుట్లు లేని చేనేత జాతీయ జెండాను ఎగురవేసేలా చూడడమే తన ఆకాంక్ష అని ఏకవస్త్రంతో మువ్వన్నెల జెండాను తయారుచేసిన రుద్రాక్షల సత్యనారాయణ తెలిపారు. జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య స్ఫూర్తితో 8/12 సైజ్‌లో అతుకులు లేని జెండాను తయారు చేసినట్లు చెప్పారు. పశ్చిమ గోదావరి జిల్లా ఆచంట మండలం వేమవరం గ్రామానికి చెందిన సత్యనారాయణ సోమవారం ఢిల్లీలో విశ్రాంత ఐఏఎస్ రామచంద్రు తేజావత్, ప్రముఖ నటి పూనం కౌర్‌తో రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిశారు. తాను తయారుచేసిన చేనేత జెండాను ఆమెకు చూపించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ ప్రతిభను రాష్ట్రపతి అభినందించారు. అనంతరం ఏపీ భవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన జెండా నిబంధనలు, సైజులను పాటించి తాను ఈ చేనేత జెండాను తయారు చేశానన్నారు. ఎర్రకోటపై ఈ జెండాను ఎగురవేయడంతోపాటు ఆర్థికంగా తనను ఆదుకోవాలని రాష్ట్రపతి అధికారులకు ఆదేశాలిచ్చారని తెలిపారు. ఈ జెండా తయారీకి గత నాలుగేళ్లలో రూ.6.50 లక్షలు ఖర్చు చేశానన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వాలు ఎగురవేయడానికి 4/6 సైజ్ జెండాలు రూపొందించానని చెప్పారు.

● తెలంగాణ

నీళ్ల బకెట్‌లో పడి చిన్నారి మృతి

రుద్రూర్: ఇంటి ఆవరణలో ఆడుకుంటున్న ఓ చిన్నారి ప్రమాదవశాత్తు నీళ్ల బకెట్‌లో పడి మృతి చెందింది. ఈ ఘటన నిజామాబాద్ జిల్లాలో సోమవారం చోటు చేసుకుంది. కోటగిరి మండలం ఎత్తోండ గ్రామానికి చెందిన సోన్‌కాంబ్లె కేశవ్, గంగామణి దంపతులకు కూతురు వేదశ్రీ (16 నెలలు) ఉంది. చిన్నారి సోమవారం మధ్యాహ్నం ఇంటి ఆవరణలో ఆడుకుంటూ ప్రమాదవశాత్తు నీళ్ల బకెట్‌లో పడిపోయింది. ఇంట్లో పనులు ముగించుకున్న తల్లి చిన్నారి కోసం వెతుకుతుండగా నీళ్ల బకెట్‌లో కన్పించింది. వెంటనే బయటకు తీసి ఆస్పత్రికి తరలించారు. చిన్నారిని పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్టుగా నిర్ధారించారు.

నాన్నా.. నీవెంటే నేనూ..

తండ్రి మృతదేహంపై పడి కుమార్తె మృతి

తిరుమలగిరి (తుంగతుర్తి): తండ్రి మరణాన్ని జీర్ణించుకోలేని ఓ మహిళ గుండెపోటుతో మృతి చెందింది. ఈ ఘటన సూర్యాపేట జిల్లాలో సోమవారం చోటు చేసుకుంది. తిరుమలగిరికి చెందిన మద్దెల వీరయ్య(85) అనారోగ్యంతో ఆదివారంరాత్రి మృతి చెందారు. వీరయ్య కూతురు యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరుకు చెందిన బుంగ వజ్రమ్మ(60) తండ్రిని కడసారి చూసేందుకు పుట్టింటికి వచ్చింది. తండ్రి మృతదేహంపై పడి రోదిస్తూ అచేతనస్థితికి వెళ్లిపోయింది. ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తండ్రి, కూతురి మరణంతో కుటుంబసభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943 Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.